# సార్వత్రిక పత్రికల పరిచయం



## టి.పి.వరప్రసాదరెడ్డి

# సార్వత్రిక పత్రికల పరిచయము

రచయిత

టి.పి. వరప్రసాదరెడ్డి, B.E.


ప్రతులకు

టి.డి. వరప్రసాదరెడ్డి

షాలోమ్ చర్చి, జె.యన్.టి.యు పోస్టాఫీస్

అనంతపురము - 515002

సెల్: 94402 85883

Date of Publishing: 19-3-2012

వెల : రూ. 30.00

ప్రతులకు:

1. లోగోస్ బుక్ సెంటర్

10/1, అరండల్‌పేట గుంటూరు - 522 002

ఫోన్ : (0863)2336927 సెల్:9866296843

2. మోరే ప్రార్థన మందిరము

1088, 3వ ఫేజ్, కె.పి.హెచ్.బి. కాలనీ, హైదరాబాద్-72, సెల్: 9490311411

3. జి.రాజారావు, పెద్దకాకాని - 522 509, గుంటూరు జిల్లా

4. టి. రత్నాకర్‌రెడ్డి, మేనేజర్, ముత్తూట్ ఫైనాన్స్, గిద్దలూరు, ప్రకాశం జిల్లా.

## విషయ సూచిక


| అధ్యాయము | అంశము | పేజి నెం. |
|---|---|---|
| 1. | పత్రికలు వ్రాసిన వారి పరిచయము | 3 |
| 2. | సార్వత్రిక పత్రికల పరిచయము | 6 |
| 3. | యాకోబు వ్రాసిన మొదటి పత్రిక | 9 |
| 4. | పేతురు వ్రాసిన మొదటి పత్రిక | 28 |
| 5. | పేతురు వ్రాసిన రెండవ పత్రిక | 47 |
| 6. | యోహాను వ్రాసిన మొదటి పత్రిక | 58 |
| 7. | యోహాను వ్రాసిన రెండవ పత్రిక | 71 |
| 8. | యోహాను వ్రాసిన మూడవ పత్రిక | 77 |
| 9. | యూదా వ్రాసిన పత్రిక | 93 |
| 10. | సంఘము - క్షేమకరమైన అభివృద్ధి | 111 |

# 1. పత్రికలు వ్రాసిన వారి పరిచయములు

ఈ గ్రంథములు వ్రాసిన యాకోబు, పేతురు, యోహాను, యూదా అను నలుగురి జీవిత చరిత్రలు గమనింతము.

## యాకోబుతో కొద్దిసేపు

నూతన నిబంధనలో ఐదుమంది యాకోబులు కలరు. 1) యేసు తండ్రిగా ఎంచబడిన యోసేపు యొక్క తండ్రియైన యాకోబు (మత్తయి 1:16వ), 2) యేసు శిష్యులలో ఇస్కరియోతు కాని యూదా తండ్రియైన యాకోబు (లూకా 6:16వ),3)అల్ఫయి కుమారుడగు, యేసుశిష్యుడైన యాకోబు (మత్త10:3వ), 4)జెబెదయి కుమారుడగు, యేసు శిష్యుడైన యాకోబు (మత్త 4:21వ), 5)యేసు తరువాత మరియకు జన్మించిన యాకోబు (మార్కు6:3వ.). మొదటి ముగ్గురు అంతగా లేఖనములలో కనిపించరు. నాల్గవవాడు అపో. 12:1వ.లో మరణించాడు. కనుక మార్కు 6:3వ. ప్రకారము ఈ గ్రంథమును వ్రాసినవాడు యేసు తరువాత మరియకు జన్మించిన కుమారుడైన యాకోబు అని సాధారణముగా నమ్ముచున్నారు.

మత్త13:55 ఇతడు వడ్లవాని కుమారుడు కాడా? ఇతని తల్లిపేరు మరియ కాదా? యాకోబు యోసేపు సీమోను యూదా యనువారు ఇతని సహోదరులు కారా? అను వచనమునుబట్టి యాకోబు యోసేపు సీమోను యూదా అనువారు యేసుకు సహోదరులు. యోహాను 5:4వ ప్రకారము 'ఆయన సహోదరులైనను ఆయన యందు విశ్వసించలేదు." కనుక ప్రభువు జీవించిన కాలమున ఈ యాకోబు ప్రభువును నమ్మలేదు. కాని యాకోబు 1:18వ. లో సత్యవాక్య ప్రకారము మనలను కన్నాడు అనుటనుబట్టియు, మరియు 1 కొరింథీ 15:7వ.లో పునరుత్థానుడైన క్రీస్తును చూచినట్లు వ్రాయబడినందున యేసు మరణ పునరుత్థానములను చూచిన తరువాత యేసు నందు విశ్వాసముంచి రక్షించబడినట్లు తలంచగలము. గలతీ 1:19, 2:8వ. ప్రకారము యెరూషలేము సంఘమందు పెద్దలలో యాకోబు పేరు పేతురు, యోహానుల కంటే ముందు వున్నందున సంఘకార్యములను ఆసక్తితో నడిపించుటలో ముందటివాడుగా నుండినవాడు. అపొ. 12:17 వచన ప్రకారము పేతురు చెర నుండి విడిపించబడి మరియ ఇంటికి వచ్చి, సంఘములలో యాకోబు ప్రముఖుడు గనుక యాకోబుకు తెలుపుమని చెప్పెను. అపొ 15:13వ. ప్రకారము సున్నతిసభలో వాక్యరీతిగా సున్నతి అవసరమా లేదా అని వివరముగా చెప్పాడు. కనుక వాక్యమును బాగుగా ఎరిగినవాడు. అపో. 21:17-20వ. ప్రకారము పౌలు సేవాయాత్రలు ముగించి యెరూషలేముకు వచ్చి యాకోబును కలసి సంగతులను సహోదరులకు వివరించెను. బోధకులమైన మనము అన్నందున ఈయన బోధించువాడని తెలియనగును.

పైన చెప్పిన కారణములనుబట్టి యాకోబు లేఖనముల యందలి జ్ఞానము లోను, ఆత్మీయతలోను, బాగుగా ఎదిగినవాడని అర్థమగుచున్నది. పైసంగతులనుబట్టి ఆత్మీయ జీవితములో అనేకుల కంటె ముందుగా ఉన్నవాడని, ఏలియావలె బహుగా ప్రార్థించుచూ బహునిష్టగా జీవించినవాడని నేర్చుకొనుచున్నాము. బహుగా ప్రార్థించినందున తన మోకళ్ళు ఒంటెమోకాళ్ళ వలె మారి పోయినవని చరిత్రనుబట్టి తెలియుచున్నది. యెరూషలేము దేవాలయములో యేసు మెస్సియాకాదని, ఒక మోసగాడని యేసును గూర్చి వ్యతిరేకముగా చెప్పమని యాజకులు కోరగా యేసే దేవుడని యేసును గూర్చి మంచి సాక్ష్యము చెప్పినందున యాజకులచే పైనుండి క్రిందకు త్రోసివేయబడి బట్టలు ఉతుకు మొద్దుచే కొట్టబడి ప్రభువు కొరకు హతసాక్షిగా మరణించాడు. యాకోబు 1:19-27వ.లో వినుట మాత్రమే కాక దాని ప్రకారము చేయువారై యుండవలెనని చెప్పుచున్నాడు. యోబువలె శ్రమలను సహించుటకు ఇష్టపడ్డాడు. అబ్రహాము తన కుమారుని బలిగా అర్పించుటలో వెనుకాడనట్లు, యాకోబును యాజకులు చంప తలపెట్టినప్పుడు దేవునికి బలియగుటలో వెనకాడక చంపబడుటకే ఇష్టపడ్డాడు. క్రైస్తవ విశ్వాసము క్రియాపూర్వకమైనదని చెప్పుట, తన జీవితములో కనుపరచుట, యాకోబు ప్రత్యేకత. యేసుప్రభువుకు స్వంత తమ్ముడైనను యేసుక్రీస్తు దాసుడనని చెప్పుట, మీరు ప్రభువైన క్రీస్తునకు దాసులై యున్నారు (కొలొ3:24) అను వాక్యమునకు ఆయన విధేయత చూపుటను సూచించును. గ్రంథకర్త దేవుడు జ్యోతిర్మయుడని (1:17వ), యేసు మహిమా స్వరూపియని (2:1వ) దేవుని గూర్చి శ్రేష్ఠమైన మాటలు పలికెను.

# పేతురు చరిత్ర

పేతురు మొదటి పేరు సీమోను. సీమోను అను పేరు పాత నిబంధన యందలి షిమ్యోను. దీన భావము వినువాడు. పేరుకు తగినట్లు ప్రభువు మాటను వినినవాడుగా పేతురును చూడగలము. మరొక పేరు కేఫా. సీమోను యోనా కుమారుడు (మత్త 16:17వ). యోనాకు యోహాను అను పేరు కలదు (యోహా21:15వ).. గ్రీకు భాషలో పేతురు, అరామేయక్ భాషలో కేఫా అను పేరుకు రాయి అని అర్థము (యోహా21:15వ). గ్రీకు భాషలో పేతురు, అరామేయక్ భాషలో కేఫా అను పేరుకు రాయి అని అర్థము (యోహా 1:42వ). గలిలయుడు, చేపలు పట్టు వృత్తిగలవాడు. దోనె, వలలు కలవాడు. లూకా 5వ అధ్యాయములో వాక్యము చెప్పుటకు ప్రభువుకు తన దోనె నిచ్చాడు. వలలు విడిచి ప్రభువును వెంబడించాడు. యేసు ప్రభువు శిష్యుల పేర్లు బైబిలులో నాలుగు స్థలములలో కలవు. ప్రతి స్థలములో పేతురు పేరు మొదటి స్థానములో కలదు. కొన్ని పర్యాయములు ముగ్గురు శిష్యులు మాత్రమే ప్రభువుతో నుండగా వారిలో మొదటివాడు పేతురు. కనుక పేతురు ప్రభువుకు అతి సమీపముగా నుండి బాగుగా ప్రభువును తెలిసికొన్నవాడు. అందుకే ప్రభువును

మెస్సియా అని గుర్తించ గలిగెను (మత్త 16:16-17:8వ). పేతురుకు పరలోకరాజ్యపు తాళపు చెవులివ్వబడ్డాయి. రూపాంతరపు కొండపై ప్రభువుతో వుండినవాడు. ప్రభువా మన మిక్కడ వుండుట మంచిది అని ప్రభువుకు, మోషేకు, ఏలీయాకు పర్ణశాలలు కడతామన్నాడు. ప్రభువు చివరి దినములలో మేము సమస్తము విడిచి నిన్ను వెంబడించాము అని మత్త19:27వ. లో చెప్పాడు. ప్రభువు సిలువ వేయబడగా భయపడి బొంకెను, కాని 1 కొరి. 15:6వ. లో చెప్పబడినట్లు పునరుత్థానుడైన ప్రభువు ప్రత్యక్షము కాగా ఆత్మీయతలో స్థిరపడి పెంతెకోస్తు దినమున ధైర్యముగా ప్రసంగించి 3000 కంటే ఎక్కువ ఆత్మలను సంపాదించాడు. కొరింథు పట్టణములో సువార్తను ప్రకటించి ఆత్మలను సంపాదించినవాడు కనుక ఆ సంఘములో కొందరు మేము కేఫా వారము అనిరి (1 కొరింథీ. 1:12వ). తన జీవిత కాలము చివరలో పేతురు రోములో నుండి క్రీ.శ. 64లో నీరో చక్రవర్తిచే తలక్రిందులుగా సిలువ వేయబడి హతసాక్షియైనాడని సంఘ చరిత్ర వలన తెలియుచున్నది. రోములో పేతురు సమాధి చేయబడ్డాడు.

# యోహాను చరిత్ర

యేసు శిష్యులైన యోహాను యాకోబులు జెబెదయి కుమారులు (మత్త4:21, అపో12:1,2). వీరు జీతగాండ్లను, దోనెలను కలిగి వృత్తికి చేపలు పట్టువారు. కనుక ధనవంతులై, గొప్ప కుటుంబీకులు కావచ్చును. కోపిష్టులు కనుక యేసు వీరికి బోయనేర్గెస్ అను పేరు పెట్టెను (మార్కు 3:17). తల్లి సలోమేయ కావచ్చును (మత్త 27:56, మార్కు 15:40). యేసు తల్లియైన మరియకు సలోమేయ సహోదరి. కనుక యోహాను యేసుకు చిన్నమ్మ కుమారుడై వరుసకు తమ్ముడు. యోహాను 1:35-40 నుండి ఆధ్యాత్మిక చింత కలవాడై, ముందుగా బాప్తీస్మమిచ్చు యోహాను శిష్యుడుగాను, తరువాత యేసును వెంబడించి శిష్యులందరిలో మొదటిగా ప్రభువును అంగీకరించిన వాడుగా తలంచ గలము. యేసుకు సమీపముగా నుండి యేసు శిష్యులలో అధిక్యత గల యోహాను, యాకోబు, పేతురు, అను ముగ్గురు శిష్యులలో ఒకడు. సువార్త ప్రకటనలో ధైర్యము గల పేతురు, యోహానులలో ఒకడు. విద్యలేని పామరుడైనను (అపో 4:13) యేసు చేత ప్రేమించబడి, యేసు రొమ్మున ఆనుకొనిన శిష్యుడుగా చూతుము. (యోహా 13:23, 20:2, 21:20,24). ప్రధాన యాజకునికి నెళవైనవాడు (యోహా 18:16). అందరు విడిచిపోయినను సిలువచెంత నిలిచినవాడు (యోహా 19:25-27). ప్రభువు తన తల్లిని ఇతనికి అప్పగించాడు. విద్య లేని పామరుడైనను ఒక సువార్తను, మూడు పత్రికలను, ప్రకటన గ్రంథమును వ్రాయు సువార్తికుడుగా, అపోస్తలుడుగా, ప్రవచనము పొందిన వాడుగా ప్రభువుచేత వాడబడ్డాడు. అందరి కన్నా ఎక్కువ కాలము జీవించి మరగ కాగిన నూనెలో వేయబడినను చనిపోక, పత్మాసు ద్వీపములో పరవాసిగా కొంత కాలముండెను. విడుదల పొందిన పిమ్మట ఎఫేసులో నుండి, చివరిలో ప్రకటన గ్రంథమును వ్రాసి సహజ మరణమును పొందెను.

# యూదా చరిత్ర

సామాన్య పత్రికలు వ్రాసిన యాకోబు, యూదాలు యేసు ప్రభువుకు తమ్ముళ్ళు. వీరి పేరులు మత్త 13:55, మార్కు 3:31, లూకా 8:19లో కలవు. ఇతడు వడ్లవాని కుమారుడు కాడా? ఇతని తల్లిపేరు మరియ కాదా? యాకోబు యోసేపు సీమోను యూదా యనువారు ఇతని సహోదరులు కారా? (మత్త 13:55). యోహాను 6:3-9 ప్రకారము వీరు యేసు జీవించిన కాలమందు యేసునందు విశ్వాసముంచిన వారు కారు. యేసు పునరుత్థానుడైన పిమ్మట యాకోబునకు కనబడెను అనుటనుబట్టి యాకోబు, యూదాలు యేసును రక్షకుడుగా నమ్మినట్లు తలంచవచ్చును (1కొరి15:7) మీరు విలువపెట్టి కొనబడినవారు గనుక మనుష్యులకు దాసులు కాకుడి (1 కొరి 7:23). కొనబడినవాడు ఇతరులకు కాక కొన్న వానికే దాసుడు. యేసు ప్రభువు రక్తమును కార్చి యూదాను కొన్నాడు కనుక యూదా యేసు ప్రభువుకు తమ్ముడైనను తనను కొన్న యేసుకు దాసుడనని గుర్తించి ఈ పత్రికలో దాసుడనని అంగీకరించుచున్నాడు. విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి (1కొరి6:20). దాసుడనని గుర్తించుట మాత్రమే కాక యూదా యేసును అన్న అని కాక ప్రభువు అని సంబోధించి యేసును మహిమపరచుచున్నాడు. యాకోబు సహోదరుడనని చెప్పుకొనినందున శారీరకముగా యేసు తమ్ముడని అంగీకరింప వచ్చును.

# 2. సార్వత్రిక పత్రికల పరిచయము

క్రొత్త నిబంధనలోని 27 పుస్తకములను 3 లేక 5 భాగములుగా విభజించవచ్చును.

| మూడు భాగాలుగా | ఐదు భాగాలుగా |
|---|---|
| I చరిత్ర గ్రంథాలు: | (1) యేసు చరిత్ర<br>మత్తయి, మార్కు లూకా, యోహాను సువార్తలు<br>(2) సంఘ చరిత్ర<br>అపొస్తలుల కార్యములు. |
| II పత్రికలు | (3) 14 పౌలు పత్రికలు<br>(4) మిగిలిన ఏడు సార్వత్రిక పత్రికలు |
| III ప్రవచన గ్రంథము | (5) ప్రకటన |

## సార్వత్రిక పత్రికల వివరములు

| వ.సం. | పత్రిక | అధ్యాయములు | వచనాలు | పదాలు | అక్షరాలు | సున్నాలు |
|---|---|---|---|---|---|---|
| 1. | యాకోబు | 5 | 108 | 1335 | 5495 | 255 |
| 2. | 1 పేతురు | 5 | 104 | 1432 | 5867 | 279 |
| 3. | 2 పేతురు | 3 | 61 | 924 | 3849 | 168 |
| 4. | 1 యోహాను | 5 | 105 | 1453 | 5635 | 261 |
| 5. | 2 యోహాను | 1 | 13 | 174 | 663 | 38 |
| 6. | 3 యోహాను | 1 | 14 | 194 | 734 | 31 |
| 7. | యూదా | 1 | 25 | 375 | 1588 | 70 |
| | మొత్తము | 21 | 430 | 5887 | 23831 | 1102 |

సార్వత్రిక పత్రికలు వ్రాసిన వారు 1) యాకోబు-1. 2) పేతురు-2. 3) యోహాను-3. 4) యూదా-1. యాకోబు, కేఫా (పేతురు), యోహానులు యెరూషలేము సంఘమందు స్తంభములని (పెద్దలని) గలతీ 2:9వ. ప్రకారము తెలియును. వారు పౌలు అన్యజనులకు అపొస్తలుడని, పేతురు యూదులకు అపొస్తలుడని గుర్తించగలిగిరి. ఆ విషయములను పైవచన భాగములో తెలియ పరచిరి. యోహాను సువార్త 21వ అధ్యాయములో ఏడుమంది శిష్యులు చేపలు పట్టబోయినను ప్రభువు యోహాను సువార్త 21:15వ. నుండి అధ్యాయము చివరి వరకు పేతురు యోహానులతో మాత్రమే మాటలాడుచుండెను. రాబోవు దినాలలో వారిని యెరూషలేము సంఘపెద్దలుగాను, పత్రికలు వ్రాయవలసినవారుగాను గుర్తించి, ముందునుండియే వారిని విశ్వాసములోను, సేవతలంపులలోను ప్రభువు పెంచుతున్నట్లు తలంచగలము.

ఆలాగే ప్రభువు జీవించిన కాలములో ఆయన శరీర సంబంధమైన సహోదరులైన 1) యాకోబు 2) యోసేపు 3) సీమోను 4) యూదాలు (మత్తయి 13:55వ) ఆయన యందు యోహాను సువార్త 7:3-5వ ప్రకారము విశ్వాసముంచలేదు. వీరు యేసు తల్లియైన మరియకు యేసు తరువాత జన్మించిన కుమారులు ప్రభువైన యేసు చనిపోయి తిరిగి లేచిన తరువాత 1 కొరింథీ. 15:7వ ప్రకారము తమ్ముడైన యాకోబుకు ప్రత్యేకముగా కనబడగా పెద్ద తమ్ముడైన యాకోబు, చిన్నతమ్ముడైన యూదాలు యేసును ప్రభుగా స్వీకరించి ఆయన దాసులైరి. యాకోబు 1:18వ ప్రకారము మనలను కనెను అన్నందున యాకోబు రక్షించబడెను. ఆత్మీయముగా ఎదిగెను. యాకోబు జీవిత చరిత్రలో వివరములు కలవు. పునరుత్థానుడైన యేసు ప్రత్యేకముగా ఈ నలుగురిని 1) పేతురు, యోహాను, యాకోబు,

యూదాలను పత్రికలు వ్రాయుటకై నియమించెను. గలతీ 2:9వలో యెరూషలేము సంఘమందలి స్తంభములుగా చెప్పబడిన వరుస క్రమములోనే క్రొత్త నిబంధనలో 1) యాకోబు 2) పేతురు 3) యోహానుల పత్రికలు క్రొ.ని.లో ఉంచబడినవి.

| **పత్రిక** | **ముఖ్య ఉద్దేశ్యము** |
|---|---|
| 1) యాకోబు వ్రాసిన పత్రిక | సంపూర్ణభక్తి- కొదువలేని విశ్వాసము (1:2-4వ). |
| 2) పేతురు వ్రాసిన పత్రికలు | సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధత - పూర్ణత (1:14-16; 5:10వ) |
| 3) యోహాను వ్రాసిన పత్రికలు | సహవాసములో సంతోషము, సంపూర్ణమగుట (1:3-4వ) |
| 4) యూదా వ్రాసిన పత్రిక | సకల పరిశుద్ధులకు అప్పగింపబడిన బోధను గూర్చిన పోరాటము (సంపూర్ణత) (1:3వ) |

పై పత్రికల ద్వారా దేవుడు తన ప్రజలు 1) సంపూర్ణ విశ్వాసము 2) సమస్త ప్రవర్తనలో, పరిశుద్ధతలో సంపూర్ణత 3) సహవాసములో సంపూర్ణ సంతోషము 4) పరిశుద్ధులకు అప్పగించబడిన సుబోధ విషయమైన పోరాటము (సంపూర్ణత) కలిగియుండవలెనని కోరుచున్నాడని తలంచగలము.

ఈ పత్రికలలో గ్రంథకర్తలు నలుగురు. యేసుక్రీస్తుకు సంఘమునకు గల సంబంధమును ఈ క్రింది విధముగా చూపిరి.

| **గ్రంథకర్తలు** | **క్రీస్తు VS** | **సంఘము** |
|---|---|---|
| 1) యాకోబు | ప్రభువు | పలు విధములైన ప్రజలు (5:7,8వ) |
| 2) పేతురు | ప్రధాన కాపరి | మంద (5:3వ) |
| 3) యోహాను | తండ్రి | కుటుంబము-పిల్లలు (3:2వ) |
| 4) యూదా | ప్రభువు | పరిశుద్ధులు (1:3,15వ) |

పౌలు వ్రాసిన పత్రికలు ఏదేని ఒక సంఘమునకు లేక కొన్ని సంఘములకు లేక వ్యక్తులకు వ్రాసెను. కాని సార్వత్రిక పత్రికలు అలాగు వ్రాయబడక అన్యదేశములందు చెదరిన వారికి సార్వత్రికముగా అన్ని ప్రాంతములలో యాత్రికులుగా ఉన్న అందరికి ఉద్దేశించిన వైనందున ఈ పత్రికలను అందరి కొరకైన సార్వత్రిక పత్రికలుగా ధ్యానింతము.

# ౩. యాకోబు వ్రాసిన పత్రిక

గ్రంథకర్త: యేసు తమ్ముడైన యాకోబు. స్థలము:- యెరూషలేము. కాలము: క్రీ.శ.48-66సం.

(యాకోబు వివరించిన కొదువలు లేని విశ్వాసయాత్ర)

**ముఖ్య అంశము:- కొదువలు లేని విశ్వాసము - భక్తి 1:4,27,2:22వ.**

ఈ గ్రంథమందు **సహోదరులు, విశ్వాసము** అను పదమును ఒక్కొక్కటి 16సార్లు కలదు. 4వ.లో ఏ విషయములోను **కొదువలు లేని వారును** అన్నందున సహోదరుల **కొదువలు లేని విశ్వాసమే** ఈ గ్రంథ ప్రాముఖ్య అంశము. విశ్వాస యాత్రలో విశ్వాసమునకు కలుగు పరీక్షలో జయమును గూర్చి 1,2 అధ్యాయాలలో 53 వచనముల ద్వారాను, జయజీవితమునకు లోపమును కలిగించ గల విరోధులైన 1) శరీర అవయవములు, 2) లోక స్నేహము, 3) సాతాను తంత్రములు, 4) సంపాదన, 5) ధన మోసమగు వెండి, బంగారు వస్త్రములను భోగాసక్తితో కూర్చుకొనుటను గూర్చి 3,4,5 అధ్యాయాలలో 53 వచనాలలో చెప్పి 5:19-20 చివరి రెండు వచనాలలో 1) విశ్వాస యాత్రలో సత్యము నుండి, తొలగిపోయిన వారిని దారికి మళ్లించుట, 2) మరణము నుండి ఆత్మలను రక్షించుట సహోదరుల బాధ్యత అని చెప్పి ముగించుచున్నాడు.

**విభజన:-**

'సహోదరులారా, మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని యెరిగి'.. (1:2వ). 'ప్రతి మనుష్యుడు వినుటకు వేగిరపడు వాడుగను, మాటలాడుటకు నిదానించువాడుగాను, కోపించుటకు నిదానించు వాడునై యుండవలెను'. (1:19వ.)

విశ్వాసమునకు కలుగు పరీక్షలో (1అ), వినుటకు వేగిర పడాలి (2అ).
మాటలాడుటకు నిదానించాలి (3అ), కోపించుటకు నిదానించాలి (4అ).
ఓర్పును కలిగి యుండాలి (5అ).

**ఇంకొక విభజన:-**

1. విశ్వాసమునకు కలుగు పరీక్షలో (శోధనకు నిలిచి, గెలిచి ధన్యులు కావాలి). 1అ.
2. వినుటకు వేగిరపడాలి (అనగా వినుకు లేని విధేయులై క్రియలు చేయాలి). 2అ.
3. మాటలాడుటకు నిదానించాలి (అనగా శరీరఅవయవములను లోపరుచుకోనాలి). 3అ.
4. కోపించుటకు నిదానించాలి (ప్రభువు దృష్టికి మిమ్మును మీరు తగ్గించుకొనాలి). 4అ.
5. ఓర్పు, సహనము కలిగి ఉండాలి (యోబును, ఏలీయాను మాదిరిగా పెట్టుకోవాలి) 5అ.

**మరొక విభజన:-**

1అ. విశ్వాసానికి కలుగు శోధనలతో కూడిన పరీక్షను ఆనందముతో జయించుట. (8+8+8+3=27వ).

2అ. విశ్వాసమును వెంబడించ వలసిన క్రియలు - అబ్రహాము

క్రియలు 2:22వ. రాహాబు క్రియలు 2:25వ. (7+6+7+7=26వ).

3అ. విశ్వాసానికి విరోధమైన శరీరము - దాని అవయవములగు

నాలుక, హృదయము. (6+6+6+18వ.)

4అ. విశ్వాసానికి విరోధమైన లోక స్నేహం 1-6వ, అపవాది

తంత్రాలు 7-12వ, ధన సంపాదన 13-17వ, (6+6+5=17వ.)

5అ. విశ్వాస యాత్రా జీవితమునకు అవసరమైన మెలకువలు,

సహనము, ఓర్పు, ప్రార్థన, (6+6+6+2=20వ.)

విశ్వాసములో పరిపూర్ణులైన అబ్రాహాము (2:21-24వ.), రాహాబుల వలె (2:25వ.) క్రియలు వెంబడించిన విశ్వాసము కలిగి, విశ్వాస యాత్రలో విరోధులైన 1)శరీర అవయవములు, 2) లోకస్నేహము, 3) సాతాను తంత్రములను ఓర్పు, సహవాసము, ప్రార్థనలతో జయించిన యోబువలె (5:10-11వ.), ఏలియా వలె (5:17-18వ.) ఆసక్తితో ప్రార్థన చేయుచు విజయులము కావాలి.

**గమనిక:-**

మొదటి అధ్యాయములో పరీక్షలో గెలిచి, నిలచిన విశ్వాసము,
రెండవ అధ్యాయములో క్రియలుగా ఫలించిన విశ్వాసము,
మూడవ అధ్యాయములో శరీరమును,
నాలుగవ అధ్యాయములో లోకమును, అపవాదిని జయించిన విశ్వాసము,
అయిదవ అధ్యాయములో ఓపికతో శ్రమలయందు ప్రార్థనలో ప్రభువు రాకడ వరకు నిరీక్షణతో కొనసాగిబహుమానముగా జీవకిరీటమును పొందిన సంపూర్ణ విశ్వాసమే యాకోబు వివరించిన

**"కొదువలు లేని విశ్వాసము".**

## 1వ. అధ్యాయము (8+8+8+3=27వ).

### అంశము:- విశ్వాసమునకు శోధనల ద్వారా పరీక్ష

1-8వ. విశ్వాసమునకు కలుగు పరీక్షను (1-4వ) దేవుడిచ్చు జ్ఞానము, ఓర్పుతో జయించాలి (5-8వ):-

1-4వ.:1వ. గ్రంథకర్త యేసుకు తమ్ముడైనను దాసుడనని చెప్పుకొనుట తన్ను తాను తగ్గించుకొని మాదిరి చూపుటగా చూడగలము. ఆకాలమందు యెరూషలేములోని సంఘమునకు హింస కలుగగా అపోస్తలులు తప్ప అందరు యూదయ, సమరయ దేశాలకు (అన్య దేశములకు) చెదరిపోయిరి (అపో8:1వ).

2-4వ. అనేక దేశములలో అన్యులమధ్య నున్నను విశ్వాసులు సంపూర్ణులును, అనునాంగులును (పూర్ణతగలవారు), ఏ విషయములోను కొదువలేని వారుగా వుండవలెనని దేవుడు మన విశ్వాసమును సాతానుచే శోధనల ద్వారా పరీక్షించును. నశించిపోవు సువర్ణము అగ్ని పరీక్ష వలన శుద్ధపరచబడుచున్నది గదా? దాని కంటే అమూల్యమైన మీ విశ్వాసము శోధనలచేత పరీక్షకు నిలిచినదై, యేసుక్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీకు మెప్పును, మహిమయు, ఘనతయు కలుగుటకు కారణమగును. మిమ్మును శోధించుటకు మీకు కలుగుచున్న అగ్ని వంటి మహాశ్రమలను గూర్చి ఆశ్చర్యపడకుడి. (1పేతురు 1:7, 4:12వ.). 2 కొరింథీ 12:7-8వ.లో పౌలు తన శరీరములో సాతాను దూతగా వున్న ముల్లు విషయమై తొలగిపోవలెనని ప్రార్థించాడు. కాని దేవుడు సెలవియ్యక నా కృప నీకు చాలన్నాడు. కనుక నానా విధములైన శోధనలచే విశ్వాసమునకు కలుగు పరీక్షలు మెప్పునకు, జయమునకు, మహానందమునకు కారణములని ఎంచుకొని పరీక్షనుబట్టి గాడాంధకారపు లోయలో సంచరించవలసి వచ్చినను ఓర్పుతో క్రియలు చేయుచు విశ్వాసి ఆనందించాలి.

5-8వ. కంసాలి కరుగుచున్న సువర్ణములో తన ముఖము చక్కగా కనిపించు వరకు అగ్నిలో దానిని కరిగించును. గలతీ 4:19వ. ప్రకారము క్రీస్తు స్వరూపము మనలో ఏర్పడుటకు మనము కూడా అగ్ని పరీక్షల గుండా వెళ్ళాలి. ఈ పరీక్షలో జయము పొందుటకు దేవుడిచ్చు జ్ఞానము అవసరము. బుద్ధి జ్ఞానము సంపదలు ఆయనయందు గుప్తమై యున్నవి (కొలొ2:3వ). ఈ జ్ఞానము భూసంబంధమైనది, ప్రకృతి సంబంధమైనది కాక, పైనుండి వచ్చు జ్ఞానముగా 3:17లో చూతుము. ఈ జ్ఞానమును సందేహింపక విశ్వాసముతో తనను అడుగు వారికి దేవుడు ధారాళముగా దయచేయును. దేవుడు నమ్మదగినవాడు, కనుక సందేహించరాదు. సందేహించువాడు గాలిచేత రేగి యెగిరిపడు సముద్ర తరంగము వంటివాడు మరియు ద్విమనస్కుడు. రెండు మనుసులు అనగా ఆత్మానుసారమైన మనస్సు మరియు శరీరానుసారమైన మనసు కలవాడు.

శరీరము ఆత్మకు, ఆత్మ శరీరమునకు విరోధముగా అపేక్షించును...గనుక మీరేమి చేయ నిశ్చయింతురో వాటిని చేయకుందురు (గలతీ 5:17వ).

కాబట్టి ద్విమనస్కులు అస్థిరులు కనుక దేవుని కొరకు క్రియలు చేయలేరు. మనము ఆత్మానుసారమైన మనసుతో, దేవుడిచ్చు జ్ఞానము, ఓర్పు కలిగి పరీక్షలో జయము పొందుటకు అవసరమైన క్రియలు చేయువారమై వుండాలి.

**9-16వ. గడ్డివలె వాడి పోవు వారము (9-11వ), కనుక దీనత్వము కలిగి దురాశలు లేక శోధనకు నిలువాలి (12-16వ):** - 9-11వ. దీనులు కాని ధనవంతులు కాని తమ శరీర స్థితిని బట్టి కాక, ఆత్మీయ స్థాయిని బట్టి అతిశయించాలి. 1 తిమోతి 6:17వ. ప్రకారము ఇహమందు ధనవంతులగు వారు అస్థిరమైన ధనమునందు నమ్మిక

యుంచకూడదు. అతిశయించువాడు ప్రభువు నందే అతిశయించవలెను అని 1 కొరింథీ 26-31వ.లో వ్రాయబడినది. దీనులు గాని, ధనవంతులు గాని తమ తమ ప్రయత్నములలో అనగా శరీరాశ, నేత్రాశ, ఈ లోక జీవన డంబపు సంబంధమైనవాటిని సంపాదించు ప్రయత్నములో అప్పుడేకాక పోయినను చివరకు వాడిపోవుదురు, ఓడిపోవుదురు. సూర్యుడు ఉదయించి వడగాలి కొట్టి గడ్డిని మాడ్చివేయగా దాని పువ్వులు స్వరూప సౌందర్యాలు రాలి నశించునట్లు శరీరము కూడా అలాగే వాడిపోయి నశించును. మన జీవము 4:14వ. ప్రకారము అంతలో కనపడి అంతలో మాయమగు ఆవిరి వంటిది. దీనులు కాని ధనవంతులు కాని అందరు స్వరూపసౌందర్యములు నశించినవారై పువ్వులవలె రాలి గతించి పోవుదురు, కనుక దీనులని, దరిద్రులని, ధనవంతులని భేదము చూపరాదు. 12-16వ. ప్రతి వానికి స్వకీయ దురాశలను బట్టియే శోధనలు సాతాను చేత కలుగును. దేవుడెవరిని శోధించువాడు కాదు. సహింప గలిగినంత కంటే ఎక్కువగా శోధింపబడనీయడు. సహింప గలుగుటకు శోధనతో కూడా తప్పించు కొనుమార్గము కలుగచేయును (1కొరిం10:13). దీని భావము పరీక్షలు వ్రాయువారికి ప్రశ్న పత్రముతో పాటు జవాబులు వ్రాయుటకై మార్గమును కూడా కలుగచేయుట. ఇది ఎంత ఆశ్చర్యము. శోధన అనగా వేదన, రోదన, బాధ సమాధానము లేక పోవుట, మానసిక క్రుంగుదల కావచ్చును. శరీర సంబంధమైన, లేక లోకము కొరకు, స్వజనులకొరకు కలుగు స్వకీయ దురాశలవలన శోధనలు కలుగవచ్చును. పవిత్రమైన లేదా అపవిత్రమైన శోధనలు కావచ్చును. సాతాను వాటి వైపునకు మనలను మరలు కొల్పగా పాపము, దాని వలన మరణము కలుగును. ఆదాము, హవ్వలు దేవతలవలెవుందుము అను స్వకీయమైన దురాశకులోనైరి (ఆది3:5వ) దురాశనుబట్టి కలిగిన శోధనకు లొంగినవారై పాపములో పడిరి.

ఆది 2:17వ.లో ఆ పండు తిను దినమున నిశ్చయముగా చచ్చెదవు అని దేవుడు అన్నాడు. ఆలాగే ఆదాము హవ్వలు ఆత్మీయముగా చచ్చిపోయిరి. రోమా 5:12వ.లో ఒక మనుష్యుని ద్వారా పాపము, పాపముచే మరణము... అందరికి సంప్రాప్తమైనట్లు మానవులందరికి పాప స్వభావము (స్వకీయ దురాశలు), తద్వారా మరణము సంప్రాప్తమాయెను.

యాకోబు 2:1వ. ప్రకారము దేవుడు మహిమా స్వరూపి. దేవుని రక్షకునిగా అంగీకరించిన వారు దేవుని కుమారులు కనుక ఆ మహిమకు వారసులే. కాని రోమా 3:23వ. ప్రకారము మనుష్యులు పాప స్వభావమును (స్వకీయ దురాశ) బట్టి పాపము చేసి ఆ మహిమను పొందు భాగ్యమును పోగొట్టుకొన్నారు. ఎఫేసి 2:1వ. ప్రకారము పాపము చేత ఆత్మలో చచ్చిన వారుగా నున్నారు. యెహోషువ 7:21వ.లో ఆకాను దోపుడు సొమ్మును చూచి, ఆశించి (స్వకీయ దురాశ) తీసుకున్నాడు, దాచుకొని, చావగొట్టబడెను(25వ.). ప్రభువు

శరీరమని వివేచించక తిని త్రాగువాడు... బలహీనులు, రోగులు, చాలామంది నిద్రించు (మరణము)చున్నారు (1కొరింథీ 11:29-30), అనగా శరీరములో మరణము కలుగవచ్చును. శరీరానుసారమైన మనసు మరణము, ఆత్మానుసారమైన మనసు జీవమునై యున్నది (రోమీ 8:6వ.).

కనుక మనము గడ్డివలె వాడి పోవు శరీరము యొక్కయు, మనసు యొక్కయు, స్వకీయ దురాశలకు తావీయక శోధనను సహించుచు శోధనకు నిలిచి, జయించి దేవుడు తనను ప్రేమించు వారికి వాగ్దానము చేసిన జీవకిరీటమును బహుమానముగా పొందుదుము. వివిధ కిరీటములను గురించి చివరలో చూడండి.

**ఈ గ్రంథమందలి మూడు ధన్యతలు:-** 1)శోధన సహించువాడు ధన్యుడు (1:12వ.) 2) వాక్య ప్రకారము క్రియ చేయువాడు ధన్యుడు (1:25వ). 3) శ్రమానుభవమును ఓపికతో సహించినవాడు ధన్యుడు(5:11వ.)

**హృదయమును గూర్చిన ఐదు అంశములు.** 1) హృదయమును మోసపరచుకొనుట (1:26వ.). 2) హృదయములో సహింపనలవికానివి (3:14వ.) 3) హృదయములను పరిశుద్ధపరచుకొనుట (4:8వ.). 4) హృదయమును పోషించుకొనుట (5:5వ). 5) హృదయమును స్థిరపరచుకొనుట (5:8వ.).

### 17-24వ. కొదువలేని భక్తికి వాక్య ప్రకారమైన ప్రవర్తన అవసరము:-

17-20వ. శ్రేష్ఠమైన ప్రతి ఈవి పరసంబంధమైనదై జ్యోతిర్మయుడగు తండ్రి యొద్ద నుండి కలుగును. శోధనలో ఓడిపోయినవారు కొన్ని పర్యాయములు దేవుడు నన్నెందుకు ఈలాగు శోధనకు లోనగునట్లు చేసాడని ప్రశ్నించుదురు. దేవుడు శ్రేష్ఠమైన వాటిని దయచేయువాడు కనుక అలాగు చేయువాడు కాదు. దేవుడు జ్యోతి అనగా అగ్నిజ్వాల, దహించు అగ్ని (నిర్గ 3:2, ద్వితీ 9:3వ.), వెలుగైనవాడు (1యోహాను1:5వ.), నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగి యుండును. (యోహాను 8:12వ). మరణచ్ఛాయలో కూర్చున్న వారికి వెలుగు ఉదయించెను (మత్త4:16వ.). అగ్ని సమస్త కల్మషమును కాల్చి వేయును. వెలుగు చీకటిని దూరపరచును, పారద్రోలును. దీనిని బట్టి దేవుడు మనలో నున్న అపవిత్రతను తీసి, కాల్చివేసి పాపమును దూరపరచి పవిత్రతచేత నింపును. దేవునియందు ఏ చంచలనము లేదు (17వ). యేసు క్రీస్తు నిన్న నేడు యుగముల వరకు ఏకరీతిగా నున్నాడు (హెబ్రీ 13:8వ.). కనుక మార్పు లేని వాడు, చంచలనము లేనివాడు. సత్యవాక్యము ద్వారా సృష్టిలో మనము ప్రథమ ఫలముగా వుండునట్లు మనలను కన్నాడు (18వ). మనము క్రీస్తువారము, క్రీస్తు దేవునివాడు (1 కొరింథీ 3:23వ.). 1 కొరింథీ 15:20వ. ప్రకారము క్రీస్తు పునరుత్థానమును బట్టి ప్రథమ ఫలమై నందున గతించి క్రొత్తవి కలిగియుండుట. కనుక మనలో పాత జీవిత

మేమి కనిపించక సమస్తము నూతన పరచబడినదిగా నుండాలి. సత్య వాక్యము ద్వారా మనము కనబడ్డాము. ఆ శక్తిగల సత్య వాక్యమును వినాలి. కనుక ప్రతి మనుష్యుడు వినుటకు ముఖ్యముగా వాక్యమును వినుటకు వేగిరపడాలి, మాటలాడుటకు నిదానించాలి, వినుటకు దేవుడు రెండు చెవులిచ్చాడు, మాటలాడుటకు ఒక నోరిచ్చాడు. కనుక మాటలు విను దానిలో సగము కంటే ఎక్కువగా నుండరాదు. చెవులు పైన నోరు క్రింద ఉన్నందున వినుటకు వేగిరపడాలి. మాటలాడుటకు నిదానించాలి. కొద్ది మందికి ముక్కు మీద కోపమున్నదంటారు. కాని కోపపడుటకు నిదానించాలని దేవుని వాక్యము సెలవిచ్చుట గమనించాలి. నరుని కోపము దేవుని నీతిని నెరవేర్చదు (19-20వ.).

21-24వ. సమస్త కల్మషమును, దుష్టత్వమును మానాలి(21వ). ప్రవచన వాక్యము (2పేతు:19వ) మరియు, అద్దమైన దేవుని వాక్యములో (23వ) చూచుకొని వాక్యము ద్వారా దేవుడు చూపిన సమస్త కల్మషమును అంగీకరించి, మనలను మనము దిద్దుకొనాలి. సత్యమైనది, శక్తిగలదగు అద్దమగు వాక్య ప్రకారము ప్రవర్తించాలి (22వ.). వాక్యమును అద్దములో చూచుకొని దిద్దుకొనకుండా అవతలికి పోవువాడు తానెట్టివాడో మరచి పోవువాడు. కనుక చక్కగా ప్రవర్తింపలేడు.

25-27వచనములు 2/3 అధ్యాయములకు పీఠికగా చూతుము. "అయితే స్వాతంత్ర్యము ఇచ్చు సంపూర్ణమైన నియమములో తేరిచూచి నిలుకడగా ఉండువాడెవడో వాడు విని మరచువాడు కాక, క్రియను చేయువాడైయుండి తన క్రియలో ధన్యుడవును" (3అ."ఎవడైనను నోటికి కళ్లెము పెట్టుకొనక తన హృదయమును మోసపరచు కొనుచు భక్తిగల వాడనని అనుకొనిన పక్షమున వాని భక్తి వ్యర్థమే"). తండ్రియైన దేవుని యెదుట పవిత్రమును నిష్కళంకమునైన భక్తి యేదనగా, దిక్కులేని పిల్లలను విధవరాండ్రను వారి యిబ్బందిలో పరామర్శించుటయు, ఇహలోకమాలిన్యము తనకంటకుండ తన్ను తాను కాపాడుకొనుటయునే."

## 2వ. అధ్యాయము (7+6+7+6=26వ).

అంశము:- విశ్వాసమును వెంబడించ వలసిన క్రియలు. (వినుటకు వేగిరపడాలి. వినుట అనగా చెవులతో వినుట మాత్రమేకాక ప్రవర్తనలో క్రియా పూర్వకముగా చేసి చూపించాలి.).

**1:25-27వచనాలు రెండవ అధ్యాయానికి పీఠిక:-** 1:25-27వ. వాక్య ప్రకారము ప్రవర్తించువాడు అనగా క్రియలలో విశ్వాసమును కనపరచువాడు అని అర్థము. భక్తి హృదయ సంబంధమైనది. హృదయమందు భక్తి గలవాడు తన భక్తిని క్రియలద్వారా కనుపరచాలి. దిక్కులేని పిల్లలను, విధవరాండ్రను వారి వారి ఇబ్బందులలో పరామర్శించాలి. మనము స్వాతంత్రమునిచ్చు నియమములో (25వ) సంపూర్ణముగా వున్నవారమైనను క్రియలు

చేయుచు క్రియలలో ధన్యులము కావాలి. మనుష్యులు విశ్వాస మూలమున మాత్రమున కాక క్రియల మూలమున నీతిమంతులని ఎంచబడుదురు (24వ). క్రియలు లేని విశ్వాసము మృతము (26వ).

**1-7వ. ధనవంతులు దరిద్రులను భేదము పెట్టుకొనకుండుట:-**

1వ. మహిమా స్వరూపియగు మన ప్రభువైన యేసు క్రీస్తును గూర్చిన విశ్వాస విషయములలో మోమాటము కలవారై యుండకుడి.(1వ.). ప్రభువైన యేసు మహిమా స్వరూపి. దేవుడు తన మహిమ నిమిత్తమే మానవులను సృజించాడు (యెషయ 43:7వ.). మానవునికి తన మహిమను ఇవ్వగోరాడు. కాని మానవుడు పాపియై దేవుడిచ్చు మహిమను పొందు భాగ్యమును పోగొట్టుకున్నాడు. కాబట్టి దేవుడు పరలోకమునుండి ఈ లోకానికి వచ్చి పాపమును పరిహారము చేసి మానవుడు పోగొట్టుకొనిన మహిమను పొందు భాగ్యమును మరలా కల్పించాడు. క్రీస్తునందు విశ్వాసముంచి రక్షకుడుగా స్వీకరించుట ద్వారా ఆ భాగ్యమును పొందుదురు. క్రీస్తును గూర్చిన విశ్వాసములో మొహమాట పడితే పాపక్షమాపణ రక్షణ యుండదు. రక్షించబడిన తరువాత విశ్వాస విషయములో మోహమాటపడిన యెడల ఆత్మీయతలో ఎదుగుదల లేక దిగజారి పోగలము. అల్పవిశ్వాసులమైతే దేవుని చిత్తము మనలో జరుగదు. విశ్వాస మూలము కానిదేదో అది పాపమని రోమా 14:23వ.లో వ్రాయబడినది.

2-4వ. ధనవంతులు ప్రశస్త వస్త్రములు, బంగారు ధరించుకొని మందిరమునకు వత్తురు. ధనవంతులు కఠినులు, మనలను న్యాయ సభలకు ఈడ్చువారు. దరిద్రులు మురికిబట్టలతో మందిరమునకు వత్తురు. దేవుడు నరుని వేషమును లక్ష్యపెట్టడు (గలతీ 2:6వ). యెహోవా హృదయమును లక్ష్యపెట్టును (1సమూ 16:7వ) దేవుడు ప్రేమా స్వరూపి, పక్షపాతము లేనివాడు. ధనవంతులని దరిద్రులని తేడా లేదు. మంచి స్థలములో ధనవంతులను కూర్చుండబెట్టి, దరిద్రులను పాదపీటమునకు దిగువ కూర్చుండమని చెప్పుట వారి విషయమై బేధము చూపి, వారిని అవమానపరచుటయే. అది క్రియలు లేని విశ్వాసమే. కనుక మనలో అలాగుండ కూడదు.

5-7వ. ఈ లోక విషయములో దరిద్రులైనను రక్షణ కొరకై విశ్వాసముంచిరి. దేవుడు వారిని ప్రేమించి కుమారులుగా స్వీకరించిన కారణమున, దేవుని రాజ్యమునకు ధనవంతులతో పాటు సమాన వారసులే, భాగ్యవంతులే. తన్ను ప్రేమించువారు అనగా మనము దేవుని ప్రేమించువారముగా వుండాలి.

**8-13వ. ఒక ఆజ్ఞను తప్పుట ఆజ్ఞలన్నిటిని తప్పుటయే:-**

8-10వ. నిన్నువలె నీ పొరుగువారిని ప్రేమించమను ఆజ్ఞను క్రియారూపముగా నెరవేర్చాలి. మార్కు 12:33వ. ప్రకారము ప్రభువును ప్రేమించుట, తనను వలె తన పొరుగు వానిని ప్రేమించుట సర్వాంగ హోమము కంటే, బలుల కంటే శ్రేష్ఠము అను

మత్తయి 22:38-39వ. ప్రకారము దేవుని, పొరుగు వానిని ప్రేమించుటే ధర్మశాస్త్రమునకు మూలము. అలాగు ప్రేమించక పోవుట క్రియలులేని విశ్వాసమై ఆజ్ఞలన్నింటిని తప్పుటతో సమానము.

11-13వ:- 11వ. ధర్మశాస్త్రము అనేక ఆజ్ఞలతో కూడినది. విశ్వాస జీవితములో ఏ చిన్న ఆజ్ఞలో తప్పిపోయినను ఆజ్ఞలన్నిటిలో తప్పినట్లే. చదువకొనే పిల్లలు ఇంటర్‌లో ఒక సబ్జెక్టులో తప్పితే ఆ వ్యక్తి ఇంటర్‌లో తప్పినట్లే. మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా వుండెదరు. (మత్త 5:48వ.). కనుక ప్రాముఖ్యమైన ఆజ్ఞయగు పొరుగు వారిని ప్రేమించుటలో తప్పిపోకుండా పరిపూర్ణులై యుండాలి.

12వ. స్వాతంత్ర్యము నిచ్చు నియమములో నున్నవారము. ప్రభువే ఆత్మ. ఆత్మ ఎక్కడవుండునో అక్కడ స్వాతంత్రముండును (2 కొరింథీ 3:17వ). స్వాతంత్రమునిచ్చు నియమమనగా ఆత్మానుసారమైన నియమమే. కనుక స్వాతంత్రము నిచ్చు నియమ ప్రకారము ప్రవర్తించుట ఆత్మానుసారముగా ప్రవర్తించుటే. దేవుని ఆజ్ఞల విషయములో వాక్యమునకు తగినట్లే క్రియలు కలిగి ప్రవర్తించాలి.

13వ. మనము కనికరము లేని వారమైతే కనికరము లేని తీర్పు పొందుదుము. ప్రభువు కనికరమును కోరుచున్నాడు (హోషే 6:6వ). మనుష్యుడా! కనికరమును, దీనమనస్సును కలిగి ప్రవర్తించుటయే గదా యెహోవా నిన్ను అడుగుచున్నాడు (మీకా 7:18వ). మనము ప్రభువువలె కనికరము గలవారై ప్రవర్తించాలి. కనికరము తీర్పును మించి అతిశయపడును. కనికరము చూపించుటలో సంతోసించు దేవుడు నిరంతరము కోపించడు (మీకా 7:18వ.). దీని భావము మనము కనికరము చూపువారమై ఇతరులపై కోపించక, తీర్పు తీర్చక యుండాలి.

**14-20వ. క్రియలు లేని విశ్వాసము నిష్ప్రయోజనము:-**

14-16వ. సహోదరులలో దిగంబరులై ఆనాటికి భోజనము లేని వారున్నారు. వారి యొక్క అన్నవస్త్రముల అక్కరలు, చలికాచు కొనుటకైన శరీర అవసరతలు తీర్చువారమై యుండాలి. తృప్తిగా వుండుమని వట్టి మాటలు చెప్పుట క్రియలు లేని విశ్వాసమే. బీదలకు యిచ్చువాడు యెహోవాకు అప్పిచ్చువాడు. (సామె 19:17వ.). కనికరము గలవారు ధన్యులు, వారు కనికరము పొందుదురు. (మత్తయి 5:7వ.). మత్తయి 25:32-42వ.లో ప్రభువు నేను ఆకలిగొంటిని, మీరు నాకు భోజనము పెట్టితిరి. దిగంబరినైతిని, నాకు బట్టలు యిచ్చితిరి అన్నాడు. మిక్కిలి అల్పులైన యీ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరి అన్నాడు. ద్వితీ 15:11వ.లో నీ సహోదరులైన దీనులు, బీదలు భూమి మీద వుండకుండా మానరు, వారికి నీ చెయ్యి చాపుము అన్నాడు.

17-20వ. కనుక క్రియలు లేని విశ్వాసము నిష్ఫలమైనది. క్రియల చేతనే విశ్వాసములో సంపూర్ణులము కావాలి.

**21-26వ. క్రియల మూలమున సంపూర్ణులుగా తీర్చబడిన అబ్రహాము, రాహాబులు:-** 21-24వ. అబ్రహాము తన విశ్వాసానికి గుర్తుగా కుమారుని బలియిచ్చి విశ్వాసముతో మాత్రమే కాక క్రియల ద్వారా కూడా నీతిమంతుడని తీర్చబడెను. (21వ.). అతని విశ్వాసము పరిపూర్ణమైనది (22వ.). అతని విశ్వాస వివరము ప్రక్క పేజిలో కలదు. గమనించండి. 25-26వ. రాహాబను వేశ్య వేగులవారిని చేర్చుకొని క్రియల ద్వారా నీతిమంతురాలని ఎంచబడెను. (25వ.). రాహాబు విశ్వాసము ప్రక్క పేజిలో వివరించబడినది. గమనించండి. కనుక క్రియలు లేని విశ్వాసము మృతమని క్రియల ప్రాముఖ్యతను చెప్పుచున్నాడు. క్రియల మూలమున నీతిమంతులని తీర్చబడిన ఇరువురివలె మనమును క్రియల ద్వారా సంపూర్ణులము కావాలి.

**యాకోబు 2:22వ. క్రియల మూలమున నీతిమంతుడుగా తీర్చబడిన అబ్రహాము**

(ఆది 22:1-14వ):- అబ్రహాము శారాలు మహిమగల దేవుని యందు విశ్వాసముంచి కల్దీయుల దేశమును విడిచి కనానుకు వచ్చి నివసించిరి. అబ్రహాము శారాలు విశ్వాసులైనను ఆది 15:4-6వ.లో మీ సంతానమును ఆకాశ నక్షత్రాలుగా చేయుదునని దేవుడిచ్చిన వాగ్దానమును విశ్వసించుటలో కొదువపడిరి. అబ్రహామునకు దేవుడు సంతానమిచ్చిన తరువాత అతని విశ్వాసమును పరీక్షించాడు. విశ్వాసము పరీక్షించబడగా విధేయత గలవాడుగా, విసుకు లేనివాడుగా, క్రియల మూలముగా నిరూపించబడి విశ్వాస యాత్రలో అబ్రహాము విజయుడయ్యాడు. 1-3వ. విధేయత, 4-6వ. విశ్వాసము, 7-9వ. విసుకు లేనితనము, 10-12వ. విజయము, 13-14వ. విషయ సమాప్తి.

**1-3వ. విధేయత:-** పరీక్షలో అబ్రహామా అని దేవుడు పిలువగా చిత్తము అన్నాడు. దేవుడు ఏమి చెప్పినా ముందే మనము చిత్తమని చెప్పాలి. 1) నీకు ఒక్కడైన కుమారుని (ఇష్మాయేలును కాదు నీకు సర్వమైన ఇస్సాకును). 2) నీవు ప్రేమించు ఇస్సాకును, (ఇస్సాకు పుట్టినప్పుడు శారాయు, విను వారందరూ నవ్వినందున నవ్వు అను అర్థముగల ఇస్సాకు అనుపేరు పెట్టబడినది (21:6వ.) నీ ప్రేమను, నవ్వును దేవుని కివ్వాలన్నాడు. అలాగైతే మిగిలేది ద్వేషము, ఏడుపే. 3) దహన బలిగా (మనకేమి మిగులదు) దేవునికి అర్పించాలి. దావీదు తన జీవితములో పెద్దవాడైన కుమారుడగు అబ్షాలోము మరణించగా నీకు బదులుగా నేను మరణించిన బాగుండును అన్నాడు (2 సమూ 18:33వ.) కాని అబ్రహాము బదులేమి చెప్పక కట్టెలు చీల్చి సిద్ధము చేసి, చేతిలో కత్తిని, నిప్పులను తీసికొని దహనబలికి వెంటనే బయలుదేరి దేవునికి సంపూర్ణముగా విధేయుడయ్యాడు.

**4-6వ. విశ్వాసము:-** అబ్రహాము నేనును, ఈ చిన్నవాడును దేవునికి మ్రొక్కి మరల మీ యొద్దకు వచ్చెదము. కుమారుని బలిగా ఇచ్చినప్పుడు మరలా తిరిగి కుమారునితో రాగలడా? ఈ జవాబు విశ్వాసముతో చెప్పగలిగాడు. 1) దేవుడు తనతో చెప్పిన చోటికి వెళ్ళుట,

2) కట్టెలు ఇస్సాకుపై పెట్టుట, 3) నిప్పును, కత్తిని చేతిలో పట్టుకొనుట, వీటన్నిటి ద్వారా అబ్రహాము విశ్వాసముతో కూడిన విధేయత గలవాడని నిరూపించాడు.

**7-9వ. విసుకు లేనితనము:-** కుమారుడు, అబ్రహాముతో నా తండ్రీ దహనబలికి గొర్రెపిల్ల ఏది? అన్నప్పుడు అబ్రహాము విసుకులేకుండా దేవుడే చూచుకుంటాడని జవాబిచ్చాడు. విసుకు లేకుండా కట్టెలు చక్కగా పేర్చుట, ఇస్సాకును బంధించుట, బలిపీఠము పైన వుంచుట, విసుకు లేనితనమును సూచించును.

**10-12వ. విజయము:-** విశ్వాసమునకు కలుగు పరీక్షలో దేవునికి భయపడువాడు అని దేవుని చేత తీర్పు తీర్చబడ్డాడు. క్రియలు వెంబడించిన విశ్వాసము గలవాడై విజయుడు అయ్యాడు.

**13-14వ. విషయ సమాప్తి:-** పొదలో కొమ్ములు తగులుకొనిన పొట్టేలు వెనుక కనిపించింది. పొట్టేలు ఇంతవరకు కనబడలేదు, దాని అరుపులు వినబడలేదు. దీనినిబట్టి దేవునికి విధేయత చూపుటలో దేనిని చూడక, వినక యుండు వాడని చూచుచున్నాము. దేవుడు దహనబలికి గొర్రెపిల్లను ఇచ్చి యెహోవా పర్వతముపై చూచుకొనుటనుబట్టి, యెహోవా యీరే అను పేరు పెట్టబడి విషయము సమాప్తి అయినది. 1) నీ ప్రేమను, 2)నీ నవ్వును, 3) నీకేమి మిగిలించుకొనకుండా, 4) నీ సమాప్తమును నాకివ్వాలన్న పరీక్షలో అబ్రహాము 5) సంపూర్ణముగా విధేయత చూపాడు. దేవుడు అన్యాయస్తుడు కాదు. అబ్రహామునకు సమస్తమును తిరిగి ఇచ్చాడు. విశ్వాస యాత్రలో విజయమును పొంది క్రియల ద్వారా పరిపూర్ణ విశ్వాసము గలవాడుగా ఎంచబడ్డాడు (2:22వ.).

**యాకోబు 2:25వ. క్రియల మూలమున నీతిమంతురాలుగా ఎంచబడిన రాహాబు:-**

యెహోషువ 2:1-21వ:- 1-7వ. విశ్వాసముతో వేగుల వారిని చేర్చుకొనుట. 8-14వ. విశ్వాసముతో రక్షింపుడని వేడుకొనుట -మిద్దె మీద వారిని ఉంచుట. 15-21వ. ఎర్రని దారమును కిటికీకి కట్టుట.

**1-7వ. విశ్వాసముతో వేగుల వారిని చేర్చుకొనుట:-** రాహాబు అను పేరుకు గర్వము. విశాలము అని అర్థము. రాహాబు లోకములో పాపులైన మానవులకు సాదృశ్యము. వేగుల వారిలో శల్మాను వుండ వచ్చును. శల్మాను యూదా గోత్రములో నుండి వెళ్ళిన వేగులవాడు. శల్మాను అనగా స్థిరుడు అని అర్థము. నిన్న నేడు ఏక రీతిగా నుండు స్థిరుడగు యేసు ప్రభువుకు సాదృశ్యముగా ఉన్నాడు. శల్మానును ఇంటిలో చేర్చుకొనుట యేసును హృదయము అను ఇంటిలో చేర్చుకొనుటను సూచించును.

**8-14వ. విశ్వాసముతో రక్షింపుడని వేడుకొనుట - మిద్దె మీద వారిని ఉంచుట:-** రక్షింపుడని వేడుకొనుట యేసుప్రభువని నోటితో ఒప్పుకొనుటను సూచించును. 11వ. లో వినినప్పుడు గుండెలు కరిగిపోయినవి. ఇదంతయు సువార్తను విని, యేసు ప్రభువని

నోటితో ఒప్పుకొని, హృదయములో విశ్వాసముంచి, చేర్చుకొనుటను సూచించును. రోమా 10:9వ. ప్రకారము ఆమె రక్షించబడినది. వేగుల వారిని ఇంటి మిద్దె మీదవుంచుట దేవునికి జీవితములో ప్రాముఖ్యత గల స్థానమును ఇచ్చుటను సూచించును.

**15-21వ. ఎర్రని దారమును కిటికీకి కట్టుట:-** హృదయములో కలిగిన విశ్వాసమునకు గుర్తుగా కిటికీకి ఎర్రని దారమును కట్టినది. హృదయములోని విశ్వాసమును క్రియల ద్వారా చూపించినది. రాహాబు, ఆమె వారందరూ బయటికి వచ్చి పాళెము వెలుపల నివసించుట క్రియారూపకమైన ప్రత్యేకత.

యెహోషువ 6:25వ. ప్రకారము ఆమె నేటి వరకు ఇశ్రాయేలీయుల మధ్య నివసించుచున్నది. దీని భావము ఆమె యేసు ప్రభువు వంశావళిలో చేర్చబడి నేటికి జీవించుచున్నది. హెబ్రీ 11:31వ.లో విశ్వాసమును బట్టి రాహాబను వేశ్య వేగులవారిని సమాధానముగా చేర్చుకొనిన క్రియ బైబిలులో వ్రాయబడి రాహాబు విశ్వాస వీరుల పట్టిలో చేర్చబడినది. అనగా రాహాబు క్రియలు ఆమె విశ్వాసమును వెంబడించగా క్రియల వలన ఆమె నీతిమంతురాలని ఎంచబడెను.

## 3వ అధ్యాయము (6+6+6=18వ).

**అంశము:- విశ్వాసమునకు వైరమైన శరీరము దాని అవయవములు, అంతరింద్రియములు:-** నిష్ప్రయోజనమైన నాలుక (6వ), మత్సరముతో నిండిన హృదయము (14వ). శరీర అవయవములగు నాలుక మాటల యందు తప్పును. మాటలయందు తప్పనివాడు సర్వ శరీరమును అనగా బాహ్య ఇంద్రియములగు 1) కన్ను, 2) ముక్కు 3) చెవి, 4) నాలుక, 5) స్పర్శించు చర్మము, మరియు అంతరింద్రియములగు 1) హృదయము, 2) మనస్సు 3) ప్రాణము, 4) ఆత్మను ఆధీనమందుంచుకొనును (2వ). హృదయము సహింపనలవి కాని చెడును కలిగియుండును (14వ). కనుక విశ్వాస యాత్రలో బాహ్య ఇంద్రియములగు 1) కన్ను, 2) ముక్కు 3) చెవి, 4) నాలుక, 5) స్పర్శించు చర్మము, మరియు అంతరింద్రియములగు 1) హృదయము, 2) మనస్సు 3) ప్రాణము, 4) ఆత్మను స్వాధీనమందుచుకొనాలి. హృదయమందు నిండియుండు దానిని బట్టి నోరు మాటలాడును (మత్త 12:34).

**1-6వ. నోటి మాట యందు తప్పకుండుట:-** 1-2వ. 'బోధకులమైన మనము కూడా అనేక విషయముల యందు తప్పిపోవుచున్నాము.' మనము అనుటలో యాకోబు తనను కూడా కలుపు కొనుట అభినందించదగినది. బోధకులు తమ స్వంత నాలుకను సాధు చేసుకొనలేకపోవుచున్నామని గుర్తించాలి. మాటలయందు తప్పనివాడు లోపము లేనివాడు. బోధించుటలో ప్రభువు ఇచ్చు తలంపులు కాక ఇతరములు మనస్సులో వుంచుకొని బోధ చేయరాదు. నోరు నాలుకను గూర్చి కీర్తనల గ్రంథమందలి వచనములు ధ్యానించుదుము.

1. వారి నోట యథార్థత లేదు-- వారు నాలుకతో ఇచ్చకములాడుదురు. కీర్త 5:9వ.

2. వారి నోరు శాపముతోను, కపటముతోను, వంచనతోను నిండియున్నది.

వారి నాలుక క్రింద చేటును పాపమును ఉన్నవి. కీర్తన 10:7వ.

3. బింకములాడు నాలుకలు. కీర్త 12:3వ.

4. నాలుకతో కొండెము లాడుట,

తన చెలికానికి కీడు చేయుట. కీర్త 15:3వ.

5. కీడు చేయవలెనని నీవు నోరు తెరుచుచున్నావు,

నీ నాలుక కపటమును కల్పించుచున్నది. కీర్త 50:19వ.

6. వారి నాలుక వాడి గల కత్తి. కీర్త 57:4వ.

నోరు యథార్థత లేక, శాపముతోను, కపటముతోను, వంచనతోను నిండి కీడు చేయవలెనని వేచియుండును. నాలుక తన క్రింద చేటును, పాపమును కపటమును కలిగి, బింకములాడును, ఇచ్చకములాడును, చెలికానికి కీడు చేయును. 3-4వ. గుర్రాలు బలము కలవి. బలమును కొలుచుటకు గుర్రపు బలమును ప్రమాణముగా తీసుకొందురు. అటువంటి గుర్రములు చిన్నదైన కళ్లెము నోటికి తగిలించుటచేత తిప్పబడుచున్నవి. పెద్దవైన ఓడలు చిన్న చుక్కానిచేత తిప్పబడుచున్నవి. యోబు 'నా నోటి మీద నా చేతి నుంచెదను... నేను మరలా నోరెత్తను' అన్నాడు (యోబు 40:4-5వ.).

5-6వ. నాలుకను అదరి పడకుండా స్వాధీనమందుంచుకొనాలి. లేనియెడల కొంచెము నిప్పు విస్తారమైన అడవిని తగులబెట్టినట్లు నాలుక మన అవయవములలో వుంచబడిన పాప ప్రపంచము. సర్వ శరీరమునకు అనగా అన్ని బాహ్య, అంతర్య అవయవములకు మాలిన్యము కలుగ చేయును. సమస్త ప్రపంచమునకు మన విశ్వాస జీవితమునకు, సంఘము, సేవా జీవితమునకు కూడా చిచ్చుపెట్టును.

**7-12వ. సాధు కాజాలని నాలుకను సాధు చేయుట:-** 7-8వ. మానవుడు సాటి మానవులను, మృగములను, పక్షులను, జలచరములను సాధుపరచెను. కాని తన స్వంత నాలుకను సాధుపరచుకొనలేదు. అది మరణకరమైన విషముతో నిండినది. వారి పెదవుల క్రింద సర్పవిషమున్నది. వారి నోటి నిండా శపించుటయు పగయు ఉన్నవి (రోమా 3:13-14వ.). నాలుక మాటలాడు మాటల వలన మనుష్యులు ఒకరి నొకరు చంపుకొనుటకూడా జరుగుచున్నది. కనుక ఇతరుల విషయమై మాటలాడునప్పుడు నాలుక విషయమై జాగ్రత్తగా నుండాలి.

9-10వ. ఒకే నాలుకతో దేవుని స్తుతించి సాటి మానవులను శపించుచున్నాడు. ఇది ద్విమనస్కులు చేయు పని. ఆత్మసంబంధమైన మనస్సుతో ఆశీర్వాదమును పలుకుట, శరీర సంబంధమైన మనస్సుతో శాపమును పలుకుట కూడనిది.

11-12వ. ఒకే నీటి బుగ్గ నుండి తియ్యని నీరు, చేదు నీరు ఊరదు. ఉప్పు నీళ్ళలో తీయని నీళ్ళు ఊరవు. ఒకే చెట్టుకు రెండురకముల పండ్లు కాయవు. కనుక నాలుకను సాధుచేసికొనుట ప్రాముఖ్యమైనది. అలాగే మిగిలిన శరీర బాహ్య ఇంద్రియములగు కన్ను, చెవి, ముక్కు, స్పర్శించు చర్మమును స్వాధీనమందుంచుకొనాలి. మత్తయి 6:23 ప్రకారము కన్ను చెడినదైతే దేహమంతయు చీకటియే.

**13-18వ. హృదయములో మత్సరము లేక-పైనుండి వచ్చు జ్ఞానముతో హృదయమును నోటిని జయించుచు యోగ్యమైన ప్రవర్తన కలిగియుండుట:-**

13-14వ. అంతరింద్రియమగు హృదయములో మత్సరము ఉండ గలదు. నరుల హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదని యెహోవా చూచి... (ఆది 6:5వ.). నరుల హృదయాలోచన వారి బాల్యము నుండి చెడ్డది (ఆది 8:21వ.). హృదయము అన్నిటికంటే మోసకరమైనది, అది ఘోరమైన వ్యాధి కలది, దాని గ్రహింప గలవాడెవడు (యిర్మీయా 17:9వ.) నిర్గ4-14 అధ్యాయములలో 18సార్లు ఫరో హృదయ కఠిన్యమును గూర్చి వ్రాయబడినది. వారు తమ క్రొవ్వుతో హృదయమును మూసికొనిరి. వారి నోరు గర్వముగా మాటలాడును (కీర్త 17:10). హృదయము ఎంతో కఠినమైనది. హృదయ మందు నిండి యుండు దానిని బట్టి నోరు మాటలాడును (మత్త 12:34). కనుక సత్యమునకు విరుద్ధముగా నోటియందు అబద్ధములు ఉండగలవు.

హిజ్కియా మనస్సులో గర్వించాడు.. గుర్తించి హృదయ గర్వమును విడిచి... తగ్గించు కొనెను (2దిన 32:25-26వ.). యూదా వారిని పరిపాలించిన ఇరువది మంది రాజులలో హిజ్కియా మంచివాడు. తన హృదయములో నున్న గర్వమును గుర్తించగలిగెను. తదుపరి విడిచిపెట్టి దేవుని కోపము నుండి తప్పింపబడెను. హిజ్కియా హృదయములో గర్వమున్న యెడల మనలో కూడా గర్వముండ గలదు. శరీరములో క్రొవ్వు స్వాభావికముగా నిత్యము ఏర్పడుచుండును. క్రొవ్వుతో హృదయము మూయబడిన యెడల ప్రాణాపాయము కలుగగలదు. గర్వమైన క్రొవ్వంతటిని నిత్యము దేవుని బలిపీఠము మీద పెట్టి సంపూర్తిగా దహించాలి. (లేవీ 4:31వ.).

క్రొవ్వయిన గర్వమును గుర్తించి దేవుని బలిపీఠముపై విడిచిపెట్టి పూర్తిగా దహించి వేసిన యెడల దేవుని కోపము నుండి తప్పించబడి దీవించ బడగలము.

15-16వ. భూసంబంధము, ప్రకృతి సంబంధమైన జ్ఞానము వలన హృదయమందున్న మత్సరము వలన, నోటిలో అబద్దాలు, అల్లరులు, శరీరములో నీచకార్యములు వుండును. హృదయములోనుండి దురాలోచనలు, జారత్వమును, దొంగతనములును, నరహత్యలును, వ్యభిచారములును, లోభములును, చెడుతనములను, కృత్రిమమును, కామ వికారమును,

మత్సరమును దేవదూషణయు, అహంభావమును, అవివేకమును వచ్చును. ఈ చెడ్డవన్ని బయలువెళ్ళి మనుష్యుని అపవిత్రపరచును (మార్కు 7:21–23). ఈ అపవిత్రతల నుండి మనలను మనము కాపాడుకొనుటకు జాగ్రత్తపడాలి. భూసంబంధము, ప్రకృతి సంబంధమైన జ్ఞానమును ఆశ్రయించకూడదు, దాని మీద ఆధారపడకూడదు.

17–18వ. ప్రకారము పైనుండి వచ్చు జ్ఞానము పవిత్రమైనది, నీతి ఫలములతోను సమాధానముతోను నిండి వుండును. కనుక మన జీవితములో శరీర అవయవములైన పంచేంద్రియములగు కన్ను, చెవి, నాలుక, ముక్కు, చర్మము, అంతరింద్రియములగు మనస్సు, హృదయము, ప్రాణము, ఆత్మలకు (మనుష్యాత్మ) తావియ్యక పైనుండి వచ్చు జ్ఞానముతో (దేవుని ఆత్మతో) యోగ్య ప్రవర్తన కలిగి మంచి సంభాషణతో, క్రియలను కనుపరచుచు సాత్వికముతో విశ్వాస జీవితములో విజయులము కావాలి.

## 4వ అధ్యాయము (6+6+5=17వ).

అంశము:– విశ్వాసమునకు వైరమైన లోక స్నేహము, అపవాది తంత్రములు.

### 1–6వ. ఈ లోకస్నేహము దేవునితో వైరము – అవసరమైన దీనత్వము:–

1–3వ. లోకములో యుద్ధాలు, పోరాటాలు మానవుల శరీర అవయవములలో పోరాడు లోక భోగములను నెరవేర్చుకొనగోరుటను బట్టియే కలుగుచున్నవి. మానవునికి శరీర, లోక ఆశలెక్కువ. లోక సంబంధమైన సంపాదనకై మత్సరముతో పోట్లాడుదురు, యుద్ధములు చేయుదురు. హత్య చేయుటకైనను వెనుకాడరు. అయినను దేవుని అడగనందున ఏమియు దొరుకదు. ఒకవేళ దేవుని అడిగినను భోగముల నిమిత్తమై మంచి ఉద్దేశ్యముతో కాక, దురుద్దేశ్యముతో అడుగుదురు. కనుక దొరుకుట లేదు. కనుక దేవుని అడుగుట మన భోగముల నిమిత్తము కాక, కొదువలు లేని విశ్వాస జీవితము కొరకు, దాని నిమిత్తమైన జ్ఞానము కొరకు దేవుని అడగాలి.

4–6వ. లోకస్నేహము దేవునితో వైరము. కనుక లోకముతో స్నేహము చేయువాడు దేవునికి శత్రువగును (4వ). లోకమును స్నేహించువారు వ్యభిచారిణులని పిలువబడుచున్నారు (4వ). స్త్రీ ఒకే పురుషుని ప్రేమించాలి. ఇద్దరిని ప్రేమించితే వ్యభిచారిణి అగును. అటు లోకమును, ఇటు ప్రభువును ప్రేమించితే అది వ్యభిచారమే. లోకమును ప్రేమించితే దేవుడు మనయందు నివసింపజేసిన ఆత్మ దుఃఖపడును. మరియు తండ్రి ప్రేమ మనయందు వుండదు(1యోహాను 2:15వ). కీర్తన 73:25వ.లో నీవు నాకుండగా లోకము లోనిది ఏదియు నాకక్కర లేదు అని ఆసాపు కీర్తనలో అన్నాడు. మనమును అలాగే ఉండాలి. మనము దీనులమైతే ఆయన కృప నిచ్చును. ఆయన అహంకారులను ఎదిరించి దీనులకు కృపనిచ్చును అని వ్రాయబడినది (6వ). ఆయనలో అహంకారము లేదు. కనుక లోకమును స్నేహించక ప్రభువు వలె దీనులమై దేవుని సహవాసముతో విశ్వాస జీవితములో విజయులము కావాలి.

**7-12వ. అపవాదితో స్నేహము చేయక - అపవాదిని ఎదిరించాలి - ప్రభువు దృష్టికి మనలను తగ్గించుకోవాలి:-**

7-10వ.లో మన విరోధియగు అపవాది ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడని 1 పేతురు 5:8వ.లోను, అపవాదిని ఎదిరించుడి, వాడు మీ యొద్ద నుండి పారిపోవునని యాకోబు 4:7వ.లోను చెప్పబడుట గమనించండి. మనలను ద్విమనస్కులని పిలచుట గమనించండి. అపవాది తన్ను తాను హెచ్చించుకొనువాడు. నేను ఆకాశమునకు ఎక్కి పోయెదను, దేవుని నక్షత్రములకు పైగా నా సింహాసనమును హెచ్చింతును. మేఘ మండలము మీదికెక్కుదును (యెషయా 14:12-17). దేవుడు తన్ను తాను తగ్గించుకొనువాడు. దేవునితో సమానముగా నున్నవాడైనను దాసుని స్వరూపము ధరించుకొన్నాడు, రిక్తుడయ్యాడు (ఫిలి 2:5-8వ.).. మనము కొన్ని పర్యాయములు తగ్గించుకొనుచు మరికొన్ని పర్యాయములు హెచ్చించుకొనుచు నుందుము. ఇదియే ద్విమనస్కులగుట, అనగా దేవుని మనసు, సాతాను మనసు రెండు మనసులు కలిగి యుండుట. అపో 5:3వ.లో అననీయ, సప్పీరాలు ఆది 3:6-7వ.లో ఆదాము, హవ్వలు రెండు మనసులు కలిగి యుండిరి. మనమైతే అలాగుండక ప్రభువు దృష్టికి మనలను మనము తగ్గించుకొనాలి. 6వ.లో నున్నట్లు దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును.

ఒక చెట్టు ఎంత లోతుగా వ్రేళ్ళను భూమి లోనికి పోనిచ్చునో అంత పైకి పెరిగినను స్థిరముగా నుండును. క్రిందికి వేరులు పోక పైకి మాత్రమే పెరిగిన విరిగి పోగలదు. 10వ.లో నున్నట్లు ప్రభువు దృష్టికి మిమ్మును మీరు తగ్గించుకొనుడి. అప్పుడాయన మిమ్మును హెచ్చించును. దీనులమై హృదయములను పరిశుద్ధపరచుకొనాలి, చేతులు శుభ్రము చేసుకొనాలి. అప్పుడు 1యోహాను 4:4వ.లో నున్నట్లు మనము అపవాదిని జయించగలమని చెప్పబడినది.

11-12వ. సహోదరులు ఒకరినొకరు ప్రేమించుకోవాలి. కాని ఒకరికి విరోధముగా మరొకరు మాటలాడక, తీర్పుతీర్చక యుండాలి. యోబు విషయమై తన ముగ్గురు స్నేహితులు తీర్పు తీర్చినప్పుడు దేవుడు వారిమీద కోపగించాడు (యోబు 42:7-8వ). మిర్యాము మోషేకు స్వంత అక్కయైనను మోషే మీద విరోధముగా మాటలాడి తీర్పు తీర్చగా దేవుడు మిర్యామును గద్దించాడు (సంఖ్యా 12అ.). కనుక మనలను మనము తగ్గించుకొని ప్రభువు తీర్పుకు వారిని అప్పగించుట వాక్యప్రకారమైనది. ఆయనే న్యాయము విధించుటకు, తీర్పు తీర్చుటకు, రక్షించుటకు, నశింపచేయుటకు శక్తిమంతుడు. మనకైతే అట్టి శక్తి లేదు కనుక విరోధముగా మాటలాడుటకు, తీర్పు తీర్చుటకు అధికారము లేదు. దేవుని అధికారమును మనము చేపట్టుట గొప్ప తప్పగును.

**13-17వ. వ్యాపారము చేసి లాభము సంపాదించువాడు డంబముగా కాక దేవుని చిత్త ప్రకారము జీవించుట:-**

13-15వ. మన జీవము గడ్డి వంటిదని 1:11వ.లో అంతలో కనబడి అంతలోనే మాయమైపోవు ఆవిరి వంటిదని 4:14వ.లో చెప్పబడినది. కనుక లోకములో ఒక సంవత్సరము వ్యాపారము చేసి సంపాదింతమని డంబముగా చెప్పుకొనక అంతలోనే ఆవిరివలె గతించిపోవు మనము ప్రభువు చిత్తమైతే బ్రతికియుండి ఇది అది చేయగలమని చెప్పుకొనాలి. లూకా 12:16-21వ.లో ఒక ధనవంతుని భూమి విస్తారముగా పండగా తన ప్రాణముతో అనేక సంవత్సరములకు ఆస్తి నీకు సమకూర్చబడినది. తినుము, త్రాగుము, సుఖించుమని చెప్పుకొందుననుకొనుచుండగా దేవుడు వెర్రివాడా, ఈ రాత్రి నీ ప్రాణమును అడుగుచున్నాను అన్నాడు. సామెతలు 10:22వ. ప్రకారము యెహోవా ఆశీర్వాదమే ఐశ్వర్యమిచ్చును, నరుల కష్టముచేత అది ఎక్కువకాదని గుర్తించుదము. కనుక సంపాదనపై అంతగా మనసుండకూడదు. కొదువలు లేని పరిపూర్ణ విశ్వాస జీవితముపై మనసుంచాలి.

16-17వ. వ్యాపారము చేసి లాభము సంపాదించువాడు, డంబముగా పలుకుట, ప్రవర్తించుట, అతిశయించుట చెడ్డవని చెప్పుచున్నాడు. కనుక మేలైనదేదో గుర్తించాలి. మేలైనది చేయనెరిగి చేయాలి. ఏవి సత్యమైనవో,.. ఏవి మాన్యమైనవో, ఏవి రమ్యమైనవో, (ఏవి మేలైనవో) యెరుగాలి, అలాగు చేయాలి. చేయకపోవుట పాపమని గమనించాలి. యెహోవా ఆశీర్వాదమే ఐశ్వర్యమిచ్చును కనుక అశాశ్వతమైన సంపాదనపై మనసుంచక, అన్నింటికంటే మేలైనదగు కొదువలు లేని పరిపూర్ణ విశ్వాస జీవితముపై మనసుంచాలి, అలాగు చేయాలి. మేలైనది చేయనెరిగియు అలాగు చేయని వానికి పాపము కలుగును.

గమనిక:- వ్యాపారస్తులు ఒక సంవత్సరము తమ వ్యాపారమునకు బయటకు వెళ్ళితే విశ్వాస యాత్రలో మనము కూడా దేవుని వ్యాపారము/సేవకై ఆయన చిత్త ప్రకారమే ఒక సంవత్సరమైన/ఎన్ని రోజులైనా బయటకు వెళ్ళి సేవ చేయుచు ఆత్మలను సంపాదించుచు విశ్వాస జీవితములో జాగ్రత్తగా జీవించాలి.

## 5వ అధ్యాయము (6+6+6+2=20వ.).

**అంశము:- విశ్వాస యాత్రా జీవితమునకు అవసరమైన మెలుకువలు.**

(దినముల అంతమందు మనమున్నామని, ప్రభువు రాకడ సమీపముగా నున్నదని, న్యాయాధిపతి వాకిటనే నిలిచియున్నాడని గుర్తించి 4:13వ.లో చెప్పబడినట్లు సంపాదనపై మనసుంచకూడదు. ద్రవ్యమును, వస్త్రమును... సంపాదించుకొనుటకు ఇది సమయము కాదని 2 రాజులు 5:26వ.లో ఎలీషా గేహజీకి చెప్పినట్లు ప్రభువు రాకడ సమీపమైనందున సంపాదనకు ఇది సమయము కాదు. ధనవంతుడైన యోబు వలె అస్థిరమైన ధనమునందు నమ్మిక యుంచక శ్రమలలో ఓపిక కలిగి, ఎలియావలె ఆసక్తితో ప్రార్థనలో ప్రభువు తన

రాకడలో మన కొరకు తెచ్చు ఫలము/బహుమానముకై ఎదురు చూచుచు ఈ లోకధనము అస్థిరమైనందున దానియందు నమ్మికయుంచక విశ్వాసయాత్ర కొనసాగించాలని చెప్పుచున్నాడు).

**1-6వ. ధనవంతులకు అంత్య దినములలో ధనమును కూర్చుకొన వలదను హెచ్చరిక:-**

1-4వ. అంత్యదినాలలో మోసముచేత, అన్యాయముగా కూలీలు బిగబట్టుటచేత ధనము సంపాదించుట ఉండకూడదు.. 1తిమోతి 6:9-10వ. ప్రకారము ధనవంతులగుటకు అపేక్షించు వారు శోధనలోను శ్రమలోను పడుదురు. ధనాపేక్ష సమస్త కీడునకు మూలము. దానిని ఆశించినవారు విశ్వాసము నుండి తొలగి పోయిరి. ధనాపేక్ష కూడదు. దాని కొరకు ప్రయాసపడుట క్షేమకరము కాదు. ఎందుకనగా సామె 23:4-5వ. ప్రకారము ఐశ్వర్యము పొంద ప్రయాసపడకుము.. నిశ్చయముగా అది స్కెలు కట్టుకొని యెగిరిపోవును అని చెప్పబడినది. 2-3వ. ప్రకారము ధనము చెడిపోవును. వస్త్రములు చిమ్మటలచేత తినివేయబడును. బంగారు, వెండి తుప్పు పట్టినవి. అన్యాయముగా సంపాదించినందున వీటి తుప్పు మన మీద సాక్షముగా నుండి అగ్నివలె మన శరీరాలను తినివేయగలదు. మత్తయి 6:18-24వ.లో భూమి మీద కాక, పరలోకములో మనకొరకు ధనము కూర్చుకోవాలని, అక్కడ చిమ్మెట కొట్టదని, దొంగలు కన్నము వేయరని చెప్పుచున్నాడు. ధనము మనలను దాసులుగా చేసికొనగలదు. దేవునికి దాసులమైన మనము దేవునికిని, సిరికిని, దాసులముగా వుండలేము. ఏదో ఒక పక్షముగా నుండగలము. కనుక ధనమునకు కాక దేవునికి దాసులై వుండాలని నేర్చుకొందము.

5-6వ. ధనవంతులకు మోసము చేయుట మీద, భూమి మీద సుఖముగా జీవించుట మీద, శరీర భోగములమీద మనసుండును. అందులకై ధనవంతులు నీతిమంతుని శిక్షించి, చంపుటకైనను వెనుకాడరు (6వ.). ధనవంతులు గర్విష్టులగుదురని అస్థిరమైన ధనమునందు నమ్మికయుంచ కూడదని 1తిమోతి 6:17వ.లో వ్రాయబడినది. కనుక అంత్య దినాలలో ప్రభువు రాకడ సమీపమైనందున అస్థిరమైన ధనమునందు నమ్మికయుంచక ప్రభువు కొరకు ఎదురుచూచుచు విశ్వాసములో కొదువలు లేకుండా చూచుకొనాలి.

**7-12వ. ప్రభువు రాకడ వరకు శ్రమలను ఓర్చుకొనుచు యోబువలె సహనము కలిగియుండుట:-** 7-9వ. వ్యవసాయకుడు తొలకరి వర్షము కొరకు, కడవరి వర్షము కొరకు పొందబోవు భూఫలము కొరకు కనిపెట్టినట్లు మనము కూడా సమీపించిన ప్రభువు రాకడకై ఆయన తెచ్చు ఫలము/బహుమానము కొరకై కనిపెట్టి యుండాలి. హృదయమందు పాపమును వుంచుకొని (3:14) నోటికి కళ్ళెము పెట్టుకొనక హృదయమును మోసపరచుకొనకూడదు. (1:26). హృదయమును స్థిరపరచుకొనాలి.

10-12వ. శ్రమల గుండా వెళ్ళుచున్నప్పుడు మరొకరిమీద సణగక యోబు వలె సహనము కలిగియుండాలి. సహనమునకు ఓపికకు, శ్రమానుభవమునకు, మన కంటే ముందున్న ప్రవక్తలను మాదిరిగా పెట్టుకొని ధన్యులము కావాలి. ఒట్టు పెట్టుకొనుట వుండకూడదు. మనమాట అవునంటే అవును, కాదంటే కాదని వుండాలి (12వ.).

**13-18వ. భక్తికి అవసరమైన ఏలీయా వంటి ఆసక్తితో కూడిన ప్రార్థన:-** ఈ భాగమందు ప్రతి వచనమందు ప్రార్థన అని ఆరు పర్యాయములు ఈ పదము కలదు. ఒకసారి విజ్ఞాపన అని మొత్తము ఏడు పర్యాయములు ఈ అంశము కలదు. ప్రార్థన చేయవలెను -2, ప్రార్థన చేయుడి -1, ప్రార్థన చేయగా -2, ప్రార్థన స్వస్థపరచును -1. ఈ క్రింది పదములను గమనింతుము.

1) నీతిమంతుని విజ్ఞాపన, 2). విశ్వాస సహితమైన ప్రార్థన,
3) నూనెరాచి చేయు ప్రార్థన, 4) ఆసక్తితో ప్రార్థన , 5) మరల ప్రార్థన,
6) మనఃపూర్వకమైన ప్రార్థన, 7) ఒకని కొరకు ఒకడు చేయు ప్రార్థన.

10-15వ. శ్రమ కలిగిన వారు ప్రార్థించాలి. సంతోషము కలిగినవారు కీర్తించాలి. స్తుతించాలి. శ్రమలలో నున్నవారి కొరకు ప్రార్థించాలి. రోగుల కొరకు పెద్దలను పిలిపించగా వారు నూనె రాచి ప్రార్థించాలి. విశ్వాస సహితమైన ప్రార్థన రోగిని స్వస్థపరచును.

16-18వ. గ్రంథకర్త యాకోబు అసాధరణ ప్రార్థనా జీవితము గలవాడని, బహుషా ఎక్కువ సేపు ప్రార్థించువాడని తన మోకాళ్ళు ఒంటె మోకాళ్ళవలె మారిపోయినవని సంఘ చరిత్రను బట్టి తెలియుచున్నది. ఏలీయా మనవంటి స్వభావము గలవాడైనను ఆసక్తితో ప్రార్థించగా అకాశము మూయబడినది / తరువాత వర్షమిచ్చినది. నీతిమంతుల ప్రార్థన బలమైనది.

**19-20వ. తప్పిపోయిన వారిని సత్యానికి మళ్లించుట:-** 1) విశ్వాసమందు తప్పిపోయిన వారిని మార్గము లోనికి మళ్లించుట, 2) పాపిని రక్షణ లోనికి నడిపించుట, మరణము నుండి ఒక ఆత్మను రక్షించుటతో సమానము. ఈ రెండు కార్యములలో ముందుకు సాగుచు శరీరము, లోకము, సాతానులను జయించుచు విశ్వాస జీవితములో విజయులమగుదుము గాక.

## వివిధ కిరీటములు.

**1. అక్షయ కిరీటము (1కొరింథీ 9:25627వ):-** పందెపు రంగమందు పరుగెత్తు వారందరు అన్నిటిలో మితముగా నుండినవారికి అక్షయ కిరీటము. పరుగెత్తుటలో అపరిమితముగా నుందురు. నియమ ప్రకారము పరుగెత్తుదురు. 1) శరీర విషయాలు, అనగా తిండి, వస్త్రధారన విషయమైన చింతలకు, 2) లోక విషయాలకు సమయమును, వృథా చేయక ఎక్కువగా పరుగును సాధకము చేయుటలోనే వుందురు. పందెపు రంగములో

పాల్గొనువారు శరీరమును బహు తక్కువగా వుండునట్లు చూచుకొందురు. తినుటలో నియమ ప్రకారము, మితముగా నుండి కడుపు బరువు కాకుండా చూచుకొందురు. వస్త్రములు బహుకొద్దిగా వేసుకొందురు. పాదములకును బరువు లేకుండా కేవలము అవసరమైన పాద రక్షణను కలిగించు వాటిని మాత్రమే ధరించుకొందురు.

27వ. నియమ ప్రకారము పరుగెత్తని వారు భ్రష్టులగుదురు. భ్రష్టులగుట **(Disqualifi)** అను పదము అనర్హులగుదురని ఇంగ్లీషు బైబిలులో కలదు. కనుక నియమ ప్రకారము జీవించనివారు బహుమానమునకు అనర్హులు. నియమప్రకారమైన జీవితము ఎంతగా అవసరమో గుర్తించుదము గాక.

**2. జీవ కిరీటము (1:12వ):–** శోధనలు సహించి, నిలిచి యుండువారు బహుమానము పొందుదురు. శోధనలో నిలిచి జయించిన వారు జీవకిరీటము పొందుదురు, శోధనకు లొంగినవారు జీవించుచున్నారన్న పేరు మాత్రముండి తమ క్రియల వలన మృతులుగా నున్నవారు. వారికి జీవ కిరీటము ఉండదు. కనుక శోధనలు జీవ కిరీటమును పొందుటకు బాటలైనందున శోధనలు కలిగినప్పుడు మహానందమని ఎంచుకోవాలి.

**3. నీతి కిరీటము (2తిమోతి 4:8వ):–** ప్రభువు రాకడ నపేక్షించుచు పాపములో పడకుండా నీతిగా జీవించువారికి నీతి కిరీటము. పౌలు ఇంచుమించు తన జీవిత కాలము చివరలో తిమోతికి వ్రాసిన మొదటి పత్రికలో పాపులలో ప్రధానపాపినైన నన్ను అన్నాడు. తన పాప స్వభావమును మనసులో ఉంచుకొని ఆలాగు చెప్పుచున్నాడు. ఎవరు పాపము విషయమై జాగ్రత్తగా నుందురో వారు నీతిగా జీవించినవారై కాలాంతమందు నీతి కిరీటమును పొందుదురు.

**4. మహిమ కిరీటము (1పేతురు 5:4వ):–** తమకు అప్పగింపబడిన పనిని నెరవేర్చి, మందకు మాదిరులుగా నున్నవారు – మాదిరులకు మహిమ కిరీటము. తోటిపెద్దను అని ప్రారంభించి పెద్దలకు అప్పగించబడిన పనిని గూర్చి చెప్పినందున ఈ కిరీటము ముఖ్యముగా పెద్దలు తమకు అప్పగించబడిన పనిని నెరవేర్చుటను గూర్చినది. వారు మందకు మాదిరులుగా నుండి మహిమ కిరీటము పొందాలి.

**5. ఆనంద అతిశయ కిరీటము (1థెస్స 2:19వ):–** ఫిలి 4:1వ.లో ఆనందము, కిరీటమైనవారని ఫిలిప్పీయులను ఉద్దేశించి చెప్పుచున్నాడు. శ్రమలలో, ఇబ్బందులలో, ఉపద్రవములలో, పోరాటములలో పౌలు ఫిలిప్పీ, థెస్సలొనికలలో ఆత్మలను సంపాదించినవాడు. కనుక ఫిలిప్పీయులే ఆయనకు ఆనంద అతిశయ కిరీటము. వివరాలు అపొ 16,17 అధ్యాయాలలో కలవు. ఆత్మలను సంపాదించుట ద్వారా ఆనంద, అతిశయ కిరీటమును పొందుదురు.

**6. సువర్ణ కిరీటము (ప్రకటన 4:4వ) :–** బంగారు దైవత్వమును సూచించునది. గల 3:27వ. ప్రకారము క్రీస్తును ధరించుకొనాలి. ఆలాగు క్రీస్తును ధరించుకొని అన్ని

విషయములలో క్రీస్తువలె నుండి దైవత్వపు లక్షణములు కలవారికి సువర్ణ కిరీటము బహుమానముగా ధరింపచేయబడును.

**7. ముండ్ల కిరీటము (ఆది 3:18, యోహాను 19:2వ) :-** పైనున్న ఆరు కిరీటములు మనకిచ్చుటకై ప్రభువు ముండ్ల కిరీటమును పెట్టించుకొనుట గమనించుదుము గాక. ఆదాము, హవ్వలు పాపము చేసినప్పుడు నేల శపించబడి ముండ్ల తుప్పలను మొలిపించినది. ఆ ముండ్ల చేత అల్లబడిన కిరీటము మనపై ఉంచాలి. కాని దానిని ప్రభువు తన తలపై పెట్టించుకొని బాధ అనుభవించాడు.

సిలువలో మనము పొందవలసిన బాధను, శ్రమలను అనుభవించి, మనలను విమోచించి, మనకు విడుదల నిచ్చాడు. లోకములో అవసరమునుబట్టి కొంచెము కాలము దుఃఖము, శ్రమలు కలిగినను, ప్రభువు మనతో కూడా నుండి వాటన్నిటి నుండి తప్పించి కాపాడుచున్నాడు.

ప్రభువుకు యుగయుగములు మహిమ కలుగును గాక.

# 4. పేతురు వ్రాసిన మొదటి పత్రిక

**(పేతురు పత్రికలో పరిశుద్ధుల యొక్క పరిశుద్ధ ప్రవర్తనను గూర్చిన పలుకులు).**

**ముఖ్య అంశము:- పరిశుద్ధ పరచబడి, పరిశుద్ధముగా ప్రవర్తించుట (1:14వ).**

ఈ గ్రంథమందు ముందుగా దేవుని ద్వారా మనము రక్షించబడిన విధము అనగా పరిశుద్ధపరచబడనవిధము ఏరీతిగా, ఎందుకు పరిశుద్ధపరచాడో (రక్షించాడో) (1అ), ఎక్కడ పరిశుద్ధముగా జీవించాలో (2-3అ), ఎప్పుడు పరిశుద్ధముగా జీవించాలో (4-5అ)లో చెప్పాడు. రక్షించబడిన వారు మొదటిదిగా వ్యక్తిగతములో, రెండవదిగా సంఘములో, మూడవదిగా సమాజములో, నాల్గవదిగా సేవకత్వములో అనగా లోక సంబంధమైన పనిలో, ఐదవదిగా సంసారములో భార్యభర్తలుగా, ఆరవదిగా సహోదరులందరితో ఒకరితో ఒకరు, హృదయములలో క్రీస్తును ప్రభువుగా ప్రతిష్టించుకొని పరిశుద్ధముగా జీవించుచూ, మిగిలిన జీవిత కాలములో పరిశుద్ధముగా ప్రవర్తించుటను గూర్చి చెప్పబడినది.

మొదటి మూడు అధ్యాయాలలో ప్రస్తుత జీవిత కాలమును గూర్చి, నాలుగు, ఐదు అధ్యాయాలలో మిగిలిన జీవిత కాలమును గూర్చి చెప్పబడినది. పరిశుద్ధులుగా తీర్చబడిన విధము, పరిశుద్ధముగా జీవించవలసిన అవసరతను గూర్చి మొదటి అధ్యాయములో చెప్పాడు. రెండు, మూడు అధ్యాయములలో **1) వ్యక్తిగతముగా 2) సంఘములో 3) సమాజములో, 4) సేవకత్వములో, 5) సంసారములో, 6) సహోదరుల మధ్య ఒకరితో**

ఒకరు, క్రీస్తును హృదయములో ప్రతిష్ఠించుకొని, పరిశుద్ధముగా జీవించుటను గూర్చి చెప్పాడు. నాలుగవ అధ్యాయములో మిగిలిన జీవిత కాలము దేవుని ఇష్ట ప్రకారము జీవించుటను గూర్చి చెప్పి పరిశుద్ధ జీవితానికి అవసరమైన హెచ్చరికలతో అయిదవ అధ్యాయము ముగించబడినది.

**విభజన:-**

**1-3అ. ప్రస్తుత కాలము జీవించుట:-**

1అ. పరిశుద్ధులగుట, పరిశుద్ధత జీవిత వివరము (2+5+5+5+4+3=24వ).

2అ. సంఘములో, సమాజములో, సేవకత్వములో, జీవించుట (8+9+8=25వ.)

3అ. సంసారములో, సహోదరులందరు ఒకరితో ఒకరు, క్రీస్తును హృదయములో ప్రతిష్ఠించుకొని జీవించుట (7+5+5+5=22వ.)

**4-5అ. మిగిలిన కాలము జీవించుట:-**

4అ. మిగిలిన కాలము మనుజ ఆశలను అనుసరించక,
దేవుని ఇష్టప్రకారము జీవించుట (6+5+4+4=19వ.)

5అ. జీవిత కాలానికి పరిశుద్ధత గూర్చిన హెచ్చరికలు (4+3=4+3=14వ).

## 1వ అధ్యాయము (12+12=2+3+2+2+3+5+4+3=24వ)

**అంశము:- పరిశుద్ధులగుట (1-12వ) - పరిశుద్ధముగా ఉండుట (13-24వ).**

1-2వ.లో తండ్రీ, కుమార, పరిశుద్ధాత్మలు ఏ రీతిగా పాపముల నుండి మనలను కడిగి పరిశుద్ధపరచారో తెలుపబడినది. మనకు అనుగ్రహించబడిన ఆ రక్షణ 3-4వ.లో జీవముతో కూడిన నిరీక్షణ గల రక్షణ అని, 5వ.లో శక్తి గల రక్షణ అని, 6-7వ.లో శోధన ద్వారా కలుగు పరీక్షలో నిలిచి మెప్పు, ఘనత, జయమునిచ్చు రక్షణ అని, 8-9వ.లో ఆనందము నిచ్చు రక్షణ అని, 10-12వ.లో మహిమ నిచ్చు రక్షణ అని తెలుపబడినది. 13-17వ.లో రక్షణ యందలి విధేయతను గూర్చి, 18-21వ.లో రక్షణ యొక్క విలువను గూర్చి 22-24వ.లో రక్షణ యొక్క వివరమును గూర్చి చెప్పాడు.

**1-12వ. పరిశుద్ధులగుట:-** 1-2వ. పరిశుద్ధులగుట:- 1-2వ.లో రక్షించబడుట అనగా పరిశుద్ధులగు విధమును గూర్చి చెప్పుచున్నాడు. ఎఫె. 1:6-7వ. ప్రకారము జగత్తునాది వేయబడక మునపే తండ్రియైన దేవుడు మన పాప క్షమాపణ, రక్షణ విషయమైన ఏర్పాటు చేసెను (planned). యుక్తకాలములో కుమారుడైన దేవుడగు క్రీస్తు కలువరిలో గాయపరచబడుట ద్వారా శ్రమపడి, అమూల్యమైన రక్తమును చిందించాడు (paid), మనపై ప్రోక్షించాడు. పరిశుద్ధాత్మ మనకు పై సంగతులను సరియైన సమయములో తెలిపి, ఒప్పింపచేసి మనలను కడిగి పవిత్రపరచాడు (performed).

3-4వ.లో క్రీస్తు మృతులలో నుండి తిరిగి జీవముతో లేచినందున జీవముతో కూడిన నిరీక్షణ మనకివ్వబడినది. మృతులలో నుండి నిర్మలుడుగా లేచిన యేసు మరలా మరణించలేదు, కనుక ఆయన యిచ్చిన రక్షణ అక్షయమైనది, వాడబారనిది, నిర్మలమైనది అనగా శాశ్వతమైనది.

5వ.లో దేవుడు సర్వశక్తిమంతుడు (ఆది 17:1వ). సర్వశక్తి ఆయన దగ్గరనే ఉన్నందున మన దగ్గర ఏమియు లేదు. కనుక మనలను మనము కాపాడుకొనలేము. తన సర్వశక్తితో మనలను కాపాడుచున్నందున ఆ రక్షణ శక్తి గలది.

6-7వ. లో రక్షించబడిన వారికి శోధనలచేత కొంచెము కాలము దుఃఖము కలుగును. కంసాలి సువర్ణమును అగ్నిచేత కరిగించి, కరిగిన సువర్ణములో తన ముఖము కనబడు వరకు కరిగించుట ద్వారా పరిశుద్ధపరచును. మనమును అగ్ని వంటి మహా శ్రమల ద్వారా పరిశుద్ధ పరచబడి, శుద్ధి చేయబడితేనే మనము పరీక్షను జయించిన వారమగుదుము. కనుక పరీక్షలలో ఈ రక్షణ మనకు జయమునిచ్చుట ద్వారా మహిమను, ఘనతను, మెప్పును పొందుదుము.

8-9వ. విశ్వాసము నిరీక్షణతో కూడినది. విశ్వసించిన మనము ఈ లోకములోను, రాబోవు లోకములోను ఫలము పొందుదుమన్న నిరీక్షణ కలిగియున్నాము. చూచి విశ్వసించిన వారికంటే చూడక విశ్వసించిన వారే ధన్యులు. మన మాయనను చూడక పోయినను విశ్వసించినందున ఫలముగా చెప్పనశక్యమును మహిమాయుక్తమైన సంతోషము, ఆనందముతో కూడిన ఆత్మ రక్షణను పొందియున్నాము.

10-12వ. క్రీస్తు విషయమైన శ్రమలను పొందిన వారికి కలుగబోవు బహుమానమును గూర్చి ప్రవక్తలు చెప్పిరి. ముందుగా మనకు కలుగబోవు కృపను గూర్చి ప్రవచించిరి. ఈ రక్షణను పరిశోధించి, కృప ద్వారానే రక్షణ కలుగునని సాక్ష్యమిచ్చినప్పుడు, రక్షణనుబట్టి కలుగు శ్రమలు, అటు తరువాత మనకు దొరుకు బహుమానమును గూర్చి వివరించిరి. దేవదూతలు పైనుండి ఈ కార్యములు ఏ రీతిగా జరుగునోయని తొంగిచూచుచున్నారు. హెబ్రీ 1:14వ. ప్రకారము దేవదూతలు రక్షణ అను స్వాస్థ్యము పొందబోవు వారికి పరిచారము చేయుటకై పంపబడిన సేవకుల ఆత్మలు. వారు రక్షణను స్వాస్థ్యముగా పొందిన మనకు పరిచారము చేయుచు, క్రీస్తు విషయమైన శ్రమలను మనమేలాగు పొందుదుమో తొంగి చూచుచున్నారు. కనుక శ్రమలను పొందుటలో మనమెంతో మెలుకువ కలిగి, అటు తరువాత బహుమానము పొందువారమైయుండాలి.

**13-24వ. పరిశుద్ధముగా వుండుట:-**

13-17వ. రక్షణయందు పరిశుద్ధతను గూర్చిన విధేయత - 13వ.లో మీ మనస్సు అను నడుము కట్టుకొని అనగా పరిశుద్ధ జీవితము జీవించుటకై సిద్ధపడాలి.

14-16వ. లేవి 11:44వ. ప్రకారము 'మీ దేవుడైన యెహోవా పరిశుద్ధుడు కనుక మీరును పరిశుద్ధులై యుందురు'. మానవులు అజ్ఞాన దశలో వ్యర్థ ప్రవర్తనను కలిగినవారు. రోమా 5:12వ. ప్రకారము అజ్ఞాన కాలములో ఆదామను ఒక మనుష్యుని ద్వారా పాపము లోకములో ప్రవేశించినది. కనుక పాపము, పాపము ద్వారా కలుగు వ్యర్థ ప్రవర్తన పిత్రుపారంపర్యమైనవి. అందువలన పూర్వపు అజ్ఞాన దశలో మనకుండిన ఆశల ప్రకారము ప్రవర్తించక సమస్త ప్రవర్తన యందు పరిశుద్ధులై ప్రవర్తించాలి. మొదటిదిగా మనలను పిలిచిన దేవుడు నిర్గమ 15:11వ. ప్రకారము పరిశుద్ధతలో మహనీయుడు. వేల్పులలో అయన వంటి పరిశుద్ధుడైన వారు ఎవ్వరును లేరు. ఆయన పిలుపు కూడా పరిశుద్ధమైనది కనుక అయన పిలుపునకు తగినట్లుగా మనమును పరిశుద్ధ ప్రవర్తన కలిగియుండాలి. 1థెస్స 4:3-5వ. ప్రకారము మొదటిదిగా పరిశుద్ధులగుటయే అనగా జారత్వమునకు దూరముగా ఉండుటయే దేవుని చిత్తము. రెండవదిగా పరిశుద్ధత యందు మన ఘటములగు శరీరములను ఎట్లు కాపాడుకొనవలెనో ఎరిగి యుండుట దేవుని చిత్తము.

17వ. యేసు ప్రత్యక్షమైనప్పుడు పక్షపాతము లేకుండ, మనలో ప్రతి వానిని తీర్పు తీర్చి ఇవ్వబోవు బహుమానమును తీసుకొని వచ్చునన్న నిరీక్షణ మనకున్నది. మనసు అను నడుము కట్టుకొని విధేయులై, పరదేశులమై యున్నంత కాలము భయముతో ప్రవర్తించాలి.

18-21వ. రక్షణ యొక్క విలువ:- 18-19వ. పితృ పారంపర్యముగా మానవులు వ్యర్థ ప్రవర్తనను కలిగినవారు. ఆదామను ఒక మనుష్యుని ద్వారా పాపము లోకములో ప్రవేశించినందున, మనమందరము పాపము గలవారమైతిమి. పాపము నుండి పాప స్వభావము, తద్వారా కలిగిన వ్యర్థ ప్రవర్తన నుండి విడిపించబడుటకు వీలు లేదు. మానవులందరు పాపము చేసినందున నిర్దోషులెవరు లేరు. క్రీస్తు ఒక్కడే నిర్దోషి. పాపములు కడుగుటకవసరమైన పరిశుద్ధ రక్తము యేసు నొద్ద మాత్రమే కలదు. కనుక దాని వెల ఎంతయో మనము కట్టలేము. క్షయ వస్తువులగు వెండి బంగారుల చేత కాక, అమూల్యమైన నిర్దోషము, నిష్కలంకమగు క్రీస్తు రక్తముతో మనము విమోచించబడితిమి. కనుక అయన కార్చిన రక్తము తద్వారా కలిగిన రక్షణ అమూల్యమైనది, వెలకట్టలేనంత గొప్ప విలువ గలది.

20-21వ. క్రీస్తు రక్తము చిందించవలెనని జగత్తు పునాది వేయబడక ముందే నిర్ణయించబడెను. కడవరి కాలమందు రక్తము కార్చుటకు క్రీస్తు శరీరధారిగా ప్రత్యక్షమయ్యాడు. ఆత్మ రక్షణకు క్రీస్తు కార్చిన రక్తము అవసరమని మనకు యుక్త కాలములో బయలుపరచబడెను. క్షయ వస్తువులగు వెండి బంగారుల చేత కాక, అమూల్యమైన నిర్దోషము, నిష్కలంకమగు క్రీస్తు రక్తముతో మనము విమోచించబడితిమి.

22-24వ. రక్షణ యొక్క వివరము - మనమైతే గడ్డిని పోలిన వారము, గడ్డి ఎండి దాని పువ్వు వాడి పోయి, రాలిపోయినట్లు, మన స్వరూప సౌందర్యాలు కూడా వాడిపోయి

శరీరాలు రాలిపోవును. రక్షణ క్షయబీజము నుండి కాక అక్షయ బీజమైన వాక్యము నుండి కలిగినది. ప్రభువు వాక్యము ఎల్లప్పుడు నిలుచునది. కనుక మన శరీరములు క్షయమైనవియైనను మన రక్షణ శాశ్వతమైనది. గొప్ప రక్షణ అని, నిత్య రక్షణ అని హెబ్రీ 2:3, 5:10వలో చెప్పబడినది.

## 2వ అధ్యాయము (8+9+8=25వ.)

అంశము:- సంఘములో, సమాజములో, సేవకత్వములో, జీవించుట

1-8వ.లో రక్షించబడినవారు క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై ఎదుగుచు (1-4వ), పరిశుద్ధ యాజకులుగా, సజీవమైన రాళ్ళుగా, ఆత్మసంబంధమైన మందిరముగా కట్టబడుచు, కట్టువారుగా సంఘములో జీవించు విధము (4-8వ) చెప్పబడినది.

9-17వ.లో సమాజములో అనగా లోకములో జీవించు విధము (9-10వ), అన్యజనుల మధ్య జీవించు విధము (11-12వ), రాజకీయ ప్రభుత్వములో జీవించు విధము (13-17వ) చెప్పబడినది.

18-25వ.లో సేవకత్వములో పనివారుగా జీవించు విధము 18-20వ.లో చెప్పుచు, మాదిరియైన, మరియు ఆత్మల కాపరియైన క్రీస్తును పోలి ఆయన అడుగు జాడల యందు నడుచుచు జీవించాలని 21-25వ.లో చెప్పబడినది.

మీరు 1) ప్రభువు దయాళుడని రుచి చూచినవారు (1వ), 2) పరిశుద్ధ యాజకులు (5వ) 3) సజీవమైన రాళ్ళు (5వ), 4) చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగు లోనికి పిలువబడినవారు (9వ), 5) గుణాతిశయములను ప్రచురము చేయువారు (9వ), అను మాటలను గమనించండి.

**1-4వ.లో రక్షించబడినవారు క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై ఎదుగుట:-**

1-3వ. ప్రభువు దయను రుచి చూచిన వారు:- తీతు 3:4వ. ప్రకారము దేవుని దయ ప్రత్యక్షమై... మనలను రక్షించినది. ప్రత్యక్షమైన దయ యేసే. యేసు పాప క్షమాపణకు అవసరమైన రక్తము చిందించుట ద్వారా రక్షణ మనకు లభించినది. అలాగైతే ప్రభువు దయను రుచి చూచుట అనగా రక్షించబడుట. రక్షించబడినవారు నూతనముగా జన్మించిన శిశువులను పోలినవారు. శిశువులు రాత్రింబగలు పాలు త్రాగుట, విశ్రమించుట తప్ప మరే దుష్టత్వము, కపటము, వేషధారణ, అసూయ, దూషణ మొదలగు వాటిని అసలే ఎరుగరు. అలాగే నూతనముగా రక్షింపబడిన వారు దివారాత్రములు వాక్యమను పాలను అపేక్షించాలి. త్రాగుచు రక్షణలో / ఆత్మీయతలో ఎదగాలి. విశ్రాంతిగా నుండాలి. యెహోవా ఉత్తముడని రుచి చూచి తెలిసికొనుడి (కీర్త 34:8వ.). వాక్యములో ఎదుగుచు దేవుని

ఔన్నత్యమును అనగా ఆయన గుణగణములను తెలిసికొనాలి. రుచి చూడవలసిన కొన్నిటిని గమనించండి. 4వ. రక్షించబడిన వారందరు రాయియగు యేసునొద్దకు వచ్చికూడుట అనగా సంఘముగా కూడుటకు వచ్చినవారు. అపొ 2:40-42వ.లో పేతురు ప్రసంగించగా వాక్యమును అంగీకరించిన వారు బాప్తిస్మము పొంది సంఘముగా చేర్చబడి అపొస్తలుల బోధయందు/వాక్యమను పాలను అపేక్షించుట యందు ఎడతెగక యుండిరి, ఎదుగుచుండిరి.

5-6వ.లో సంఘములో జీవించుట:- 5వ. యేసు సజీవమైన రాయి, మనమును సజీవమైన రాళ్ళమై, ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నాము. ఎజ్రా 6:3-4వ.లో యెరూషలేము మందిరము గొప్ప రాళ్ళతో, క్రొత్త దూలములతో నిర్మించబడినది. గొప్ప రాళ్ళనగా ఉన్నత స్థితిలో నున్నవారు మందిర నిర్మాణమునకు అవసరముగా నున్నారు. క్రొత్తదూలములు అనగా నూతనమైన వ్యక్తులను ప్రభువు కొరకై సంపాదించాలి. పరిశుద్ధ యాజకులమై, దేవునికి అనుకూలమగు ఆత్మ సంబంధమైన బలుల నర్పించుచున్నవారము. దీని భావము ఆరాధన, సేవ మొదలగు పనులన్నియు క్రమముగా జరుగాలి. ఆత్మసంబంధమైన బలులను నేర్చుకొనుటకు ఛాయారూపకమైన అక్షరార్థమైన బలులను వాటి భావమును తలంచాలి.

**1. దహనబలి** - ఆరాధికుడు దేవునికి సంపూర్తిగా సమర్పించుకొను - సమర్పణ.

**2. నైవేద్యము** - ఆరాధికుడు సమస్త వ్యక్తిత్వమును దేవునికిచ్చుట - భక్తి.

**3. సమాధాన బలి** - దేవునితో, మానవులతో సమాధానముగానుండుట - సమాధానము.

**4. పాపపరిహారార్థబలి** - ఆరాధికునికి కలిగిన పాపక్షమాపణ - పాపపరిహారము.

**5. అపరాధ పరిహారార్థబలి** - ఆరాధికునికి కలిగిన అపరాధపరిహారం - అపరాధ పరిహారం.

6వ. యేసు దేవుని దృష్టికి ఏర్పరచబడినవాడు, సంఘమునకు అమూల్యమైన మూలరాయి. ఆయన యందు విశ్వాసముంచువాడు ఏ మాత్రమును సిగ్గుపడడు.

7-8వ. ఇల్లు కట్టువారైన యూదులు ఆయనను తృణీకరించిరి. అందుకు ఆయనే వారికి అడ్డురాయిగాను, అడ్డుబండగాను వున్నాడు. వారి అవిధేయతనుబట్టి తొట్రిల్లినవారైరి. యేసు యొక్క అమూల్యతలు గమనించండి.

## పేతురు పత్రికలలో అమూల్యతలు.

| | |
|---|---|
| 1). అమూల్యమైన మీ విశ్వాసము | 1పేతు 1:7వ. |
| 2). అమూల్యమైన రక్తము | 1పేతు 1:19వ. |
| 3). అమూల్యమును సజీవమునైన రాయి | 1పేతు 2:4వ. |
| 4). అమూల్యమగు మూలరాయి | 1పేతు 2:6వ. |
| 5). అమూల్యమైనవాడు | 1పేతు 2:7వ. |

6). అమూల్యమైన విశ్వాసము 2పేతు 1:1వ.

7). అమూల్యములును అత్యధికములనైన వాగ్దానములు, 2పేతు 1:4వ.

**పాతనిబంధనలో:-**

8). అమూల్యమైన, పరిశోధింపబడిన, బహు స్థిరమైన
పునాదియైన, మూలరాయి యెష 28:16వ.

9) అమూల్యమైన కృప కీర్త 36:7వ.

## 9-12వ.లో లోకములో, అన్యజనుల మధ్య జీవించుట:-

9-10వ. రక్షించబడిన మనలను చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి పిలిచాడు. లోకములో చీకటి ఉన్నది. యోహాను 8:12వ.లో యేసు నేను లోకమునకు వెలుగునైయున్నాను, నన్ను వెంబడించువాడు ఎంతమాత్రమును చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగియుండును అన్నాడు. పాపమనెడి చీకటిలో నున్న మనలను జీవపు వెలుగులోనికి పిలిచాడు. కనుక లోకములో మనముండగా చీకటి మనలో ఏ మాత్రము ఉండరాదు. మనమాయన గుణాతియములను ప్రచురము చేయుటకై రాజులుగా, యాజకులుగా ఏర్పాటు చేయబడిన వారము. దేవుడు పరిశుద్ధుడు, మనమైతే దేవుని ప్రజలము, పరిశు ద్ధ జనము. కాబట్టి అయన ప్రజలముగా, అయన పరిశుద్ధతను, అయన మహిమను, ఆయన ఘనతను, ఆయన ప్రభావమును, మొదలగు గుణములను లోకానికి ప్రచురించాలి. ప్రకటన చెవులకు వినబడునది కాగా, ప్రచురణ కన్నులకు కనుపించునది. అనగా దేవుని గుణాతిశయములను లోకానికి చూపించు వారముగా ఉండాలి. ఫిలి 2:14వ.లో మీరు లోకమందు జ్యోతులవలె కనబడుచున్నారు అన్నాడు. జ్యోతిలో వెలుగుండును. ఎఫె 5:9వ. ప్రకారము ఫలములగు మంచితనము, నీతి, సత్యము, మనలో ఉండాలి. క్రీస్తు గుణములు మనలో లోకములోని జనులకు కనిపించినప్పుడు మనము జ్యోతులమే. దేవుని సొత్తయిన వారమై ఇప్పుడు కనికరింపబడితిమి.

11-12వ.లో మనము ఈ లోకములో యాత్రికులు, పరదేశులుగా నున్నాము. సమాజములో అన్యజనులున్నారు. అన్యులైనవారు మనలను చూచుచున్నారు. మనలో శరీరాశలున్న యెడల వారు మనలను / దేవుని దూషింతురు. 5:19లో శరీర కార్యములు చెప్పబడ్డాయి. ఆత్మఫలము కూడా చెప్పబడినది. క్రీస్తు యేసు సంబంధులు శరీరమును దాని ఇచ్ఛలతో కూడ సిలువ వేసియున్నారు అని చెప్పబడినది. కనుక అన్యజనులు దేవుని మహిమపరచునట్లు మనము శరీర ఆశలను విసర్జించి, సత్క్రియలు / మంచి ప్రవర్తన కలవారముగా జీవించాలి.

## 13-17వ. సమాజములో జీవించుట:-

13-14వ.లో సమాజములో రాజులు, అధికారులు కలరు. వారు దేవునిచేత నియమించబడినవారు. దేవుని చేత నియమించబడిన అధికారులు, నాయకులు, దుర్మార్గులకు

ప్రతి దండన చేయుచు, సన్మార్గులకు మెప్పు కలుగచేయుదురు. కనుక వారు నియమించు ప్రతి కట్టడకు ప్రభువు నిమిత్తమై మనము లోబడి వారిచేత మెప్పుపొందువారమై యుండాలి. లేనియెడల వారు మనకు చేయు ప్రతి దండనను బట్టి దేవునికి అవమానము కలుగగలదు.

15-17వ. మనము దేవునికి దాసులము కనుక అందరికి మేలు చేయుచు, అందరిని, రాజును సన్మానించాలి. దేవునికి భయపడుచు యుక్త ప్రవర్తన కలవారమై యుండాలి. అలాగు చేసి అజ్ఞానముగా మాటలాడు మూర్ఖులైన వారి నోరు మూయించుట దేవుని చిత్తము.

**18-20వ.లో సేవకత్వములో పనివారుగా జీవించుట:-**

18వ.లో సాత్వికులు, మంచివారు, ముష్కరులైన యజమానులుందురు, పనివారు సామాన్యముగా మంచి వారైన యజమానులకు లోబడి యుందురు. యజమానులలో కఠినులైన / ముష్కరులైన వారుందురు. యజమాని మంచివాడైతే లోబడుతాను, లేనియెడల లోబడను అనకూడదు. ప్రభువును బట్టి అటువంటి వారికి కూడా లోబడాలి. పోతీఫరు కఠినుడై, భార్య మాట విని యోసేపును చెరలో పెట్టాడు. యోసేపు దానిని లెక్క చేయక యజమానికి విధేయుడై చెరసాలలో పనులన్నీ తానే చేయించాడు. యోసేపు చేసిన కార్యములను దేవుడు రెండు సంవత్సరములు పరీక్షించి అభినందించి పానదాయకుని కలకు భావము చెప్పునట్లు చేసాడు. తద్వారా యోసేపుకు చెర నుండి విడుదల కలిగింది (ఆది 39:19-41:14వ.).

19-20వ. అటువంటివారు అన్యాయముగా దెబ్బ మీద దెబ్బ కొట్టి శ్రమపెట్టినను, సహించిన అది హితమగును. అందుకొరకే మనము పిలువబడితిమి. మేలు చేసే బాధపడునప్పుడు సహించిన అది హితమగును. కాని తప్పితము చేసి బాధపడిన యెడల యేమి ఘనత యుండదు. యోసేపు అన్నలకు మేలు చేయుటకై తండ్రి మాట ప్రకారము అరణ్యము లోనికి వెళ్ళాడు. కాని అన్నలు కీడు చేసి మిద్యానీయులకు అమ్మి వేసారు. యోసేపు ఐగుప్తుకు అధిపతియైన తరువాత అన్నలు చేసిన కీడును బట్టి పగ పట్టక అన్నలను ప్రేమించి వారి క్షేమమును విచారించాడు (ఆది 37:12-28-47:7వ). యోహాను 16:33వ.లో లోకములో మీకు శ్రమ కలుగును అని వ్రాయబడినది. ఆ పేరును బట్టియే దేవుని మహిమ పరచాలి. ఆది సంఘకాలములో అపొ. 9:2వ.లో బెదిరింపులు, హత్యలు- 19:9వ.లో దూషణలు -22:4వ.లో బంధకాలు, చెరసాలలు, మొదలగు శ్రమలు, క్రీస్తు మార్గమందున్న వారికి కలిగినవని చెప్పబడింది.

**21-25వ.లో మాదిరి, ఆత్మల కాపరియైన క్రీస్తును పోలి ఆయన అడుగు జాడల యందు నడుచుచు జీవించాలి:-**

21-23వ.క్రీస్తు మన కొరకు బాధపడుట గమనించండి.

22వ. ఆయన పాపము చేయలేదు.
ఆయన నోట కపటము లేదు.
23వ. ఆయన దూషింపబడియు బదులు దూషించలేదు.
శ్రమపెట్టబడియు బెదిరింపలేదు.
ఆయన యందు ఏ దోషమును కనబడలేదు. (యోహా 19:4వ.).
అతడు అన్యాయమేమియు చేయలేదు. (యెష 53:9వ.)
అతనియందు మరణమునకు తగినదేమియు లేదు. (లూకా 23:22వ.)

24-25వ.

ఆయన పాపము చేయలేదు - మనము పాపము చేసినవారము. 1 యోహా 1:10వ
ఆయన పాపస్వభావములేనివాడు - మనలో పాప స్వభావము కలదు, హెబ్రీ 4:15వ
ఆయనయందు పాపము లేదు - మనయందు పాపమున్నది (రోమ 7:19వ.).
2 కొరి 5:21వ. ఆయన పాపమును ఎరుగడు - మనము పాపమును ఎరుగుదుము.
2:24వ. ఆయన మన పాపమును మోసికొనెను - మనము మన పాపము మోసికొనలేము (కీర్త 38:4వ.)

2కొరి 5:21వ. ఆయన పాపముగా చేయబడెను.
యెష 53:5వ. ఆయన పాపములను భరించెను - మనము పాపములు భరించలేము (ఆది 4:14వ.).

1 పేతు 3:18వ. పాపముల విషయమై ఒక్కసారే శ్రమపడెను - మనము శ్రమలు పొందినను ఇతరుల కేమి కలుగదు.
యెష 53:5వ. పాపములనుబట్టి నలుగగొట్టబడెను.
హెబ్రీ 10:12వ. పాపముల విషయమై సదాకాలము నిలుచు ఒక్కబలిని అర్పించెను.
హెబ్రీ 1:4వ. పాపముల విషయములో శుద్ధీకరణము చేసెను.

**2:24వ. ఆయన పొందిన గాయములచేత మనకు స్వస్థత కలుగుచున్నది.**

మత్త 1:21వ. ప్రజలను పాపములనుండి ఆయనే రక్షించును (రక్షించెను).

ఆయన పొందిన శ్రమలు, బాధలు, గాయములు మనము పొందలేము. పాపము చేయనివాడు. ఇతరుల పాపములు భరించినవాడు. కనుక ఆయన శ్రమలు, బాధలు, గాయములు సాటి లేనివి. క్రీస్తు గుణములు మనకు మాదిరి. 1) బాధపడి, 2) శ్రమపడి. 3) పాపము చేయలేదు. 4) ఆయన నోట కపటము లేదు. 5) బదులు దూషించలేదు. 6) ఓర్చుకున్నాడు. 7) దేవుని తీర్పుకు అప్పగించుకొన్నాడు. ఆయన నడచిన అడుగుజాడలు మనకు మాదిరిగా ఉన్నవి.

## సమస్త ప్రవర్తన యందు పరిశుద్ధత 1:14.

| వరుస సంఖ్య | అంశము | ఉండవలసిన విధము |
|---|---|---|
| 1. ఆత్మ వలని పరిశుద్ధతలో 1అ. | a. ప్రోక్షించబడుటకు ఏర్పరచబడినవారు 1:1-12వ.<br>b. నిరీక్షణ కలవారు 1:12-24వ. | అవసరమునుబట్టి దుఃఖము సహించాలి. మనస్సు అను నడుము కట్టుకొని పవిత్రముగా నుండాలి. |
| 2. సంఘములో 2:1-8వ. | a. ప్రభువు దయాళుడని రుచి చూచినవారు 1-4వ.<br>b. సంఘముగా 2:5-8వ. | క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై,<br>1. పరిశుద్ధ యాజకులుగా<br>2. సజీవమైన రాళ్ళువలె,<br>3. కట్టువారు. |
| 3. సమాజములో 2:9-17వ. | a. లోకములో 2:9-10వ.<br>b. అన్యజనుల మధ్య 2:11-12వ.<br>c. ప్రభుత్వములో 2:13-17వ. | 1. ఆశ్చర్యకరమైన వెలుగులో,<br>2. యాత్రికులు, పరదేశులు<br>3. సమాజంతో కట్టడలకు, అధికారులందరికి లోబడాలి |
| 4. సేవకత్వములో 2:18-25వ. | a. పనివారుగా 2:18-20వ.<br>b. క్రీస్తు మాదిరి 2:21-25వ. | దు:ఖము సహించాలి, మేలు చేసి బాధపడాలి. |
| 5. సంసారములో 3:1-7వ. | a. భార్యలు 3:1-6వ.<br>b. భర్తలు 3:7వ. | సాధువైనట్టి, మృధువైనట్టి గుణమును అక్షయ హృదయ అలంకారము. భార్య ఎక్కువ బలహీన ఘటమని సన్మానించాలి. |
| 6. సహోదరుల మధ్య 3:8-22వ. | a. ఒకరితో ఒకరు 3:8-12వ.<br>b. క్రీస్తును ప్రభువుగా ప్రతిష్టించి ఆయన అడుగుజాడలలో 3:13-22వ. | వినయ మనస్కులై మంచి విషయాలలో ఆసక్తి గలవారై, |
| 7. మిగిలిన కాలంజీవించుట 4అ. | a. శరీరమందు శ్రమపడ్డవారు 4:1-11వ.<br>b. క్రీస్తు కొరకు నిందలపాలైనవారు 4:12-19వ. | మంచి గృహనిర్వాహకులై క్రైస్తవుడను పేరునుబట్టి |
| 8. ముగింపు 5 అ. | a. పెద్దలు 5:1-4వ.<br>b. చిన్నలు, అందరు 5:5-9వ. | సిద్ధ మనస్సు కలిగి, దీన మనస్సు కలిగి |

## సమస్త ప్రవర్తన యందు పరిశుద్ధత 1:14.

| జీవించవలసిన విధము | ఉండకూడని విధము | ప్రవర్తన |
|---|---|---|
| విశ్వాసము పరీక్షకు నిలిచినదై మెప్పు పొందాలి. సమస్త ప్రవర్తనలో పరిశుద్ధులై యుండాలి. | పూర్వపు ఆశలననుసరించి ప్రవర్తింపకూడదు. | పరిశుద్ధ ప్రవర్తన 1:16వ. |
| నిర్మల వాక్యమను పాలను అపేక్షించి, రక్షణలో ఎదగాలి, ప్రభువు నొద్దకు రావాలి. ఆత్మసంబంధమైన బలులర్పించాలి. ఆత్మసంబంధమైన మందిరంగా కట్టబడాలి. | దుష్టత్వము, కపటము, వేషధారణ, అసూయ, ధూషణమాటలు మానాలి. వాక్యానికి అవిధేయులుగా ఉండకూడదు. | ఆత్మీయ ప్రవర్తన 2:5వ. |
| గుణాతిశయముల ప్రచురము చేయాలి. అన్యజనులు సత్క్రియలు చూడాలి. అందరిని సన్మానించాలి, సహోదరులను ప్రేమించాలి. దేవునికి భయపడాలి. | ఆత్మకు విరోధముగా పోరాడు శరీరాశలను విసర్జించాలి. దుష్టత్వము కప్పిపెట్టుటకు స్వాతంత్ర్యమునువినియోగించకూడదు. | మంచి ప్రవర్తన 2:12వ. యుక్త ప్రవర్తన 2:21వ. |
| ముష్కరులైన యజమానులకు పూర్ణ భయముతో లోబడి వుండాలి. ఆత్మల కాపరివైపునకు మల్లాలి. | తప్పుచేసి దెబ్బలు తినకూడదు. బదులు దూషించుట, శ్రమపెట్టుట కూడదు. | మాదిరి ప్రవర్తన 2:21వ. |
| పూర్వము దేవుని ఆశ్రయించిన పరిశుద్ధ స్త్రీలను, శారాను పోలి జీవించాలి. జ్ఞానము చొప్పున కాపురం చేయాలి. | జడలు అల్లుకొనుట, బంగారు నగలు పెట్టుకొనుట, మిగుల వెలగల వస్త్రములు ధరించుట అలంకారముగా ఉండకూడదు. ప్రార్థనలకు అభ్యంతరము వుండకూడదు. | పవిత్ర ప్రవర్తన 3:2వ. |
| సహోదర ప్రేమ కలిగి వుండాలి. హేతువు అడుగు ప్రతివానికి సాత్వికముతో సమాధానము చెప్పుటకు సిద్ధముగా నుండాలి. | ప్రతి కీడు, ప్రతి దూషణ వుండకూడదు. బెదరకూడదు, కలవరపడకూడదు. | సత్ ప్రవర్తన 3:17వ. |
| దేవుని ఇష్టప్రకారము జీవించాలి. దేవుని మహిమపరచాలి. | మనుజాశలను అనుసరించకూడదు. దుర్మార్గముగా బాధను అనుభవించకూడదు. | శ్రమలలో సత్ ప్రవర్తన 4:19వ. |
| దుర్లాభాపేక్షతోకాక, మందకు మాదిరులై నిబ్బరమైన బుద్ధి, మెలుకువగలవారై అపవాదిని ఎదిరించుడి. | ప్రభువులైనట్లు వుండ కూడదు. చింతించకూడదు. | పూర్ణప్రవర్తన, స్థిర ప్రవర్తన 5:9-10వ. |

# 3వ అధ్యాయము (7+5+5+5=22వ).

అంశము:- సంసారములో, సహోదరులందరు ఒకరితో ఒకరు, క్రీస్తును హృదయములో ప్రతిష్ఠించుకొని జీవించుట- 1-7వ.లో కుటుంబములో భార్యభర్తలు జీవించుట. 8-12వ.లో ఏకమనస్కులు, వినయమనస్కులై, సహా విశ్వాసులతో జీవించుటను గూర్చి 13-17వ.లో క్రీస్తును హృదయములో ప్రతిష్టించుకొని నీతి నిమిత్తమై శ్రమ పడుటను గూర్చి 18-22వ.లో అన్ని విషయములలో మంచి మాదిరియైన క్రీస్తును గూర్చి చెప్పబడినది.

**1-7వ. సంసారములో భార్యభర్తలు జీవించుట (కాపురము చేయుట):-**

**1-6వ.లో భార్యలను గూర్చి 6వ.లో భర్తలను గూర్చి చెప్పబడినది.**

1-2వ.లో భార్యలు లోబడి అనుసరించుట, 3-4వలో అలంకరించుకొనుటను,

5-6వ.లో అనుకరించుటను గూర్చి చెప్పబడినది. 7వ.లో భర్తలు జ్ఞానము చొప్పున కాపురము చేయుట చెప్పబడినది. 1-2వ. లోబడి అనుసరించుట. ఎఫె 5:22-33వ, కొలొ 3:18వ. తీతు 2:1-10వ. గమనించండి. పైవచనాలలో కూడా భర్తలకంటే ముందుగా భార్యలకు హెచ్చరికలు చెప్పబడినవి. 2వ. అధ్యాయము చివరిలో క్రీస్తు తండ్రియైన దేవునికి లోబడినట్లు వ్రాయబడినది. అటువలెనే అని ఈ అధ్యాయము ప్రారంభించబడుటనుబట్టి, క్రీస్తు తండ్రికి లోబడినట్లు భార్యలు భర్తలకు లోబడి అనుసరించుట గూర్చి చెప్పబడుచున్నదని గమనించాలి. కుటుంబమునకు భార్య, భర్తలు అవసరమే కాని స్త్రీకి యజమాని భర్త కనుక స్త్రీలు వారికి లోబడియుండుట అవసరము. క్రైస్తవ గృహములో స్వార్థమునకు, ఆధిక్యతలకు తావు లేదు. ఒకవేళ క్రైస్తవ భార్యలకు అవిశ్వాసులైన భర్తలున్న యెడల వారు ఆత్మీయ జీవితములో భార్యల వలె వాక్యమునకు విధేయులు కాక పోవచ్చును. కాని విశ్వాసులైన భార్యల భయముతో కూడిన పవిత్ర ప్రవర్తన, యోగ్యమైన నడవడికను చూచి అవిశ్వాసులైన భర్తలను రాబట్టవచ్చును.

3-4వ. దేవుని దృష్టికి మిగుల విలువైన, నిజమైన అలంకరణ గూర్చి చెప్పుచున్నాడు. జడలు అల్లుకొనుటయు, బంగారు నగలు పెట్టుకొనుటయు, మిగుల వెలగల వస్త్రములు ధరించుకొనుటయను వెలుపటి అలంకరణ, నిజమైన అలంకరణ కాదని చెప్పుచున్నాడు. హృదయములో సాధువైనట్టి, మృదువైనట్టి గుణమను, అక్షయ అలంకారమగు హృదయపు అంతరంగ స్వభావమే నిజమైన అలంకారముగా నుండాలని చెప్పుచున్నాడు. 1 తిమోతి 2:9వ కూడ చదవండి. ప్రభువు కోరిన అలంకరణ కలిగియుండాలి. ప్రభువుకు కూడని అలంకరణ వుండకూడదు.

5-6వ. అనుకరణ - విధేయతలోను, అలంకరించుకొనుటలోను మాదిరియైన పరిశుద్ధ స్త్రీలను, శారాను అనుకరించాలని చెప్పుచున్నాడు. పూర్వము దేవుని ఆశ్రయించిన

పరిశుద్ధ స్త్రీలు తమ స్వపురుషులకు లోబడి యుండుట చేత తమ్మును తాము అలంకరించుకొనిరి. శారాయు అబ్రహామును యజమానుడని పిలుచుచు, అతనికి లోబడియుండుట ద్వారా తనను అలంకరించుకొనినది. కనుక నిజమైన అలంకరణ భర్తలకు లోబడియుండుటే. ప్రస్తుత కాలమందలి సోదరీలును యోగ్యముగా నడచుకొవాలని చెప్పుచున్నాడు. 7వ. స్త్రీలు స్వపురుషులకు లోబడియున్నను జీవమను కృపావరములో పాలివారని యెరుగాలి. ఒక వ్యక్తిని సృజించుట అనగా జన్మనిచ్చు/జీవమునిచ్చు దేవుని ప్రణాళికలో స్త్రీలు పురుషులతో పాలివారు. అలాగైతే పుట్టిన పిల్లలను పెంచి ఆత్మ సంబంధమైన నూతన జీవమిచ్చు / జన్మనిచ్చుటలోను పాలివారు. కన్నపిల్లలను కని పెంచి పెద్దచేసి ఆత్మీయత లోనికి నడిపించుటలోను పాలివారు. స్త్రీలు లోబడువారు. జీవమను కృపావరములో పాలివారు ఈ రెండు సమపాళ్ళలో చూచుకొనాలి. కనుక కుటుంబ జీవన విషయాలలో స్త్రీ పాత్ర ముఖ్యమైనను భర్తలకు లోబడాలి కాబట్టి చివరి తీర్మానము పురుషులదే అని గుర్తించాలి. స్త్రీలు ఎక్కువగా బలహీనులు అనుటలో పురుషులు కూడ బలహీనులని గుర్తించాలి. స్త్రీలు ఎక్కువ బలహీనులు కనుక వారి బలహీనతలను గుర్తించుచు పురుషులు వారిని సన్మానించాలి. లేని యెడల ప్రార్థనలకు అభ్యంతరము కలుగగలదు. పై రీతిగా జీవించుట జ్ఞానము చొప్పున కాపురము చేయుట అని గుర్తించాలి. పురుషులు సంఘములో పెద్దలను, సమాజములో రాజును, అధిపతులను, సేవలో యజమానిని, సంసారములో భార్యను సన్మానించాలి కాని తాను సన్మానమును కోరుకొనువాడుగా వుండకూడదు. కనుక పురుషుల మీద గొప్ప బాధ్యత ఉన్నదని గుర్తించాలి.

## 8-12వ.లో సహోదరులు ఏకమనస్కులు, వినయమనస్కులై సహ విశ్వాసులతో జీవించుట:-

8-11వ. 8వ వచనములో తుదకు అనుట ఈ అంశము యొక్క ముగింపుకు వచ్చినట్లు తలంచగలము. ఆ అంశమేదనగా జీవమును ప్రేమించుచు మంచి దినములు చూడగోరుట, ఆశీర్వాదమునకు వారసులగుట - సహోదరులు తాము జీవించు దినములన్ని మంచిగాను, ఆశీర్వాదకరముగాను ఉండాలని (10వ.) కోరుకుంటారు. కీర్తన 34:12-17వ.లో 'మేలు నొందుచు అనేక దినములు బ్రతకగోరువాడెవడైననున్నాడా?' అని చెప్పబడినది. అలాంటి జీవితమునకు అవసరమైన వాటిని గూర్చి 8వ.లో చెప్పుచున్నాడు.

9-12వ.లో అందరు 1) ఏక మనస్సు, వినయమనస్సు కలిగియుండాలి. 2) ఒకరి సుఖదుఃఖములలో మరొకరు పాలు పంచుకొవాలి. 3) సహోదర ప్రేమ కలవారుగా నుండాలి. 4) కరుణాచిత్తులుగా నుండాలి. 5) కీడుకు ప్రతి కీడు చేయకూడదు. 6) కీడు నుండి తొలగి మేలు చేయాలి. 7) సమాధానమును వెదకి వెంటాడాలి. 8) ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను ఆయన చెవులు వారి ప్రార్థనలవైపున ఉన్నవి. 9) చెడ్డ మాటలు కాని, కపటపు మాటలు కాని పలుక రాదు. (కీర్తనల గ్రంథమునందలి నోటిని, నాలుకను గూర్చిన వచనాలను ధ్యానించండి.)

1. వారి నోట యథార్థత లేదు --; వారు నాలుకతో ఇచ్చకము లాడుదురు. కీర్త 5:9వ,
2. వారి నోరు శాపముతోను, కపటముతోను, వంచనతోను నిండియున్నది.
వారి నాలుక క్రింద చేటును పాపమును ఉన్నవి. కీర్త 10:7వ.
బింకములాడు నాలుకలు, కీర్త 12:3వ.
4. నాలుకతో కొండెములాడుట, తన చెలికానికి కీడు చేయుట. కీర్త 15:3వ.
5. కీడు చేయవలెనని నీవు నోరు తెరచుచున్నావు,
నీ నాలుక కపటమును కల్పించుచున్నది. కీర్త 50:19వ.
6. వారి నాలుక వాడి గల కత్తి. కీర్త 57:4వ.

నోరు యథార్థత లేక, శాపముతోను, కపటముతోను, వంచనతోను నిండి, కీడు చేయవలెనని వేచియుండును. నాలుక తన క్రింద చేటును, పాపమును, కపటమును కలిగి, బింకములాడును. ఇచ్చకములాడును, చెలికానికి కీడు చేయును.

కనుక పై విషయములలో నీతిగా జీవించుచు, ప్రార్థించు వారికి ప్రభువు తప్పక సహాయము చేయును. 'నీతిమంతులు మొరపెట్టగా యెహోవా ఆలకించును. వారి శ్రమలన్నింటి నుండి వారిని విడిపించును.' కీర్త 34:17వ. కీడు చేయువారికి ఆయన ముఖము విరోధము. కాబట్టి కీడును మాని నీతిగా జీవించాలి.

**13-17వ.లో క్రీస్తును హృదయములో ప్రతిష్టించుకొని నీతి నిమిత్తమై శ్రమపడుచు మంచి విషయములో ఆసక్తి కలిగి జీవించుట:-**

13-14వ. సాధారణముగా నీతిగా జీవించు వారికి ఎవరు హాని చేయరని చెప్పవచ్చును. కాని నీతిగా జీవించు వారిని శ్రమపెట్టువారు, బెదరించువారు, హాని చేయువారు, అపనిందలు వేయువారు కూడా కలరు. ఇది దేవుని సెలవుతో అపవాది కలిగించును. వారైతే శరీరమునకు శ్రమలు కలిగించుదురు, కాని ఆత్మకు ఏమియు చేయలేరు. వాటన్నిటి ద్వారా ఆత్మకు ఆశీర్వాదమే కలుగును. శ్రమలు శారీరకమునకు కాని, మనసునకు కాని, ఆత్మీయ జీవితమునకు గాని కలుగవచ్చును. ఆదికాండ గ్రంథములో యోసేపు సంపూర్తిగా నీతిమంతుడుగా జీవించాడు. అన్నల ద్వారా శ్రమపరచబడి గుంటలో వేయబడి మిద్యానీయులకు అమ్మివేయ బడినాడు. అన్నల ద్వారాను, ఐగుప్తులో పోతీఫరు భార్య ద్వారా శారీరక, మానసిక బాధలను అనుభవించాడు. భయపడకుడి, కలవరపడకుడి అని దేవుడు వాగ్దానము చేసినందున మనము ధైర్యము కలిగి ఈ వచన ప్రకారము ధన్యులమని గుర్తించాలి. మొదటి శతాబ్ద కాలములో క్రీస్తును దూషించాలని బలవంత పెట్టబడగా ఎనుబది సంవత్సరాలు కాపాడిన దేవుని ఎలాగు దూషించగలనని జవాబిచ్చిన ఒక భక్తుడు కలడు.

కాబట్టి మంచి దినములు చూడగోరువాడు దేవుని కొరకైన మంచి విషయాలలో ఆసక్తి కలిగియుండాలి. మనమైతే మంచి విషయాలలో ఆసక్తి కలిగి, నిర్మలమైన మనసాక్షితో,

హృదయములందు క్రీస్తును ప్రభువుగా ప్రతిష్ఠించుకొని సత్ ప్రవర్తన గలవారమై జీవించాలి. అప్పుడు మనలను దుర్మార్గుల్ని దూషించి, అపనింద వేసినవారు సిగ్గుపడుదురు. కనుక మనలో వున్న నిరీక్షణ విషయమై హేతువు అడుగు ప్రతి వానికి సాత్వీకముతో, దేవుని భయముతో జవాబు చెప్పాలి.

17వలో. మనము శ్రమపడుట దేవుని చిత్తమైన యెడల మేలు చేసి శ్రమపడుటయే బహు మంచిది. మేలు చేసి బాధపడుటకే పిలువబడితిరి (2:20). కీడు చేసి శ్రమపడుట మంచిది కాదు.

**18-22వ.లో అన్ని విషయములలో మంచి మాదిరియైన క్రీస్తును పోలి జీవించుట:-**

ఈ 18వ. వచనములో శ్రమపడుటలో మనకు మాదిరియైన క్రీస్తును చూచుచున్నాము. ఆయన నీతిమంతుడై యుండియు అనీతిమంతులమైన మన కొరకు ఒక్కసారే మన పాపముల విషయమై శ్రమపడి, శరీర విషయములో చంపబడెను కాని ఆత్మ విషయమై జీవించుచున్నాడు. ఈ మాదిరిని మనమును అనుసరించాలి.

19-20వ. పూర్వము నోవహు దినములలో నోవహు ఓడను సిద్ధపరచునప్పుడు అవిధేయులైన వారి ఆత్మలకు సువార్త ప్రకటించబడినది. ఎనిమిది మంది ఓడలో ప్రవేశించుట ద్వారా రక్షించబడిరి.

21-22వ.లో అదే రీతిగా దేవుని ఆత్మ వాక్యమును నీటి ద్వారా మనలను రక్షించాడు. ప్రభువు తన కార్యములను నెరవేర్చి పరలోకమునకు వెళ్ళి, అందరి మీద అధికారము గలవాడై దేవుని కుడి పార్శ్వమున కూర్చున్నాడు. ఈ మాదిరిన మనము అనుసరించాలి.

## 4వ అధ్యాయము (6+5+4+4=19వ)

**అంశము:- మిగిలిన కాలము మనుజ ఆశలను అనుసరించక, దేవుని ఇష్ట ప్రకారము జీవించుట.** 1-6వ.లో శరీరమందు శ్రమపడినవారు క్రీస్తు మనస్సును కలిగి మనుజాశలను అనుసరింపక దేవుని ఇష్ట ప్రకారము జీవించాలని, 7-11వ.లో మంచి గృహనిర్వాహకులై దేవుడిచ్చిన కృపావరము కొలది జీవించాలని చెప్పబడినది. 12-15వ.లో దుర్మార్గముగా బాధను అనుభవించకూడదని 16-19వ.లో శ్రమలు, బాధలలో సత్ప్రవర్తన కలిగి జీవించాలని చెప్పబడినది.

**1-6వ.లో శరీర మందు శ్రమపడినవారు క్రీస్తు మనస్సును కలిగి మనుజాశలను అనుసరింపక దేవుని ఇష్ట ప్రకారము జీవించాలి:-** 1-2వ. క్రీస్తు శరీర విషయములో శ్రమపడినను, మనుజాశలకు తన జీవితములో తావిచ్చినవాడు కాదు. కనుక ఆయన జీవితములో పాపము లేదు, సంపూర్ణమైన పవిత్రుడు. మన శరీరమందైతే పాపము నివసించగలదు (రోమా 7:20,23వ). మనము కూడా గత కాలములో అజాగ్రత్తగా

జీవించితిమని గుర్తించాలి. మిగిలిన జీవిత కాలములో మనుజాశలకు తావియ్యక, క్రీస్తు మనస్సును కలిగి, పాపముతో జోలి లేక దేవుని ఇష్ట ప్రకారముగా పవిత్రముగా నడుచుకొనాలి. 3-5వ. గతకాలములో అన్యజనుల ఇష్ట ప్రకారము నడిచి, 1) పోకిరి చేష్టలు 2) దురాశలు, 3) మద్యపానము, 4) అల్లరితో కూడిన ఆటపాటలు, 5) త్రాగుబోతుల విందులు, 6) చేయదగని విగ్రహపూజలు, మొదలగు పాపపు క్రియలతో జీవితమును కలిగియుంటిమి. ఆ అన్యజనులు ఇప్పుడు మనము వారితో కలవనందుకు అనగా పాపపు క్రియలలో పాల్గొననందుకు ఆశ్చర్యపడుచు మనలను దూషించుచున్నారు. దేవుడు అందరికి తీర్పు తీర్చును గనుక మనలను దూషించిన అన్యులు దేవునికి ఉత్తరవాదులై యున్నారు.

6వ. మనలను దూషించు అన్యులు పాపముల విషయములో చనిపోయి మృతులైన వారే. వారికి కూడా సువార్త ప్రకటించబడగా వారు విన్నారు. కనుక మానవరీతిగా వారును తీర్పు పొందుదురు.

## 7-11వ.లో మంచి గృహనిర్వాహకులై కృపావరము కొలది జీవించాలి:-

7-9వ. అన్నిటి అంతము సమీపమై ప్రభువు రాకడ రానున్నదని గుర్తుంచుకొనాలి. 1) స్వస్థబుద్ధి కలిగియుండాలి. 2) ప్రార్థన చేయాలి. 3) మెలుకువగా నుండాలి. 4) మిక్కుటమైన ప్రేమగలవారై యుండాలి. 5) సణుగుకొనకుండా ఆతిథ్యము చేయాలి. ఆతిథ్యము విషయములో అబ్రహామును జ్ఞాపకము చేసుకొనవచ్చును. ఆది 18:1-15వ. హెబ్రీ 13:2వ.లో ముగ్గురు మనుష్యులను చేర్చుకొన్నాడు. తాను ఎరుగకయే దేవదూతలకు ఆతిథ్యము ఇచ్చినట్లు వ్రాయబడింది. చూచిన వెంటనే వారిని చేర్చుకొనినందున మెలుకువ కలిగిన వాడని, మిక్కుటమైన ప్రేమ కలవాడని అర్థమగుచున్నది. ఆది 18:22-33వ.లో అబ్రహాము సొదొమ పట్టణముకై ప్రార్థించాడు. అగ్నిలో శ్రమలే కలిగాయి.

10-11వ. గృహ నిర్వాహకులమైన మనకు దేవుడు కృపావరముల నిచ్చాడు. ఆ కృపావరము బోధించుట అయితే దైవోక్తులను బోధించునట్లు బోధించాలి. ఉపచారము చేయుట అయితే దేవుడు అనుగ్రహించు సామర్థ్యము కొలది చేయాలి. కృపావరముల వివరములు 1 కొరింథీ 12:4-11, 28-30వలోను, రోమా 12:6-8వ. లోను ఎఫె 4:12-13వ. కలవు. కృపావరములు కొన్ని కావు. నానా విధములు. మన అపేక్షనుబట్టి కాక ఆత్మచేత తన చిత్తము చొప్పున ప్రతివారికి ఇవ్వబడును. అవి అందరి ప్రయోజనము కొరకే గాని మన కొరకు కాదు. అన్నిటిలో దేవునికి మహిమ రావాలి. మహిమ, ప్రభావము యుగయుగములకు ఆయనకు కలగాలి.

## 12-15వ.లో దుర్మార్గముగా బాధను అనుభవించకూడదు:-

12-13వ. శోధన వలన కలుగు శ్రమలలో దేవుని మహిమ మనకు బయలుపరచబడును. మనకు అగ్నివంటి శ్రమలే కలుగుచున్నవి. కాని షద్రకు, మేషాకు, అబెద్నెగోలకు అగ్నిలో శ్రమలే కలిగాయి. అగ్ని శ్రమలైనా, అగ్ని వంటి శ్రమలైనా దేవుడు తప్పించగలడు. అప్పుడు మనము పొందబోవు బహుమానము గుర్తుంచుకొని, ఇప్పుడు శ్రమలలో పాలుపొందునప్పుడు సంతోషించాలి.

14-15వ. కనుక క్రీస్తు నిమిత్తము శ్రమపడుట ధన్యతయే. కాని తప్పుచేసి శ్రమను బాధను అనుభవింపతగదు. శోధనల వలన కలుగు శ్రమలు యాకోబు పత్రికలో వివరించబడ్డాయి.

ఈ గ్రంథమందలి రెండు ధన్యతలు గమనింతము.

1) మీరొకవేళ నీతి నిమిత్తము శ్రమపడినను మీరు ధన్యులే. 3:14వ.

2) క్రీస్తు నామము నిమిత్తము నిందపాలైన యెడల... దేవుని ఆత్మ మీ మీద నిలుచుచున్నాడు కనుక మీరు ధన్యులు 4:14వ.

**16-19వ.లో శ్రమలు, బాధలలో మంచి ప్రవర్తన కలిగి జీవించాలి:-**

16వ. క్రైస్తవుడను పేరు బైబిలులో మూడు పర్యాయములు కలదు. 1)అపొ 11:26వ. 2) అపో 26:28వ. 3) 1పేతు 4:16వ. క్రైస్తవుడైనందుకు బాధలు కలిగిన యెడల వాటిని అనుభవించాలి. యోహాను 16:33వ.లో లోకములో మీకు శ్రమకలుగును అని వ్రాయబడినది. ఆ పేరును బట్టియే దేవుని మహిమపరచాలి. అపొ. 9:2వ.లో బెదిరింపులు హత్యలు - 19:9వ.లో దూషణలు -22:4వ.లో బంధకాలు, చెరసాలలు, 24అ.లో చెరసాల మొదలగు శ్రమలు, క్రీస్తు మార్గమందున్న వారికి కలిగినవని చెప్పబడినది. అపొస్తలులు దూషణలు, బెదరింపులు, బంధకాలు, చెరసాలలు, హత్యలు మొదలగు వాటిని అనుభవించి ప్రాణాలైన బలి ఇవ్వడానికి వెనుకాడ లేదు. దేవుని మహిమపరచారు, కాని సిగ్గుపడలేదు. 17-19వ. దేవుడు తన ఇంటి వారగు విశ్వాసులకు, పాపులైన భక్తిహీనులకు తీర్పు తీర్చును. పాపులకు తీర్పున్నదనుమాట నిజమే. నీతిమంతులు కూడ కొన్ని పర్యాయములు శ్రమల నుండి తప్పించబడలేరు. కనుక నమ్మకమైన సృష్టికర్తకు మన ఆత్మలను అప్పగించి బాధలను అనుభవించుచు సత్ ప్రవర్తన కలవారమై జీవించాలి.

## 5వ అధ్యాయము (4+3+4+3=14వ).

### అంశము:- జీవితకాలానికి పరిశుద్ధతను గూర్చిన హెచ్చరికలు.

1-4వ.లో పెద్దలు మందను పైవిచారణ చేయుచు మందకు మాదిరులుగా నుండాలని, 5-7వ.లో చిన్నలు పెద్దలకు లోబడివుండాలని, ఆయన తగిన సమయములో హెచ్చించునట్లు, అందరు దీన మనసును కలిగియుండాలని చెప్పాడు. 8-11వ.లో మనలను మ్రింగవలెనని కనిపెట్టిన అపవాదిని ఎదిరించాలని, శ్రమలు కొంచెము కాలమే కనుక విశ్వాసమందు స్థిరులై యుండాలని, 12-14వ.లో ముగింపులో సత్యకృపలో నిలకడగా వుండవలెనని ఈ అధ్యాయమునందు పెద్దలను, చిన్నలను అందరిని హెచ్చరించాడు.

**1-4వ. పెద్దలు మందను మేపుచు మందకు మాదిరులుగా నుండాలి:-**

1వ. పేతురు పెద్దలలో పెద్దను లేదా పెద్దలకు పెద్దను అనక తోటి పెద్దను అనుట గమనింతుము. సంఘమందు పెద్దలు ఒకరి కంటే ఎక్కువగా, అనేకులు అనగా బహువచనములో వుండాలి. పెద్దలు 1తిమోతి 3:2-7వ. ప్రకారము అనుభవము, అర్హత

కలవారై యుండాలి. అపొ. 20:28వ. ప్రకారము పరిశుద్ధాత్మ చేత నియమించబడినవారై యుండాలి.

**1. సామాన్య అర్హత:**- నిందారహితుడు (2వ),

**2. కుటుంబ అర్హత:**- ఏక పత్ని పురుషుడు (2వ.) పిల్లలను స్వాధీనపరచుకొనువాడు, ఇంటి వారిని బాగుగా ఏలువాడు(4వ).

**3. వ్యక్తిగతమైన అర్హత:**- మితానుభవుడు, స్వస్థబుద్ధిగలవాడు, మర్యాదస్తుడు (2-3వ)

**4. ఆత్మీయ అర్హత:**- బోధింపతగినవాడు, సాత్వికము గలవాడు (2-3వ).

ఆరోగ్యకరమైన బోధ విషయమై హెచ్చరించుటకు, ఖండించుటకు, నమ్మదగినబోధను గట్టిగా చేపట్టు కొనువారై యుండాలి (తీతు 1:9వ). పెద్దలు క్రీస్తు సంఘము కొరకై పాట్లుపడి మరణించుటను ఎరిగినవారై ఉండాలి.

2వ. మంద దేవునికి చెందినదైనను పెద్దలకు అప్పగింపబడినది. బలిమిచేత కాక అనగా అధికారము చెలాయించు రీతిగా కాక, దుర్లాభాపేక్షయైన చెడు ఉద్దేశ్యముతో కాక సిద్ధ మనస్సుతో అనగా సంపూర్ణ ఇష్టముతో తమకు అప్పగింపబడిన పని చేయాలి. పై విచారణ / కాపు కాయుపని అందరికి ఇష్టముగా ఉండాలి. పెద్దలే కాపు కాయు కాపరులు, పై విచారణ కర్తలు.

3వ. ప్రభువులైనట్టుండక అను మాటనుబట్టి, పెద్ద పని స్వాభావికముగా గర్వమును పుట్టించుట వలన కొందరు మంద మీద ప్రభువులుగా ప్రవర్తించుదురు. అలాగుండకూడదు. మందకు మాదిరులుగా ఉండాలి. కొలొ 3:4వ. ప్రకారము క్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు ఆయనతో కూడ మహిమయందు ప్రత్యక్షమగుదుమని పెద్దలు తేటగాను, సంపూర్ణముగాను ఎరిగినవారైయుండాలి. అప్పుడే మంద విషయమైన నిజమైన భారము / బాధ్యత కలిగి మందను వాక్యముతో మేపగలరు, కాయగలరు (యోహా 21:15:17వ.). వాక్యము ఎరుగని వారు కాయలేరు, మేపలేరు, ఆరోగ్యకరమైన బోధ విషయమై హెచ్చరించలేరు. కనుక అట్టివారు పెద్దపని చేపట్టకూడదు. పెద్దలైన వారు మందకు మాదిరియైన జీవితమును కలిగియుండాలి. సంఘము వారి మాదిరిని అనుసరించగలగాలి. క్రీస్తు ప్రధాన కాపరి కాగా, పెద్దలు కాపరులు, పైవిచారణ కర్తలు. 4వ. ప్రధాన కాపరియైన క్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు పెద్దలు / కాపరులు / పై విచారణకర్తలుగా వారు చేసిన పనినిబట్టి తీర్పులో వాడబారని మహిమ కిరీటమును పొందుదురు. వీరితోపాటు సంఘక్షేమాభివృద్ధికి సువార్తికులు కూడా అనుగ్రహించబడిరి. (ఎఫె 4:13వ.). (గ్రంథము అను చివరిలో సంఘము అను అధ్యాయము చదవండి.)

వీరందరు ఒకరికి ఒకరు తోటివారై ఉండాలి. మార్కు 9:35, 10:34వ. ప్రకారము ఒకరికి ఒకరు దాసులుగాను, పరిచారకులుగాను ఉండాలి. కాని ప్రభువులైనట్టుండ కూడదు.

**5-7వ. చిన్నలు పెద్దలకు లోబడాలి, అందరు దీన మనసును కలిగియుండాలి:-**

5-6వ. పెద్దలు వాక్యములో లోతైన అనుభవము గలవారు, దేవునిచేత నియమించబడినవారు, కనుక ఆత్మీయతలో గాని, వయసులో గాని చిన్నలైన వారు దేవుని చేత నియమించబడిన పెద్దలకు లోబడాలి. అందుకని పెద్దలు ఎల్లప్పుడు పెత్తనము చేయువారు మాత్రమే కారు. పెద్దలు కాని, చిన్నలు కాని అందరు ఎదుటివాని యెడల దీన మనసు అను వస్త్రము ధరించుకొనాలి. ఎందుకనగా దేవుడు దీనులకు కృప అనుగ్రహించును, అహంకారులను ఎదిరించును.

7వ.లో ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు. దేవుడు చింతించుట, ఎంత ఆశ్చర్యము? పైగా ఎన్నిక లేని మన విషయమై చింతించుట ఆశ్చర్యము? కనుక మనము చింతించక ఆయన బలిష్టమైన చేతిక్రింద దీన మనస్కులమై చింత యావత్తు ప్రభువు మీద వేయాలి. నిశ్చింతగా నుండాలి.

**8-11వ. అపవాదిని ఎదిరించాలి - విశ్వాసమందు స్థిరులైయుండాలి:-**

8-9వ. అపవాది ఎవరిని మ్రింగుదునా అని వెదుకుచు ఎదురు చూచుచున్నాడు. అజాగ్రత్తగానున్న వారి కొరకై వెదుకుచున్నాడు. లోకములో సహోదరులందరికిని ఈ విధమైన శ్రమలే కలిగించుచున్నవి. ఆత్మీయులైనవారు గమనించి అపవాదిని ఎదిరించాలి, కాని అపవాదికి అవకాశమివ్వకూడదు.

10-11వ. మన దేవుడు మనలను నిత్య మహిమకు పిలచుచున్నాడు. ఆయన సర్వకృపానిధి. ఎట్టి సమయములోనైనను మనకు అవసరమైన కృపను ఇచ్చి నిత్యమహిమకు మనలను పాత్రులనుగా చేయును. తానే మనలను పూర్ణులుగా చేసి బలపరచును. అందువలన ఆయన యుగయుగములకు ప్రభావమునకు పాత్రుడు.

**12-14వ. ముగింపులో నిలకడగా నుండుటను గూర్చిన హెచ్చరిక:-**

12వ. నిత్య మహిమకు పిలిచిన, దేవుని సత్య కృపలో నిలకడగా ఉండాలని హెచ్చరించుచున్నాడు.

13వ. ప్రేమ సహోదరుల మధ్య నిలకడగా ఉండాలి. దానికి గురుతుగా పవిత్రమైన ముద్దు పెట్టుకొనుట చెప్పబడినది. కాలము సంస్కృతులు మారినవి, కనుక పవిత్రమైన ముద్దుపెట్టుకొనుట ఒక సమస్యయే. మొదటిదిగా అంత పవిత్రత మనలో ఉన్నదేమో పరీక్షించుకొనుట అవసరము. సహోదరులు సహోదరులకు, సహోదరీలు సహోదరీలకు ముద్దును పరిమితము చేయుట సమంజసముగా నుండును. సహోదరులు, సహోదరీలు ఒకరికి ఒకరు ముద్దు పెట్టుకొనుట లేఖనములలో ఎక్కడ చెప్పబడలేదు.

14వ. శ్రమలలో ఉన్న సహోదరులు సమాధానముకై ఎదురు చూచుచున్నారు. అందుకై సమాధానము కలుగును గాక అనుమాటతో పత్రికను ముగించుచున్నాడు.

# 5. పేతురు వ్రాసిన రెండవ పత్రిక

ముఖ్య అంశము:- పరిశుద్ధమైన ప్రవర్తన.

అంశములు:- 1అ. దైవ స్వభావములో పాలివారగుట - ఔన్నత్యము.

2అ. అబద్ధ బోధకుల రాక, వారి పరిస్థితి - భ్రష్టత్వము.

3అ. ప్రభువు దినమును గూర్చిన హెచ్చరిక - అవిశ్వాసము.

**ఉద్దేశ్యము:-** మొదటి అధ్యాయములో అమూల్యమైన విశ్వాసము పొందినవారిలో ఉండవలసిన దైవ స్వభావము / యేసు ప్రభువు గుణముల ఔన్నత్యము గూర్చి, రెండవ అధ్యాయములో విశ్వాసులు దేవుని గుణములు కలిగి వుండుటలో జాగ్రత్త లేనియెడల కలుగ గల భ్రష్టత్వమును గూర్చి, మూడవ అధ్యాయములో అంత్యదినాలలో విశ్వాసులలో ఉండగల అవిశ్వాసము, అపహాస్యమును గూర్చి, చెప్పుచు, పరిశుద్ధ ప్రవర్తనతోను, భక్తితోను ఎంతో జాగ్రత్త గలవారై ఉండవలెనని చెప్పుచున్నాడు.

ఈ గ్రంథమందలి ఐదు జాగ్రత్తలు గమనింతము. 1) పూర్ణ జాగ్రత్త (1:5), 2) మరి జాగ్రత్త (1:10), 3) జాగ్రత్త (1:15), 4) ఎంతో జాగ్రత్త (3:12), 5) జాగ్రత్త (3:14) లేనిచో తొట్రిల్లగలము (1:11). (క్రొ.ని.లో 53 జాగ్రత్తలు కలవు).

## 1వ అధ్యాయము 2+2+3+2+2+4+6=21వ.

అంశము:- దైవ స్వభావములో పాలివారగుట (4వ).

**1-2వ. పీఠిక:-** రక్షణ మన నీతినిబట్టి కాక, యేసుక్రీస్తు నీతిని బట్టి (తీతు 3:5వ) కలిగినందున మనము అమూల్యమైన విశ్వాసము పొందినవారము. మానవులు స్వాభావికముగా పాపులై భక్తిలేనివారుగా నున్నారు. క్రీస్తు నీతిమంతుడు (యోహా 16:8వ.), పాపమెరుగనివాడు. మన పాపములను సిలువపై మోసికొన్నాడు. మన కొరకై పాపముగా చేయబడ్డాడు. సిలువలో తాను పొందిన అనుభవము ద్వారా, తన యందు విశ్వాసముంచిన మానవులను నిర్దోషులుగా, నీతిమంతులుగా చేసాడు (యెషయా 53:11వ.). అందులకు మనము అమూల్యమైన విశ్వాసము పొందినవారము, అంటున్నాడు. అట్టి వారికి శుభములు తెలుపుచు ఈ పత్రిక వ్రాయబడుచున్నది. అమూల్యము అనుపదము పాతనిబంధనలో 7 పర్యాయములు + క్రొత్త నిబంధనలో 10 పర్యాయములు= మొత్తముగా 17 పర్యాయములు బైబిలులో కలదు. అందులో కొన్ని అమూల్యములు ధ్యానించుదుము.

ముఖ్యముగా యేసు యొక్క అమూల్యతలు గమనించండి.

**పేతురు పత్రికలలో అమూల్యతలు:**

1). అమూల్యమైన మీ విశ్వాసము 1పేతు 1:7వ.

2). అమూల్యమైన రక్తము 1పేతు 1:19వ.

3). అమూల్యమును సజీవమునైన రాయి 1పేతు 2:4వ.

4). అమూల్యమగు మూలరాయి 1పేతు 2:6వ.

5). అమూల్యమైనవాడు 1పేతు 2:7వ.

6). అమూల్యమైన విశ్వాసము 2పేతు 1:1వ.

7). అమూల్యములును అత్యధికములనైన వాగ్దానములు, 2పేతు 1:4వ.

**పాతనిబంధనలోని కొన్ని అమూల్యతలు:-**

8). అమూల్యమైన, పరిశోధింపబడిన, బహు స్థిరమైన పునాదియైన, మూలరాయి యెష 28:16వ.

9) అమూల్యమైన కృప, కీర్త 36:7వ.

## 3-4వ. దేవుని మహిమ, గుణాతిశయములు - దేవుని శక్తి :-

ఆయన మహిమనుబట్టి, గుణాతిశయములను బట్టి మనలను పిలిచాడు. యెహోవా మహోన్నతుడు, మహిమోన్నతుడు. ఆయన స్వభావము సాటిలేని గుణములు కలది. దైవశక్తి అపరిమితమైనది (ఆది 17:1వ). ఆయన మహిమ, గుణాతిశయములను బట్టియే కాని, మన గుణములను బట్టి కాదు. కాబట్టి ఆయన మహిమను, శక్తిని, గుణములను ధ్యానింతము. ఆయన మహిమ:- ఆయన మహిమ ఆకాశ విశాలమంత వ్యాపించి యున్నదని కీర్త. 113:4వ.లో నున్నది. ఆకాశ విశాలములో 30,000 కోట్ల, కోట్ల, కోట్ల సూర్యులను నేటి వరకు శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. మన దృష్టికి అందని ఆకాశ విశాలములో ఇంకను ఎన్నో ఉన్నవని చెప్పుచున్నారు. కనుక ఇంత గొప్ప ఆకాశమంత వ్యాపించిన ఆయన మహిమ ఎంతో గొప్పది. కనుక ఆయన మహోన్నతుడు. మహిమ అనగా ప్రకాశము అని 2 కొరింథీ 4:4వ.లో ఉన్నది. అపొ 26:13వ.లో పౌలు సూర్యకాంతి కంటే మించిన కాంతిని చూచానని అన్నాడు. సూర్యకాంతి అంతయు భూమికి చేరుట లేదు. సూర్యకాంతిలో రెండు కోట్లలో ఒక భాగము మాత్రమే భూమికి చేరుచున్నట్లు శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. అనేక కోట్ల సూర్యుల కాంతి ఎంత గొప్పదో అంత గొప్ప ప్రకాశము గలవాడు మన ప్రభువు...

**3వ. ఆయన శక్తి:-** దైవశక్తి మన జీవమునకును (living), భక్తికిని కావలసిన వాటిని అన్నిటిని దయచేయుచున్నది.

**జీవమునకు కావలసినవి:-** 1. అన్నము, 2. నీరు, వస్త్రములు, (తినుట, త్రాగుట, ధరించుకొనుట అవన్నియు అనుగ్రహించబడును. మత్త 6:31-33వ), 4. గాలి, 5. సూర్యరశ్మి. ఆయన చెడ్డవారి మీద మంచివారి మీద తన సూర్యుని ఉదయింపచేసి, నీతిమంతుల మీద అనీతిమంతుల మీదను వర్షము కురిపించుచున్నాడు (మత్తయి 5:45వ).

**భక్తికి కావలసినవి:-**

1. ఆయన తన కుమారుని ఈ లోకమునకు పంపి కుమారుని యందు మన పాపములకు క్షమాపణ దయచేసాడు (కొలొ 1:14వ).

2. మనలను తన కుమారులనుగా చేసాడు (యోహా 1:12వ).

3. నాయనా, తండ్రీ అని మొరపెట్టు ఆత్మను మన హృదయములలోనికి పంపాడు (గల4:6వ).

4. పరిశుద్ధాత్మ మనలను సర్వసత్యము లోనికి నడిపించుట ద్వారా భక్తిగా జీవించగలుగుచున్నాము (యోహా 16:13వ).

5. తన వాక్యము ద్వారా భక్తిలో బలపరచి, పెంచి జయమిచ్చుచున్నాడు. (కీర్త 1:3వ, 1పేతు 2:3వ, కీర్త 119:28వ.).

6. మనము భక్తిలో క్షేమాభివృద్ధి నొందుటకై సంఘములో కొందరు సువార్తికులను, కొందరు కాపరులను ఇచ్చాడు (ఎఫె4:13వ).

7. సంఘ సహవాసమిచ్చి ఆయనను ఆరాధించు కృపనిచ్చాడు (అపొ2:42వ).

4వ. పైన చెప్పిన వాటితో పాటు అమూల్యమును, అత్యధికమైన ఆశీర్వాదాలను (అమూల్యమును +అతి+అధికమైన+ఆశీర్వాదములను=నాలుగంతల ఆశీర్వాదాలు మనకిచ్చాడు. ఈ వాగ్దానముల అనుభవమూలముగా లోకమందున్న భ్రష్టత్వము నుండి తప్పించుకొని, తన స్వభావములో మనము పాలివారమగునట్లు చేశాడు.

**ఆయన స్వభావములోని కొన్ని గుణములు:-** 3-4వ.లో ఆయన తన గుణాతిశయములను బట్టి మనలను పిలిచాడు అని ఉన్నది. గుణాతిశయములు అనగా లెక్కించలేనన్ని గుణములు. కనుక ఆయన స్వభావములో అనేకమైన గుణములు కలవు. అందులో కొన్నింటిని జ్ఞాపకము చేసికొందము.

1) పరిశుద్ధత - పరిశుద్ధతనుబట్టి మహనీయుడు. నిర్గ 15:11వ.

2) సద్గుణము - దేవుడు అన్యాయము చేయుట అసంభవము. యోబు 34:10వ.

3) జ్ఞానము - ఎ. ఆయన జ్ఞానము శోధింప అసాధ్యము. యెషయా 40:28వ. బి. దేవుని బుద్ధి జ్ఞానములు ఎంతో గంభీరములు. రోమా 11:33వ సి. బుద్ధి, జ్ఞానములు ఆయనయందు గుప్తమైయున్నవి. కొలొ 2:3వ. డి. ఎవనికైనను జ్ఞానము కొదవగా ఉన్నయెడల దేవుని అడగాలి (యాకోబు 1:5వ.). ఈ జ్ఞానము శోధనలలో జయమును పొందుటకు సహాయము చేయును.

4) ఆశా నిగ్రహము - శరీరాశలకు, నేత్రాశలకు ఆయనలో తావు లేదు. హబ1-13వ.

5) సహనము - ఆయన దూషించబడియు బదులు దూషించలేదు. 1 పేతు 2:23వ.

6) దయ-ప్రపంచములో ఆయనొక్కడే దయామయుడని పిలువబడుచున్నాడు. మానవుల యెడల ఆయనకున్న దయ యేసు పేరుతో ప్రత్యక్షమైనది (తీతు 3:4వ). దురాశల వలన భ్రష్టత్వము సంభవించగలదు. భ్రష్టత్వము అనగా అయోగ్యత అనగా విశ్వాస యాత్రలో బహుమానము పొందు అయోగ్యతగా నిష్ఫలమైన జీవితముగా చూచుచున్నాము. రక్షణలోని అయోగ్యత కాదని గుర్తించాలి...

**5-7వ. మనలో ఉండవలసిన దేవుని స్వభావము:-** క్రీస్తు యేసు నందు పరిశుద్ధ పరచబడిన మనము ఆయన గుణములను అమర్చుకొనుచుండగా క్రీస్తు యేసు స్వరూపము మన యందు ఏర్పడాలి. ఆయన గుణాతిశయములను ప్రచురము చేయుటకు ఏర్పరచబడ్డాము. మన విశ్వాసము పునాది వంటిది కాగా దానిపై అమర్చబడవలసిన గుణములు విశ్వాసమను పునాదిపై కట్టబడు అంతస్తుల వంటివి. మొదటి అంతస్తు సద్గుణము కాగా దానిపైన, రెండవదిగా జ్ఞానమును, మూడవదిగా ఆశానిగ్రహమును, నాల్గవదిగా సహనమును, ఐదవదిగా భక్తిని, ఆరవదిగా ప్రేమను, ఏడవదిగా దయను (దేవుని ప్రేమగా) మొత్తము ఏడు గుణములను విశ్వాసమను పునాదిపై ఏడు అంతస్తులనుగా అమర్చుకోవాలి. ఏడు సంపూర్ణ సంఖ్య కనుక క్రీస్తు యేసులో సంపూర్ణముగా ఎదిగి క్రీస్తును పోలి, ఆయన స్వరూపములోనికి మార్చబడాలి. గలతీ 4:19వ.లో పౌలు 'నా పిల్లలారా, క్రీస్తు స్వరూపము మీయందేర్పడు వరకు మీ విషయమై మరల నాకు ప్రసవ వేదన కలుగుచున్నది' అన్నాడు. పరమందున్న ఆయనతో గొర్రెపిల్ల వివాహ మందు ఏకమగుదుము గనుక ఈ లోకములో ఉండగానే అటువంటి స్థితికై ప్రయాసపడాలి.

**1) సద్గుణము-** గుణవతియైన భార్య దొరుకుట అరుదు, అట్టిది ముత్యము కంటే గొప్పదని సామె 31:10వ.లో చెప్పబడినది. శిక్షల మూలముగానైనను మానవులు గుణపడరని లేవి 26:23వ.లో వ్రాయబడినది. నేను వారిని గుణపరచుదును అని హోషేయ 14:4వ.లో చెప్పుచున్నాడు కనుక ఆయన స్వభావములో పాలివారమగుట ద్వారా గుణపరచబడుదుము గాక.

**2) జ్ఞానము -** లోక జ్ఞానము కాదు, క్రీస్తును గూర్చిన అతిశ్రేష్ఠమైన జ్ఞానము - క్రీస్తును గూర్చిన అతి శ్రేష్ఠమైన జ్ఞానము నిమిత్తము సమస్తమును నష్టపరచుకొనిన పౌలును పోలి ఆ జ్ఞానమును సంపాదించుకొనాలి. (ఫిలి 3:8-11వ). ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్న యెడల దేవుని అడగాలి (యాకో 1:5వ). ఈ జ్ఞానము ద్వారా శోధనలలో జయమును పొందగలము.

**3) ఆశానిగ్రహము -** దేవుడు మనకు ఇంద్రియ నిగ్రహము గల ఆత్మనే ఇచ్చెను అని 2 తిమో 1:7వ.లో చెప్పబడినది. శరీరాశ, నేత్రాశ, జీవపుడంబములకు మనము లోను కాగలము. బాహ్యమైనవగు పంచేంద్రియములకు (కన్నులు, చెవులు, ముక్కు, నోరు, చర్మము), అంతరింద్రియములకు (హృదయము, మనస్సు, మనుష్య ఆత్మ, ప్రాణము) అనేక ఆశలుండును. మనస్సును స్వాధీనమందుచుకొనాలని సామెతలు 16:32వ.లో నున్నది. కొద్ది, గొప్ప ఆశలన్నిటిని నిగ్రహించుకొనువారమై యుండాలి.

**4) సహనము (ఓర్పు) -** యోబు యొక్క సహనమును గూర్చి మీరు వింటిరి (యాకో 5:11వ.) యోబును పోలి మనము శ్రమలలో సహనము కలిగి యుండాలి.

**5) భక్తి-** సంతుష్టిసహితమైన దైవభక్తి గొప్ప లాభసాధనమైనదని 1తిమో 6:6-10వ.లో చెప్పబడినది. ఆ రీతిగా భక్తి కలిగి జీవించుదము గాక.

**6) సహోదర ప్రేమ** – నేను మిమ్మును ప్రేమించినట్లే మీరును ఒకరిని ఒకరు ప్రేమింపవలెను అని యోహాను 13:34వ.లో చెప్పబడినట్లు ప్రేమలో ముందుకు సాగాలి...

సహోదరులు, సహోదరీల మధ్య ఒకరి నొకరు ప్రేమించుకొనని వారు కలరు (ఫిలి4:2వ).లో సువార్త పనిలో బహుగా ప్రయాసపడు యువోదియ, సుంటుకేను అను ఇద్దరు సోదరీలు కలరు. వారిలో ఏక మనసు లేదు. ఒకరిని, ఒకరు ప్రేమించలేక పోవుచున్నారు. పనిలో ప్రయాసపడువారిలోనే సహోదర ప్రేమ లేని యెడల మిగిలినవారిలో ఎంత వరకు ఉండగలదో తలంచవచ్చును. కనుక సహోదర ప్రేమను మన మందరము అమర్చుకొనాలి.

**7) దయ (దేవుని ప్రేమ – Agape )**– దయ, కరుణ, కనికరము, దేవుని ప్రేమ మొదలుగునవి ఒకే అర్థమిచ్చునవిగా నున్నవి పైన చెప్పినవన్నియు మనము కలిగి యుండాలి. మనలో కలిగి విస్తరించాలి. విస్తరణ అనగా పొడవులో, వెడల్పులో పెరుగుట, ఇటువంటి ఎదుగుదల మనలో వుండాలి.

**8–9వ. పై నున్న గుణములు కలిగినవారు – గుణములు లేనివారు :–** 8వ. భ్రష్టత్వము/ అయోగ్యత అనగా విశ్వాస యాత్రలో బహుమానము పొందు అయోగ్యతగా / నిష్ఫలమైన జీవితముగా చూచితిమి. పైనున్న ఏడు గుణములు కలిగి విస్తరించిన వారిని, యేసు ప్రభువును గూర్చిన అనుభవ జ్ఞానము విషయములో నిష్ఫలులు కాకుండా చేయును. దీని భావము పైనున్న ఏడు గుణములు కలిగినవారు ఫలించువారుగా నుందురు.

**9వ. గుణములు లేనివారు:–** ఈ గుణములు లేనివారు గ్రుడ్డివారును, దూరదృష్టి లేనివారు. ఆత్మీయ జీవితములో గ్రుడ్డివాడు తానెక్కడికి పోవుచున్నాడో తనకే తెలియదు అని 1 యోహాను 2:11వ.లో చెప్పబడినది.

**10–11వ. పిలుపు విషయమైన జాగ్రత్త లేని యెడల తొట్రిల్లుట:–**

**పిలుపును -- నిశ్చయము -- చేసికొనుట.**

1) మహిమనుబట్టి గుణాతిశయములను బట్టి మనలను పిలిచినవాడు 1:3వ.
2) మిమ్మును పిలిచిన పిలుపును చూడుడి 1 కొరి 1:26వ.
3) ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానము పొందవలెనని...
4) ... గురియొద్దకే పరిగెత్తుచున్నాను. ఫిలి 3:14వ.
5) పరలోక సంబంధమైన పిలుపులో పాలుపొందు పరిశుద్ధ సహోదరులు. హెబ్రీ 3:1.
6) పరిశుద్ధ పిలుపుతో పిలిచెను 2 తిమో 1:10వ,
7) పిలుపు విషయమైన ఒక్కటే నిరీక్షణ యందుండుటకు పిలువబడితిరి. ఎఫె 4:4వ.
8) పిలుపునకు యోగ్యులుగా ఎంచునట్లు... 2థెస్స 1:12వ,
9) పిలుపునకు లోబడి... హెబ్రీ 11:8వ.

10) పిలువ బడిన పిలుపునకు తగినట్లుగా దీర్ఘశాంతము, సంపూర్ణ వినయము, సాత్వికముతో నడచుకొనుట, ఎఫె 4:2వ.

ఒకసారి బిల్లిగ్రహం గారిని ఫోర్ట్ కారుల కంపెనివారు తమ కంపెనికి ఉన్నతమైన అధికారిగా ఉండమని పిలుపు లెటర్ పంపారు. వారిచ్చు జీతమును కూడ అందులో తెలిపిరి. బిల్లిగ్రహం గారు దానికి జవాబుగా మీ జీతము గొప్పది, కాని పని చిన్నది. కనుక నేను రాలేను అన్నాడు. బిల్లిగ్రహం గారు దేవుడు తనను పిలిచిన పనిని గూర్చి వివరముగా ఎరిగినవాడై నిశ్చయము చేసికొన్నాడు. మనమైతే మన పిలుపును, ఏర్పాటును నిశ్చయము చేసికొన్నామా?

ఈ గ్రంథమందలి జాగ్రత్తలు గమనింతుము. పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటలో 1)పూర్ణజాగ్రత్త (1:5), 2) మరి జాగ్రత్త (1:10), 3) జాగ్రత్త (1:15), 4) ఎంతో జాగ్రత్త (3:12), 5) జాగ్రత్త (3:14) కలిగియుండాలి. లేనిచో ఆత్మీయ జీవితములో తొట్రిల్లగలము (1:11).

**12-15వ. ఒకరికి జ్ఞాపకము చేయ వలసిన అవసరత:-** 12వ. ఆత్మీయ జీవితములో స్థిరపడినవారు కలరు. అస్థిరులు కలరు. తాను నిలుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనాలి (1కొరి 10:12వ.). సత్యమందు స్థిరపడిన వారికైనను పేతురు వంటి కాపరులైనవారు నిత్యము వాక్యమును జ్ఞాపకము చేయుటకు సిద్ధముగా నుండాలి.

13-14వ. పేతురు తన గుడారమును విడువవలెనని దేవుడు ఆయనకు సూచించాడు. ఆది 18:17వ.లో దేవుడు నేను చేయబోవు కార్యమును అబ్రహాముకు దాచెదనా? అన్నాడు. యెహోషువ 23:14వ.లో యెహోషువ నేడు నేను సర్వలోకుల మార్గమున పోవుచున్నాను అని తాను చనిపోవు దినమును గూర్చి స్పష్టముగా చెప్పగలిగెను. మొదటి రాజులు 2:2వ.లో దావీదు తన మరణమును గూర్చి, నేను వెడలిపోవు కాలము సమీపమైనదని చెప్పాడు. దేవుడు తాను ప్రేమించు వారికి తమ మరణ కాలమును తెలియపరచుట లేఖనములలో మనము గమనించగలము. కనుక పేతురు తన జీవితకాల అంతము వరకు ప్రభువులో నమ్మకముగా నుండెనని గమనించుచున్నాము. జీవిత కాల అంతము వరకు సహోదరులను ఆత్మీయత కొరకై రేపుట చూడగలము. అలాగే మనమును ఒకరినొకరు రేపు కొనుచునుండాలి.

15వ. తాను మృతి పొందిన తరువాత కూడ నిత్యము ఈ సంగతులు జ్ఞాపకము చేయబడాలని కోరుటలో ఆత్మీయ జీవితము పట్ల ఆయన ఆశ ఎంత గొప్పదో చూడగలము. అలాగే మనము మృతిపొందిన తరువాత కూడ ఈ సంగతులు నిత్యము జ్ఞాపకము చేయబడు ఏర్పాటును మనము చేయాలి.

**16-21వ. లేఖనముల ప్రాముఖ్యత:-** 16-18వ. రూపాంతరపు కొండపై ప్రభువును చూచాడు. తండ్రీ కుమారుని గూర్చి పలికిన దానిని విన్నాడు. చూచిన దాని మీద గాని, వినిన దాని మీద గాని లక్షముంచక, స్థిరమైన ప్రవచన వాక్యము మీద లక్షముంచాలని చెప్పుచున్నాడు.

19-21వ. స్థిరమైన ప్రవచన వాక్యము:- తెల్లవారి వేకువ చుక్క మీ హృదయములలో ఉదయించు వరకు ఆ వాక్యము చీకటి గల చోట్ల వెలుగిచ్చు దీపమై యున్నది. వేకువ చుక్క ప్రభువైన యేసే. రోమా 13:12వ. ప్రకారము రాత్రి చాలా గడచి పగలు సమీపమైనది. మొదటి శతాబ్దములో పగలు సమీపముగా నున్నది. ఆలాగైతే వేకువ చుక్కయైన ప్రభువు ఉదయించుట / రాకడ ఇప్పుడు మరీ సమీపము.. బైబిలులో చెప్పబడిన సూచనలను బట్టి క్రీస్తు రాకడ అతి సమీపముగా నున్నది. ఆయనను చూచుట మీద గాని, ఆయన స్వరము వినుట మీద గాని కాక ఆయన రాకడవరకు వాక్యము మీదనే తప్ప మరి దేని మీద లక్షముంచరాదు.

ఎందుకనగా దేవుని వాక్యము సజీవమైనది. బలము గలది, రెండంచుల ఖడ్గము కంటే వాడిగలది, ప్రాణాత్మలను, కీళ్ళను, మూల్గులను విభజించునది (హెబ్రీ 4:12వ.). ఎమ్మాయి మార్గములో ఆయన వారితో లేఖనములను మాటలాడగా వారి హృదయములు మండెను (లూకా 24:32వ). కనుక వాక్యము మీదనే మనము లక్షముంచాలి.

## 2వ. అధ్యాయము. 3+3+3+3+5+5=22వ.

### అంశము:- అబద్ధ బోధకుల రాక, వారి పరిస్థితి.

**1-3వ. అబద్ధ బోధకుల రాక - వారి నాశనము:-** మొదటి అధ్యాయము చివరలో ప్రవచనము, ప్రవక్తలను గూర్చి చెప్పబడినది. ఎక్కడ దేవుని ప్రవక్తలు ఉండిరో అక్కడ అబద్ధ ప్రవక్తలును ఉండిరి. అలాగే ప్రస్తుత కాలములో సంఘ క్షేమాభివృద్ధికి దేవుడు బోధకులను ఇచ్చాడు. (ఎఫెసీ 4:13వ). బోధకులతో పాటి అబద్ధ బోధకులును ఉన్నారు. వీరు తమ్మును కొనిన ప్రభువును కూడ విసర్జించుదురు. వీరు మనలోనే ఉన్నారు. కొనబడినవారు, మనలో ఉన్నవారు అనగా వీరు రక్షించబడినవారే. బోధకులు అనగా వాక్యమును బాగుగా ఎరిగినవారే. లోభులై ధనాపేక్షను కలిగిన వారై లాభ సంపాదన నిమిత్తము తమ్మును కొనిన ప్రభువును కూడా విసర్జించుదురు. కనుక కల్పనా వాక్యములను, సత్యమునకు భిన్నమైన బోధను అనగా అబద్ధములను రహస్యముగా బోధింతురు. దేవుడు వారికి తీర్పు తీర్చి శిక్షించగా నాశనమగుదురు. ఇది ఆత్మరక్షణ పోవుట కాదు.

కాని గోధుమల మధ్య విత్తబడిన గురుగులవలె సంఘములో ప్రవేశించిన అవిశ్వాసులగు అబద్ధ బోధకులు కూడా కలరు. వారు రక్షణ లేనివారు కనుక వారి అంతము నరక శిక్షయే. అబద్ధ బోధకులు రహస్యముగా వత్తురు. మనము నమ్మిన వాక్యానుసారమైన సత్యములను గాక నాశనకరమగు భిన్నాభిప్రాయములను అనగా ప్రభువుకు వ్యతిరేకమైన సంగతులను రహస్యముగా బోధింతురు. వారు స్వలాభము కొరకై ఆలాగు బోధించగా అనేకులు వారిని అనుసరించి తప్పు దారిలో నడతురు. ఈ రీతిగా అబద్ధ బోధకులు తమ నాశనమును తామే కలిగించుకొందరు.

**4-6వ. పాపము చేసిన వారికి, నీతిమంతులకు గత కాలములో జరిగిన తీర్పులు:-** గత కాలములోని తీర్పులు ఇక్కడ చెప్పబడినది. తీర్పులో శిక్షించబడిన వారు / విడిచి పెట్టబడిన వారిని గూర్చిన కొన్ని దృష్టాంతాలు.

4-6వ. పాపము చేసిన దేవదూతలు (4వ), 2) పాపము చేసిన నోవహు కాలము నాటి ప్రజలు (5వ), 3) పాపము చేసిన సొదొమ, గొమొఱ్ఱ ప్రజలు (6వ), 4) నీతిమంతుడైన నోవహు అతని కుటుంబము (5వ).

| | వ్యక్తులు | విడిచిపెట్టబడనివారు | విడిచిపెట్టబడినవారు |
|---|---|---|---|
| 1 | సృష్టి ప్రారంభ మందలి దూతలు | పాపులైన సాతాను, వాని దూతలు | పాపము చేయని దూతలు. |
| 2. | నోవహు దినాలలో పాపము/నీతిగల దూతలు, ప్రజలు | 3) పూర్వకాలలోకమందలి, భ్రష్టత్వము, నందున్న ప్రజలు/దూతలు. | 2)నోవహు, అతని కుటుంబము. |
| 3. | లోతు దినాలలోని వారు. | 4) సొదొమ, గొమొఱ్ఱ ప్రజలు | 3) లోతు. |

**4వ. పాపము చేసిన దేవదూతలు:-** ప్రస్తుతము శరీరులు నివసించిన ఈ భూమి మీద ఆదాము హవ్వల సృష్టి కంటే ముందు ఆత్మలు నివసించిరని వారిలో సాతాను, వాడి ఆదీనమందున్న దూతలు చేసిన పాపమును బట్టి వారు నరకములో ఒక మూలకు త్రోసివేయబడిరి అని యెషయా 14:12-17వ. లేఖనముల నుండి నేర్చుకొనుచున్నాము. ఒకవేళ వీరిని గూర్చిన తీర్పు ఇక్కడ చెప్పబడితే వారు కటికచీకటిబిలములో అనగా పాతాళములో నుండాలి. కాని సాతాను వానిని అనుసరించిన దూతలు కావలి లేక స్వతంత్రులుగా ఉన్నారు. కనుక ఈ వచనములందు ప్రస్తావించబడిన దూతలు వీరు కారు. ఆది 6:2వలో దేవుని కుమారులు నరుల కుమార్తెలు చక్కని వారని చూచి వారందరిలో తమకు మనస్సు వచ్చిన స్త్రీలను వివాహము చేసికొనిరి. వేదాంతులు ఇక్కడ చెప్పబడిన దేవుని కుమారులు దేవదూతలని చెప్పుచున్నారు. దేవదూతలు శరీరములను ధరించుకొనిన సందర్భములు లేఖనములలో కన్పించును. అందుకే దేవుడు అప్పటి ప్రజలనందరిని జల ప్రళయము ద్వారా నాశనము చేసాడు. దీనిని మనము అంగీకరిచిన యెడల ఈ దేవదూతలనే దేవుడు విడిచిపెట్టక కటిక చీకటి గల పాతాళ బిలములో వారిని బంధించాడు (యూదా 6వ. కూడా చూడండి).

**2) పాపము చేసిన నోవహు కాలమునాటి ప్రజలు (5వ):-** పైన చెప్పినట్లు దూతలను శిక్షించిన దేవుడు ఆనాటి ప్రజలను కూడా శిక్షించాడు. ప్రజలకు మారుమనస్సును పొందుటకై నోవహు ద్వారా సువార్త ప్రకటింప చేసి అవకాశమిచ్చాడు. ప్రజలు మారు మనస్సును పొందలేదు. అందువలన ఆనాటి ప్రజలందరినీ నశింపచేశాడు.

**3) పాపము చేసిన సొదొమ, గొమొఱ్ఱ ప్రజలు (6వ):-** వీరిని గూర్చిన ప్రస్తావన ఆది 18:20-23, 19:1-26 వచనాలలోను, 2 పేతురు 2:6-8వ. లోను కలదు. నోవహు కాలము నాటి ప్రజలు పాపము చేసి నాశనమైన నాలుగు వందల సంవత్సరములకే లోతు కాలము నాటి ప్రజలు మరల పాపులైరి. లోతు ఇంటికి వచ్చిన పురుషులతో సంయోగించకోరిరి. ఈసారి దేవుడు ఆకాశమునుండి అగ్నిని, గంధకమును కురిపించి సొదొమ, గొమొఱ్ఱ ప్రజలను, పట్టణములను నాశనము చేశాడు. ఇది రాబోవు కాలమందు దేవుడు పట్టణములను, ప్రజలను అగ్నిచేత లయపరచుటకు సాదృష్యముగా నున్నది.

**4) నీతిమంతుడైన నోవహు అతని కుటుంబము (5వ) :-** నోవహు దేవుని యందు విశ్వాసముంచినవాడు. దేవుని యందు భయభక్తులు గలవాడు. విశ్వాసమునుబట్టి అది వరకు ఎన్నడు జరుగని సంగతుల విషయమై దేవుని చేత హెచ్చరించబడి దేవుడు చేయబోవు నాశనమును గూర్చి లోకానికి ప్రకటన చేశాడు. జల ప్రళయము నుండి తప్పించుకొనుటకు ఓడను సిద్ధము చేశాడు. కనుక ఆ ఓడలో తాను, తన కుటుంబము ప్రవేశించుట ద్వారా నాశనము నుండి రక్షించబడిరి. ఆ తరము వారి మీద నేరస్థాపన చేయువాడైనాడు.

**7-9వ. నీతిమంతుడైన లోతు :-** దుర్మార్గుల కామ వికారయుక్తమైన నడవడి చేత బహు బాధపడిన నీతిమంతుడైన లోతు అని వ్రాయబడినది. ఇక్కడ నీతిమంతుడని వ్రాయబడకపోతే లోతును నీతిమంతుడు అనుట ప్రశ్నార్థకముగా ఉండేది. ఈ భాగమునుబట్టి **లోతు నీతిమంతుడే** అని నిశ్చయముగా చెప్పగలము. కాని నీతి గల తన మనసును నొప్పించుకొనుచుండెను అని వ్రాయబడినది. శరీర సంబంధి, లోకసంబంధియై శరీరమును, లోకమును ప్రేమించినవాడు. అందుకే మనస్సులో సంతోష, ఆనందాలకు బదులు, నొప్పి కలిగియుండెను. కానీ సొదొమను విడిచి బయటకు వచ్చినవాడు కాదు. **అక్కడే** మనస్సులో నొప్పితో వుండెను.

ఈ దినాలలో అనేకులు అపొస్తలుల బోధకు, సహవాసానికి, ప్రార్థనకు చేరి రాక మనస్సులో నొప్పి ఉన్నను లెక్కచేయక అలాగే ఉన్నారు.

**10-12వ. అబద్ధ బోధకుల లక్షణములు:-**

1) మలినమైన దురాశలు కలిగినవారు:- దురాశ గర్భమును ధరించి పాపమును కనును (యాకోబు 1:15వ).

2) శరీరానుసారముగా నడుచుకొనువారు:- శరీరానుసారమైన మనస్సు మరణము (రోమా 8:5వ). క్రీస్తు యేసు సంబంధులు శరీరమును దాని ఇచ్ఛలతో కూడా సిలువ వేసియున్నారు. (గల 5:24వ).

3) ప్రభుత్వమును నిరాకరించు వారు. బాగుగా పాలన (ప్రభుత్వము) చేయు పెద్దలను రెట్టింపు సన్మానమునకు పాత్రులుగా ఎంచుకోవాలి (1 తిమో 5:17వ). కాని అలాగు చేయక పెద్దల ప్రభుత్వము నిరాకరించు వారు కలరు.

4) తెగువగల వారు – వీరు నిర్బంధము లేక తెగింపు గలవారు.

5) స్వేచ్ఛాపరులు – పాపము నుండి విడిపించబడి దేవునికి దాసులమైతిమి (రోమా 6:17వ), కాని స్వేచ్ఛాపరులము కాదు.

6) వివేక శూన్యములగు మృగముల వంటివారు,

7) మహాత్ములను దూషించువారు – మహాత్ములనగా గొప్పవారని అర్థము. గొప్పవారిని తమకంటే యోగ్యులని ఎంచి, గౌరవించాలి, కాని దూషించకూడదు.

**13–17వ. అబద్ధ బోధకుల మరి కొన్ని లక్షణములు:–**

**13–15వ.** 8) ఒకనాటి సుఖానుభవము సంతోషమని ఎంచుకొనువారు – ఏశావు ఒకనాటి కూడు కొరకు తన జ్యేష్ఠత్వమును అమ్ముకొనెను (హెబ్రీ 12:16వ). 9) కళంకులు.
10) వ్యభిచారిని చూచి, ఆశించుచు పాపము మానలేని కన్నులు కలవారు.
11) లోభత్వమందు సాధకము చేయబడిన హృదయము గలవారు.
12) తిన్నని మార్గమును విడిచి బిలాము పోయిన మార్గమున త్రోవ తప్పినవారు. దుర్నీతిపరులు.

**16–18వ.** 13) నీళ్ళు లేని బావులు – వాక్యమునకు జీవితములో తావు లేనివారు.
14) మంచి వారిని తమ పోకిరి చేష్టలచేత మరలకొల్పువారు.

19–22వ. అబద్ధ బోధకుల భ్రష్టత్వము, వారిని గూర్చిన సామెతలు:– 19వ. భ్రష్టత్వమునకు దాసులు. 20–22వ. కుక్క సామెతగా, పంది సామెతగా అబద్ధ బోధకులను పోల్చుచున్నాడు. కుక్క తన వాంతికి తిరిగినట్లు, కడుగబడిన పంది బురదలో పొర్లినట్లు అబద్ధ బోధకులు పదే, పదే భ్రష్టత్వము వైపునకు మళ్ళించబడుచుందురు.

## 3వ అధ్యాయము 2+2+3+3+3+3+2=18వ.

అంశము:– ప్రభువు దినమును గూర్చిన హెచ్చరికలు.

**1–2వ. పత్రిక ఉద్దేశ్యము:–** పూర్వకాలమందలి ప్రవక్తల మాటలు, నూతన నిబంధన కాలమందలి అపొస్తలుల మాటలు అనగా పాత, క్రొత్త నిబంధన యందలి దేవుని ఆజ్ఞలను జ్ఞాపకము చేయుచు వారి మనస్సులను రేపుచు పేతురు ఈ పత్రిక వ్రాయుచున్నాడు. ఆలాగే మనము కూడా పాత క్రొత్త నిబంధనలయందలి ఆజ్ఞలను నిత్యము సంఘమునకు జ్ఞాపకము చేయాలి.

**3–4వ. అవిశ్వాసముతో కూడిన అపహాసకుల ప్రశ్నలు:–**

3వ. అమూల్యమైన విశ్వాసము పొందినవారు విశ్వాసములో బలహీనులై, స్వకీయ దురాశల చొప్పున నడుచుకొందురు. దురాశను అనుసరించుట వలన లోకమందున్న

భ్రష్టత్వము సంభవించునని 1:4వ.లో చూచితిమి. అనగా నిష్ఫలమైన స్థితి, ఫలమును పొందుటకు అయోగ్యత సంభవించును. దేవుని వాగ్దానముల మూలముగా ఈ స్థితి నుండి తప్పించుకొనగలము అని 2 పేతు 1:4వ.లో చూచితిమి. 2 పేతు 3:12వ.లో వాగ్దానముల కొరకై కనిపెట్టుకొని యుండాలని చెప్పబడినది. కాని ఇక్కడ అవిశ్వాసము లోనికి దిగజారిన వారు వాగ్దానముల విషయములో కనిపెట్టక అపహాసకులైరి..

4వ.లో అవిశ్వాసముతో అపహాసకులై ఆయన రాకడను గూర్చిన వాగ్దానము ఏమాయెను? అని ప్రశ్నించుస్థితికి జారిపోయిరి. రెండవదిగా పితరులు నిద్రించినది మొదలు సృష్టి ఆరంభమునందున్నట్లే ఉన్నదే? అని ప్రశ్నించుదరు. రెండవ ప్రశ్నకు ముందుగా జవాబు చెప్పుచున్నాడు.

**5-7వ. రెండవ ప్రశ్నకు జవాబు:-** దేవుడు భూమ్యాకాశములను సృజించెను, భూమి నిరాకారముగాను, శూన్యముగాను ఉండెను (ఆది 1:1వ) అని ఉన్నది. నిరాకారముగా నుండునట్లు ఆయన దానిని సృజింపలేదు (యెషయా 45:18వ). సృజించబడిన భూమి అట్లే ఉండక నిరాకారముగాను శూన్యముగాను మారినది. ఎందుచేత మారినదో చెప్పుట కష్టమే. మానవుని సృజించక మునుపు దేవుడు సృజించిన ఆత్మలగు దేవదూతలు భూమి మీద నివసించినట్లున్నది. యెషయా 14:12-17వ. ప్రకారము సాతాను దేవునితో సమానునిగా చేసికొందును అని తలంచిన తలంపులోని పాపమును బట్టి భూమి సాతాను నరకములో ఒకమూలకు త్రోయబడి, భూమి ఆకారము లేక, శూన్యముగాను మారినట్లు తలంచగలము. ఇది మొదటిసారి మార్పుగా తలంచాలి కనుక సృష్టి ఆరంభమున ఉన్నట్లు ఉన్నదనుట సరికాదు. అపహాసకుల అభిప్రాయము తప్పు. **రెండవసారి మార్పు:-** ఏదేనులో నుండి ఒక నది బయలుదేరి పాయలై యూఫ్రటీస్, టైగ్రీస్ కాగా నేడు ఆ రెండు ఒక స్థలములో కలియుచున్నవి. ఒకప్పుడు ఆ స్థలములో దక్షిణము నుండి ఉత్తరమునకు నీరు పారగా, ఇప్పుడు ఆ స్థలములో ఉత్తరము నుండి దక్షిణ ప్రాంతమునకు నీరు ప్రవహించుచున్నది. నీళ్ళలో నుండియు, నీళ్ళవలనను సమకూర్చబడిన భూమి దేవుని వాక్యము వలన కలిగినదని గుర్తించాలి.

అలాగే నీళ్ళ వలననే నోవహు కాలములో భూమి మీద ప్రజలు నశించిరి. అగాధ జల ఊటలు విప్పబడుట. జల ప్రళయమునుబట్టి చుట్టూ నున్న భూభాగము ఎత్తయినది. అందుకే నీరు ఏదేను తోట వున్న ప్రాంతమునకు పారుచున్నది. భూమి దాని రూపు రేఖలు మారిపోయినవి. కనుక రెండవసారి కూడా భూమి మార్పునకు గురియైనది. కనుక భూమి సృజించబడిన రీతిగా ఇప్పుడు లేదని గుర్తించాలి. 7వ. ధవళమైన మహా సింహాసన మందు పాపులు తీర్పు తీర్చబడిన తరువాత, ఇప్పుడున్న ఆకాశము, భూమి అగ్నిచేత లయమై నూతన ఆకాశము, నూతన భూమిగా మారిపోవును (ప్రక. 21:1వ). కనుక భూమి సృజించబడిన రీతిగానే వుండదని గుర్తించాలి.

**8-10వ. ప్రభువు రాకడ సమయమును గూర్చిన మొదటి ప్రశ్నకు జవాబు:-** దేవుని దృష్టికి ఒక దినము వేయి సంవత్సరముల వలె నున్నవి. దేవుని కాలమానము వేరే అని చూచుచున్నాము. ఆయన దీర్ఘశాంతము, ఆలస్యము అంతటా అందరు మారుమనస్సును పొందు నిమిత్తమే. ఆయన రాకడ దొంగవచ్చినట్లు అన్నందున ఎప్పుడో చెప్పవల్లపడదు. కనుక మనము ఆయన రాకడ కొరకు కనిపెట్టుకొని ఓపికతో ఎదురుచూచుచుండాలి.

**11-13వ. రెండవ జవాబులో ప్రభువు రాకడలో జరుగు నాశనమును గూర్చిన హెచ్చరిక:-** ఈ భాగములో ఐదు హెచ్చరికలు కలవు. ఆకాశములు, పంచ భూతములు మహా వేండ్రముతో లయమై కరిగి పోవును. అట్టి దేవుని దినపు రాకడకై 1) కనిపెట్టుకొనాలి, 2) ఆశతో అపేక్షించాలి, 3) పరిశుద్ధ ప్రవర్తన కలిగి యుండాలి, 4) భక్తి కలిగి యుండాలి, 5) ఎంతో జాగ్రత్తగా నుండాలి. నూతన ఆకాశము, నూతన భూమి ఏర్పడుట, అందులో నీతి నివసించుట, దేవుని బిడ్డలమైన మనము అందులో నివసించుట, అను వీటన్నిటి కొరకై మనము కనిపెట్టుకొనాలి.

**14-16వ. ప్రభువు రాకకై కనిపెట్టుకొనియుండుటను గూర్చిన హెచ్చరిక:-** ప్రభువు రాకడ వచ్చువరకు మరికొన్ని హెచ్చరికలు మన కొరకై చెప్పబడినవి. 1) శాంతముతో నుండాలి, 2) నిష్కలంకముగా నుండాలి, 3) నిందారహితముగా కనపడాలి. చివరిసారి, జాగ్రత్తగా నుండాలని చెప్పబడినది. పౌలు కూడా ఇదే విషయాలు వ్రాశాడు, కాని విద్యావిహీనులు వాటిని అపార్థము చేసికొంటారు.

**17-18వ. ప్రభువు రాకడ వరకు స్థిర మనస్సును కలిగి యుండుట:-** ఈ సంగతులన్ని ముందే తెలిసినవైనను నీతి విరోధుల తప్పుడు బోధల వలన తొలగిపోక, స్థిర మనస్సును విడిచి పడిపోకుండ కాచుకొని యుండాలి. కృపలో జ్ఞానములో అభివృద్ధి పొందుచుండాలి.

# 6. యోహాను వ్రాసిన మొదటి పత్రిక

## యోహాను వ్రాసిన మొదటి పత్రిక పరిచయము

| గ్రంథకర్త | కాలము |
|---|---|
| యోహాను | క్రీ.శ 90-94 |

ముఖ్యాంశము: సహవాసమునందలి సంతోషము సంపూర్ణమగుటను గూర్చిన సంగతులు వ్రాయబడినవి (3,4వ.)

మన అన్యోన్య సహవాసము తండ్రియైన దేవునితోను, కుమారుడైన దేవునితోను ఉన్నది. దేవుని లక్షణములను గూర్చియు తద్వార విశ్వాసులమైన మనకు దొరికిన మేలులనుబట్టి కలుగు పరిపూర్ణ సంతోషమును గూర్చియు ఈ గ్రంథమందు రచయిత వ్రాయుచున్నాడు.

గ్రంథకర్త:- యోహాను తన పేరును ఈ గ్రంథమందు ప్రస్తావించక పోయినను గ్రంథకర్త యోహాను అని క్రింద కనపరచిన విషయములనుబట్టి తీర్మానించగలము.

1. మేమేది చూచితిమో అనగా క్రీస్తును చూచినవాడు. మా చేతులు దేనిని తాకి చూచినో అనగా క్రీస్తుతో కూడా సంచరించినవాడు. ఏది నిదానించి కనుగొంటిమో అనగా క్రీస్తు సేవా జీవితకాలములో సంపూర్తిగా క్రీస్తుతోనున్న వాడు. క్రీస్తును నిదానించి చూచినవాడు. కనుగొన్నవాడు వీటినిబట్టి గ్రంథకర్త అపొస్తలులలో ఒకడని గమనించగలము. మరియు ముఖ్యముగా పేతురు, యాకోబు, యోహానులలో ఒకడని గమనించగలము.

2. యోహాను సువార్త 15:11లో "మీయందు నా సంతోషము పరిపూర్ణము కావలెనని" యేసు ప్రభువు చెప్పిన మాటలను, వివరించుచూ మన సంతోషము పరిపూర్ణమగుటకే మేమీ సంగతులు వ్రాయుచున్నామని ఈ గ్రంథకర్త పలికినందున, గ్రంథకర్త యేసు శిష్యులలో ఒకడు, యోహాను సువార్తను వ్రాసిన యోహానే అని గమనించగలము.

3. యోహాను సువార్త 20:31వలో యేసే దేవుని కుమారుడైన క్రీస్తు అని నమ్మునట్లు సువార్త వ్రాయబడెనని చెప్పుచున్నాడు. రెండవదిగా యేసు నామమందు జీవము పొందుదురని సువార్తలో తెలుపుచున్నాడు. యోహాను మొదటి పత్రికలో 1:2లో నిత్యజీవము గూర్చి సాక్ష్యమిచ్చుచున్నాము అన్నాడు. 5:11లో దేవుడు మనకు నిత్యజీవము దయచేసెను అని వ్రాసాడు. 5:20లో దేవుడు నిత్యజీవమునైయున్నాడని వ్రాసాడు. 5:13లో దేవుని కుమారుని నామమందు విశ్వాసముంచు వారు నిత్యజీవము కలవారైయున్నారని తెలిసికొనునట్లు ఈ సంగతులు మీకు వ్రాయుచున్నాను అన్నందున యోహాను సువార్తను వ్రాసిన శిష్యుడైన యోహానే ఈ గ్రంథమును వ్రాసెనని అర్థమగుచున్నది.

4. యోహాను సువార్త 1:1లో ఆదియందు అని ప్రారంభించాడు. ఆలాగే 1 యోహాను 1:1లో ఆది నుండి ఏది ఉండెనో అన్నందున రెండు గ్రంథముల ప్రారంభము ఒకే రీతిగా నున్నందున ఈ పత్రిక యోహానే వ్రాసెనని నిశ్చయించగలము. యోహాను మొదటి పత్రికలోను, యోహాను సువార్తలోను ఈ క్రింది ప్రాముఖ్య అంశములు ఒకే రీతిగానున్నవి.

| 1 యోహాను పత్రిక | యోహాను సువార్త |
|---|---|
| 1. 1:5వ దేవుడు లోకమునకు వెలుగు. చీకటిలో నడవకూడదు. | 8:12వ నేను లోకమునకు వెలుగు. నన్ను వెంబడించువాడు చీకటిలో నడవకూడదు. |
| 2. 3:16వ దేవుని ప్రేమ ఎట్టిదని తెలుపబడినది. | 3:16వ. దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. |
| 3. 4:8,16వ. దేవుడు ప్రేమయైయున్నాడు | |
| 4. 5:16వ. ఆత్మ సత్యమే | 16:13వ. సత్య స్వరూపియగు ఆత్మ. |
| 5. 5:11,5:20,1:2వ. దేవుడు నిత్యజీవము | 14:16వ. యేసు "నేనే... జీవమును" |
| 6. 5:13వ. దేవుని నామమందు విశ్వాసముంచువాడు నిత్యజీవము గలవాడు | 5:24వ. నిత్యజీవము కలవాడైయున్నాడు. |

**కాలము:–** శిష్యుడైన యోహాను కాగుచున్న నూనెలో క్రీ.శ. 95లో పడవేయబడెనని సంఘ చరిత్రలో నేర్చుకొనుచున్నాము. కాని ఈ పత్రికలో శ్రమల ప్రస్తావన లేనందున క్రీ.శ. 95 కంటె ముందే బహుశా క్రీ.శ. 90-94లో వ్రాసెనని తలంచగలము.

**స్థలము:–** యోహాను తన జీవితకాలం చివరిలో ఎఫేసు పట్టణమునందు నివసించెను. ఎఫేసు చుట్టు ప్రక్కల ఉన్న సంఘములలో దేవుడైన క్రీస్తును గూర్చి భిన్నమైన బోధలున్నందున దేవుడైన క్రీస్తు గుణములను ఎత్తి చూపుచు ఎఫేసు చుట్టు ప్రక్కల ఉన్న సంఘములను మిగిలిన అన్ని సంఘములను ఉద్దేశించి వ్రాయబడినది కనుక వ్రాయబడిన స్థలము ఎఫేసు అని సర్వసాధారణముగా అంగీకరింతురు. అన్ని సంఘములను ఉద్దేశించినదైనందున సార్వత్రిక పత్రికల భాగములో చేర్చబడినది. 1:4,5లో యోహాను వలె ముందుగా ప్రభువు వద్ద విని ప్రకటించుట, ప్రచురించుట (వ్రాయుట) బోధకులైన వారికి మంచి మాదిరి.

పాపము+ చీకటి+దోషము అను పదములు (27+7+2)=36 పర్యాయములు, లోకము అను పదము 23 పర్యాయములు, జీవము 15 పర్యాయములు, చెప్పుకొనుట 6 పర్యాయములు, పిల్లలు అను పదము 15 పర్యాయములు, ప్రియులు అను పదము 6 పర్యాయములు కలవు. పిల్లలు ప్రియులు అనుటతో ప్రేమ అను పదమునుబట్టి గ్రంథకర్త తండ్రి వలె ప్రేమను కలిగి ప్రవర్తించుట గమనించగలము. నిలిచియుండుట అను పదము 23 పర్యాయములు, ఎరుగుట అను పదము 31 పర్యాయములు, తెలిసికొనుట 12 పర్యాయములు కలదు. కనుక రక్షించబడినవారు ఎరుగవలసిన అనేక విషయములు ఇందు కలవు. 1. మనము తండ్రిని ఎరిగియున్నాము 1:14, 1:13, 1:14వ. 2. దేవుడు నీతిమంతుడని ఎరుగుదుము 2:28వ. 3. మనము దేవుని పిల్లలమని ఎరుగుట 3:1వ. 4. దేవుని మూలముగా పుట్టియున్నామని ఎరుగుదుము 2:29వ. 5. మరణము నుండి జీవములోనికి దాటి యున్నామని ఎరుగుదుము 3:14వ. 6. మనము సత్యసంబంధులమని ఎరుగుదుము 3:19వ. 7. మనము సత్యమును ఎరిగినవారము 2:21వ. 8. మన యెడల దేవునికి ఉన్న ప్రేమను ఎరిగినవారము 4:16వ. 9. దేవుని పిల్లలను ప్రేమించుచున్నామని ఎరుగుదుము 5:2వ. 10. క్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు ఆయనను పోలి ఉందుమని ఎరుగుదుము. 3:2వ. 11. దేవుని ఆత్మను మీరెరుగుదురు 4:3వ. 12. నరహంతకునిలో నిత్యజీవముండదని ఎరుగుదుము. 3:14వ.

**తెలిసికొనుచున్న విషయములు:–**

1. ఆయనను ఎరిగియున్నామని తెలిసికొందుము 2:3వ.
2. మనమాయనయందు ఉన్నామని తెలిసికొనుచున్నాము. 2:6వ.

3. ఆయన మనయందున్నాడని తెలిసికొనుచున్నాము. 4:13వ.

4. ఇది కడవరి గడియ అని తెలిసికొనుచున్నాము. 2:18వ.

5. పాపము తీసివేయుటకు క్రీస్తు ప్రత్యక్షమాయెనని తెలియును 3:5వ.

6. క్రీస్తు మన నిమిత్తము తన ప్రాణము పెట్టుట వలన ప్రేమ ఎట్టిదో తెలిసికొనుచున్నాము. 3:16వ.

7. ఆయన మనయందు నిలిచియున్నాడని అత్మవలన తెలిసికొనుచున్నాము. 3:24వ.

8. సత్యస్వరూపమైన ఆత్మయేదో, భ్రమపరచు ఆత్మ ఏదో తెలిసికొనుచున్నాము 4:6వ.

9. నిత్యజీవము కలవారమని తెలిసికొనుచున్నాము. 5:13వ.

**పత్రిక వ్రాయబడిన ఉద్ధేశ్యము:**

I **చిన్న పిల్లలారా,** 1. ఆయన నామమునుబట్టి మీ పాపములు క్షమింపబడినవి కనుక మీకు వ్రాయుచున్నాను. (2:12వ.)

2. మీరు తండ్రిని యెరిగియున్నారు గనుక మీకు వ్రాయుచున్నాను (2:14వ.)

3. మీరు పాపము చేయకుండుటకై ఈ సంగతులు మీకు వ్రాయుచున్నాను. (2:1వ.)

II **యవ్వనస్తులారా,**

4. మీరు బలవంతులు (2:14వ.)

5. దేవుని వాక్యము మీయందు నిలుచుచున్నది (2:14వ.)

6. మీరు దుష్టుని జయించి యున్నారు కనుక మీకు వ్రాయుచున్నాను. (2:14).

III **తండ్రులారా,**

7. మీరు ఆది నుండి యున్నవానిని ఎరిగియున్నారు గనుక మీకు వ్రాయుచున్నాను. (2:13వ.)

8. ఏ అబద్ధమును సత్యసంబంధమైనది కాదని ఎరిగియున్నందున మీకు వ్రాయుచున్నాను. (2:26వ.)

9. మిమ్మును మోసపరచు వారినిబట్టి ఈ సంగతులు మీకు వ్రాయుచున్నాను. (2:21వ)

10. దేవుని కుమారుని నామమందు విశ్వాసముంచు మీరు నిత్యజీవము కలవారని తెలిసికొనునట్లు మీకు వ్రాయుచున్నాను. (5:13వ.)

11. మన సంతోషము పరిపూర్ణమగుటకై ఈ సంగతులు మీకు వ్రాయుచున్నాను. (1:4).

| దేవుని గుణములు | మనకుండవలసిన గుణములు |
| --- | --- |
| 1వ అధ్యా. దేవుడు వెలుగైయున్నాడు | మనము వెలుగైన దేవుని సహవాసములో నున్నను పావము లేనివారమని చెప్పుకొనకూడదు. (1:8వ.) |
| 2వ అధ్యా. ఆయన మన పాపములకు శాంతికరమైయున్నాడు. | మనము పాపములకు శాంతికరమైన దేవునిలో నిలచియుండవలెను. |
| 3వ. అధ్యా.ఆయన నీతిమంతుడైయున్నాడు. | మనముదేవునిద్వారా పవిత్రపరచుకొనుచు నీతిమంతులమైయుండాలి. |
| 4వ. అధ్యా. దేవుడు ప్రేమయైయున్నాడు | దేవుడు ప్రేమాస్వరూపి కనుక మనము ప్రేమ కలిగియుండాలి |
| 5. అధ్యా. దేవుడు నిత్యజీవమైయున్నాడు | మనము పాపములో పడకుండ నిత్యము ఆత్మీయముగా జీవించుచుండాలి. |

# 1వ అధ్యాయము 4+3+2+1=10వ

## అంశము: దేవుడు వెలుగైయున్నాడు

**1-4వ పీఠిక:-**

1-2వ లో జీవవాక్యమును గూర్చినది అనుటలో జీవవాక్యమైన యేసును గూర్చియు ఈ లోకములో ఆయన ప్రత్యక్షమైన సంగతిని గూర్చియు గ్రంథకర్త తెలియజేయుచున్నాడు. జీవవాక్యం యేసుక్రీస్తు అది నుండి 'వున్నవాడని' ఆయనను గూర్చి వింటిమని ఆయనను గూర్చిన సంగతులు కన్నులారా చూచితినని చెప్పుచున్నాడు. వినుటకు రెండు చెవులు, చూచుటకు రెండు కన్నులు ఉన్నను చెప్పుటకు ఒకే నోరు కలదు. బాగా విని, చూచి కనుగొని చెప్పుచున్నాడు. 1. అయనను గూర్చిన సత్యము నిదానించి కనుగొంటిమని ఆయన యొక్క సంభవములు చేతులారా తాకి చూచితినని చెప్పుచున్నాడు. మనమును బాగుగా విని, చూచి, నేర్చుకొని, బోధించాలి. యేసుక్రీస్తు పరలోకమందున్న తండ్రి యొద్ద నుండి ఈ లోకములో ప్రత్యక్షమాయెనని తెలియపరచుచున్నాడు. యేసుక్రీస్తు శరీరధారిగా వచ్చాడని ఒప్పుకొనని వారు ఉన్నందున యేసుక్రీస్తు దైవత్వమును స్థిరపరచుచు ఈ పత్రిక వ్రాయుచున్నాడు. 3-4వ. మన సహవాసము తండ్రితో కూడాను ఆయన కుమారుడైన యేసుక్రీస్తుతో కూడాను వున్నదని క్రీస్తు ద్వారా మన సంతోషాలు పరిపూర్ణమగునని తెలుపుతున్నాడు.

**5-7వ వెలుగైన దేవునితో సహవాసం గలవారమని చెప్పుకొనుట:-**

దేవుడు వెలుగైయున్నాడు. ఆయన యందు చీకటి అనగా పాపము ఎంత మాత్రము లేదు. యేసు ఈ లోకమునకు వెలుగుగా వచ్చియున్నాడు (యోహాను 12:46వ). ఆయన

యందు విశ్వాసముంచిన వారు ఎంతమాత్రమును చీకటిలో నిలిచియుండరు కనుక ఆయనతో సహవాసము కలవారమని చెప్పుకొనువారు చీకటిలో నడువరాదు. ఆయన వెలుగులో ఉన్న ప్రకారము వెలుగులో నడచిన యెడల అనగా పరిశుద్ధమైన జీవితమును జీవించిన ఎడల సహవాసము కలవారమై యుందుము. (1:6వ) ప్రకారము ఆయనతో సహవాసము కలవారమని చెప్పుకొను వారు చీకటిలో నడిచిన ఎడల అని ఉన్నందున చీకటిలో నడువ గలరు అని నేర్చుకొనుచున్నాము. దేవునితో అన్యోన్య సహవాసము గలవారమైనప్పుడు ఆయన వెలుగులో మన పాపములు కనిపించును. అప్పుడు యేసు రక్తముద్వారా ప్రతి పాపము నుండి మనము పవిత్రులనుగా చేసుకోవాలి.

**8-9వ పాపము లేని వారమని చెప్పుకొనుట:-**

దేవుని వెలుగులో నడుచుచూ అన్యోన్య సహవాసము కలిగి ఉన్నను మనము పాపము లేని వారమని చెప్పుకొనకూడదు. యోహాను 8:7లో మీలో పాపము లేని వాడు అని ఉన్నందున పాపము లేనివాడు లేడు. అలాగు చెప్పుకొనుట అసత్యముగా వుండును లేదా అబద్ధముగా ఉండెను. కీర్తన 38:18వ ప్రకారము కీర్తన 32:5వ ప్రకారము దోషమును కప్పుకొనక ఒప్పుకోవాలి సామె. 28:13వ ప్రకారము అతిక్రమములు దాచిపెట్టువాడు వర్థిల్లడు. వాటిని ఒప్పుకొని విడిచి పెట్టువాడు కనికరము పొందును. కీర్తన 38:18వ ప్రకారం పాపముల గూర్చి విచారపడుచు దోషమును ఒప్పుకోవాలి. అలాగు ఒప్పుకొనిన 1:9లో మన పాపములను క్షమించునని, సమస్త దుర్నీతి నుండి పవిత్రులుగా చేయునని నేర్చుకొనుచున్నాము.

**1:10వ పాపము చేయలేదని చెప్పుకొనుట:-**

పాపము స్వభావము మనలో ఉన్నందున మనము పాపము చేయలేదని చెప్పుకొనకూడదు. యిర్మియా 2:35లో పాపము చేయలేదని నీవు చెప్పిన దాని బట్టి నీతో నాకు వ్యాజ్యము కలిగినదని ఉన్నది. అలాగు చెప్పిన యెడల దేవుని అబద్ధికుని చేసిన వారమగుదుము. కనుక పై వచనములను బట్టి మనము పాపము లేని వారమని, పాపము చేయలేదని చెప్పుకొనక నిత్యము మనలను మనము పరీక్షించుకొనుచూ వెలుగైన దేవునితో కూడా వెలుగులో అనగా పవిత్రతలో నడచుకొనవలెనని నేర్చుకొనుచున్నాము.

2:1-2వ. వెలుగైన దేవుడగు యేసు 2వ వచనములో నీతిమంతుడైన ఉత్తరవాదిగా (అడ్వకేట్, న్యాయవాది)గా మన కొరకు తండ్రి యొద్ద ఉన్నాడు. 2 కొరింథీ 5:21లో యేసు పాపమెరుగనివాడని ఉన్నది. యేసు వెలుగు అని నీతిమంతుడని పాపము ఎరుగనివాడని, 1 పేతురు 2:22 ప్రకారము పాపము చేయలేదని, 1 యోహాను 3:5 ప్రకారము పాపము లేనివాడని తెలుసుకొనుచున్నాము. మనమైతే పాపము కలిగి పాపము చేయుచున్నామని 1:8-10వ వచనములలో చూచితిమి. కీర్తన 31:5 ప్రకారము పాపములో పుట్టిన వారము కనుక పాపమును ఎరుగుదుము. 2 కొరింథీ 5:21 ప్రకారము మనము యేసునందు దేవుని నీతి అగు నిమిత్తము పాపమెరుగని యేసు మన కొరకు పాపముగా

చేయబడెనని చదువుచున్నాము. 1 కొరింథీ 5:11వ వచన ప్రకారము యేసుక్రీస్తు నామమున ఆత్మయందు పాపములనుండి కడుగబడితిమి. పరిశుద్ధపరచబడితిమి. నీతిమంతులముగా తీర్చబడితిమి. యోహాను 1:29వ వచన ప్రకారము యేసు లోక పాపమును మోసికొనిపోయినవాడు.

పై వచనములన్ని కలిపిన తేలిన సత్యమేదనగా పాపమెరుగని యేసు పాపము చేయని యేసు, పాపము లేని యేసు మన పాపములను తనపై మోపుకొని మన నిమిత్తము పాపముగా చేయబడెను. మన శాపము గ్రహించి శాపగ్రాహియై (గలతీ 3:13) పాపశిక్ష సిలువలో భరించి సమాప్తి చేశాడు. తాను కార్చిన పరిశుద్ధ రక్తము ద్వారా మన పాపములు కడుగబడెను. కడుగబడిన యెడల పాపమిక లేదు కనుక పరిశుద్ధపరచబడితిమి. యేసుక్రీస్తు మన న్యాయవాదిగా (అడ్వకేట్) తండ్రితో తాను మన పాపములకు శాంతికరమైన సంగతిని తెలిపి మనలను నీతిమంతులుగా తీర్పు తీర్చినాడు. ఇంత గొప్ప కార్యము క్రీస్తు మన నిమిత్తము చేసినందున మనము ఇక పాపము చేయకూడదని నేర్చుకొనవలెను. ఒకవేళ ఏ పాపమైన జరిగిన యెడల యేసుక్రీస్తువారు సర్వలోకమునకు చేసిన పాప పరిహారము ఇంకను ఉన్నందున 1:9వచన ప్రకారము క్రీస్తు నందు మనము పరిశుద్ధపరచబడుచు నుండవలెను.

## 2వ అధ్యాయము 6+5+6+6+6=29వ

### అంశము: యేసు మన పాపములకు శాంతికరమైయున్నాడు - యేసునందు మనము నిలిచియుండుట

### 1:6వ. ఆయనను ఎరిగియున్నామని చెప్పుకొనుట (3వ) - ఆయనలో నిలిచియున్నామని చెప్పుకొనుట (5వ):-

1,2 వచనములు ముందుగా ధ్యానించితిమి. 3-4వ యేసును రక్షకుడుగా ఎరిగినవారు ఆయన ఆజ్ఞలను గైకొనాలి. మొదటి అధ్యాయములో ఆయన వెలుగులో నడుచుకొనుచున్నామని చెప్పుకొనుచు చీకటిలో నడుచుట అబద్ధమాడుటయని నేర్చుకొంటిమి. 1:8వ, 1:10వలో మనము పాపము లేనివారమని చెప్పుకొనుట, పాపము చేయలేదని చెప్పుకొనుట అబద్ధమాడుటయని నేర్చుకొంటిమి. ఇప్పుడు యేసును ఎరుగుదుమని చెప్పుకొనుచు ఆయన ఆజ్ఞ గైకొనకుండుట అబద్ధమాడుట అని నేర్చుకొనుచున్నాము. మత్తయి 26:75లో యేసును ఎరిగిన పేతురు నేనాయనను ఎరుగనని ఒట్టుపెట్టుకొనెను. తీతు 1:16లో యేసును ఎరుగుదుమని చెప్పు క్రేతీయులు తమ క్రియల వలన ఆయనను ఎరుగము అన్నట్లున్నారు. 5-6 వచనములలో ఆయన యందు నిలిచి ఉన్నామని చెప్పుకొనువాడు ఆయన నడుచుకొనినట్లు నడుచుకొనవలెనని చెప్పబడినది. హెబ్రీ 12:1వలో విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడైన యేసు వైపు చూచుచు ఓపికతో

పరుగెత్తుదము అని వ్రాయబడినది కనుక మనము నడుచుట కూర్చుండుట, పరుండుట, లేచుట అనగా జీవిత విధానమంత ఆయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన ఆజ్ఞలననుసరించుచు ఆయనను పోలియుండవలెనని నేర్చుకొనుచున్నాము.

**7-11వ వెలుగులో ఉన్నామని చెప్పుకొనుట:-**

యేసును రక్షకుడిగా ఎరిగినవారు ఆయన ఆజ్ఞలను గైకొనవలెనని పైభాగములో చూచితిమి. నిన్ను వలె నీ పొరుగువాని ప్రేమించవలెనను ఆజ్ఞను యేసు మత్తయి 22:39వ; మార్కు 12:31లో బోధించెను కనుక సహోదరుని ప్రేమించక ద్వేషించువాడు వెలుగులో నడవక చీకటిలోనే ఉన్నాడు. చీకటి అతని కన్నులకు గ్రుడ్డితనము కలుగజేయును గనుక తానెక్కడకు పోవుచున్నాడో ఎరుగక అపాయములకు గురికాగలడు. కనుక సహోదరులను ప్రేమించక ద్వేషించువాడు ఆత్మీయముగా అపాయకరమైన స్థితిలో ఉన్నాడు.

**12-17వ శత్రువులైన సాతాను శరీరమును లోకమును ప్రేమించకుండుట:-**

12:14వ తండ్రులు, యవ్వనులు, పిల్లల ఆత్మీయ స్థితిని తెలుపుచున్నాడు. పిల్లలు తండ్రియైన దేవుని ఎరిగినవారని, పాపములకు క్షమాపణ పొందిన వారని వారికి జ్ఞాపకము చేయుచున్నాడు. యవ్వనులు దేవుని వాక్యమును ఎరిగిదాని యందు నిలిచినవారని, దుష్టుని జయించియున్నారని వారికి జ్ఞాపకము చేయుచున్నాడు. తండ్రులు, దేవుని ఎరిగినవారని వారికి జ్ఞాపకము చేయుచున్నాడు. దీని సారాంశము దేవుని ఎరిగినవారు దేవుని ప్రేమించుచు అపవాదియైన సాతానును ప్రేమించకూడదని సాతానుపై జయమును పొందవలెనని నేర్చుకొనుచున్నాము. 15-17వచనములలో తండ్రిప్రేమలో కొనసాగువారు, లోకమునైనను, లోకాశలనైనను, అనగా శరీరాశలను నేత్రాశలను జీవపుడంబములను ప్రేమించకూడదని తెలుపుచున్నాడు. లోకము, దాని ఆశలన్నియు గతించి పోవును. ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల దేవుని ప్రేమ వానిలో నుండదు. కనుక యేసుని నమ్మినవారు సాతానును, లోకమును, శరీరమును శత్రువులుగా గుర్తించి ప్రేమించకూడదని నేర్చుకొనుచున్నాము.

**18-23వ క్రీస్తు విరోధులతో కూడని సహవాసము:-**

క్రీస్తు విరోధియని రెండు పర్యాయములు, క్రీస్తు విరోధులు అని ఒక పర్యాయము మొత్తము మూడు పర్యాయములు ఈ పదము కలదు. 18వ వచనములో క్రీస్తు విరోధులు బయలుదేరి ఉన్నారని వ్రాయబడెను. అట్లయిన ఈ క్రీస్తు విరోధులు ఏడేండ్ల శ్రమల మహాశ్రమల కాలమందు బయలుపడు క్రీస్తు విరోధికాదని గుర్తించవలెను. వీరు మనలో నుండి బయలుదేరినవారు కాని 22 వచన ప్రకారము తండ్రియగు దేవుని, కుమారుడగు దేవుని ఒప్పుకొనువారు కారు. క్రైస్తవులలో కొద్దిమంది తండ్రియైన దేవుని ఒప్పుకొందురు గాని కుమారుని దేవుడుగా అంగీకరించరు. 23 వచన ప్రకారము కుమారుని ఒప్పుకొనువాడే

తండ్రిని అంగీకరించువాడు. కనుక కుమారుడైన యేసు దైవత్వమును అంగీకరించనివారును క్రీస్తు విరోధులే. వారిప్పుడును లోకములో ఉన్నారు. క్రీస్తు విరోధులు మనకును విరోధులే కనుక మనకు విరోధులగు 1. సాతాను 2. శరీరము 3. లోకము 4. క్రీస్తు విరోధులను విషయము జాగ్రత్తగానుండాలి.

**24-29వ. కుమారునియందును, తండ్రియందును నిలిచియుండుట:-**

24-27వ కుమారుని దైవత్వమును గూర్చి లోకములో మోసపు మాటలు పలుకువారున్నారు. యోహాను 15:7వ వచనములో నాయందు మీరును, మీయందు నా మాటలు నిలిచియుండవలెనని యేసు సెలవిచ్చారు. యోహాను 14:1లో దేవునియందు విశ్వాసముంచుచున్నారు నాయందును విశ్వాసముంచుడని యేసు చెప్పెను కనుక తండ్రియైన దేవుని యందు మాత్రమే కాక కుమారుడైన దేవునియందు నిలిచియుండవలెను.

28-29వ. యేసు ప్రత్యక్షతను ప్రస్థావించుచు, ఆయన నీతిమంతుడు గనుక ఆయనయందు నిలిచి నీతిమంతులముగా నుండవలెనని చెప్పుట మూడవ అధ్యాయపు అంశముగా చూడగలము.

## 3వ అధ్యాయము 2+8+7=24వ.

**అంశము:- యేసు పవిత్రుడైయున్నాడు (3వ), యేసు నీతిమంతుడైయున్నాడు (7వ)**

**1-9వ. ఆయన పవిత్రుడైనట్లు మనము పవిత్రులముగా నుండుట**
**ఆయన నీతిమంతుడైనట్లు మనము నీతిని జరిగించుట:-**

1-3వ. మనము దేవుని పిల్లలమని ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయనను చూతుమని ఆయనను పోలియుందుమని తెలుసుకొనుచున్నాము. అనగా ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన ఎంతటి మహిమ గలవాడో మనము అంతటి మహిమను కలిగియుందుము. ఆయన పవిత్రుడై యున్నందున మనమును పాపము లేని వారముగా ఉండాలి. నిత్యము మన పాపములకు శాంతికరమైన యేసు ద్వారా పవిత్రపరచుకొనుచూ ఉండాలి. **4-6** వచనములలో పాపము చేయువాడు ఆజ్ఞను అతిక్రమించును. కనుక ఆయనను ఎరిగిన మనము పాపము చేయకుండ ఉండాలి. పాపమును తీసివేయుటకే క్రీస్తు ప్రత్యక్షమైనందున మనమును పాపముతో జోలిలేనివారమైయుండాలి.

7-9వ. అపవాది పాపము చేయువాడని, క్రీస్తు నీతిమంతుడని గుర్తించాలి. కనుక పాపము చేయుచు ఉండువారు (Continuesly sinning) అపవాది సంబంధులు. నీతిని జరిగించువారు క్రీస్తు సంబంధులు. ఎందుకనగా దేవుని మూలముగా పుట్టిన వారిలో దేవుని బీజము నిలుచును గనుక వారు పాపము చేయజాలరు. అనగా పాపము చేయుచు ఉండలేరు.

**10-17వ. క్రీస్తు మనలను ప్రేమించి ప్రాణము పెట్టినట్లు మనమును సహోదరులను ప్రేమించాలి:-**

10-12వ. నీతిమంతుడైన దేవుని పిల్లలు లేదా దేవుని సంబంధులు నీతిని జరిగించి సహోదరులను ప్రేమింతురని ఉన్నది. ఆది 4:8వలో కయీను అపవాది సంబంధియై సహోదరుని ద్వేషించి చంపెను. కనుక సహోదరులను ద్వేషించువారు అపవాది సంబంధులు, సహోదరులను ప్రేమించువారు దేవుని సంబంధులు. 13-15వ. సహోదరులను ప్రేమించు దేవుని సంబంధులు నిత్యజీవము గలవారని, సహోదరులను ద్వేషించువారు నిత్యజీవము లేనివారని వ్రాయబడినది.

16-17వ. యేసు మనలను ప్రేమించి మన నిమిత్తమై తన ప్రాణము పెట్టెను. కనుక మనమును మన సహోదరుల నిమిత్తము ప్రాణము పెట్టబద్ధులమైయున్నాము. కనుక జీవనోపాధి కలిగిన సహోదరులు లేమిలో ఉన్నవారికి ప్రేమనుబట్టి సహాయము చేయవలెను.

**18-24వ. దోషారోపణలను దేవుని యెదుట సమ్మతిపరచుకొని ప్రార్థించుట - దేవునియందు నిలిచియుండుట:-**

మన దేవుడు నీతిమంతుడే కాక సత్యవంతుడు. కనుక సత్యవంతుడైన దేవుని సంబంధులమైన మనము మన హృదయము ఏఏ విషయములలో దోషారోపణ చేయుచున్నదో వాటిని గుర్తించాలి. వాటిని దేవుని ఎదుట ఒప్పుకొని మన హృదయములను ఆయనతో సమ్మతి పరచుకొనాలి. అప్పుడు దేవుని యెదుట ధైర్యము గలవారము గనుక మనమేమి అడిగినను వాటిని ఆయన వలన పొందుదుము. దేవుడు మనకొక ఖాళీగా నున్న చెక్కుపై సంతకము చేసి ఇచ్చినట్లున్నది. ఆ చెక్కుపై ఎంతయైనను వ్రాసి బ్యాంకులో ఇచ్చి సొమ్ము పొందగలము. కనుక మూడవ అధ్యాయములో ఆయనను ప్రేమించుచూ, ఆయన పవిత్రతలోను నీతిలోను సత్యములోను నిలిచియుండి ఆయన ఆజ్ఞలను గైకొనిన ఏమి అడిగినను ఆయన ఇచ్చును.

## 4వ అధ్యాయము 6+5+5+5=21వ

**అంశము:- దేవుడు ప్రేమయైయున్నాడు (4:8వ)**

**1-6వ. దేవుని సంబంధులు - లోకసంబంధులు:-**

ఈ భాగములో తండ్రియైన దేవుడు, యేసుక్రీస్తు, దేవుని ఆత్మ, దేవుని సంబంధులను మనము చూచుచున్నాము. యేసుక్రీస్తు శరీరము ధరించుకొని ఈ లోకమునకు వచ్చిన దేవుడని అంగీకరించువారు దేవుని సంబంధులు. వారు తండ్రియైన దేవుని, కుమారుడైన దేవుని, ఆత్మయైన దేవుని ఎరుగుదురు. వారి మాటలను విందురు.

లోకములో ఉన్నవాడు అని 4వ వచనములో చెప్పబడిన సాతాను, క్రీస్తు విరోధులు దేవుని సంబంధము కాని ఆత్మ వీరందరు లోకములో ఉన్నారు. అలాగే అబద్ధ ప్రవక్తలు కూడా లోకములో ఉండి దేవుని సంబంధులను మోసపరచ ప్రయత్నించుచున్నారు. కాని దేవుని సంబంధులలో యేసుక్రీస్తు ఆత్మ స్వరూపిగా ఉన్నందున దేవుని పిల్లలు లోకములో ఉన్న అపవాదిని జయించిన వారుగా ఉన్నారు. దేవుని ప్రేమ గతకాలములో (7-11వ), ప్రస్తుత కాలములో (12-16వ), రాబోవు కాలములో (17-21వ) మన పట్ల చేయు కార్యములు క్రింద వివరించబడినవి.

## 7-11వ ప్రేమనుబట్టి దేవుడు గతములో చేసిన కార్యములు:-

8-10వ. దేవుడు ప్రేమయైయున్నాడని 8వ వచనములో చూచుచున్నాము. ఈ ప్రేమను దేవుడు మనపట్ల కనపరచెను. దేవుడు మనయందుంచిన ప్రేమను 2000 సం॥ క్రితము ఈ లోకములో ప్రత్యక్షపరచెను. తీతు 2:4వ.లో దేవుని దయ, మానవుల యెడల ఆయనకున్న ప్రేమ ప్రత్యక్షమాయెను, అనగా యేసుగా ప్రత్యక్షమాయెను. పాపములు అపరాధములచేత చనిపోయిన మనము క్రీస్తు ద్వారా జీవించు నిమిత్తమై దేవుడు క్రీస్తు యేసును ఈ లోకములోనికి పంపెను. మన పాపములకు ప్రాయశ్చిత్తముగా నుండుటకు అనగా పాపములను కప్పివేయుటకు దేవుడు క్రీస్తును ఈ లోకమునకు పంపెను. ఇందులో ప్రేమ ఉన్నదని నేర్చుకొనుచున్నాము. 11-12వ. దేవుడు ఇంత గొప్ప ప్రేమతో మనలను ప్రేమించి నందున మనమును ఒకరినొకరు ప్రేమించుకోవాలి.

## 12-16వ. ప్రస్తుత కాలములో దేవుని ప్రేమ చేయు కార్యములు:-

దేవుని మూలముగా మనకు కలిగిన ప్రేమనుబట్టి మనము మన సహోదరులను ప్రేమించి నప్పుడు దేవుని ప్రేమ మనయందు సంపూర్ణమగును. మరియు దేవుడు మనయందు నిలిచియుండును. దేవుడు మనకు తన ఆత్మలో పాలు దయచేసియున్నాడు. దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తును లోకరక్షకుడుగా పంపియున్నాడని మనము తెలిసికొని సాక్ష్యమిచ్చువారముగా నుందుము. దేవుడు ప్రేమయైయున్నాడని మనమెరిగితిమి గనుక ఆయన ప్రేమయందు నిలిచియుండి దేవుని యందు నిలిచియున్నాము.

## 17-21వ. అంత్యకాలములో ప్రేమచేయు కార్యములు:-

అంత్యకాలము అనగా 17వ వచనములో తీర్పు దినమును గూర్చి ప్రస్తావించుచున్నాడు. దేవుడు మనయందుంచిన ప్రేమనుబట్టి మనము తీర్పు లోనికి రాక మరణము లోనుండి జీవములోనికి దాటియున్నామని యోహాను 5:24వచనమునుబట్టి నేర్చుకొనుచున్నాము. ఈ ప్రేమ శాశ్వతమైన ప్రేమ, (యిర్మియా 31:3వ) ఈ ప్రేమ అంతము వరకు ఉండునది. (యోహాను 13:1వ). ఈ ప్రేమ మన కొరకు ప్రాణము పెట్టినది (1 యోహాను 3:16వ). అందుకే దేవుని ప్రేమ ఎంతో గొప్పదని యోహాను

3:16.లో చెప్పబడినది. దేవుడు ఇంత గొప్ప ప్రేమతో మనలను ప్రేమించియుండగా మనమును ఒకరినొకరు ప్రేమించుకొనుచూ విశ్వాసయాత్ర కొనసాగించాలి.

## 5వ అధ్యాయము 5+7+5+4=21వ

అంశము:- దేవుడు నిత్యజీవమైయున్నాడు (20వ)

### 1-4వ దేవునియందు విశ్వాసముంచినవారు లోకములో విజేయులు:-

దేవునియందు విశ్వాసముంచినవారు దేవుని మూలముగా పుట్టియున్నారు. దేవుని మూలముగా పుట్టినవారు ఈ గుణములను కలిగియుందురు.

1. యేసు క్రీస్తయి యున్నాడని నమ్మి రక్షకుడైన యేసు రాబోవు రారాజైన మెస్సియాయని నమ్ముదురు. (1వ.)
2. దేవుని ప్రేమించుదురు (2వ.)
3. ఆయన ఆజ్ఞలు గైకొందురు (2వ)
4. దేవుని పిల్లలను ప్రేమించుదురు (2వ.) (దేవుని ఆజ్ఞలను గైకొనుటయే ఆయనను ప్రేమించుట 3వ.)
5. దేవుని మూలముగా పుట్టినవారు తమ విశ్వాసమునుబట్టి లోకమును జయింతురు (4వ).

### 6-12వ. దేవుని కుమారుని గూర్చి దేవుడిచ్చిన సాక్ష్యము; దేవుడు మన విషయమై మన ఆత్మతో ఇచ్చిన సాక్ష్యము:-

6-9వ దేవుడు తన కుమారుని గూర్చి యేసుక్రీస్తు నీళ్ళతోను, రక్తముతోను వచ్చెనని చెప్పుచున్నాడు. దీని భావము: దేవుడు ఆత్మ (యోహాను 4:24వ) గనుక ఆయనకు రక్తము లేదు. పాప క్షమాపణకు రక్తము అవసరమని హెబ్రీ 9:22వలో ఉన్నది. కనుక రక్తము నీళ్ళు గల శరీరమును అమర్చుకొని ఈ లోకమునకు వచ్చెను. (హెబ్రీ. 2:15వ; 10:5వ.) అందుకే యోహాను 19:34వలో యేసు సిలువపై నున్నప్పుడు సైనికుడు బల్లెముతో పొడవగా నీరు రక్తము కారినది. కనుక యేసుక్రీస్తు శరీరధారిగా ఈ లోకమునకు వచ్చిన దేవుడు అనగా జ్ఞాస్తికులు భావించినట్లు కాక పుట్టుకనుండి మరణము వరకు దేవుడే (ఆ కాలమందు నివసించిన జ్ఞాస్తికులను ఒక తెగవారు మానవుడైన యేసు బాప్తిస్మము పొందినప్పుడు దైవత్వము ఆయనలో ప్రవేశించెనని, గెత్సెమనేలో ప్రార్థించినప్పుడు దైవత్వము వెళ్ళిపోయెనని బోధింతురు. ఇది తప్పు.) ఈయన నీళ్ళలోను రక్తములోను, ఆత్మ ద్వారాను దేవుని వలన సాక్ష్యము పొందెను.

**సాక్ష్యమిచ్చిన నీళ్ళు:-** నీళ్ళలో అనగా నీటిలో యోహాను ద్వారా బాప్తిస్మము పొందినప్పుడు

"ఈయన నా ప్రియకుమారుడు ఈయన యందు నేను ఆనందిచుచున్నానని మత్తయి 3:17 వచనములో చెప్పబడినది.

**సాక్ష్యమిచ్చిన ఆత్మ:-** రూపాంతరపు కొండపై మత్తయి 17:1-5 పరిశుద్ధాత్మ క్రీస్తును గూర్చి పలికిన సాక్ష్యము కలదు.

**సాక్ష్యమిచ్చిన రక్తము:-** ఆయన సిలువలో రక్తము కార్చిన సమయమును జ్ఞాపకము చేసికొనగలము. ఆయన రక్తము కార్చుచుండగా పిలాతు, హేరోదు, రెండవమారు పిలాతు, పిలాతు భార్య, శతాధిపతి, సిలువపైనున్న దొంగ, ఇస్కరియోతు యూదా క్రీస్తు నీతిమంతుడని సాక్ష్యమిచ్చిరి.

### 10-12వ దేవుని మూలముగా పుట్టినవాడు తనలోనే కలిగిన సాక్ష్యము:-

దేవుని మూలముగా పుట్టినవాడు తన ఆత్మలో దేవుడు తనకు నిత్యజీవమును ఇచ్చెనను సాక్ష్యము కలిగియున్నను. దేవుని మూలముగా పుట్టనివాడు జీవమును చూడడు గనుక అట్టివాని హృదయములో ఈ సాక్ష్యము లేదు.

### 13-17వ. విశ్వాసమునుబట్టి మనకు కలిగిన ధైర్యము-మరణకరమైన పాపము:-

13-15వ దేవుని కుమారుని యందు విశ్వాసముంచినవారికి నిత్యజీవమును అనుగ్రహించుట మాత్రమే కాక దేవునిని ఏమి అడిగినను ఆయన మనకనుగ్రహించును. ఇదియే విశ్వాసమునుబట్టి మనకు కలిగిన ధైర్యము. 16-17వ మరణకరమైన పాపము కలదు. దేవుడు మనకిచ్చునది నిత్యజీవము గనుక ఆత్మకు మరణము లేదు. అలాగైతే మరణకరమైన పాపమనగా ఏమి? మత్తయి 12:32లో పరిశుద్ధాత్మకు విరోధముగా మాటలాడు వానికి ఈ యుగమందును రాబోవుయుగమందును పాపక్షమాపణ లేదు. దీని భావము:- పరిశుద్ధాత్మ మన పాపమును గూర్చి, (దేవుని) నీతిని గూర్చి, తీర్పును గూర్చి యోహాను 16:8 ప్రకారము ఒప్పుకొనచేయును. పరిశుద్ధాత్మకు విరోధముగా అనగా ఆయన చెప్పిన మన పాపమును, దేవుని నీతిని ఒప్పుకొనక విరోధముగా మాటలాడుట అని అర్థము. మన పాపములు ఒప్పుకొని నీతిమంతుడైన యేసును క్షమించమని అడిగితే క్షమించును కాని పరిశుద్ధాత్మ ఒప్పించునప్పుడు ఒప్పుకొనక విరోధముగా మాటలాడిన వారికి క్షమాపణ ఎట్లు కలుగును. కనుక అదియే మరణకరమైన పాపము.

**18-21వ. ముగింపు:-** 18-19వ దేవుని మూలముగా పుట్టినవాడు దేవుడు ఎలాంటివాడో పైన చెప్పబడినట్లు ఎరిగియున్నందున, దేవుడు మనకనుగ్రహించిన జ్ఞానము శక్తినిబట్టి పాపము చేయకుండ తనను భద్రపరచుకొనును. కనుక దుష్టుడు వానిని ముట్టలేడు. 20-21వలో ఈయన నిజమైన దేవుడని నిత్యజీవమని చెప్పుచు, పాపమైన విగ్రహముల జోలికి పోకూడదని హెచ్చరించుచు ముగించుచున్నాడు.

# 7. యోహాను రెండవ పత్రిక

గ్రంథకర్త :- యోహాను.    కాలము:- క్రీ.శ.85-95.  స్థలము:- ఎఫేసు.

గ్రంథ అంశము :- సత్యమును ఎరిగి నడుచుట - సత్యమందు నిలిచి కాపాడుట. వచముల విభజన :-3+3+3+2+2=13వ. పదములు=174. అక్షరములు=663.

1-3వ సత్యమును ఎరుగుట [Know the truth]
4-6వ సత్యమును అనుసరించి నడచుట [Walk in truth]
7-9వ (సత్యమైన) బోధయందు నిలుచుట [abide in truth]
10-11వ (సత్యమైన) బోధను కాపాడుట [guard the truth]
12-13వ సత్యము ద్వారా నిరీక్షించుట [hope by the truth]
(సత్యము నేర్పించుట ద్వారా సంతోషము సంపూర్ణమగునన్న నిరీక్షణ)

బైబిల్ గ్రంథములోని 66 గ్రంథములలో ఈ పత్రిక తెలుగు తర్జుమాలో అతి చిన్నది.

ఈ పత్రిక ఏర్పరచబడిన అమ్మగారికి వ్రాయబడినది. ఈ అమ్మగారు ఎవరో స్పష్టముగా తెలియదు. ఈ పత్రిక ఒక సంఘమునకు లేదా కొద్ది మందిని వుద్దేశించి వ్రాయబడి యుండాలి. రోమా చక్రవర్తియైన తీతు యెరూషలేము దేవాలయమును నాశనము చేసి క్రైస్తవులను హింసించాడు. డామిటన్ చక్రవర్తి క్రీ.శ.81-96 వరకు పాలించి క్రైస్తవులను బహుగా హింసించి శ్రమల పాలు చేసాడు. సహోదరులకు, సంఘములకున్న శ్రమలను బట్టి సంఘము పేరు చెప్పబడకుండా అమ్మగారికి అని చెప్పబడినందున ఈ పత్రిక ఒక సంఘమునకు గాని లేదా కొద్దిమందిని వుద్దేశించిగాని వ్రాయబడినదని తలంచాలి. ఈ చిన్నపత్రికలో ప్రేమ, ఆజ్ఞలు, అనుపదములు ఐదుపర్యాయములు. సత్యము, అను పదము నాలుగు పర్యాయాలు, నడచుట, బోధించుట, పిల్లలు అను పదములు మూడు పర్యాయములు కలవు.

**1-3వ సత్యమును ఎరిగియుండుట [Know the truth] :-** సత్యమనగా ఏమి ? 1) యేసు నేనే మార్గము, సత్యము, జీవము.(యోహా14:6). 2) సత్యస్వరూపియగు ఆత్మ (యోహా15:26, 16:13వ) 3) నీ వాక్యమే సత్యము (యోహా17:7వ). 4) సువార్త సత్యము (గల2:14వ). ఈ వాక్యములను బట్టి సత్యమనగా యేసుప్రభువు, పరిశుద్ధాత్మ, వాక్యము. ఆదియందు వాక్యముగా ఉన్నవాడు ఆయనే, ఆ వాక్యమే శరీరధారిగా ఈ లోకమునకు వచ్చి 33ఏండ్లు లోకములో నివసించాడు. పరలోకమునకు ఆరోహణమైన 10రోజులకు పరిశుద్ధాత్మను (యేసు యొక్క ఆత్మను, అపో16:7) ఈ లోకానికి పంపించాడు. ఈ యేసు యొక్క ఆత్మయగు పరిశుద్ధాత్మ మనతో ఎల్లప్పుడు సదాకాలము ఉంటాడు.(యోహా14:17). కనుక సత్యదేవుడైన యేసుక్రీస్తు అనాదికాలము నుండి సదాకాలము మనతోనే వున్నవాడు.

1వ. ఏర్పరచబడిన..13వలో ఏర్పరచబడిన నీ సహోదరి, పిల్లలు... అను మాటలలో దేవుని ఏర్పాటును చూడగలము. 1 పేతురు 1:2వలో తండ్రియైన దేవుడు భవిష్యత్ జ్ఞానమును బట్టి ఆత్మ వలని పరిశుద్ధత పొందినవారై విధేయులగుటకును, యేసుక్రీస్తు రక్తము వలన ప్రోక్షించబడుటకును ఏర్పరచబడిన వారికి.. ఎఫె1:6-8వ.లో తండ్రియైన దేవుడు జగత్తుకు పునాది వేయక ముందే ప్రేమ చేత మనలను తనకు కుమారులుగా ఏర్పాటు చేసికొనెను. దేవుడు పరిశుద్ధుడు. మనము పాపులమై యుండగా తన సొంత కుమారుని ఈ లోకమునకు పంపి మన పాపములను ఆయనపై మోపగా కలువరిలో యేసుకార్చిన రక్తము ద్వారా మన పాపములకు విమోచన కలిగినది. కాలము సంపూర్ణ మైనపుడు పరిశుద్ధాత్మ వలన మనకు జ్ఞాన వివేచన కలుగజేయుట ద్వారా ఆత్మ వలన కడుగబడి పరిశుద్ధతను పొందితిమి. కనుక పాపములు కడుగబడి దేవుని పిల్లలుగా చేయబడినవారే ఏర్పరచబడినవారు. 2వ. సత్యమైన ప్రభువును, వాక్యమును, బోధను ఎరుగుట : 1) సత్యమును ఎరిగిన వారు అని ప్రభువును నమ్మిన వారికి పేరు పెట్టబడినది. మనము యేసును రక్షకుడుగా ఎరుగుదుము, కాని యేసుప్రభువును, పరిశుద్ధాత్మను, ఆయన వాక్యమును గూర్చి ఎంతగా ఎరుగుదుము ? ఎరుగువారు అనుసరించి నడవాలి.

తీతు 1:16వ.లో క్రేతీయులు ఎరుగుదుమని చెప్పుకొందురు గాని తమ క్రియల వలన ఆయనను ఎరుగమన్నట్టున్నారు. కనుక చెప్పువారమే కాక దాని ప్రకారము చేయు వారమై యుండాలి.

యేసు ప్రభువు పునరుత్థాన బలమును ఎరుగుటకై సమస్తమును నష్టపరచు కొంటిని అని పౌలు ఫిలి3:10వలో అన్నాడు. క్రీస్తు పునరుత్థాన బలమునే కాక ఆయన జననమును ఆయన జీవితమును, ఆయన మరణమును, పునరుత్థానమును ఎంత శ్రేష్టమైనవో, ఎంత సాటిలేనివో, ఎంత శక్తిగలవో పూర్తిగా వాక్యములో నుండియే ఎరుగాలి. 1) నీ ధర్మ శాస్త్రము నందు ఆశ్చర్యమైన సంగతులను చూచునట్లు (ఎరుగునట్లు) నా కన్నులు తెరువుము (కీర్త119:18), 2) నీ మాటలమీద నేను ఆశపెట్టుకొని యున్నాను (కీర్త119:147). 3) నీ విచ్చిన వాక్యము నేను ధ్యానించుటకై నా కన్నులు రాత్రిజాములు కాకమునుపే తెరుచు కొందును (కీర్త119:148).

మనలో నిలుచుచు మనతో ఎల్లప్పుడు ఉండు సత్యమును బట్టి ప్రేమించుట - యోహా 14:17లో ఆయన (పరిశుద్ధాత్మ) మీతో కూడా నివసించును, మీలో వుండును. యోహా 14:23లో మేము (తండ్రీ,, కుమారుడు) వాని యొద్దకు వచ్చి నివాసము చేతుము; దీని భావము తండ్రీ, కుమార, పరిశుద్ధాత్ములు మనతోను మనలోను వున్నారు. అలాగే సత్యమైన వాక్యము, సత్యమైన బోధ మనతోను, మనలోను వున్నవా ? యేసు మనలో వుండి మనలను ప్రేమించుచున్నాడు. కనుక ప్రభువు కనపరచిన ప్రేమను మనము కనపరచాలి. ఆయన చూపులు, మాటలు, క్రియలు, సమస్తము ప్రేమ గలవి. పేతురు

ప్రభువును ఎరుగనని బొంకినపుడు ప్రభువు ప్రేమగల చూపు పేతురును మార్చివేసినది. (లూకా 22:61) ఆయన మాటలు దయగలవి. ఆయన దయగల మాటలకు వారు ఆశ్చర్యపడిరి (మత్త 13:54) తానే మనలను ప్రేమించి మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను. ఈ క్రియలో ప్రేమ వున్నది (1యోహా4:10) అన్నిటిలో శ్రేష్టమైన క్రియ మన పాపాలకు ప్రాయశ్చిత్తము చేయుటయే. సత్యములైన ముగ్గురు 1) యేసుప్రభువు, 2) పరిశుద్ధాత్మ, 3) వాక్యము మనలో నిలువాలి, ఎల్లప్పుడు ఉండాలి. సత్యమైన వాక్యము మనలోను, మనతోను ఉన్నపుడు శోధన కొండపై వాక్యముతో ప్రభువు సాతానును జయించినట్లు మనమును జయ జీవితమును కలిగియుందుము.

3వ.సత్య ప్రేమలు మనయందుండుట – దేవుడు ప్రేమయై యున్నాడు (1యోహా 4:8), సత్యము, ప్రేమ రెండును దేవుని గుణములే, దేవుని పేరులే. అవి జంటగా మన యందున్నపుడు తండ్రీ, కుమారుల యొద్ద నుండి కృప, కనికరము, సమాధానము మనకు తోడుగా నుండును.

**4–6వ. సత్యమును అనుసరించి నడచుట [Walk in truth] :–** సత్యమనగా ఏమియో పై భాగములో చూచితిమి. 1) నేనే మార్గము. సత్యము.. అనగా ప్రభువే సత్యము (యోహా 14:7వ) 2) ఆత్మయే సత్యము (యోహా 16:13వ) 3) వాక్యమే సత్యము (యోహా 17:7వ, కీర్త 119: 160వ) 4) సువార్త సత్యము, అనగా వాక్యమందలి సిద్ధాంతాల బోధయు, సత్యము (గల 2:14వ). సత్యమైన ప్రభువును, ఆత్మను, వాక్యమును, సువార్తను అనుసరించి నడచుట: 1)సత్యమైన ప్రభువును అనుసరించి నడచుట; 2) సత్యమైన వాక్యమును అనుసరించి నడచుట : 3) సత్యమైన సువార్తను, బోధను, సిద్ధాంతమును అనుసరించి నడచుట : 4) సత్యమైన ఆత్మను అనుసరించి నడచుట : నడచుకొనుటకు ముందు ఎరిగియుండాలి.

(బి) సత్యమైన ప్రభువును, వాక్యమును, బోధను హృదయములో కలిగి అనుసరించుట: 1) నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యమును ఉంచుకొని యున్నాను. (కీర్త 119:11) 2) నీ ధర్మశాస్త్రమును ప్రేమించు (అనుసరించు) వారికి ఎంతో నెమ్మది కలదు. (కీర్త 119:165) 3) ఆయన శాసనములను అనుసరించువారు మంచి వివేకము కలవారు. (కీర్త 111:10) 4) క్రీస్తు వాక్యము సమృద్ధిగా నివసింపనీయుడి (కొలో 3:16వ). మనలో నున్న పరిశుద్ధాత్మ మన హృదయములో ఇచ్చు సాక్ష్యమును ఎరిగి దాని ప్రకారము నడచుకోవాలి.

4వ. నీ పిల్లలలో కొందరు సత్యమును అనుసరించి నడుచుకొని నందున బహుగా సంతోషించితిని అంటున్నాడు. కుటుంబములలో పిల్లలు సత్యమును అనుసరించుటకు తండ్రులు, తల్లులు కారణముగా నుందురు. అలాగే సంఘాలలో పిల్లల వంటి చిన్నలు

సత్యమును అనుసరించుటకు తండ్రుల వంటి పెద్దలు బాధ్యత వహించాలి. బాధ్యత కలవాడుగా పౌలు, ఫిలేమోను సత్యమును అనుసరించుట వలన నాకు ఆనందము కలిగెను అనియు, కలుగనిమ్ము, అనియు ఫిలేమోను పత్రిక 7,20 వచనములలో అంటున్నాడు. అలాగు మనమును సత్యమును అనుసరించి నడుచుట ద్వారా అందరికి సంతోషమును కలుగచేయాలి. నీ పిల్లలలో కొందరు అనుటలో సత్యమును ఎరిగిన వారందరు సత్యమును అనుసరించుటలేదని, కొందరే అనుసరించు చున్నారని తెలియుచున్నది. ఎరిగినవారు అందరు, అనుసరించువారు కొందరు. ఈ దినాలలో కూడా ప్రభువును ఎరిగిన అందరు కాక కొందరే అనుసరించు చున్నారు. ఇది దుఃఖకరమే. ఈ గ్రంథమును చదువుచున్న నీవు సత్యమును అనుసరించి నడుచుచున్నావో లేదో పరీక్షించుకొనుట మంచిది.

5వ. సత్యమైన దేవుని ఆజ్ఞలను అనుసరించి ప్రవర్తించుట. ఆజ్ఞలు అనగా ధర్మ శాస్త్రమునందలి పది ఆజ్ఞలు కాదు. పది ఆజ్ఞలను క్రీస్తు మన పక్షమున నెరవేర్చి (మత్త 5:17), మీరు ఒకరినొకరు ప్రేమించాలని నూతన నిబంధనలో క్రొత్త ఆజ్ఞ ఇచ్చాడు. ప్రేమించు ప్రతివాడు దేవుని మూలముగా పుట్టినవాడని 1యోహాను 4:7వ.లో చెప్పబడి నది. కనుక విశ్వాసులు ఒకరినొకరు ప్రేమించుకొనుచుండాలి. ప్రేమించువారు ఒకరి నొకరు అనుసరించుదురు. మనము సత్యమును ప్రేమించువారమైతే సత్యమైన ప్రభువును, ఆత్మను, వాక్యమును, అందలి ఆజ్ఞలను అనుసరించి నడచుకొనుచుండాలి. వాక్యమందలి ఆజ్ఞలు అనగా వాక్యమందలి ప్రతివచనము ఆజ్ఞయేనని గుర్తుంచుకొనాలి. సహోదరులు ఒకరినొకరు ప్రేమించుటను గూర్చిన లేఖనభాగములను చూచుదము. 1) మీరు ఒకరినొకరు ప్రేమించుడి (యోహాను 13:34వ). 2) సహోదరులను ప్రేమించుడి (1పేతు 2:17) 3) ఒకని యెడల ఒకరు మిక్కుటమైన ప్రేమ గలవారై యుండుడి (1పేతు 4:8) 4) నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించుము (మత్తయి 22:39), (మార్కు 12:31). 5) మీ శత్రువులను ప్రేమించుడి (లూకా6:27వ) 6) ఒకని నొకడు ప్రేమించుటకు దేవుని చేత నేర్పబడి తిరి. (1థెస్స 4:9) 7) ప్రేమలో వర్ధిల్లాలని (1థెస్స 3:13వ) 8) సహోదర ప్రేమయందు దయను అమర్చుకొనుడి (2పేతు 1:7వ) 9) పరిశుద్ధులందరి మీద మీకున్న ప్రేమ (కొలో1:3వ) 10) ఆత్మయందలి మీ ప్రేమను తెలిపిన వాడు (కోలో 1:8) 11) ప్రేమ దోషములన్నిటిని కప్పును, పగ కలహమును రేపును (సామె 10:12). 12) అక్రమము విస్తరించుట చేత అనేకుల ప్రేమ చల్లారు (మత్త 24:12).

6వ. ప్రేమలో నడుచుకొనవలెనను నదియే ఆజ్ఞ - దేవుడు ప్రేమయై యున్నాడు, ప్రేమలేనివాడు దేవుని ఎరుగడు... మనము ఒకనినొకడు ప్రేమించిన యెడల... దేవుని ప్రేమ మన యందు సంపూర్ణమగును.. దీని వలన మనము ఆయన యందు నిలిచియున్నా మని ఆయన మనయందు నిలిచియున్నాడని ఎరుగుదుము (1యోహా 4:8-13) యేసే ప్రేమయైనందున యేసును ఎరిగి నడచుట సహోదరులను, పొరుగువారిని, శత్రువులను

ప్రేమించాలని ఎరిగి ప్రేమలో నడచుటయే. (2,3వచనాల ప్రకారము ప్రేమ మనయందు వుండాలి).

**7-9వ. సత్యమందు నిలచుట - హత్తుకొనుట [Abide in truth] :-** సత్యమందు నిలుచుటను తెలిసి కొనుటకు ముందుగా సత్యమగు క్రీస్తుకు విరోధులగు వంచకులు ఎవరో ?-- వారి లక్షణములు ఏమిటో ? తెలిసికొనాలి. క్రీస్తు విరోధులు అనుపదములు 1 యోహాను 2:18 (రెండు పర్యాయములు), 2:22, 4:3, 2 యోహాను 2:8వ. లోను మొత్తము ఐదు పర్యాయములు బైబిలులో కలదు. సత్యమైన యేసుక్రీస్తు శరీరధారిగా ఈలోకమునకు వచ్చెనని నమ్మనివారు, తండ్రిని మరియు కుమారుడైన యేసు క్రీస్తును దేవుడుగా అంగీకరించని వారే క్రీస్తు విరోధులు. వారి బోధ ఏమనగా... యేసు జన్మించినపుడు దేవుడు కాదని యొర్దానులో బాప్తీస్మము పొందినపుడో లేదా ఆ తరువాత కాని దైవత్వము క్రీస్తులో ప్రవేశించినదని గెత్సెమనే వనములో ప్రార్థించినపుడు దైవత్వము ఆయనలో నుండి వెళ్లి పోయెనని చెప్పుదురు. కనుక సిలువ వేయబడినది దేవుడు కాదని వారు బోధించుదురు. వారు ఒకప్పుడు మనలో నుండి వెళ్లిపోయిరి. కనుక ఈ దుర్బోధకులు మనలో నుండియే బయలుదేరుదురు. ఈ క్రింది లేఖనములను జాగ్రత్తగా పరిశీలింతము. 1) ఆది యందు వాక్యముండెను, వాక్యము దేవుడై యుండెను. ఆ వాక్యమైన దేవుడు శరీరము ధరించుకొని కృపాసత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను (యోహా 1:1,14). 2) ఆయన సశరీరుడుగా ప్రత్యక్షమయ్యెను (1తిమో 3:16). 3) దేవత్వము యొక్క సర్వ పరిపూర్ణత శరీరముగా క్రీస్తు నందు నివసించు చున్నది (కొలొ 2:9). కనుక యేసు సర్వ పరిపూర్ణమైన దేవుడు. 4) ఆయన శరీరమందు మన పాపములకు శిక్ష విధింపబడెను (రోమా 8:4). 5) మాంసయుక్తమైన దేహమందు మరణము వలన ఇప్పుడు మిమ్ములను సమాధాన పరచెను (కొలొ 1:22). కనుక యేసు ఈ లోకములో ప్రత్యక్షమైనప్పటి నుండి మరణము వరకు దేవుడే. ఆయన సిలువ వేయబడుట ద్వారానే పాపక్షమాపణ పొందితిమి. ఈ సత్యము నుండి తొలగిపోక దుర్బోధను ఖండించాలి, సత్యమందు నిలువాలి. 1) నీ వాక్య భయము నా హృదయమందు నిలుచుచున్నది. (కీర్త 119:161). 2) దేవుని ధర్మశాస్త్రము హృదయములో నున్నది, కనుక వారి అడుగులు జారవు (కీర్త 37:31). 3) మీకు కలిగిన దానిని (నిలిచి యుండుము) పట్టుకొనుము (ప్రక 2:25వ). 4) యౌవనస్థులారా, మీరు బలవంతులు, దేవుని వాక్యము మీ యందు నిలుచుచున్నది. మీరు దుష్టుని జయించి యున్నారు (1 యోహా 2:14వ).

**10-11వ. సత్యమును కాపాడుట [God the truch] :-** సత్యమైన యేసుక్రీస్తు శరీరధారిగా ఈ లోకమునకు వచ్చెనని నమ్మని వారు, తండ్రిని, కుమారుడైన యేసుక్రీస్తును దేవుడుగా అంగీకరించనివారే క్రీస్తువిరోధులు. బోధకులలో సత్యమైన బోధను తెచ్చువారు కలరు. సత్యమైన బోధను తీసుకొనిరాని వారు కూడా కలరు. సత్యమైన బోధను లేని

బోధకుల విషయము జాగ్రత్తగా నుండాలి, అట్టి బోధల వలన నిష్కపటుల మనసులు చెరుపబడ గలవు. కనుక వారిని ఇంటిలో చేర్చుకొనకూడదు. వారికి శుభమని చెప్పకూడదు. అలాగే మనలో ప్రతి ఒక్కరము మనము బోధించుబోధ సత్యమైనదో కాదో పరీక్షించుకొనాలి. పౌలు 2 తిమోతి 1:11వ. సువార్త విషయములో నేను ప్రకటించువాడనుగాను, అపోస్తలుడు గాను, బోధకుడనుగాను, నియమింపబడితిని అన్నట్లు బోధించుటకు ప్రత్యేకముగా నియమింప బడినవారు కలరు. 4:13వ. ప్రకారము సంఘములో పరిశుద్ధులు సంపూర్ణు లగుటకు, క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి చెందుటకు, పరిచర్య ధర్మము జరుగుటకు ఆయన కొందరిని... సువార్తికులనుగాను, కొందరిని కాపరులను గాను, ఉపదేశకులను గాను నియమించెను. ప్రత్యేకముగా నియమించబడిన బోధకులైనను, బోధకులగు ఇతరులైనను ఈలాగున వాక్యసత్యమును ఎరిగి, అనుసరించి నిలిచియుండి సత్యమును కాపాడాలి.

మేము మీ మధ్యను నెరవేర్చిన కార్యములను (కాపాడుకొనుచు) చెడగొట్టు కొనక మీరు పూర్ణ ఫలము పొందునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి (8వ) పూర్ణఫలము – బైబిలులో ఏ ఏ ఫలములు కలవౌ పరిశీలింతుము. పరిశుద్ధత అనుఫలము (రోమా 6:22), ఆత్మ ఫలము (గల 5:22), వెలుగు ఫలము (ఎఫె5:9) నీతిఫలము (ఫిలి1:11) సువార్త ఫలము (కొలో 1:6), సేవా ఫలము (1తిమో6:2), జిహ్వాఫలము (హెబ్రీ13:15) విస్తార ఫలము (ఫిలి4:17), పరిశుద్ధుల కొరకైన చందా అను ఫలమును (రోమా15:26), పొందు విషయములో జాగ్రత్తగా చూచుకొనాలి. జాగ్రత్త అనుటలో విశ్వాసులు ఫలమును పొందక పోవుట, లేదా నిష్ఫలులగుట (మత్త 13:22) అను అపాయము కలదు. క్రొత్త నిబంధనలో 53 జాగ్రత్త అను పదములు కలవు. కనుక సత్యమును ఎరిగి, అనుసరించి, నిలిచి, కాపాడు కొనుటయందు జాగ్రత్తగా నుండాలి.

**12-13వ. ముగింపులో సత్యము ద్వారా సంతోషము సంపూర్ణమగునను నిరీక్షణ [Hope the truth]:–** 12వ. గ్రంథకర్త వ్రాయుటతోనే సంతసించక ముఖాముఖిగా కలిసికొనుటలో సత్యమైన ప్రభువు, పరిశుద్ధాత్మ, వాక్యము, ఆరోగ్యకరమైన బోధను గూర్చిన సంగతులను వివరముగా నేర్పించుట ద్వారా ఏర్పరచబడిన అమ్మగారు, వారి పిల్లల యొక్క సంతోషము (బహుగా 4వ.) పరిపూర్ణమగునను నిరీక్షణ కలిగియున్నాడు.

13వ. కుటుంబ సహవాసము : ఏర్పరచబడిన సహోదరి, నీ పిల్లలు అనుటలో కుటుంబమును జ్ఞాపకము చేసుకొనాలి. క్రొత్త నిబంధనలోని పత్రికలలో పౌలు ఏర్పరచబడిన వారిని సంఘముగాను, యాకోబు దేవుని ప్రజలుగాను, పేతురు దేవుని మందగాను, యూదా దేవుని పరిశుద్ధులుగాను, యోహాను ఒక కుటుంబము గాను చెప్పుదురు. సహోదరులను పిల్లలనుగాను సంఘమును కుటుంబముగాను యోహాను తన పత్రికలలో చూపు వాడు కనుక సంఘమునకే ఈ పత్రిక వ్రాయబడినదని స్థిరపరచు చున్నాము.

# 8. యోహాను మూడవ పత్రిక

గ్రంథకర్త :- యోహాను. కాలము:- క్రీ.శ. 85-95. స్థలము:- ఎఫేసు. గ్రంథ వచముల విభజన :- (8(2+2+2+2)+2+2+2=14వ).

1) 1-8వ (8=2+2+2+2)వ. గాయు;

ఎ) 1-2వ. గాయు - వర్ధిల్లుట (Living - Well in spirit)

బి) 3-4వ. గాయు - నడచుట (Walking _ Walk in truth)

సి) 5-6వ. గాయు - చేయుట (Serving (Ministering) - Witness of charity - Worthy way of sending)

డి) 7-8వ. గాయు - జతగా నుండుట (Working - Work together for truth).

2) 5-8వ. ఆయన నామము నిమిత్తము బయలు దేరిన పనివారు.

3) 9-10వ. దియొత్రెఫే;

4) 11-12వ. దేమేత్రి;

5) 13-14వ (1-13-14వ) యోహాను;

1-8వ. గాయు. (Life + Walk + Witness + Work = 1-2 వ. Living - Well in spirit + 3-4 వ. Walking - Walk in truth + 5-6 వ. serving (Ministering) - Witness of charity, Worthy way of sending + 7-8 వ. Working - Work together for truth

ఉపోద్ఘాతము :- ఈ గ్రంథమందు శిష్యుడైన యోహాను తాను విశ్వాసములోనికి నడిపించిన సంఘములోని నలుగురు వ్యక్తులను గూర్చి ప్రస్తావించుచూ వారికి తన జీవితకాల ముగింపులో ఈ పత్రిక వ్రాయుచున్నాడు. సామాన్యముగా సంఘములలో కొందరు గొప్ప ఆత్మీయుడైన గాయు వంటి వారు, మరి కొందరు మంచి సాక్ష్యమును కలిగిన దేమేత్రి వంటివారు, మరికొందరు చెడ్డసాక్షము కల దియొత్రెఫే వంటివారు, ఆయన నామము నిమిత్తము బయలు దేరిన సువార్త సేవకుల వంటివారు ఉందురు. వారిలో అనేకులను రక్షణలోనికి నడిపించిన యోహాను వంటి మంచి సాక్ష్యము కలిగిన వారు కూడా ఉండుట గమనించగలము. వారందరి గుణగణాలను ఈ గ్రంథమందు ధ్యానించుట మనందరికి సహాయకరము.

కనుక ఈ గ్రంథమందు 1)గాయు, 2) ఆయన నామము నిమిత్తము బయలు దేరినవారు, 3) దియొత్రేఫే, 4) దేమేత్రి, 5) యోహాను అను వారి జీవిత సాక్షములు ధ్యానించుట మంచిదియు మనందరికి అవసరమై యున్నది. 1-8వ.గాయు= 1-2వ. వర్ధిల్లుట, 3-4వ. నడచుట, 5-6వ చేయుట, 7-8వ జతగా నుండుటు. గాయు అను పదమునకు భూనివాసి, ఆనందించువాడు, సంతసించు వాడు అని అర్ధము. భూనివాసి

యైనను పరదేశులమీద (5వ) పరలోకమునకు సంబంధించిన వారి మీద (కొలో 3:1వ) మనసు కలవాడు. పరలోకము మీద ఎందుకు మనసుంచాలి ?

1) మన పౌరస్థితి పరలోక మందున్నది (ఫిలి3:20వ). 2) మనస్వాస్థ్యము పరలోక మందు భద్రపరచబడియున్నది (1పేతు 1:5వ). 3) పరలోకములో ధనము కూర్చుకొనుడి, అక్కడ చిమ్మెట, తుప్పు, దొంగలు లేరు (మత్త 6:20వ). 4) పరలోకములో మీకు ధనము కలుగును (మార్కు 10:21వ). 5) పరలోకములో అక్షయ ధనము సంపాదించుకొనుడి (లూకా 12:33). 6) మన నిరీక్షణ పరలోకమందున్నది (కొలో 1:5వ). 7) మన భవంతులు పరలోకమందున్నవి (యోహా 14:2-3వ). అలాగే భూనివాసులమైన మనము పరలోక ములో మనకున్న పౌరస్థితి, స్వాస్థ్యము, నిరీక్షణ, భవంతులను బట్టి ఆనందించు వారముగా నుండాలి.

**1-8వ.గాయు** (1-2వ. వర్ధిల్లుట, 3-4వ. నడచుట, 5-6వ. చేయుట, 7-8వ. జతగా నుండుట) :1-2వ. ఆత్మలో వర్ధిల్లుట ఆరోగ్యములో, అన్ని విషయాలలో వర్ధిల్లుట(). వర్ధిల్లుట అను పదము బైబిలులో 47 పర్యాయములు కన్పించును. క్రొత్త నిబంధనలో 4 పర్యాయములు కలదు. క్రొత్త నిబంధనలో మొదటిగా యేసు..దేవుని దయ యందును, మనుష్యుల దయయందును వర్ధిల్లు చుండెను, అని లూకా 2:52వలో చెప్పబడినది. రెండవదిగా గాయు విషయములో తప్ప మరెవరి విషయములో వర్ధిల్లిరి అని చెప్పబడలేదు. ప్రేమలో వర్ధిల్లాలని మాత్రమే 1 థెస్స 3:3వ.లో హెచ్చరిక చెప్పబడినది. బైబిలు గ్రంథ మంతటిలో వర్ధిల్లుట, వర్ధిల్లక పోవుటను అను అంశమును గూర్చి ఆలోచింతము.

**ఎ) వర్ధిల్లువారు - ఎవరు వర్ధిల్లుదురు ? :-**

1) యెహోవా యందు నమ్మిక యుంచువారు వర్ధిల్లుదురు (సామె28:25వ).

2) ధర్మశాస్త్రమును ధ్యానించి, బోధించువారు వర్ధిల్లుదురు (యెహో 1:8వ, కీర్త 1:2వ).

3) ఆయన మాట వినిన యెడల.. నీకు మేలు కలుగునట్లు నిన్ను వర్ధిల్లచేయును. (ద్వితీ 30:1-9).

4) నీతిమంతులు వర్ధిల్లుదురు (కీర్త 72:7వ).

5) ఆయన యథార్థవంతులను (యోబు) వర్ధిల్ల చేయును (సామె 2:7వ)

6) యథార్థవంతుల గుడారము వర్ధిల్లును (సామె 14:11వ).

7) నీ నీతికి తగినట్టుగా నీ నివాస స్థలమును. వర్ధిల్ల చేయును (యోబు 8:6)

8) ఉజ్జియా... యెహోవాను ఆశ్రయించినంత కాలము వర్ధిల్లెను (2దిన 26:5).

9) నీతిమంతులు యెహోవా మందిరములో నాటబడి ఆవరణములో వర్ధిల్లుదురు. (కీర్తన 92:13).

10) యెరూషలేమును ప్రేమించువారు వర్ధిల్లుదురు (కీర్త 122:6).

బి) వర్ధిల్లనివారు - ఎవరు వర్ధిల్లరు? :-

1) అతిక్రమును దాచి పెట్టువారు వర్ధిల్లరు, ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరము పొందును. (సామె 28:13వ).

2) నీ దేవుడైన యెహోవా సెలవిచ్చిన మాట వినని యెడల నీ మార్గమును వర్ధిల్ల చేసికొన లేవు (ద్వితీ 28:15-29)

3) యెహోవా ఆజ్ఞను మీరు వారు వర్ధిల్లరు (2దిన 24:20వ).

4) ఐగుప్తును ఆశ్రయించువారు వర్ధిల్లరు (యెహెజ్కేలు 17:15).

5) నీకు విరోధముగా రూపింపబడిన ఏ ఆయుధమును వర్ధిల్లదు (యెష 54:17)

6) భక్తి హీనులు (కొద్ది కాలమే వర్ధిల్లుదురు) శాశ్వతకాలము వర్ధిల్లరు (కీర్త37:35)

7) భక్తిహీనులు ఇల్లు నిర్మూలమగును (వర్ధిల్లదు) (సామె 14:11వ).

8) దుష్టులు తమ మార్గములలో వర్ధిల్లరు (యిర్మియా 12:1)

9) యెకొన్య.. అతని సంతానములో ఎవడును వర్ధిల్లడు (యిర్మి 22:30).

10) యెహోవా యొద్ద విచారణ చేయనివారు వర్ధిల్లరు (యిర్మి 10;21వ).

ఆత్మలో వర్ధిల్లుట ఆత్మీయ జీవితములోని ప్రతి విషయములో యెహోవా యందు నమ్మికయుంచి, యోబువలె (యోబు 1:1,8,2:3,9వ) యథార్థవంతుడు గాను, నీతిమంతుడు గాను జీవించుటను, దేవుని ఆజ్ఞలను అతిక్రమించకపోవుట ఒకవేళ క్రమము తప్పి ఏమైనా చేసిన యెడల అతిక్రమమును దాచిపెట్టక ఒప్పుకొనుటను సూచించును. గాయు ప్రార్థనాపరుడై పైన చెప్పబడిన క్రమమైన జీవితమును అవరచుకొన్నాడు. బైబిలు లోని పాతనిబంధన గ్రంథములో వర్ధిల్లిన ఏడుగురు సహోదరులు కలరు. వారెవరనగా 1) యోసేపు, 2) సమూయేలు, 3) దావీదు, 4) సోలోమోను, 5) జెకర్యా, 6) హిజ్కియా, 7) దానియేలు అనువారు కలరు. వారందరిని గమనింతము. స్త్రీలలో రాహేలు, లేయా, రూతులు కలరు.

1) యెహోవా యోసేపునకు తోడైయుండెను గనుక అతడు వర్ధిల్లెను. ఆది39:2వ, (సంసోను...యెహోవా తనను యెడబాసెనని అతనికి తెలియలేదు. న్యాయా16:20)

2) బాలుడైన సమూయేలు యెహోవా దయ యందును, మనుష్యుల దయయందును వర్ధిల్లుచుండెను. 1సమూ 2:26వ,

3) దావీదు అంతకంతకు వర్ధిల్లెను. యెహోవా అతనికి తోడైయుండెను. సౌలు కుటుంబము నీరసిల్లెను. 2సమూ 3:1,5:10వ. (వున్నట్లే వుండుట, వర్ధిల్లుట లేక నీరసిల్లుట).

4) సొలోమోను యెహోవా సింహాసన మందు రాజుగా కూర్చుండి వర్ధిల్లెను. 1దిన 29:23వ.

5) జెకర్యా.. అతడు యెహోవాను ఆశ్రయించినంతకాలము దేవుడతనిని వర్ధిల్ల చేసెను. 2దిన 26:5వ.

6) హిజ్కియా..ధర్మశాస్త్ర విషయములోను, మందిర సేవ విషయములోను ఆరంభించి హృదయపూర్వకముగా జరిగించి వర్ధిల్లెను. 2దిన 31:21వ.

7) దానియేలు దర్యావేషు ప్రభుత్వ కాలమందును కోరేషు ప్రభుత్వ కాలములోను వర్ధిల్లెను. దాని6:28వ.

8) రూతు ఇశ్రాయేలు వంశమును వర్ధిల్ల చేసిన రాహేలును, లేయాను పోలిన దాయెను (రూతు 4:11వ).

వీరిలో క్రింద కనపరచిన కొందరి జీవిత వివరములను ధ్యానింతము.

1) యెహోవా తోడై యుండిన యోసేపు - యెహోవా యెడబాసిన సంసోను.
2) అంత కంతకు వర్ధిల్లిన దావీదు - నీరసిల్లిన సౌలు.
3) యెహోవాను ఆశ్రయించి వర్ధిల్లిన జెకర్యా.
4) హృదయ పూర్వకముగా సేవ జరిగించి వర్ధిల్లిన హిజ్కియా.
5) దేవునికి బహు ప్రియుడై వర్ధిల్లిన దానియేలు.

## యోసేపు

యోసేపు అను పేరుకు ఫలించెడి కొమ్మ అని అర్ధము. యాకోబు యొక్క 11వ కుమారుడు. షుమారు ఐదు ఏండ్ల వయసు గలవాడుగా నున్నపుడు తల్లి చనిపోయినది. పిన తల్లుల దగ్గర పెరిగాడు. 17 ఏండ్ల వయసులో నున్నపుడు అన్నల క్షేమము నిమిత్తము తండ్రి ఆజ్ఞతో అరణ్యానికి వెళ్లితే అన్నలు ముందుగా గోతిలో పడవేసి, తరువాత ఇష్మాయేలీయులకు బానిసగా అమ్మివేసిరి. ఐగుప్తులో రాజదేహ సంరక్షకుడగు పోతీఫరు ఇష్మాయేలీయుల యొద్ద యోసేపును కొనెను.

యోసేపు ఐగుప్తీయుడగు పోతీఫరు ఇంట నుండగా యెహోవా అతనికి తోడై యుండెనని, యోసేపు వర్ధిల్లెనని ఐగుప్తీయుడగు పోతీఫరు గమనించెను. పోతీఫరు భార్య యోసేపును శోధించినపుడు అతడు తన పవిత్రతను కాపాడుకొన్నాడు. తప్పుచేయని యోసేపును భార్య చెప్పిన అబద్ధపు మాటలు విని పోతీఫరు చెరసాలలో వేయించాడు. చెరలోను యెహోవా అతనికి తోడుగా నుండగా గమనించి పోతీఫరు చెరసాలలో అందరిని యోసేపు వశమునకు అప్పగించాడు. చెర నుండి బయటకు రాగా ఐగుప్తు రాజ్యమంతటికి అధిపతి అయ్యాడు. అన్నలందరిని, ప్రపంచ మంతటిని కరవు కాలమందు కాపాడాడు. తన జీవిత కాలమందు చివరి వరకు నమ్మకస్తుడుగాను, ఏ తప్పయినను చేయని వాడుగాను నుండెను. ఆది 39:2వ.లో యోసేపు వర్ధిల్లెనని చెప్పబడినది.

## 2) సమూయేలు గూర్చిన సమాచారము

ఈయనే దేవుడు అను అర్థముగల పేరుకు తగినట్లు మాదిరి కరమైన జీవితము జీవించినవాడు. ఎల్కానా హన్నాల ప్రథమ కుమారుడు. పాలు మానిన వెంటనే ప్రభువుకు ప్రతిష్టించబడ్డాడు. 1సమూయేలు 1:28 ప్రకారము బాల్యము నుండియే యెహోవాకు మ్రొక్కు (ఆరాధించు) అలవాటు కలవాడు. 1సమూయేలు 2:12,18 ప్రకారము తోటి బాలురైన ఏలీ కుమారులు యెహోవాను ఎరుగని దుర్మార్గులైనను సమూయేలు ఏఫోదు ధరించుకొని యెహోవాకు పరిచర్య చేయువాడు. ఇందునుబట్టి 1సమూయేలు 2:26 ప్రకారము బాలుడుగా వుండగానే ఎదుగుచు యెహోవా దయయందును, మనుష్యుల దయ యందును వర్ధిల్లుచుండెను. 1సమూయేలు 3:3 ప్రకారము దేవుని మందిరములోనే పండుకోనువాడు, దేవుడు పిలిచి మాటలాడి, ఏలీ ఇంటిని గూర్చి తాను చేయబోవు కార్యములను సమూయేలుకు తెలియపరచాడు. 1సమూయేలు 3:19-21 ప్రకారము సమూయేలు పెద్దవాడు కాగా దేవుడు అతనికి తోడైఉన్నందున, అతడు ప్రవక్తగా స్థిరపడె నని ఇశ్రాయేలీయులందరు తెలిసికొనిరి. యెహోవా వాక్కు చేత సమూయేలునకు ప్రత్యక్ష మగు చుండెను. సౌలును, దావీదును రాజుగా అభిషేకించుటలో సమూయేలు పాత్ర కలదు. వృద్ధుడై మరణించు వరకు ఇశ్రాయేలీయుల క్షేమము పట్ల భారము గలిగి యుండెను. సమూయేలే చివరి న్యాయాధిపతి. జీవిత కాలమంతటిలో వర్ధిల్లిన వాడుగా చూచుచున్నాము.

## 3) దావీదును గూర్చిన ధ్యానము

1సమూయేలు 16-30 అధ్యాయములలో దావీదు యొక్క 16-30 సం॥ జీవిత చరిత్ర కలదు. 16వ. అధ్యా.లో దావీదు వయసు 16సం॥, 30వ అధ్యా.లో 30 సంవత్స రములని తలంచిన ప్రతి అధ్యా.లోని సంగతులు ఇంచుమించుగా అదే వయసులో జరిగినట్లు తలంచ వచ్చును. 16అ.లో గొర్రెల కాపరిగా, చూడచక్కని వాడుగా, ఆత్మపూర్ణుడుగా, గాయకుడుగా, వీణ వాయించువాడుగా నుండెను. 17లో ఆత్మబలముతో యుద్ధశూరుడై, గోల్యాతును చంపెను. 18లో సుబుద్ధి గలవాడై ఇశ్రాయేలు స్త్రీలచే పొగడబడి, సహస్రాధిపతిగాను, రాజు అల్లుడుగాను, సేవకులందరి దృష్టిలో ప్రసిద్ధుడుగాను, ఉండెను. 19లో సౌలుచే తరుమబడి 26వ అధ్యా. వరకు అనగా 26సం॥ వయసు వరకు ప్రాణ భీతిలో నుండెను. 23లో కెయీలా కాపురస్థులను రక్షించెను. 24-26లో సౌలు దావీదుకు రెండుసార్లు చిక్కినను చంపక విడిచి పెట్టాడు. 24లో సౌలు వస్త్రపు చెంగు కోసినందుకు మనసులో నొప్పి పడ్డాడు. 25లో సంఘమునకు గుర్తుగానున్న అబీగయీలును వివాహమాడాడు. 30లో శరీరమునకు సాదృశ్యముగా నున్న అమాలేకీయులు దోచుకొనిన సమస్తమును రక్షించాడు. 30సం. వయసులో సుమారు రాజై 50 సం. వయసు వరకు రాజ్యాలను జయించాడు. సాతానుకు సాదృశ్యమైన ఫిలిష్తీయులను, లోకమునకు సూచనమైన

లోతు సంతానమగు మోయాబీయులను, అమ్మోనీయులను, శరీరమునకు సాదృశ్యమైన ఏశావు సంతానమగు ఎదోమీయులను,జయించాడు. విశ్వాసులు సాతానును, లోకమును, శరీరమును జయించ వలెనని దీని సారాంశము. దేవుని మందసము, మందిరముల విషయమై ఆలోచన కలిగి మందిరమునకు స్థలము సిద్ధపరచాడు. 50-70 సం॥ముల వయస్సులో బెత్షెబ విషయములో తప్ప జీవితమంతటిలో దేవునికి హృదయానుసారుడుగా ఉండి పితరుల యొద్దకు చేర్చబడిరి.

## 4) జెకర్యా.. ఉజ్జియా - 2దిన 26అ.

ఉజ్జియా 16సం. వయసులో రాజై 52సం. పాలించి మొత్తము 68సం. జీవించాడు (16+52=68సం.) ఉజ్జియా యెహోవా దృష్టికి యదార్థముగ ప్రవర్తించెను (4వ). యెహోవాను ఆశ్రయించినంత కాలము దేవుడు అతని వర్ధిల్లచేసెను (5వ).

1) ఉజ్జయా అను పేరుకు యెహోవా నా బలము అని అర్థము. ఈ రాజు దేవుడిచ్చిన బలము ద్వారా ఫిలిష్తీయులను (సాతానుకు గురుతు), అరబీయులను (శరీరమునకు గురుతు), అమ్మోనీయులను (లోకమునకు గురుతు) జయించెను. ఆత్మీయులు సాతానును, లోకమును, శరీరమును జయించాలి (6-7వ).

2) బలమును, బలాభివృద్ధిని, అధికముగా బలాభివృద్ధిని పొందెను (8వ).

3) కనుక అతని కీర్తి ఐగుప్తు వరకు వ్యాపించెను (8వ).

4) పట్టణ గుమ్మములు దిట్ట పరచెను (9వ).

5) బావులను త్రవ్వించెను. బావి అనగా నీరు, సంఘం అనగా వాక్యము సమృద్ధిగా దొరకు స్థలమైన సంఘములను స్థాపించుట బావులను త్రవ్వుటకు గురుతు (10వ).

6) సైన్యమును వృద్ధిచేసి యుద్ధమునకు అవసరమైన యంత్రములను చేయించెను (15వ).

7) దేవుని ఆశ్చర్యకరమైన సహాయముతో అతడు స్థిరపడెను (15వ).

8) అతని కీర్తి దూరముగా వ్యాపించెను (15వ).

9) అతడు స్థిరపడి కీర్తి దూరముగా వ్యాపించి నందున అతడు మనసున గర్వించి చెడిపోయెను (16వ). స్థిరపడుట, కీర్తి దూరముగా వ్యాపించుట, మనసున గర్వించి చెడి పోవుట కారణమగును. కనుక జాగ్రత్తగా నుండాలి.

10) ధూపము వేయుటకు మందిరములో ప్రవేశించి.. యెహోవాకు ద్రోహము చేసెను (16వ).

11) యాజకులు హెచ్చరించగా రౌద్రుడై.. కోపగించి.. రోగము తెచ్చుకొనెను (19వ).

12) యెహోవా చేత అతడు మొత్తబడి కుష్ఠరోగి యాయెను (20వ).

13) కుష్ఠ రోగియైనను మనసు మార్చుకొననందున మరణము వరకు ఆలాగే ఉండి మరణించెను. (21వ).

14) రాజుల సమాధుల దగ్గర కాక పితరుల స్మశానభూమిలో పాతిపెట్టబడెను (23వ).

## 5) హిజ్కియా .. 2దిన 29-32అ.

హిజ్కియా 25 సం॥ వయసులో రాజై 29 సం॥ పాలించి మొత్తము 54సం. జీవించెను. యెహోవా దృష్టికి యదార్థముగా ప్రవర్తించెను. మందిర సేవ, ధర్మశాస్త్రము నాచరించి, ధర్మశాస్త్ర ప్రకారము తాను ఆరంభించిన ప్రతి పని హృదయ పూర్వకముగా చేసి వర్ధిల్లెను.

1) హిజ్కియా అను పేరుకు యెహోవా బలము గలవాడు అని అర్థము.

2) హిజ్కియా రాజైన మొదటి నెల మొదటి దినమున మందిరపు తలుపులు తెరచి మందిర మంతటిని బాగుచేసెను (29:17వ).

3) హిజ్కియా యాజకులను, మందిరమును ప్రతిష్ఠించెను (29:5వ).

4) హిజ్కియా మందిరములో సమస్తమును పవిత్ర పరచెను (29:18వ).

5) హిజ్కియా మందిరసేవ క్రమముగా జరిగెను (29:35వ).

6) హిజ్కియా పురికోలుపగా బహుమంది యాజకులు తమ్మును తాము ప్రతిష్ఠించు కొనిరి (30:2,15వ).

7) హిజ్కియా కాలమందు పస్కా జరిగినట్లు సొలొమోను కాలము తరువాత ఎన్నడును జరుగలేదు (30:26వ).

8) హిజ్కియా కాలమందు యాజకులు సమృద్ధిగా భోజనము చేసినను చాలా మిగులుచున్నది (31:10వ).

9) హిజ్కియా రోగి యాయెను (32:24వ).

10) హిజ్కియా మనసులో, హృదయములో గర్వించెను (31:25వ).

11) హిజ్కియా తన్ను తాను తగ్గించుకొనెను (31:26వ).

12) హిజ్కియా తాను పూనుకొనిన ప్రతి ప్రయత్నములోను వర్ధిల్లెను (31:30వ).

13) హిజ్కియా విస్తారమైన సంపాదన కలిగియుండెను (31:29వ).

14) హిజ్కియా మనసులో, హృదయములో గర్వించినను, తన్ను తాను తగ్గించు

కానినందున రాజైన ఉజ్జియా వలె కాక ఆశీర్వాదము పొంది స్మశానభూమిలో పితరుల దగ్గర పైస్థానమందు పాతి పెట్టబడెను (32:33).

## 6) దానియేలు (దాని. 6:28).

1) దానియేలు అను పేరుకు దేవుడు నా న్యాయాధిపతి అని అర్థము. అష్షూరీయుల రాజ్యపాలన కాలములో యెరూషలేములో రాజవంశమునకు చెందిన బాలుడుగా సకల శాస్త్ర ప్రవీణత కలిగి, తత్వశాస్త్రములను నేర్చుకొన్నాడు. బాల్యకాలములోనే బబులోను రాజు బానిసగా పట్టుకొనిపోయి రాజనగరులో నిలువ దగిన బాలుడుగా గుర్తించి కల్దీయుల విద్య నేర్పింప నేర్పాటు చేసెను. అందులో రాజు భుజించు (విగ్రహార్పితమైనది కాబోలు) భోజనము తినవలెనని ఏర్పాటాయెను (1:4-5).

2) రాజు భుజించు భోజనముతో తన్ను అపవిత్ర పరచుకొన కూడదని ఉద్దేశించెను (1:8). ఇది మనందరికి హెచ్చరిక. మన జీవిత ఉద్దేశమేదో ఒకసారి ఆలోచింతము?

3) దానియేలు కల్దీయుల విద్య నభ్యసించుటలో ప్రవీణుడై కల్దీయులందరి కంటే చదువులో పది అంతల శ్రేష్టుడయ్యెను. కలల భావమును చెప్ప సమర్థుడయ్యెను (1:20)

4) రెండవ అధ్యాయములో రాజుకు కల భావమును తెలిపి రాజ్యమంతటిలో అధిపతి, ప్రధాని యయ్యెను (2:48).

5) నాల్గవ అధ్యా.లో నెబుకద్నెజరు రాజుకు చెట్టును గూర్చిన భావము తెలిపి.. ఆ అధ్యా. చివరలో రాజు దేవుని స్తుతించునట్లు చేసెను (4:34-37).

6) నెబుకద్నెజరు రాజు చనిపోయిన తరువాత దానియేలుకు కల్దీయుల రాజ్య పాలనలో స్థానము లేదు. మాదీయుడగు దర్యావేషు రాజు కాగా దానియేలు ముఖ్యుడైన అధిపతియాయెను (6:2).

7) షుమారు తొంబది ఏండ్ల వయసులో రాజు ప్రార్థించకూడదని ఆజ్ఞాపించినను మోకరించి యెరూషలేము తట్టు కిటికీలు తెరచి ప్రార్థించువాడు (6:10).

8) పారసీకుడగు కోరేషు ప్రభుత్వ కాలమందు అధిపతిగా ఉండి వర్ధిల్లెను (10:1).

9) దేవుని దృష్టికి ప్రియుడుగా నుండెనని ముమ్మారు సాక్షము పొందెను (9:23,10:11,18).

10) ఈ దానియేలు దర్యావేషు ప్రభుత్వ కాలమందును, పారసీకుడగు కోరేషు ప్రభుత్వ కాలమందును వర్ధిల్లెను (6:28).

ఆత్మలో వర్ధిల్లు గాయు యొక్క మాదిరిని గమనించి, అనుసరించి ప్రేమలో వర్ధిల్లు. అలాగే మనము 1) యోసేపు 2) సమూయేలు 3) దావీదు 4) జెకర్యా

5) హిజ్కియా 6) దానియేలు లవలె వర్ధిల్లుదుము గాక. నీకు విరోధముగా రూపించబడిన ఏ ఆయుధమును వర్ధిల్లదని యెష 54:17వ. లో చెప్పబడిన మాటను గమనింతము. ఇంత గొప్ప వాగ్దానము మనకున్నది. కనుక ఆత్మలోను, ఆనందములోనే కాక ఆరోగ్యములోను, అన్ని విషయాలలోను వర్ధిల్లునట్లు ప్రభువును వేడుకొందము.

3-4వ. సత్యమును అనుసరించి నడచుట :- సత్యమనగా ఏమి?

1) నేనే మార్గము, సత్యము.. అనగా ప్రభువే సత్యము. (యోహా 14:7వ).

2) ఆత్మయే సత్యము (యోహా 16:13వ).

3) వాక్యమే సత్యము (యోహా 17:7వ, కీర్త 119:160వ).

4) సువార్త సత్యము, అనగా వాక్య బోధ, సిద్ధాంతములు సత్యము (గల 2:14వ).

సత్యమైన ప్రభువును, ఆత్మను, వాక్యమును, సువార్తను అనుసరించినడచుట 1) సత్యమైన ప్రభువును అనుసరించి నడచుట 2) సత్యమైన వాక్యమును అనుసరించి నడచుట 3) సత్యమైన సువార్తను, బోధను, సిద్ధాంతమును అనుసరించి నడచుట 4) సత్యమైన ఆత్మను అనుసరించి నడచుట

**(ఎ) సత్యమైన ప్రభువు, వాక్యమును, బోధను ఎరుగుట :-**

1) నీ ధర్మశాస్త్రము నందు ఆశ్చర్యమైన సంగతులను చూచునట్లు నా కన్నులు తెరువుము. కీర్త 119:18.

2) ఆయన శాసనముల ననుసరించువారు మంచి వివేకము కలవారు. కీర్త 111:10.

3) నీ మాటల మీద నేను ఆశపెట్టుకొని యున్నాను. కీర్త 119:147,

4) నీ విచ్చిన వాక్యము నేను ధ్యానించుటకై నా కన్నులు రాత్రి జాములు కాకమునుపే తెరుచుకొందును. కీర్త 119:148.

**(బి) సత్యమైన ప్రభువును, వాక్యమును, బోధను హృదయములో నిలుపుకొనుట :-**

1) నేను పాపము చేయకుందునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొని యున్నాను. కీర్త 119:11,

2) నీ వాక్య భయము నా హృదయమందు నిలుచుచున్నది. కీర్త119:161,

3) నీ ధర్మశాస్త్రమును ప్రేమించువారికి ఎంతో నెమ్మది కలదు. కీర్త 119:165,

4) దేవుని ధర్మశాస్త్రము వారి హృదయములో నున్నది, కనుక వారి అడుగులు జారవు. కీర్త 37:31.

5) యౌవ్వనస్థులారా, మీరు బలవంతులు, దేవుని వాక్యము మీయందు నిలుచు చున్నది. మీరు దుష్టుని జయించియున్నారు (1యోహా 2:14వ).

6) క్రీస్తు వాక్యము సమృద్ధిగా నివసింపనీయుడి (కొలో 3:16వ).

మనలోనున్న పరిశుద్ధాత్మ మన హృదయములో ఇచ్చు సాక్ష్యమును ఎరిగి దాని ప్రకారము జీవించాలి.

**7-8వ. సత్యము కొరకై పనిచేయుట, పోరాడుట :-**

సత్యమైన ప్రభువు, ఆత్మ, వాక్యము, సువార్త పక్షమున పోరాడు వారముగా నుండాలి.

1) ఏ విషయములోను ఎదురించువారికి బెదరక సువార్త (వాక్యము), విశ్వాస పక్షమున పోరాడుచు ఏకమనసు కలవారై యుండాలి. ఫిలి. 1:28.

2) ప్రియులారా, మీరు పరదేశులును యాత్రికులునైయున్నారు గనుక ఆత్మకు విరోధముగా పోరాడు శరీరాశలను విసర్జించి.. (1పేతు 2:11). గనుక ఆత్మకు విరోధముగా పోరాడక ఆత్మానుసారముగా పోరాడుదము గాక.

3) ఆయన పక్షమున శ్రమపడుట (పోరాడుట) ఆయన పక్షమున అనుగ్రహించబడినది. ఫిలి. 1:30.

## సాక్ష్యము

1) ప్రవర్తనా సాక్ష్యము (3) :- బైబిలులో ప్రవర్తన అను పదము 116 పర్యాయములు క్రొత్త నిబంధనలో 20 పర్యాయములు, పేతురు పత్రికలలో 10 పర్యాయములు కలదు.

**ఎ) పూర్తి బైబిలు నందలి కొన్ని ప్రవర్తనను గూర్చిన పదములు :**

1) యదార్థమైన ప్రవర్తన (యోబు 4:6, కీర్త 15:2)

2) న్యాయ ప్రవర్తన (యోబు 29:14, ఆది 30:33)

3) నీతి ప్రవర్తన (1కొరి. 15:34)

4) ప్రీతికరమైన ప్రవర్తన (సామె 16:7)

5) యోగ్యమైన ప్రవర్తన (1కొరి 7:35, యాకోబు 3:13).

6) భయభక్తులు గల ప్రవర్తన (తీతు 2:3).

7) మూర్ఖ ప్రవర్తన (సామె 28:18).

8) దుష్ ప్రవర్తన (యెహెజ్కేలు 36:31).

9) మూర్ఖుల ప్రవర్తన (సామె2:14).

10) అపవిత్ర ప్రవర్తన (యూదా 1:23).

**బి) పేతురు పత్రికలలోని ప్రవర్తనను గూర్చిన పదములు :**

1) సమస్త ప్రవర్తలో పరిశుద్ధత (1పేతు 1:16వ)

2) వ్యర్థ ప్రవర్తన (1పేతు 1:18వ)

3) మంచి ప్రవర్తన (1పేతు 2:12వ) 4) యుక్త ప్రవర్తన (1పేతు 2:15వ)

5) పవిత్ర ప్రవర్తన (1పేతు 3:2వ)　　6) సత్ప్రవర్తన (1పేతు 3:17వ)

7) అజ్ఞాన దశలో నుండి ప్రవర్తన (1పేతు 1:16వ).

8) పరిశుద్ధ ప్రవర్తన (2పేతు 3:12వ).

సి) కొద్దిమంది ఇతరుల ప్రవర్తన :

1) నీ ప్రవర్తన వంటి ప్రవర్తన లేని కుమారులు 1సమూ 8:5,

2) మునుపటి సత్‌ప్రవర్తన కంటే ఎక్కువైన వెనుకటి సత్‌ప్రవర్తన రూతు 3:10,

3) నీ కుమారులు తమ ప్రవర్తన విషయములో జాగ్రత్తగా నుండు... 1రాజు 2:4,

4) నీ కుమారులు సత్‌ప్రవర్తన గలవారై నీవు నడిచినట్లు నడిచిన యెడల... 1రాజు 8:25,

5) యోషియా... దావీదు చూపిన ప్రవర్తనకు సరిగా ప్రవర్తించెను 2రాజు 22:2, 2దిన 34:2.

6) జీవముగల దేవుని సంఘములో జనుల ప్రవర్తన (1తిమో 3:15).. 1) వ్యక్తిగత ప్రవర్తన. 2) కుటుంబముగా ప్రవర్తన 3) సంఘముగా ప్రవర్తన. 4) సమాజములో ప్రవర్తన 5) రక్షింపబడక ముందు అజ్ఞాన దశలో ప్రవర్తన. 6) సమస్త ప్రవర్తన.

పై వచనముల ఆధారముగా ప్రవర్తనా సాక్షమును గూర్చి ధ్యానించండి.

**2) నీ ప్రేమను గూర్చి సంఘము యెదుట సాక్షమిచ్చిరి (1:6):–** సహోదరులు ఒకరి నొకరు ప్రేమించుటను గూర్చిన లేఖన భాగములను చూచుదము.

1) మీరు ఒకరి నొకరు ప్రేమించుడి (యోహాను 13:34వ).

2) సహోదరులను ప్రేమించుడి (1పేతు 2:17).

3) ఒకని యెడల ఒకరు మిక్కుటమైన ప్రేమగలవారై యుండుడి (1 పేతు 4:8).

4) నిన్ను వలె నీ పొరుగువారిని ప్రేమించుము (మత్త 22:39, మార్కు 12:31).

5) సహోదర ప్రేమయందు దయను అమర్చుడి (2 పేతు 1:7వ).

6) ఒకని నొకడు ప్రేమించుటకు దేవుని చేత ఏర్పరచబడితిరి (1థెస్స 4:9)

7) ప్రేమలో వర్ధిల్లాలని (1థెస్స 3:13వ).

8) మీ శత్రువులను ప్రేమించుడి (లూకా 6:27వ)

9) పరిశుద్ధులందరి మీద మీకున్న ప్రేమ (కొలొ 1:3వ).

10) ఆత్మ యందలి మీ ప్రేమను తెలిపిన వాడు (కొలొ 1:8).

11) అక్రమము విస్తరించుట చేత అనేకుల ప్రేమ చల్లారు (మత్త 24:12)

**3) పెద్దల ద్వారా సాక్షము పొందిన వారమై యుండాలి (12) :**

**4) ప్రభువు మన విషయమై ఇచ్చు సాక్ష్యము (11):**

**5) పరిశుద్ధాత్మ ఇచ్చు సాక్ష్యము (11) :-** యోహా 15:26వ లో యేసును గూర్చి సాక్ష్యమిచ్చాడు. బంధకములు, శ్రమలు ప్రతిచోట కలవని పరిశుద్ధాత్మ సాక్ష్యమిచ్చు చున్నాడు. (అపొ. 20:23).

**6) పరిశుద్ధ లేఖనముల ద్వారా మన క్రియలు ఏలాగున్నవో తెలిసికొనాలి(సాక్ష్యము11) 7) మనస్సాక్షి :-** తలంపులు ఒకదాని మీద ఒకటి తప్పు మోపుచుండా, తప్పులేదని చెప్పుచుండ.. మనస్సాక్షి (రోమా 2:15వ).

**5-8వ., అయన నామము నిమిత్తము బయలుదేరిన పనివారు, గాయు- సహోదరులు, సంఘము, దేవునికి తగినట్టుగా చేయుట :** ఆయన నామము నిమిత్తము సువార్త ప్రకటకు, సంఘములలో బోధ చేయుటకు బయలుదేరిన వీరు 1) సహోదరులై యుండాలి (5వ), 2) విశ్వాసులై యుండాలి (5వ) (ఈ దినాలలో సేవకు బయలుదేరు వారు సహోదరులు, విశ్వాసులై యుండాలి).

3) పరదేశులుగా అనగా పరలోక సంబంధమన మనసు కలిగి జీవించువారై యుండాలి (5వ).

4) అటువంటి వారే ఆయన నామము నిమిత్తము సేవకు ఆహ్వానించబడి బయలు దేరాలి (6వ).

5) ప్రభువు పనిలో ముందుగా సువార్త ప్రకటనకై సాగి వెల్లువారుగా నుండాలి (6వ).

6) సంఘముల ద్వారా పిలువబడి సంఘము యెదుట వాక్యమును ప్రకటించి సాక్ష్యమిచ్చువారుగా నుండాలి (7వ).

7) అన్యజనుల వలన ఏమియు తీసికొనకూడదు (7వ).

8) వీరు దేవునికి తగినట్టుగా, యుక్తముగా సాగనంపబడవలసినవారు (8వ).

9) ఇటువంటి వారికి ఉపకారము చేయుట సత్యమునకు జతపనివారమగుటయే (8వ).

సువార్త సేవ కొరకు ప్రత్యేకించబడిన వారికి నిర్ణీతమైన జీతములుండవు. స్థానిక సంఘములే వారికి తగినంత సహాయము ఆర్థికముగాను, అన్ని రీతులుగాను చేయాలి.

**తగినట్టుగా వారిని సాగనంపిన యెడల నీకు యుక్తముగా ఉండును' (7వ) :-** ఆయన నామము నిమిత్తము బయలు దేరిన సహోదరులను తగినట్టుగా, యుక్తముగా, సరిగా సాగనంపుట, సువార్త కొరకు ప్రత్యేకింపబడిన వారి జీవనమును గూర్చిన నియమ మేమి? తగినట్టుగా, యుక్తముగా అనగా ఏమి? 1 కొరి 9:7-14 చదువుదము. ఎవడైనను..

1) తన స్వంత ఖర్చు పెట్టుకొని దండులో కొలువు చేయునా ?

2) ద్రాక్షతోట వేసి దాని ఫలము తినని వాడెవడు ? మందును కాచి

3) మంద పాలు త్రాగని వాడెవడు ? ఈ మాటలు లోకాచారమును బట్టి చెప్పు చున్నానా ? ధర్మశాస్త్రము కూడ వీటిని చెప్పుచున్నది గదా ? కళ్లము త్రొక్కుచున్న

4) యెద్దు మూతికి చిక్కము పెట్టవద్దు అని మోషే ధర్మశాస్త్రములో వ్రాయబడి యున్నది. దేవుడు ఎడ్ల కొరకు విచారించుచున్నాడా ? కేవలము మనకొరకు దీని చెప్పు చున్నాడా ? అవును, మనకొరకే గదా యీ మాట వ్రాయబడెను. ఏలయనగా దున్నువాడు పాలు పొందుదునను ఆశతో దున్నవలెను, కళ్ళము త్రొక్కించువాడు పంటలో పాలు పొందుదునను ఆశతో త్రొక్కింపవలెను. మీ కొరకు ఆత్మ సంబంధమైనవి మేము విత్తి యుండగా మీ వలన 5) శరీర సంబంధమైన ఫలములు కోసి కొనుట గొప్ప కార్యమా ? ఇతరులకు మీ పైని యీ అధికారములో పాలు కలిగిన యెడల మాకు ఎక్కువ కలదుగదా ? అయితే మేము ఈ అధికారమును వినియోగించుకొనలేదు; క్రీస్తు సువార్తకు ఏ అభ్యంతరమైనను కలుగజేయకుండుటకై అన్నిటిని సహించుచున్నాము.

6) ఆలయ కృత్యములు జరిగించువారు ఆలయము వలన జీవనము చేయుచున్నా రనియు,

7) బలిపీఠమునొద్ద కనిపెట్టుకొని యుండువారు బలిపీఠముతో పాలివారై యున్నారనియు మీరెరుగరా ?

8) అలాగే సువార్త ప్రచురించువారు సువార్త వలన జీవింపవలెనని ప్రభువు నియమించి యున్నాడు

9) సంఖ్యా. 18:21వ "ఇదిగో లేవీయులు చేయు సేవకు, అనగా ప్రత్యక్షపు గుడారము యొక్క సేవకు ఇశ్రాయేలీయుల యొక్క దశమ భాగములన్నిటిని వారికి స్వాస్థ్యముగా ఇచ్చితిని."

పై వచనములను బట్టి సువార్త ప్రకటించు వారి జీవనము అనగా తినుట, త్రాగుట ద్రాక్షా తోట, మంద, దండు ద్వారా అనగా ఆలయము ద్వారా జరుగాలి. దీని భావము సువార్త సేవకు ప్రత్యేకించబడిన వారి జీవనము సంఘము యొక్క రాబడి నుండియే జరగాలి. "దశమ భాగములన్నిటిని వారికి స్వాస్థ్యముగా ఇచ్చితిని". దశమభాగములన్ని సువార్త సేవకులకే. కనుక దశమ భాగములను మరి దేనికి వినియోగించరాదు.

**9-10వ. దియొత్రెఫే :-**

1) ప్రధాని కాని వాడు 2) కాకపోయినను ప్రధానత్వము కోరువాడు 3) సువార్త సేవకులను అంగీకరించనివాడు 4) సేవకులైన యోహాను వంటి వారిని చెడ్డమాటలు

వదరువాడు 5) సహోదరులను చేర్చుకొనని వాడు 6) సహోదరులను చేర్చుకొన మనసు కలిగిన వారిని ఆటంకపరచువాడు 7) అలాటి వారిని వెలివేయువాడు.

**11-12వ. దేమేత్రి :-**

1) అందరి వలన మంచి సాక్షము పొందినవాడు 2) సత్యము వలన మంచి సాక్షము పొందినవాడు. సత్యమైన ప్రభువు వలనను, ఆత్మవలనను, వాక్యము వలనను, సువార్త వలనను మంచి సాక్షము పొందినవాడు 3) యోహాను వంటి సేవకుల వలన మంచి సాక్షము పొందినవాడు 4) సత్యమైన సాక్షము పొందినవాడు 5) దేమిటర్ అను దేవత పేరు కలిగినవాడు కాబట్టి అన్యులలో నుండి రక్షింపబడినట్లు తలంచగలము. మంచి సాక్షము కలిగియుండుటను గూర్చి గాయు జీవితములో ముందుగా వివరముగా చూచితిమి.

**1-13-14వ. యోహాను :-**

1) పెద్ద, ప్రేమించు వాడైన యోహాను (1వ), 'నేను నా గొర్రెలను ప్రేమించు చున్నాను'. కాపరియైన ప్రభువు వలె పెద్దలు ప్రేమించువారుగా నుండాలి. 2) ప్రార్థించు వాడైన యోహాను (2వ) :- ఆత్మ విషయములలో వర్ధిల్లువారు శరీర విషయాలలోను, అన్ని విషయాలలోను వర్ధిల్లాలని ప్రార్థించు యోహాను. ఒకవేళ శరీరము సహకరించని యెడల ఆత్మీయముగా ముందుకు సాగలేము శరీరములో పొలువలె ముళ్ళు వున్నాను అవసరమైన దేవుని కృప కొరకు మనము ప్రార్థించాలి (2కొరి 12:7వ). యోహాను వలె మనము అందరి ఆత్మీయ, శరీర అవసరముల కొరకై ప్రార్థించు వారముగా నుండాలి. 3) సంతోషించుచున్న యోహాను (3వ) :- సహోదరుల సత్య ప్రవర్తనను గూర్చి విని బహుగా సంతోషించువాడు(Greater joy). కొద్దిమంది మిక్కిలి సంతోషము రథములు రౌతులు యందున్నది. మన సంతోషము దేని యందున్నది ? 4) ఆత్మల సంపాదికుడైన యోహాను (4వ) :- నా పిల్లలు అనుటలో యోహాను ఆత్మల సంపాదకుడని తెలియుచున్నది. జెబదయి కుమారుడగు యోహాను మనుష్యులను పట్టు జాలరుడుగా వుండుటకు ప్రభుచే పిలువ బడ్డాడు. ఈ పత్రిక క్రీ.శ.95వ సం.లో వ్రాయబడినది. యోహాను బహు వృద్ధుడు. బహుశా వృద్ధాప్యములోనే గాయును కన్నాడు. అలాగే మనము మన కాలంతము వరకు ఆత్మల సంపాదకులముగా నుండాలి. 5) అభినందించుచున్న యోహాను :- ఆయన నామము నిమిత్తము బయలుదేరిన వారికి గాయు చేసిన దానిని విశ్వాసికి తగినట్టు చేసెనని అభినందించుచున్నాడు (5వ). 6) పనివారిని మెచ్చుకొనిన యోహాను :- గాయు ప్రేమగలవాడని చెప్పబడిన మాటను జ్ఞాపకము చేయుచు మెచ్చుకొనుచున్నాడు (6వ). 7) ఆయన నామము నిమిత్తము బయలుదేరిన వారిని గూర్చిన భారము కలిగి గాయుకు జ్ఞాపకము చేసిన యోహాను (7వ). 8) సత్యమునకు జతపనివారముగా ఉండాలని హెచ్చరిక చేసిన యోహాను (8వ). 9) సంఘ క్షేమమును కోరిన యోహాను (9వ) 10) తప్పు దిద్దు మనసు గల యోహాను (10వ) 11) మంచి కార్యములు, చెడు కార్యములను గూర్చి

హెచ్చరించువాడైన యోహాను (11వ), 12) దేమేత్రి గూర్చి మంచి సాక్షమిచ్చుచున్న యోహాను (12వ), 13) దేవుని యందు నిరీక్షణ గల యోహాను (13వ) 14) ముఖాముఖిగా మాటలాడగోరిన యోహాను (14వ). యోహాను పత్రికలలో కొన్ని దైవత్వ అంశములను నేర్చుకొనగలము.

యోహాను వ్రాసిన మూడు పత్రికలలో గల 1) తత్వ శాస్త్రము 2) క్రీస్తు శాస్త్రము 3) పరిశుద్ధాత్మ శాస్త్రము 4) పాప శాస్త్రము 5) రక్షణ శాస్త్రము 6) ప్రవచన శాస్త్రము మొదలగు వాటిని గూర్చి నేర్చుకొందము.

**1) తత్వ శాస్త్రము :-** దేవుని రెండు ప్రాముఖ్యమైన గుణములను గూర్చి చెప్పు చున్నాడు. మొదటిది దేవుడు వెలుగైయున్నాడు (1యోహా 1:5), రెండవది దేవుడు ప్రేమయై యున్నాడు (1యోహా 4:8). ఈ రెండును దేవుని సాటిలేని గుణములు. ఈ రెండు గుణములు లోకములోనైనను, ఏ మనుష్యునిలోను సంపూర్ణముగ నుండవు. వెలుగులో నడచుట దేవుని అడుగుజాడలలో నడచుట. ప్రేమను అలవరచుకొనుట దేవుని గుణము లను కనుపరచుటయే.

**2) క్రీస్తు శాస్త్రము :-** క్రీస్తు దేవుని కుమారుడుగా పరిచయము చేయబడినను, ఆది యందు జీవవాక్యమైన దేవుడు శరీరధారిగా ఈ లోకమునకు వచ్చిన యేసుక్రీస్తుగా. ఈ లోకములో ప్రత్యక్షమైన దేవుని జీవముగా ఈ పత్రికలలో చూడగలము (1యోహా 1:1-5). మొదటి పత్రికలో 21 పర్యాయములు + రెండవ పత్రికలో 2 పర్యాయములు మొత్తముగా 23 పర్యాయములు కుమారుడు అను పదము ఈ గ్రంథములందు కన్పించును. కుమారుడు తండ్రియొద్ద నున్నవాడుగాను, నిత్యజీవమైన దేవుడుగాను, నిజమైన దేవుడు గాను చెప్పబడ్డాడు (1యోహా 5:20). ఆయన యందు పాపము ఏమియు లేదని 1 యోహాను 3:5వ.లో దైవత్వపు గురుతుగా చెప్పబడినది. సర్వలోక పాపములకు శాంతి కరమైన దేవుడుగాను (1యోహాను 2:2), పాపమును తీసి వేయువాడుగాను (1 యోహాను 3:5), అపవాది క్రియలను లయపరచువాడుగాను (1యోహాను 3:8), చూచు చున్నాము. తాను పాపములేని వాడైనను పాపులైన మానవులను ప్రేమించి వారి కొరకై ప్రాణము పెట్టుటయే దేవుని ప్రేమ అని దేవుని ప్రేమను కనపరచాడు. క్రీస్తు శరీరధారియైనను పాపములేని పవిత్రుడై నందున దైవత్వము, పరిపూర్ణ మానవత్వము ఆయన యందు పెనవేసికొనినట్లు చూడగలము.

**3) పరిశుద్ధాత్మ శాస్త్రము :-** 1యోహా 2:27, 5:7-8 ప్రకారము పరిశుద్ధాత్మ క్రీస్తును గూర్చి సాక్షమిచ్చు చున్నాడు. 1 యోహా 3:24 ప్రకారము విశ్వాసి పరిశుద్ధాత్మ అభిషేకము పొందినవాడు కనుక విశ్వాసి తనలో నున్న పరిశుద్ధాత్మను బట్టి లోకమును జయించినవాడు. పరిశుద్ధాత్మ సత్యము గనుక అబద్ధపు ఆత్మ ఏదో, సత్యమైన ఆత్మయేదో విశ్వాసి గుర్తించగలుగుచున్నాడు.

**4) పాప శాస్త్రము :-** 1 యోహా 3:8 ప్రకారము అపవాది మొదట నుండి పాపము చేయుచున్నాడు గనుక పాపము చేయువాడు అపవాది సంబంధి. పాపానికి మూలము అపవాదియే. అపవాది వశమునకు మానవుడు తనను తాను అప్పగించుకొనిన దాని ఫలితమే పాపము మానవుని యందు నివాసము చేయుచున్నది. పాపమును చీకటితోను (1యోహా 1:5), ఆజ్ఞాతిక్రమముతోను (1యోహా 3:4), తిరుగుబాటుతోను (1యోహా 3:5), అవినీతితోను (1యోహాను 3:8) పోల్చి చెప్పుచున్నాడు. పాపము సార్వత్రికముగానున్నది. కనుక ప్రతి మానవుడు పాపి యని 1 యోహా 1:8-10లో చెప్పుచున్నాడు.

**5) రక్షణ శాస్త్రము :-** ప్రభువు జరిగించిన విమోచనా కార్యమును బట్టి మనకు రక్షణ కలిగినది. ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు; మన పాపములకు మాత్రమే కాదు సర్వ లోకమునకును శాంతికరమై యున్నాడు (1యోహా 2:2వ). ఆయన మన నిమిత్తము తన ప్రాణము పెట్టెను గనుక దీని వలన ప్రేమ యెట్టిదని తెలిసి కొను చున్నాము. మనము కూడ సహోదరుల నిమిత్తము మన ప్రాణములను పెట్టబద్ధులమై యున్నాము (1యోహా 3:16వ). మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి మన పాపములకు శాంతికరమై యుండుటకు తన కుమారుని పంపెను; ఇందులో ప్రేమ యున్నది (1యోహా 4:10వ). కుమారుని యందు విశ్వాసముంచువాడు నిత్య జీవము కలవాడు. (1యోహా 5:10-13వ). ప్రియులారా, యిప్పుడు మనము దేవుని పిల్లలమై యున్నాము. మనమిక ఏమవుదుమో అది ఇంక ప్రత్యక్షపరచబడలేదు గాని ఆయన (క్రీస్తు) ప్రత్యక్షమైనప్పుడు ఆయనను పోలి యుందుమని యెరుగుదుము (1యోహా 3:1-2వ). ఆయన మూలముగా పుట్టినవాడు నీతిని జరిగించును (1యోహా 2:29వ). రక్షణ ఎవరు పొందిరో అనగా దేవుని కుమారుని ఎవడు ఒప్పుకొనునో వానిలో దేవుడు నిలిచియున్నాడు, వాడు దేవునియందున్నాడు (1యోహా 4:15వ) ఆయనలో నిలిచియున్న వాడెవడు (వాడుకగా) పాపము చేయడు, చేయజాలడు (1యోహా 3:6-9).

**6) ప్రవచన శాస్త్రము :-** చిన్న పిల్లలారా, యిది కడవరి గడియ. క్రీస్తు విరోధులు బయలు దేరియున్నారు; ఇది కడవరి గడియని దీనిచేత తెలిసికొనుచున్నాము (1యోహా 2:18వ). కడవరి గడియ అని అనుటలో ప్రభువు రెండవ రాకడను గూర్చిన ప్రవచనము ఇమిడియున్నది. ఆలాగే క్రీస్తువిరోధి రాకడను గూర్చిన ప్రవచనము కూడా ఇమిడియున్నది. ఈ క్రింది వచనములలో లోకమును గూర్చిన ప్రవచనము, తీర్పు దినమును గూర్చిన ప్రవచనము కలవు. లోకమును దాని ఆశయు గతించి పోవుచున్నవి గాని దేవుని చిత్తమును జరిగించువాడు నిరంతరమును నిలుచును (1యోహా 2:17వ), తీర్పు దినమందు మనకు ధైర్యము కలుగునట్లు దీనివలన ప్రేమ మనలో పరిపూర్ణము చేయబడియున్నది (1యోహా 4:17వ).

ఈ రీతిగా ప్రభువు రాకడను, క్రీస్తువిరోధి రాకడను గూర్చిన ప్రవచనములు, లోకమును, తీర్పు దినమును గూర్చిన ప్రవచనములు కలవు.

# 9. యూదా వ్రాసిన పత్రిక

విభజన :- (4+6+6+7+2=25)=2+2+3+3+3+3+2+2+2=25వ.

అంశము :- పరిశుద్ధులకు ఒకేసారి అప్పగించబడిన బోధ నిమిత్తము పోరాడుట.

వచనముల విభజన :- పరిచయం 1-4వ, గతకాలము, 5-10వ, ప్రస్తుత కాలము, 11-16వ, అంత్యకాలము, 17-23వ, ఆశీర్వచనము 24-25వ.

## 1-4వ. పత్రిక పరిచయము

ఎ) 1-2వ. యేసుక్రీస్తు నందు భద్రము చేయబడి, పిలువబడిన వారికి శుభములు.

బి) 3-4వ. పత్రిక ఉద్దేశము - పరిశుద్ధులకు ఒకేసారి అప్పగించబడిన బోధ నిమిత్తము పోరాడు.

## 5-10వ. గత కాలములోని దృష్టాంతాలు

సి) 5-7వ. గతకాలములో సత్యమును (బోధను) విడిచిన వారు - సత్యమును నమ్మని ఇశ్రాయేలీయులు (5), ప్రధానత్వమును నిలుపుకొనక నివాస స్థలమును విడిచిన దేవదూతలు (6), పరశరీరాను సారులై నిత్యాగ్ని దండన అనుభవించిన ప్రజలు (7), వారికి జరిగిన తీర్పుల దృష్టాంతములు.

డి) 8-10వ. గత కాలమందు సత్యమును (బోధను) విడిచిన వారు - వారి మూడు పాపాల గూర్చి తీర్పులు.

## 11-16వ. ప్రస్తుత కాల పరిస్థితి

ఇ) 11-13వ. కయీను, బిలాము, కోరహుల మార్గముననుసరించు వారు విశ్వాస భ్రష్టులగు సహోదరులు, బోధకులు, వారి ఐదు పోలికలు వారి శ్రమలను గూర్చిన హెచ్చరికలు.

యఫ్) 14-16వ. భక్తిహీనులకు తీర్పును గూర్చి హనోకు యొక్క ప్రవచనము.

## 17-23వ. అంత్యకాలములో విశ్వాసులకు హెచ్చరికలు

జి) 17-19వ. అంత్యకాలములో భక్తిహీనులు, ప్రకృతి సంబంధమైన విశ్వాసులకు హెచ్చరికలు.

హెచ్) 20-21వ. అంత్యకాలములో విశ్వాసులు తమ్మును తాము కట్టుకొనుట, ప్రార్థన, ప్రేమ కలిగి యుండుట.

ఐ) 22-23వ. అంత్యకాలములో విశ్వాసులకు ఉండవలసిన ఆత్మల కొరకైన ఆవేదన, కరుణ, కనికర గుణము.

## 24-25వ. ఆశీర్వచనము

జె) 24-25వ. తొట్రిల్లకుండ కాపాడి, తన మహిమ యెదుట మనలను ఆనందముతో నిర్దోషులుగా నిలవబెట్టునను ఆశీర్వచనము.

**1-2వ. శుభములు** :- 1వ. దేవుని చేత మనము పిలువబడుటలో తండ్రి ప్రేమ యందు క్రీస్తు ప్రేమ యందు భద్రపరచబడుట ఇమిడియున్నవి.

2వ. ఎ) తండ్రియైన దేవుని యందు ప్రేమింపబడి :- 1. శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను గనుక విడువక నీ యెడల కృప చూపుచున్నాను (యిర్మీ 31:3).

2. క్రీస్తు ప్రేమ యందు భద్రపరచబడి :- లోకములోనున్న తన వారిని ప్రేమించి వారిని సంపూర్ణముగా ప్రేమించెను (యోహా 13:1).

3. మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి మన పాపము లకు శాంతికరమై యుండుటకు తన కుమారుని పంపెను; ఇందులో ప్రేమయున్నది, మనము ఆయన ద్వారా జీవించునట్లు దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపెను; దీని వలన దేవుడు మనయందుంచిన ప్రేమ ప్రత్యక్ష పరచబడెను. (1యోహాను 4:9-10).

4. ఆయన మన నిమిత్తము తన ప్రాణము పెట్టెను గనుక దీని వలన ప్రేమ యెట్టిదని తెలిసికొనుచున్నాము (1 యోహాను 3:16).

తండ్రియైన దేవుడు శాశ్వతమైన, సంపూర్ణ ప్రేమతో మనలను ప్రేమించి పాప క్షమాణకై ప్రాణమిచ్చుటకు కుమారుడైన క్రీస్తు యేసును ఈ లోకమునకు పంపెను.

బి) యేసుక్రీస్తు నందు భద్రము చేయబడి :- 1. నేను వారియొద్ద ఉండగా నీవు నాకు అనుగ్రహించిన వారిని నీ నామమందు కాపాడితిని; నేను వారిని భద్రపరచితిని (యోహా 17:12).

2. నేను వాటికి నిత్యజీవము నిచ్చుచున్నాను గనుక అవి ఎన్నటికిని నశింపవు, ఎవడును వాటిని నా చేతిలో నుండి అపహరింపడు (యోహా 10:28).

3. క్రీస్తు ప్రేమ నుండి మనలను ఎడబాపు వాడెవడు ? శ్రమయైనను, బాధయైనను హింసయైన కరవైన, వస్త్ర హీనతయైన, ఉపద్రవమైన, ఖడ్గమైనను మనలను ఎడబాపునా? (రోమా 8:35).

4. పరుని సేవకునికి తీర్పు తీర్చుటకు నీవెవడవు ? అతడు నిలిచియుండుట యైనను అతని స్వకీయ యజమానుని పనియే; అతడు నిలుచును, ప్రభువు అతని నిలువ బెట్టుటకు శక్తిగలవాడు (రోమా 14:4).

5. కడవరి కాలమందు బయలుపరచబడుటకు సిద్ధముగానున్న రక్షణ మీకు కలుగునట్లు, విశ్వాసము ద్వారా దేవుని శక్తిచేత కాపాడబడు మీ కొరకు, ఆ స్వాస్థ్యము పరలోకమందు భద్రపరచబడియున్నది (1పేతు 1:5). పై వచనములను బట్టి ఎన్నటికి నశింపక, ఎడబాపులేక, పడిపోయినను ప్రభువు మనలను నిలువబెట్టుచు భద్రము చేయును.

**3-4వ. పత్రిక వ్రాయబడిన కారణము :-** 3వ. పరిశుద్ధులకు కలిగెడి రక్షణను గూర్చి వ్రాయాలి అనుకొని దానికంటే ముందుగా పరిశుద్ధులకు అప్పగింపబడిన బోధ విషయమై పోరాడవలెనని వ్రాయుచున్నాడు. దీనివలన బోధ మనకు అప్పగించబడినదని ముందుగా ఎరుగాలి, దానిని కాపాడుట కొరకై పోరాడుట ఎంత అవసరమో గమనించాలి. సత్యమైన బోధను ఎరుగాలని, అనుసరించాలని నిలిచి కాపాడాలని యోహాను రెండవ పత్రికలో చూచితిమి. అనేకులు బోధ యందు నిలుచుట లేదని, కాపాడు కొనుటలేదని దీని భావము. కనుక సత్యమైన బోధను కాపాడు విషయమై యోహాను వ్రాసినను పరిశుద్ధులకు అప్పగింపబడిన బోధ కొరకు పోరాడవలెనని యూదా వేడుకొనుచు ఈ పత్రిక వ్రాయుచున్నాడు. రక్షణ, బోధ రెండు ప్రాముఖ్య విషయములే. రెండింటిలో బోధ కొరకు పోరాడుట ముఖ్యమైనది. సంఘముల మధ్య బోధకులతో కూడా అబద్ధ బోధకు లున్నారు. కనుక ప్రతి విశ్వాసి సరియైన బోధ ఏదో ఎరుగుట ప్రాముఖ్యము. ముందుగా కలిగెడు రక్షణ ఏమిటియో తెలిసికొందము. రక్షణ యొక్క మూడు కాలములను గమనింతము.

1) రక్షణ పొందితిమి (ఎఫె2:8). 2) రక్షించబడుచున్నాము (ఫిలి2:12), 3) రక్షించబడుదుము (రోమా 5:9) 1) రక్షణ పొందితిమి :- ఎఫె 2:8 ప్రకారము మీరు విశ్వసించినవారై కృపచేత రక్షింపబడి యున్నారు; ఇది మీ వలన కలిగినది కాదు,దేవుని వరమే. తీతు 3:5 ప్రకారము మనము నీతిని అనుసరించి చేసిన క్రియల మూలముగా కాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను మనలను రక్షించెను. ఆలాగే రోమా 8:1 ప్రకారము యిప్పుడు క్రీస్తు యేసునందున్న వారికి ఏ శిక్షావిధియు లేదు. క్రీస్తు యేసునందు జీవమునిచ్చు ఆత్మ యొక్క నియమము పాపమరణముల నియమము నుండి నన్ను విడిపించెను. ఇదియే భూతకాలములో మనకు కలిగిన రక్షణ.

2) రక్షించబడుచున్నాము (ఫిలి 2:12) :- శరీరము ఆత్మకును, ఆత్మ శరీరమునకు విరోధముగా అపేక్షించును. ఆత్మకు విరోధముగా పోరాడు శరీరేచ్ఛలను విసర్జించాలి (గల5:17). మన విరోధియగు అపవాది గర్జించు సింహము వలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు (1పేతు 5:8). క్రీస్తు యేసునందున్న సరళత నుండియు, పవిత్రత నుండియు తొలగిపోవుదురేమోనని భయపడుచున్నాను (11కొరి 11;3). మీలో నున్నవాడు లోకములో నున్న వానికంటే గొప్పవాడు కనుక మీరు వానిని జయించి యున్నారు (1యోహా 4:4). తొట్రిల్లకుండ మిమ్మును కాపాడుటకును మిమ్ములను నిర్దోషులుగా ప్రభువు యొద్ద నిలువ బెట్టుటకు రక్షకుడైన దేవుడు శక్తి గలవాడు (యూదా 24వ). సిలువను గూర్చిన వార్త... రక్షించబడుచున్న మనకు దేవుని శక్తి (1కొరి 1:18).. కనుక మన ప్రభువు సాతాను బారి నుండి అనుదినము మనలను తన శక్తి ద్వారా రక్షించుచున్నాడు. ఇదియే వర్తమాన కాలమునకు చెందిన అనుదిన రక్షణ.

3) రక్షించబడుదుము (రోమా 5:9). కలిగెడు రక్షణ (యూదా 3వ) :- ప్రభువు ప్రత్యక్షమైనపుడు ఆకాశమండలమునకు ప్రపంచము నుండి ఎత్తబడుదుము. ప్రభువుతో

కూడా సదాకాలముందుము (1థెస్స 4:16). పాపము నుండి దూరమగుదుము కనుక ఇదియే శాశ్వతముగా కలిగెడు రక్షణ.

పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ :- పరిశుద్ధులకు అనగా పరిశుద్ధులైన అపోస్తలులు, ప్రవక్తల ద్వారా ఒకేసారి బోధ అప్పగించబడినది (ఎఫె3:3,5,11). ఎఫెసీ 2:21లో వారు వేసిన పునాది అని గతకాలములో చెప్పబడినందున క్రొత్త నిబంధనతో ఆ బోధ ముగించబడినది. సంపూర్ణమైన ఆ బోధకు మరేమి కలుపకూడదు. కనుక మరెవరైనా క్రొత్తగా బయలుపరచబడినదని చెప్పినను మనము అంగీకరించక వేయబడిన పునాది మీదనే కట్టాలి.

బోధ నిమిత్తము మీరు పోరాడవలెను.. కొలో 1:28-29 ప్రతి మనుష్యుని క్రీస్తు నందు సంపూర్ణునిగా చేసిన ఆయన యెదుట నిలువబెట్టవలెనని, సమస్త విధములైన జ్ఞానముతో మేము ప్రతి మనుష్యునికిని బుద్ధి చెప్పుచు, బోధించుచు, ఆయనను ప్రకటించు చున్నాము. అందు నిమిత్తము నాలో బలముగా కార్యసిద్ధి కలుగజేయు ఆయన క్రియాశక్తిని బట్టి నేను పోరాడుచు, ప్రయాసపడుచున్నాను. బోధ పరిశుద్ధులను సంపూర్ణులుగా చేయునది. కనుక బోధ నిమిత్తము పోరాడాలి. ప్రయాసపడాలి. మరియు జెట్టియైనవాడు పోరాడునపుడు నియమ ప్రకారము పోరాడకుంటే వానికి కిరీటము దొరకదు (2తిమో 2:5). కనుక మన పోరాటము వాక్యప్రకారమే వుండాలి. ఎఫెసి 6:12లో మనము పోరాడునది శరీరులతో కాదని వ్రాయబడినది. కనుక శరీరములు గల మనుష్యులతో శరీరరీతిగా మనము పోరాడకూడదు. బైబిలు గ్రంథములోని ప్రాముఖ్యమైన కొన్ని పోరాటములను గమనింతము.

**పరిశుద్ధులు పరిపూర్ణ మగుటకు, ఫలము పొందుటకైన పోరాటములు :**

1) ఆయన వారిని చూచి ఇరుకు ద్వారమున ప్రవేశింప పోరాడుడి (లూకా 13:24). ఆత్మీయతలో ప్రవేశించుట, ఆత్మీయతను కొనసాగించుట రెండును పోరాటముతో కూడినవే.

**మనలో నున్న పోరాటము..**

2) వేరొక నియమము నా అవయవములలో ఉన్నట్టు నాకు కనబడుచున్నది. అది నా మనస్సునందున్న ధర్మశాస్త్రముతో పోరాడుచు నా అవయవములలో నున్న పాప నియమమునకు నన్ను చెరపట్టి లోపరచుకొనుచున్నది (రోమా 7:23).

3) మీలో యుద్ధములును పోరాటములును దేని నుండి కలుగుచున్నవి ? మీ అవయవములలో పోరాడు మీ భోగేచ్ఛలనుండియే గదా ? (యాకోబు 4:1)

4) పాపమును ఎదిరించుటలో రక్తము కారు నంతగా పోరాడాలి (హెబ్రీ 12:4).

**మన అభివృద్ధి కొరకైన పోరాటము**

5) అప్పుడు రాహేలు దేవుని కృప విషయమై నా అక్కతో పోరాడి గెలిచితిననుకొని అతనికి నఫ్తాలి అను పేరు పెట్టెను (ఆది 30:8). (ఆయన పరిపూర్ణతలో నుండి మన మందరము కృప వెంబడి కృపను పొందితిమి. యోహా 1:16)

6) ఆకాశమందలి దురాత్మల సమూహముతో పోరాడాలి (ఎఫె 6:12)

7) ప్రార్థనలో పోరాడాలి (రోమా 15:32), (కొలొ 4:12).

8) యాకోబు వలె దేవుని ఆశీర్వాదముకై పోరాడాలి (హోషే 12:4).

### ఇతరుల కొరకైన పోరాటము

9) సువార్త విశ్వాస పక్షమున పోరాడాలి (ఫిలి 1:27).

10) పరిశుద్ధులను సంపూర్ణులుగా చేయుటకై పోరాడాలి (కొలొ 2:2,4:12).

11) పరిశుద్ధులకు ఒకేసారి అప్పగించబడిన బోధ విషయమై పోరాడాలి (యూదా 1:3).

12) మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని (2 తిమో 4:7).

బైబిలు అంతటిలో 53 పోరాడుట అను పదములు కలవు. చివరిదిగా పోరాడుట అను పదము పరిశుద్ధులకు అప్పగింపబడిన బోధ విషయము పోరాడుటను గూర్చి చెప్పబడుట గమనించదగినది. మీలోనున్న వాడు లోకములోనున్న వాని కంటే గొప్పవాడు కనుక మీరు వానిని జయించి యున్నారు (1 యోహా 4:4). ప్రభువులో వున్న శక్తిని బట్టి జయము పొందగలము.

4వ. విశ్వాస గృహములోనికి భక్తిహీనులైన కొందరు రహస్యముగా జొరబడి యేసుక్రీస్తును విసర్జించి, దేవుని కృపను కామాతురత్వమునకు దుర్వినియోగము చేసిరని వ్రాయబడినది. మొదటి శతాబ్దకాలములోనే ఈరీతిగా జరిగిన ప్రస్తుత కాలములో మరి ఎక్కువగా జరుగగలదు. అనగా అబద్ధ ప్రవక్తలు, అబద్ధ బోధకులు సంఘములలో రహస్యముగా నేటి కాలములోనే ప్రవేశించియున్నారు. అలాగే శరీర స్వభావము కలిగి కామాతురత గలవాడు సంఘములలో రహస్యముగా జొరబడివున్నారు. 1పేతురు 2:1 ప్రకారము వీరు దేవుని విడిచినవారై కుయుక్తిచేత అపాయకరమైన తప్పుడు బోధలను రహస్యముగా బోధించుచున్నారు. అందువలన పరిశుద్ధులకు అప్పగింపబడిన బోధ కొరకు పోరాడవలసిన అవసరత ఎంతగానున్నదో గమనించగలము. కనుక ఈ పోరాటము అవసరమే. సత్యమైన యేసుక్రీస్తు శరీరధారిగా ఈ లోకమునకు వచ్చెనని నమ్మనివారు, తండ్రిని మరియు కుమారుడైన యేసుక్రీస్తును దేవుడుగా అంగీకరించని వారే, క్రీస్తు విరోధులైన దుర్భోధకులు.. వారి బోధ ఏమనగా.. యేసు జన్మించినపుడు దేవుడు కాదని యోర్దానులో బాప్తిస్మము పొందినపుడో లేదా ఆ తరువాత కాని దైవత్వము క్రీస్తులో ప్రవేశించినదని గేత్సెమనే వనములో ప్రార్థించినపుడు దైవత్వము ఆయనలో నుండి వెళ్ళిపోయెనని చెప్పుదురు.

కనుక సిలువ వేయబడినది దేవుడు కాదని వారు బోధించుదురు. వారు ఒకప్పుడు మనలోనున్నవారు. మనలో నుండి వెళ్ళిపోయిరి. కనుక ఈదుర్భోధకులు మనలో నుండియే బయలు దేరుదురు. వీరు క్రీస్తును విసర్జించిన వారు.

క్రీస్తును విసర్జించిన పలు రకములైన ఇతరులు. 1) పైకి భక్తిగలవారివలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించని వారునై యుందురు (2తిమోతి 3:5).

2) దేవుని ఎరుగుదుమని వారు చెప్పుకొందురు గాని అసహ్యులును అవిధేయులును ప్రతి సత్కార్యము విషయము భ్రష్టులునై యుండి, తమ క్రియల వలన ఆయనను ఎరుగ మన్నట్టున్నారు (తీతు 1:16). పై వచనముల బట్టి భక్తిహీనులు, భ్రష్టులైనవారు క్రీస్తును విసర్జించి దేవుని కృపను కామాతురత్వమునకు దుర్వినియోగము చేసి జీవించువారు.

**5-7వ. గత కాలములో సత్యమును విడిచిన ఇశ్రాయేలీయులు, దేవదూతలు, ప్రజలకు, జరిగిన తీర్పుల దృష్టాంతములు :-** 5వ. ప్రభువు ఐగుప్తులో నుండి ప్రజలను రక్షించినను, వారిలో నమ్మకపోయిన వారిని తరువాత నాశనము చేసెను. ఐగుప్తులో ప్రజలు మొరపెట్టగా దేవుడు వారిని శరీరకముగా విమోచించాడు. కాని వారు ముందుకు సాగిన విధము చూచిన ఆత్మీయత బొత్తిగ లేక అంతయు అవిశ్వాసముతోనే యుండెను. అవిశ్వాసముతో అనేక కార్యములు చేసిరి. కనుక ప్రభువును నమ్మనివారి శరీరములు అరణ్యములోనే రాలిపోయెను. రాలిపోయినది శవములే. మన్నయినది వెనుకటి వలెనె మరల మంటికి చేరును, ఆత్మదాని దయచేసిన (విమోచించిన) దేవుని యొద్దకు పోవును (ప్రసంగి 12:7). నమ్మిన వారిలో మోషే శరీరకముగా అరణ్యములోనే చనిపోయినను ఆత్మ విమోచించబడినందున ప్రభువుతో రూపాంతరము కొండపై కనబడెను. కనుక నమ్మిన వారు ప్రభువుతో సదాకాలము ఉందురు.

6వ. పాపము చేసి నిత్యపాశములతో బంధించబడిన దూతల విషయము పలు అభిప్రాయములు కలవు. సాతాను వాని దూతలు స్వతంత్రులుగానున్నందున ఇక్కడ చెప్పబడినవారు వేరే దూతలు అని అంగీకరించాలి. ఆది.6అ.గల దేవుని కుమారులు ఇక్కడ చెప్పబడిన దూతలే అని అంగీకరించాలి. ఆది 19:1-5 నుండి దూతలు శరీరము ధరించి మనుష్యుల వలె ప్రవర్తించగలరని అంగీకరించగలమా ? 1కొరి 15:40లో (there are also celestial bodies) అని ఉన్నది. దీని భావము ఆకాశవాసులకును వాటి శరీరములు కలవు. మార్కు 12:25లో దూతలు పెండ్లిచేసికొనరు అని ఉన్నది, కాని కామవాంఛలు ఉండవని దాని భావము కాదు. కనుక దేవుని కుమారులనబడుదూతలు ఏదో రీతిగా తాము కలిగిన శరీరములతో తమ కామ కోర్కెలు నెరవేర్చుకొనినందున వారి పాపమును బట్టి పుట్టిన ఆ సంతాన మంతటిని దేవుడు నాశనము చేసి, పాపము చేసిన ఆ దూతలను నిత్యపాశములతో బంధించెను. వారే శూరులు. కాని (సామాన్యముగా మనుష్యుల మధ్య విశ్వాసులకు అవిశ్వాసులకు జరుగు వివాహాలలో అందరు శూరులు పుట్టినట్లు చూడము. ఒకవేళ పుట్టినను అది పాపముగా చూడము.)

7వ. సొదమ ప్రజలు లోతు ఇంటికి వచ్చిన ఆ దూతలను కూడుదుమని చెప్పుట ఎంత భయంకరము. సొదమ ప్రజలు ఆ పట్టణమునకు చుట్టున్న వారును అటువంటి

వారైనందున దేవుడు ఆ పట్టణములను నాశనము చేసెను. వారందరు ప్రభువు నందు విశ్వాసములేనివారు. వారిలో విశ్వాసము గల లోతును నాశనము నుండి తప్పించెను.

**8-10వ. గత కాలమందు సత్యమును (బోధను) విడిచినవారు - వారి మూడు పాపాలు, వాటిని గూర్చిన తీర్పులు :-** 8వ. ఎ) కలలు కనుట:-పూర్వకాలమందు నానా సమయములలో నానా విధములుగాను ప్రవక్తల ద్వారా మనపితరులతో మాటలాడిన దేవుడు (హెబ్రీ1:1-4).. పాత నిబంధన కాలములో కలల ద్వారా దేవుడు మాటలాడినను ఈ దినములలో వాక్యమైన కుమారుని ద్వారానే మనతో మాటలాడును. కనుక వాక్యమే మనకు ఆధారము. కాని ఈ దినములలో కూడా కలలపై ఆధారపడువారున్నారు. ఇది తప్పని గుర్తించాలి.

బి) శరీరమును అపవిత్రపరచుకొనుట :- ఏడవ వచనములో చెప్పబడి నట్లు ఈ దినములలోను పవిత్రతను లెక్కచేయనివారు కలరు. ఆత్మీయులలోను అపవిత్రత కనిపించుచున్నది. ప్రభువు నామమునకు అవమానము కలుగుచున్నది.

సి) ప్రభుత్వమును నిరాకరించుట;- స్థానిక సంఘములలో ప్రభుత్వము అప్పగించ బడిన పెద్దలు వున్నారు. సహోదరులలో కొందరు ప్రభుత్వమును నిరాకరించుట అనగా పెద్దలను నిర్లక్షము చేయుట జరుగుచున్నది. దేవుడు వీటిని తీర్పు తీర్చునని గుర్తుంచు కొనాలి.

డి) మహాత్ములను దూషించుట :- ఆత్మీయులలో మహాత్ముల వంటి వారుందురు. వారి మాదిరిని అనుసరించి వారిని సన్మానించాలి, కాని వారిని దూషించువారుందురు. వీటన్నిటిని దేవుడు తీర్పులోనికి తెచ్చునని గుర్తుంచుకొనాలి. ఈ మూడు పాపములు, వాటి తీర్పులు గమనించండి.

9వ. ఎ) ప్రధాన దూతయైన మిఖాయేలు-అపవాది:- ప్రధాన దూతలు ముగ్గురు. మిఖాయేలు యుద్ధ సంబంధమైన ప్రధాన దూత. గబ్రియేలు వర్తమాన సంబంధమైన ప్రధాన దూత. లూసిఫర్ అనబడు అపవాది, స్తుతి సంబంధమైన ప్రధాన దూత.

బి) మోషే యొక్క శరీరమును గూర్చి తర్కము :- ఈ తర్కము యొక్క వివరము మనకు పూర్తిగా తెలియదు, కాని మోషే మృతి పొందినపుడు సమాధి చేయబడినను అతని సమాధి ఎక్కడ వున్నదో ఎవరికి తెలియదు అని ద్వితీ 34:6లో వ్రాయబడినది. రూపాంతరపు కొండపై మామూలుగా కనబడినందున శరీరముతో పైకి వెళ్ళినట్లు తలంచ గలము. శరీరముతో పైకి కొనిపోబడుటను అపవాది ఆటంకపరచెనని ఆ విషయమై మిఖాయేలు-అపవాదికి తర్కము జరిగినట్లు తలంచగలము. కాని మిఖాయేలు అపవాదిని దూషించక, వాదించక, తీర్పు తీర్చ తెగింపక, ప్రభువు నిన్ను గద్దించును గాక అనుట గమనింతము. మనమును ఆలాగే జీవించాలి.

10వ. వివేక శూన్యములగు మృగములు :- వారిలో ఒకడు, అనగా వారి స్వంత ప్రవక్తలలో ఒకడు ఇట్లనెను-క్రేతీయులు ఎల్లప్పుడు అబద్ధికులును దుష్టమృగములును సోమరి

తిండిపోతులునై యున్నారు (తీతు 1:12). మనుష్యరీతిగా నేను ఎఫెసులో మృగములతో పోరాడితిని; నాకు లాభమేమి (1కొరి 15:32). లెబానోనులో నున్న దుష్ట మృగమువచ్చి ఆ ముండ్ల చెట్టును త్రొక్కివేసెను (2రాజు 14:9). పైవచనములలో మృగ స్వభావమును అర్థము చేసి కొనగలము. అటువంటి స్వభావము మనము కలిగి యుండరాదు.

11వ. ఎ) కయీను నడిచిన మార్గమున నడిచిరి :- హేబేలు రక్తము చిందించుట ద్వారా పాపక్షమాపణ కలుగునని నమ్మినవాడు. కాని కయీను వాక్యప్రకారము కాక స్వంత ఇష్ట ప్రకారము పొలములోని పంట దేవునికిచ్చుట ద్వారా దేవుని యొద్దకు రాతలంచెను. అలాగే మనలోను కొందరు వాక్యప్రకారముకాక స్వంత ఇష్టప్రకారమైన పద్ధతులను అనుసరించకోరుదురు. కయీను వంటి పద్ధతులు దేవునికి ఇష్టము కాదని గమనింతము.

బి) బహుమానము పొందవలెనని బిలాము నడిచిన తప్పుత్రోవలో ఆతురతముగా పరిగెత్తుట :- నిర్గ24-25అ.లో బిలాము వాక్యప్రకారము కాక తప్పు మార్గము ద్వారా బహుమానము పొందగోరెను. ఆలాగే వాక్యపద్ధతిలో కాక స్వంత పద్ధతుల ద్వారా బహుమానము పొందగోరువారు ఈ దినములలోను కలరు. మనమైతే అలాగుండరాదు.

సి) కోరహు చేసినట్టు తిరస్కారము చేసి నశించుట :- కోరహు మోషేలు అన్నదమ్ముల పిల్లలు (నిర్గ6:18-20). మోషే దేవుడు నియమించిన ప్రవక్త. కోరహు ఆలాగు నియమించ బడినవాడు కాదు. ఈ సమాజములో అందరు పరిశుద్ధులే అని మిమ్మును మీరు ఎందుకు హెచ్చించుకొనుచున్నారు అని కోరహు అన్నాడు (సంఖ్యా 16:3-20). అది కోరహు దేవుని తిరస్కరించుటగా దేవుడు భావించాడు. బోధకుడైన బిలాము, ఎదిరించి మాటలాడిన కోరహు ప్రస్తావనను బట్టి ఈ భాగములో బోధకులకు పాఠము కలదని గమనింతము.

**11-13వ. విశ్వాస భ్రష్టులగు బోధకుల ఐదు పోలికలు - వారి శ్రమలను గూర్చిన హెచ్చరికలు :-** వీరు నిర్భయముగా మీతో సుభోజనము చేయుచు, తమ్మును తాము నిర్భయముగా పోషించుకొనుచు, మీ ప్రేమ విందులలో దొంగమెట్టలుగా ఉన్నారు. వీరు గాలి చేత ఇటు అటు కొట్టుకొని పోవు నిర్జల మేఘములుగాను, కాయలురాలి ఫలములు లేక, రెండు మారులు చచ్చివేళ్లతో పెళ్లగింపబడిన చెట్లుగాను, తమ అవమానమును నురుగు వెళ్లగ్రక్కువారై, సముద్రము యొక్క ప్రచండమైన అలలుగాను, మార్గము తప్పి తిరుగు చుక్కలు గాను ఉన్నారు వారి కొరకు గాఢాంధకారము నిరంతరము భద్రము చేయబడి యున్నది.

12-13వ. మేఘములు, చెట్లు, సముద్రము యొక్క అలలు, చుక్కలు అను ఆకాశ భూమి, సముద్రము నందలి ఐదు పోలికలతో విశ్వాస భ్రష్టులను పోల్చుట గమనించగలము.

1) ప్రేమ విందులలో దొంగ మెట్టలు :- అపొ 2:42లో చెప్పబడిన సహవాస విందే ఈ ప్రేమ విందు, అపో6:13లోను, 1కొరి 11:17-28లోను చెప్పబడినట్లు కొందరు

ఇతరుల కంటే ముందుగా తినుచు మిగిలిన వారి పట్ల చిన్నచూపు కలిగి వారికి లేకుండ చేయుచుండిరి. తద్వారా సంఘమునకు సమస్యలు, నష్టము కలుగుచుండెను. సముద్రములో కనబడకుండా వుండు కొండలను పడవలె గుర్తించక ఢీ కొనుట ద్వారా ఎంతో నష్టము కలుగును. అలాగే విశ్వాస భ్రష్టులగు బోధకులు కనిపెట్టుట మాని ఇతరుల కంటే ముందుగా తామే బోధలు చేయవలెననుట / చేయుట ద్వారా కనబడని ఎంతో గొప్ప నష్టము సంఘములకు కలుగుచున్నది.

2) గాలిచేత ఇటు అటు కొట్టుకొని పోవు నిర్జల మేఘములు :- ఆకాశములో కొన్ని పర్యాయాలు పెద్ద మేఘములున్నను ఒక్క చుక్కయైనను కురువక గాలిచే అటు ఇటు కొట్టుకొని పోవుచుండును. అలాగే కొద్దిమంది బోధలు వినుటకు గొప్పగా నుండును, కాని క్రియలు/ఫలము లేక శూన్యముగా నుందురు. ధనము అను గాలి చేత లేక అతిశయము / గర్వము అనుగాలిచేత, లేదా మరి ఏదో ఒక ఇతర గాలులచేత అటుఇటు కొట్టుకొని పోబడుచుందురే కాని సంఘమునకు వారి ద్వారా బలమైన ఆత్మ సంబంధమగు ఫలమేమి యుండదు.

3) కాయలు రాలి ఫలములు లేక, రెండు మారులు చచ్చి వేళ్లతో పెల్లగింపబడిన చెట్లు :- మత్తయి 3:8లో మారు మనస్సుకు తగిన ఫలము ఫలించుడి అని చెప్పబడినది. దాని 4:22 ప్రకారము చెట్లు మానవులను సూచించును. కాయలు రాలి ఫలములు లేని చెట్లవంటివారు అసలు మారు మనసును పొందిరా ? అని అనుమానము కలుగును. మార్కు 11;12-15లో ప్రభువు ఆకలితో అంజూరపు చెట్టును చూచి ఫలములు లేనందున శపించగా చెట్టు ఎండిపోయినది. ఆత్మీయ ఫలములు లేని ఈ చెట్టు ఆకులు క్రియలు లేనివారి వట్టి మాటలతో పోల్చబడినది. క్రియా పూర్వకము కాని మాటలు ప్రభువుకు ప్రీతికరము కావు.

4) అవమానమను నురుగు వెళ్లగ్రక్కు సముద్రము యొక్క ప్రచండమైన అలలు:- యెష 57:20-21లో భక్తిహీనులు కదలుచున్న సముద్రము వంటివారు అది నిమ్మళింప నేరదు. దాని జలములు బురదను మైలను పైకివేయును. దుష్టులకు నెమ్మదియుండదని నా దేవుడు సెలవిచ్చుచున్నాడు. ఈ అలలు భక్తిహీనులే. నురుగును వెళ్ళగ్రక్కుట వారి నోటిమాటలె. పై వచనముల బట్టి భక్తిహీనుల నోటి మాటలు వ్యర్థము, నిష్ప్రయోజనము, అవమానకరము.

5) మార్గము తప్పి తిరుగు చుక్కలు :- దాని 12:3 వచన ప్రకారము చుక్కలు విశ్వాసులను సూచించును. మార్గము తప్పి తిరుగు చుక్కలు ఒకదానికి ఒకటి ఢీ కొనుట ద్వారా ఎంతో నష్టము, కీడు కలుగును. కనుక విశ్వాస భ్రష్టులగు బోధకుల ద్వారా సంఘములలో ఆత్మీయతకు గొప్ప నష్టము కలుగును. 13వ వచన ప్రకారము వారి కొరకు గాఢాంధకారము నిరంతరము భద్రము చేయబడియున్నది. విశ్వాస భ్రష్టులగు బోధకుల విషయమై ఎంతో జాగ్రత్తగా నుండాలి.

**14-16వ. భక్తిహీనులకు తీర్పును గూర్చి హనోకు యొక్క ప్రవచనము;-** ఆదాము మొదలుకొని యేడవవాడైన హనోకు కూడ వీరిని గూర్చి ప్రవచించి యిట్లనెను; ఇదిగో అందరికిని తీర్పు తీర్చుటకును, వారిలో భక్తిహీనులందరును భక్తిహీనముగా చేసిన వారి భక్తిహీనక్రియలన్నిటిని గూర్చియు, భక్తిహీనులైన పాపులు తనకు విరోధముగా చెప్పిన కఠినమైన మాటలన్నిటిని గూర్చి వారిని ఒప్పించుటకును, ప్రభువు తన వేవేల పరిశుద్ధుల పరివారముతో వచ్చెను. ప్రభువు చేయబోవు తీర్పుల యొక్క కొన్ని వచనాల గమనించండి.

కీర్త 47:5:- దేవుడు ఆర్భాటముతో ఆరోహణ మాయెను. బూర ధ్వనితో యెహోవా ఆరోహణమాయెను. అపో.1:11:-గలిలయ మనుష్యులారా, మీరెందుకు నిలిచి ఆకాశము వైపు చూచుచున్నారు ? మీ యొద్ద నుండి పరలోకమునకు చేర్చుకొనబడిన యీ యేసే యే రీతిగా పరలోకమునకు వెళ్లుట మీరు చూచితిరో ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చునని వారితో చెప్పిరి. 1థెస్స 4:16:- ఆర్భాటముతోను, ప్రధానదూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తునందుండి మృతులైనవారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారతో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘముల మీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము. ఇక్కడనే విశ్వాసుల తీర్పు జరుగును. ఇది ప్రభువు రాకడలో ఆకాశమండలమునకు వచ్చు మొదటి మెట్టు.

జకర్యా 14:4:- ఆ దినమున యెరూషలేము ఎదుట తూర్పు తట్టుననున్న ఒలీవ కొండమీద ఆయన పాదములుంచగా ఒలీవ కొండ తూర్పు తట్టునకును పడమటి తట్టున కును నడిమికి విడిపోయి సగము కొండ ఉత్తరపు తట్టునకును సగము కొండ దక్షిణపు తట్టునకును జరుగును గనుక విశాలమైన లోయ యొకటి యేర్పడును.

2థెస్స 1:6:- ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ పరలోకము నుండి అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమై, దేవుని ఎరుగనివారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడనివారికి ప్రతిదండన చేయును.

మత్త 24:30 :- అప్పుడు మనుష్య కుమారుని సూచన ఆకాశమందు కనబడును. అప్పుడు మనుష్య కుమారుడు ప్రభావముతోను మహా మహిమతోను ఆకాశ మేఘారూఢుడై వచ్చుట చూచి భూమిమీద ఉన్న సకల గోత్రములవారు రొమ్ము కొట్టుకొందురు. ఇది ప్రభువు రాకడలో ఆకాశము నుండి భూమి మీదకు వచ్చు రెండవ మెట్టు.

పై వచనముల నుండి ప్రభువు రెండవ రాకడలో మొదట ఆకాశ మండలమునకు దిగివచ్చి యేసును నమ్మినవారు చేసిన క్రియలకు ఫలమిచ్చును. పిమ్మట భూమి మీదికి దిగివచ్చిన తరువాత వేయి ఏండ్ల పాలన జరిగించి అది ముగిసిన తరువాత యేసునందు విశ్వాసముంచని పాపులను తీర్పు తీర్చును.

**14-15వ.** 1) భక్తిహీనులైన పాపులకు తీర్పు:- హనోకు ప్రవచనము ఆదికాండ మందు లేదు. ప్రకటన 19:11-15లో భక్తిహీనులైన పాపులకు తీర్పు వివరములు కలవు. పాపులు తీర్పు తీర్చబడి జీవగ్రంథములో పేర్లు లేనందున అగ్ని గుండములో వేయబడిరి.

2) భక్తిహీనులు భక్తిహీనముగా చేసిన క్రియలను గూర్చిన తీర్పు :- ఇది భక్తిహీనులైన విశ్వాసులు భక్తిహీనముగా చేసిన క్రియలు 2కొరి.5:10 ప్రకారము తీర్పు తీర్చబడును. ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలము పొందునట్లు మన మందరము క్రీస్తు న్యాయ పీటము ఎదుట ప్రత్యక్షము కావలెను.

16వ.వారు 1) తమ దురాశల చొప్పున నడచుచు, 2) లాభము నిమిత్తము మనుష్యులను కొనియాడుచు 3) సణగువారును తమ గతిని గూర్చి నిందించువారునై యున్నారు; 4) వారి నోరు డంబమైన మాటలు పలుకును.

2) తమ దురాశలచొప్పున నడచుచు లాభము నిమిత్తము మనుష్యులను కొనియాడుచు:- **1తిమో 6:10** ప్రకారము ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము; కొందరు దానిని ఆశించి విశ్వాసము నుండి తొలగిపోయి నానాబాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి. దురాశ అనగా ఆశించకూడని ధనమును ఆశించుట ఇక్కడ చెప్పబడినది. లాభము కొరకు ప్రయాసపడుట మొదలగు కార్యములు చేయుదురు. 1తిమో6:11 ప్రకారము దైవజనుడు, వీటిని విసర్జించి, నీతిని భక్తిని విశ్వాసమును ప్రేమను ఓర్పును సాత్వికమును సంపాదించుకొనుటకు ప్రయాసపడాలి.

3) సణుగువారును తమ గతినిగూర్చి నిందించువారునై యున్నారు :- ఫిలి 2:14లో మీరు మూర్ఖమైన వక్రజనము మధ్య, నిరపరాధులును నిష్కళంకులును అనింద్యులైన దేవుని కుమారులగునట్లు, సణుగులును సంశయములను మాని సమస్త కార్యములను చేయుడి. సామె 13:5లో భక్తిహీనుడు నిందించుచు అవమానపరచును. కీర్త 102:8లో దినమెల్ల నా శత్రువులు నన్ను నిందించుచున్నారు. కనుక సణుగువారు, నిందించువారు భక్తిహీనులు, శత్రువులు. అందువలన విశ్వాసులమైన మనము అలాగుండరాదు.

4) వారి నోరు డంబమైన మాటలు పలుకును :- 2పేతు 2:10-18 ప్రకారము దుర్నీతి పరులు వ్యర్థమైన డంబపు మాటలు పలుకుదురు. తాము శరీర సంబంధమైన దురాశలచేత, పోకిరి చేష్టలచేత అస్థిరులైన వారిని పాపమునకు మరులు కొల్పుచున్నారు. ఇటువంటి వారి వలన ఆత్మీయతకు ఎంతో కీడు కలుగును.

**17-23వ. అంత్య కాలములో విశ్వాసులకు హెచ్చరికలు.** 17-19వ. విశ్వాసులలో ఉండకూడని 4 గుణములు, 20-21వ. ఉండవలసిన 4 గుణములు, 22-23వ. చేయవలసిన / చేయకూడని 4 కార్యములు చెప్పబడినవి. అవి ఈ క్రింద చెప్పబడినవి.

**విశ్వాసులలో ఉండకూడని 4 గుణములు :**

17-19వ. అయితే ప్రియులారా, 1) అంత్యకాలము నందు తమ భక్తిహీనమైన దురాశలచొప్పున నడుచు పరిహాసకులుందురని మన ప్రభువైన యేసుక్రీస్తు అపొస్తలులు ఇదివరలో మీతో చెప్పిన మాటలను జ్ఞాపకము చేసికొనుడి. అట్టివారు 2) ప్రకృతి సంబంధులును 3) ఆత్మలేనివారనై యుండి 4) భేదములు కలుగజేయుచున్నారు.

**విశ్వాసులలో ఉండవలసిన 4 గుణములు :**

20-21వ. ప్రియులారా, 1) మీరు విశ్వసించు అతి పరిశుద్ధమైన దానిమీద మిమ్మును మీరు కట్టుకొనుచు, 2) పరిశుద్ధాత్మతో ప్రార్థన చేయుచు, 3) నిత్యజీవార్థమైన మన ప్రభువగు యేసుక్రీస్తు కనికరము కొరకు కనిపెట్టుచు, 4) దేవుని ప్రేమలో నిలుచునట్లు కాచుకొని యుండుడి.

**విశ్వాసులు చేయవలసినవి / చేయకూడని 4 కార్యములు :**

22-23వ. 1) సందేహపడువారి మీద కనికరము చూపుడి. 2) అగ్నిలో నుండి లాగినట్టు కొందరిని రక్షించుడి, 3) శరీరసంబంధమైన వారి అపవిత్ర ప్రవర్తనకు ఏ మాత్రము నొప్పుకొనక దానిని అసహ్యించుకొనుచు 4) భయముతో కొందరిని కరుణించుడి.

**17-19వ. అంత్యకాలములో విశ్వాసులలో ప్రకృతి సంబంధమైన పరిహాసకులగు అపోస్తలులకు ఇచ్చిన హెచ్చరికలు :-** అయితే ప్రియులారా, అంత్యకాలము నందు 1) తమ భక్తిహీనమైన దురాశల చొప్పున నడుచు పరిహాసకులుందురని మన ప్రభువైన యేసుక్రీస్తు అపోస్తలులు ఇదివరలో మీతో చెప్పిన మాటలను జ్ఞాపకము చేసికొనుడి. అట్టివారు 2) ప్రకృతి 17-18వ. అంత్యకాలములో విశ్వాసులలోనే 1) తమ భక్తిహీనమైన దురాశల చొప్పున నడుచు పరిహాసకులుందురని చెప్పుచున్నాడు. వీరికి దురాశలు, పరిహాసములే ముఖ్యము. యాకోబు 1:15 ప్రకారము దురాశ గర్భము ధరించి పాపమును కనగా పాపము పరిపక్వమై మరణమును కనును. భక్తిహీనులు ఇట్టి గొప్ప ఆపదలలో చిక్కుకొందురు. 19వ. 2) వారు ప్రకృతి సంబంధులని చెప్పుచున్నాడు. శరీర సంబంధు లైన మనుష్యులే అనియు, క్రీస్తు నందు పసిబిడ్డలే అనియు, మీతో మాటలాడవలసి వచ్చెను. మీలో అసూయయు కలహమును ఉండగా మీరు శరీర సంబంధులైన మనుష్య రీతిగా నడుచుకొనువారు కారా ? ఒకడు - నేను పౌలువాడను, మరి యొకడు నేను అపొల్లోవాడను, అని చెప్పునప్పుడు మీరు ప్రకృతి సంబంధులైన మనుష్యులు కారా ? ప్రకృతి లోక సంబంధము కనుక ప్రకృతి సంబంధులు అని రక్షణలేని వారిని గూర్చి చెప్పబడాలి. కాని 19వ వచనమును గమనించిన ఇక్కడ చెప్పబడిన ప్రకృతి సంబంధులు రక్షించబడిన వారే. కనుక ప్రకృతి సంబంధులు, ఆత్మ లేనివారు అనబడు వీరు రక్షించబడిన భక్తిహీనులు. వీరికి పరిహాసమే ముఖ్యము కాని ఆత్మీయత ముఖ్యము కాదు. సంఘములో భేదములు కలుగజేయు చున్నారు. కొరింథీ సంఘములో ఈలాంటి వారే నేను పౌలువాడను, అపోల్లో వాడను అని బేధములు కలిగించు చున్నారు. ఈలాంటి వారి విషయమై సంఘములలో ఎంతో జాగ్రత్త అవసరము.

3) ఆత్మలేని వారనిచెప్పుచున్నాడు. రోమా 8:9 ప్రకారము దేవుని ఆత్మ మీలో నివసించియున్న పక్షమున మీరు ఆత్మ స్వభావము గలవారే గాని శరీర స్వభావము గలవారు కారు. ఎవడైనను క్రీస్తు ఆత్మలేనివాడైతే వాడాయనవాడు కాడు (1కొరి 3:1-4):- సహోదరులారా, ఆత్మ సంబంధులైన మనుష్యులతో మాటలాడినట్లు నేను మీతో మాటలాడ లేకపోతిని. 4) భేదములు కలుగజేయు చున్నారు అని చెప్పుచున్నాడు.

**20-21వ. విశ్వాసులకుండ వలసిన ప్రేమ మొదలగు గుణములు (దేవుని ప్రేమలో నిలుచు):-** ప్రియులారా, 1) మీరు విశ్వసించు అతి పరిశుద్ధమైన దాని మీద మిమ్మును మీరు కట్టుకొనుచు, 2) పరిశుద్ధాత్మలో ప్రార్థన చేయుచు, 3) నిత్యజీవార్థమైన మన ప్రభువగు యేసుక్రీస్తు కనికరము కొరకు కనిపెట్టుచు, 4) దేవుని ప్రేమలో నిలుచునట్లు కాచుకొని యుండుడి.

1) మీరు విశ్వసించు అతి పరిశుద్ధమైన దాని మీద మిమ్మును మీరు కట్టుకొనుచు:- ఎవడైనను ఈ పునాది మీద బంగారము వెండి వెలగలరాళ్లు కర్ర గడ్డి కొయ్యకాలు మొదలైన వాటితో కట్టిన యెడల.. (1కొరి 3:13). క్రీస్తు యేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాది మీద మీరు కట్టబడియున్నారు. (ఎఫె.2:20).

పై వచనములలో మీరు కట్టిన యెడల (1కొరి 3:13), మీరు కట్టబడియున్నారు. (ఎఫె 2:20). కాని యూదా 20వ.లో మీరు కట్టుకొనుచు అనుమూడు కాలములకు చెందిన మాటలు గమనించండి. మీరు విశ్వసించు అతిపరిశుద్ధమైన దాని మీద మిమ్మును మీరు కట్టుకొనుచు అనుటలో మనలను కట్టువాడు పరిశుద్ధాత్మయైనను, వ్యక్తిగతముగా మనలను మనము కట్టుకొనుట అవసరమై యున్నది. విశ్వాసజీవితము అతిపరిశుద్ధమైనది. 2పేతురు 1:4-6 ప్రకారము విశ్వాసము ద్వారా విశ్వాసము నందు సద్గుణమును, సద్గుణము నందు జ్ఞానమును, జ్ఞానము నందు ఆశానిగ్రహమును, ఆశానిగ్రహము నందు సహనమును, సహనము నందు భక్తిని, భక్తియందు సహోదర ప్రేమను, సహోదర ప్రేమ యందు దయను అమర్చుకొనాలి. వీటన్నిటి చేత మన జీవితాలను కట్టుకొనాలి.

పరిశుద్ధాత్మలో ప్రార్థన చేయుచు :- పరిశుద్ధాత్మ సహాయముతో ప్రార్థన చేసి కొనుట ఎంతో అవసరమైనది. రోమా 8:26 ప్రకారము పరిశుద్ధాత్మ మనలను యుక్తమైన ప్రార్థన చేయుటలో నడిపించువాడు. కాబట్టి ఆత్మతో ప్రార్థన చేతును మనస్సుతోను ప్రార్థన చేతును (1కొరి 14:15); మత్త 18:19 ప్రకారము మీలో ఇద్దరు తాము వేడుకొను ఏ సంగతిని గూర్చియైనను భూమి మీద ఏకీభవించిన పక్షమున అది పరలోకమందున్న నా తండ్రి వలన వారికి దొరుకునని చెప్పబడినది. మార్కు 11:24 ప్రార్థన చేయునప్పుడు మీరు అడుగుచున్న వాటినెల్లను పొందియున్నామని నమ్ముడి అని చెప్పబడినది. కనుక 1 థెస్స 5:16 ప్రకారము యెడతెగక ప్రార్థన చేయాలి; ప్రతి విషయమునందు కృతజ్ఞతా స్తుతులు

చెల్లించాలి. కొలొ 4:12 ప్రకారము ప్రార్థనలలో పోరాడి జయమును పొందాలి. కనుక ఫిలి 1:3 ప్రకారము ప్రతి ప్రార్థనలో ఎల్లప్పుడును సంతోషముతో ప్రార్థన చేయుచు, మనలను మనము ఆత్మీయతలో కట్టుకొనాలి.

3) నిత్యజీవార్థమైన మన ప్రభువగు యేసుక్రీస్తు కనికరము కొరకు కనిపెట్టుచు:- కనిపెట్టుచు అను మాట భవిష్యత్తును చూపించుచున్నది. తన కనికరము చొప్పున మనలను రక్షించెను (తీతు 3:5). 1 పేతురు 1:4 ప్రకారము మృతులలో నుండి యేసుక్రీస్తు తిరిగి లేచుట వలన జీవముతో కూడి నిరీక్షణ మనకు కలుగునట్లు, అనగా అక్షయమైనదియు, నిర్మలమైనదియు, వాడబారనిదియునైన స్వాస్థ్యము మనకు కలుగునట్లు, ఆయన తన విశేష కనికరము చొప్పున మనలను మరల జన్మింపజేసెను. స్వాస్థ్యము మనకు కలుగునట్లు అను వచన ప్రకారము యేసుక్రీస్తు కనికరము ప్రస్తుత కాలమున విస్తరించుచున్నది. నెహె 9:31 ప్రకారము నిజముగా నీవు కృపాకనికరములు గల దేవుడవై యున్నావు. కీర్త 119:156 ప్రకారము యెహోవా, నీ కనికరములు మితి లేనివి నీ న్యాయ విధులను బట్టి నన్ను బ్రదికింపుము. కీర్త 145:9 యెహోవా అందరికి ఉపకారి ఆయన కనికరములు ఆయన సమస్తకార్యముల మీద నున్నవి. కనుక మన సమస్తకార్యముల మీద ఆయన మితిలేని కనికరము గలవాడు. నిత్యజీవార్థమైన మన ప్రభువగు యేసుక్రీస్తు ప్రత్యక్షమైనపుడు మనము ఆయనతో కూడా నిత్యము జీవించెదము. ఇది ఆయన కనికరమును బట్టియే మనకు కలుగును. కనుక ఆయన కనికరమును బట్టి ఆయన రాకడ కొరకు కనిపెట్టుచు జీవించుచుండాలి.

4) దేవుని ప్రేమలో నిలుచునట్లు కాచుకొనియుండుడి :- హెబ్రీ 1:9 ప్రకారము దేవుడు నీతిని ప్రేమించి, దుర్నీతిని ద్వేషించువాడు, అందుచేత మనము కూడా దుర్నీతిని ద్వేషించుచు నీతిగా జీవించాలి. దేవుడు 1) శిష్యులను అనగా సహోదరులను, 2) పొరుగు వారిని, 3) శత్రువులను ప్రేమించాడు. కనుక మనము కూడా 1) సహోదరులను, 2) పొరుగువారిని 3) శత్రువులను, 4) దేవుడిని కూడా ప్రేమించాలి. దేవుని ప్రేమను గూర్చిన ఈ క్రింది వచనాలను గమనించండి.

1) శిష్యులను అనగా సహోదరులను ప్రేమించుట :- 1) తాను ఈ లోకము నుండి తండ్రి యొద్దకు వెళ్లవలసిన గడియ వచ్చెనని యేసు పస్కా పండుగకు ముందే యెరిగినవాడై, లోకములో నున్న తన వారిని ప్రేమించి వారిని సంపూర్ణముగా ప్రేమించెను (యోహా 13:1).

2) మీరు ఒకనినొకడు ప్రేమింపవలెనని మీకు క్రొత్త ఆజ్ఞ ఇచ్చుచున్నాను; నేను మిమ్మును ప్రేమించినట్టే మీరును ఒకని నొకడు ప్రేమింపవలెను. మీరు ఒకని యెడల ఒకడు ప్రేమగలవారైన యెడల దీని బట్టి మీరు నా శిష్యులని అందరును తెలిసికొందురనెను (యోహా 13:34-35).

3) సహోదర ప్రేమను గూర్చి నేను మీకు వ్రాయనక్కరలేదు; మీరు ఒకని నొకడు ప్రేమించుటకు దేవుని చేతనే నేర్పబడితిరి (1థెస్స 4:9).

4) పరిశుద్ధులందరి మీద మీకున్న ప్రేమను గూర్చి మేము విని యెల్లప్పుడు మీ నిమిత్తము ప్రార్థన చేయుచు, మన ప్రభువగు యేసుక్రీస్తు యొక్క తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను (కొలో 1:3).

2) పొరుగువారిని ప్రేమించుట :- 5) నిన్నువలే నీ పొరుగువాని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దాని వంటిదే. 6) లూకా 10:36 కాగా దొంగల చేతిలో చిక్కిన వానికి ఈ ముగ్గురిలో ఎవడు పొరుగువాడని నీకు తోచునని యేసు అడుగగా అతడు – అతని మీద జాలిపడినవాడే అనెను (మత్త 22:39). 7) ప్రేమ అనేక పాపములను కప్పును గనుక అన్నిటికంటె ముఖ్యముగా ఒకనియెడల ఒకడు మిక్కటమైన ప్రేమగలవారై యుండుడి (1పేతు 4:8). 8) వినుచున్న మీతో నేను చెప్పున దేమనగా – మీ శత్రువులను ప్రేమించుడి, మిమ్మును ద్వేషించువారికి మేలు చేయుడి (లూకా 6:27).

3) శత్రువులను ప్రేమించుట :- 9) కాబట్టి నీ శత్రువు ఆకలిగొనియుంటే అతనికి భోజనము పెట్టుము, దప్పిగొనియుంటే దాహమిమ్ము (రోమా 12:20).

4) దేవుడిని ప్రేమించుట :- 10) వారు భోజనము చేసిన తరువాత యేసు సీమోను పేతురును చూచి యోహాను కుమారుడవైన సీమోనూ, వీరికంటె నీవు నన్ను ఎక్కువగా ప్రేమించుచున్నావా ? (యోహా 21:15). 11) ఆ స్త్రీ వైపు తిరిగి, సీమోనుతో ఇట్లనెను – ఈ స్త్రీని చూచుచున్నావే నేను నీ యింటిలోకి రాగా నీవు నా పాదములకు నీళ్లియ్యలేదు గాని యీమె తన కన్నీళ్లతో నా పాదములను తడిపి తన తలవెంట్రుకలతో తుడిచెను. నీవు నన్ను ముద్దుపెట్టుకొనలేదు గాని నేను లోపలికి వచ్చినప్పటి నుండి యీమె నా పాదములు ముద్దుపెట్టుకొనుట మానలేదు. నీవు నూనెతో నా తల అంటలేదు గాని ఈమె నా పాదములకు అత్తరు పూసెను. ఆమె విస్తారముగా ప్రేమించెను గనుక ఆమె యొక్క విస్తార పాపములు క్షమింపబడెనని నీతో చెప్పుచున్నాను (లూకా 7:44-47) 12) అప్పుడు మరియ మిక్కిలి విలువగల అచ్చ జటామాంసి అత్తరు ఒక సేరున్నర యెత్తు తీసికొని, యేసు పాదములకు పూసి తన తలవెంట్రుకలతో ఆయన పాదములు తుడిచెను; ఇల్లు ఆ అత్తరు వాసనతో నిండెను (యోహా 12:3). 13) మన ప్రభువైన యేసు తన పరిశుద్ధులందరితో వచ్చినప్పుడు మన తండ్రియైన దేవుని యెదుట, మేము మీ యెడల ఏలాగు ప్రేమలో అభివృద్ధి పొంది వర్ధిల్లుచున్నామో ఆలాగే మీరును ఒకని యెడల ఒకడును మనుష్యులందరి యెడలను ప్రేమలో అభివృద్ధి పొంది వర్ధిల్లునట్లు ప్రభువు దయచేయును గాక (1థెస్స 3:13). 14) అతడు మా విషయములో నమ్మకమైన క్రీస్తు పరిచారకుడు; అతడు ఆత్మయందలి మీ ప్రేమను మాకు తెలిపినవాడు (కొలో1:8). 15) పగ కలహమును రేపును ప్రేమ దోషములన్నిటిని కప్పును (సామె 10:12).

16) అక్రమము విస్తరించుటచేత అనేకుల ప్రేమ చల్లారును. మన ప్రభువగు యేసుక్రీస్తు మొదటిదిగా కనికరము, రెండవదిగా ప్రేమగలవాడు. దేవుని కనికరములోను, ప్రేమలోను నిలిచినవారమై మనలను మనము కట్టుకొనాలి (మత్త 24:12).

**22-23వ. విశ్వాసుల కుండవలసిన కనికరము మొదలగు గుణము (భయముతో కొందరిని కరుణించుడి):-** 1) సందేహపడువారి మీద కనికరము చూపుడి. 2) అగ్నిలో నుండి లాగినట్టు కొందరిని రక్షించుడి. 3) శరీర సంబంధమైనవారి అపవిత్ర ప్రవర్తనకు ఏ మాత్రము నొప్పుకొనక దానిని అసహ్యించుకొనుచు, 4) భయముతో కొందరిని కరుణించుడి.

1) సందేహపడువారి మీద కనికరము చూపుడి :- ఆత్మీయులలో సందేహపడు వారుందురు. యాకోబు 1:6 ప్రకారము ఏ మాత్రము సందేహింపక విశ్వాసముతో అడుగ వలెను; సందేహించు వాడుగాలి చేత రేపబడి యెగిరిపడు సముద్రతరంగమును పోలి యుండును. సందేహించువాడు ద్విమనస్కుడై, తన సమస్త మార్గములయందు అస్థిరుడు గనుక ప్రభువు వలన తనకేమైనను దొరుకదు. అది బలహీనత. రోమా 14:1 ప్రకారము విశ్వాసము విషయమై బలహీనుడైన వానిని చేర్చుకొనాలి, అయినను సంశయాస్పద వాదములను పెట్టుకొనకూడదు. ఆలాటి వారి మీద కనికరము చూపి వారిని విశ్వాస విషయములో బలమైన స్థితిలోనికి తీసుకొని రావాలి.

2) అగ్నిలో నుండి లాగినట్టు కొందరిని రక్షించుడి :- ఈ అగ్ని నిత్యము కాలు అగ్ని గుండమైన నరకము కావచ్చును. రక్షణలేని వారు ప్రకటన 21:8 ప్రకారము ఈ అగ్ని గుండములో పాలు పొందుదురు. వారి పట్ల కరుణ కలిగి వారి కొరకై ప్రార్థించి, ప్రభువు రాకడ సమీపమైనందున వారికి సువార్త ప్రకటించి, ఒప్పించి, అగ్నిలో నుండి లాగినట్టు కొందరిని రక్షించాలి. మరొక రీతిగా 1పేతు 2:14 ప్రకారము అగ్ని శ్రమలను సూచించును. శ్రమలలో నున్న వారి పట్ల కరుణ కలిగి శ్రమల నుండి వారు కాపాడబడుటకై ప్రయత్నించాలి.

3), 4) శరీర సంబంధమైనవారి అపవిత్ర ప్రవర్తనకు ఏ మాత్రము నొప్పుకొనక భయముతో కొందరిని కరుణించుడి:- ఆత్మీయులలో శరీర సంబంధమైన అపవిత్రత కలవారుందురని దీని భావము. వారి అపవిత్ర ప్రవర్తనకు ఏ మాత్రము నొప్పుకొనకూడదు. యోసేపును ఈ సందర్భముగా జ్ఞాపకము చేసికొనాలి. ఆది 39:9లో నీవు అతని భార్యవై నందున నిన్ను తప్ప మరి దేనిని నాకప్పగింపక యుండలేదు. కాబట్టి నేనెట్లు ఇంత ఘోరమైన దుష్కార్యము చేసి దేవునికి విరోధముగా పాపము కట్టుకొందునని తన యజమానుని భార్యతో అనెను. శరీర సంబంధమైన వారి అపవిత్ర ప్రవర్తన దేవునికి విరోధముగా పాపమని గుర్తించి దానికి ఏ మాత్రము నొప్పుకొనక తన విశ్వాసములో తన్ను తాను అతి పరిశుద్ధముగా కట్టుకొన్నాడు. నేను నా కన్నులతో నిబంధన చేసికొంటిని.

కన్యకను నేనేలాగు చూచుదును ? అని యోబు 31:1లో పలుకుచున్నాడు. లూకా 11:34లో నీ దేహమునకు దీపము కన్నే గనుక నీ కన్ను తేటగా నుంటే నీ దేహమంతయు వెలుగు మయమై యుండును; అది చెడినదైతే నీ దేహమును చీకటిమయమై యుండును అని ఉన్నది. కనుక శరీరములోని అన్ని అవయవములో పాపము లేనివారముగా జీవించాలి. అట్టి దానిని మనము అసహ్యించుకొనాలి. కాని అటువంటి స్థితిలో ఉన్నవారిని దేవుని భయముతో కరుణించి వారిని మంచి దారికి తీసుకొని వచ్చు వారముగా నుండాలి.

యూదా పత్రికలో చెప్పబడిన కొన్ని పాపములను గమనింతము. మనము వీటికి దూరముగా ఉండునట్లు చూచుకొనాలి :-

1) తమ ప్రధానత్వము నిలుపు కొనక, తమ నివాస స్థలమును విడచుట.
2) వ్యభిచారము చేయుట, పరశరీరాను సారులగుట,
3) శరీరమును అపవిత్ర పరచుకొనుట,
4) ప్రభుత్వమును నిరాకరించుట,
5) మహాత్ములను దూషించుట,
6) గ్రహింపలేని విషయములను గూర్చి దూషించువారగుట,
7) కయీను నడిచిన మార్గమున నడచుట,
8) బహుమానము పొందవలెనని బిలాము నడిచిన తప్పుత్రోవలో ఆతురముగా పరుగెత్తుట,
9) కోరహు చేసినట్టు తిరస్కారము చేయుట,
10) గాలిచేత ఇటుఅటు కొట్టుకొనిపోవు నిర్జల మేఘములుగా నుండుట,
11) మార్గము తప్పి తిరుగు చుక్కలుగా నుండుట
12) భక్తిహీనముగ నుండి భక్తహీన క్రియలను చేయుట,
13) భక్తిహీనులైన పాపులవలె దేవునికి విరోధముగా మాటలాడుట
14) దురాశల చొప్పున నడుచుకొనుట
15) లాభము నిమిత్తము మనుష్యులను కొనియాడుట, సణుగువారుగా నుండుట
16) నిందించువారుగా నుండుట
17) నోటితో డంబమైన మాటలు పలుకుట
18) భక్తిహీనమైన దురాశల చొప్పున నడుచుచు పరిహాసకులుగా నుండుట.
19) ప్రకృతి సంబంధులుగా నుండుట.

**24-25వ. ఆశీర్వచనము :-** తొట్రిల్లకుండ మిమ్మును కాపాడుటకును, తన మహిమ యెదుట ఆనందముతో మిమ్మును నిర్దోషులుగా నిలువబెట్టుటకును శక్తిగల మన రక్షకుడైన అద్వితీయ దేవునికి, మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా, మహిమయు మహాత్మ్యమును ఆధిపత్యమును అధికారమును యుగములకు పూర్వమును ఇప్పుడును సర్వ యుగములును కలుగును గాక.

ఎ) తొట్రిల్లకుండ మిమ్మును కాపాడువాడు :-

1) ఆయన నీ పాదము తొట్రిల్ల నియ్యడు. నిన్ను కాపాడువాడు కునుకడు (కీర్త 121:3వ).

2) బాలురు సొమ్మసిల్లుదురు అలయుదురు, యౌవనస్థులు తప్పక తొట్రిల్లుదురు. యెహోవా కొరకు ఎదురు చూచువారు నూతన బలము పొందుదురు (యెష 40:30వ).

3) వారి దేవుని ధర్మశాస్త్రము వారి హృదయములో నున్నది వారి అడుగులు జారవు. (కీర్త 37:31).

4) నేను వారి యొద్ద ఉండగా నీవు నాకు అనుగ్రహించిన వారిని నీ నామమందు కాపాడితిని; నేను వారిని భద్రపరచితిని (యోహా 17:12వ). దేవుడు తొట్రిల్లకుండ మనలను కాపాడువాడు. మహిమ.. యుగములకు పూర్వమును ఇప్పుడును సర్వయుగము లును కలుగును గాక.

తన మహిమ యెదుట ఆనందముతో మిమ్మును నిర్దోషులుగా నిలవబెట్టుటకు శక్తి గలవాడు :-

సి) తన మహిమ యెదుట : అప్పుడు మనుష్య కుమారుని సూచన ఆకాశమందు కనబడును. అప్పుడు మనుష్య కుమారుడు ప్రభావముతోను మహా మహిమతోను ఆకాశ మేఘారూఢుడై వచ్చును (మత్త 24:30). క్రీస్తు కూడ సంఘమును ప్రేమించి, అది కళంకమైనను ముడతయైనను అట్టిది మరి ఏదైనను లేక పరిశుద్ధమైనది గాను, నిర్దోష మైనదిగాను, మహిమగల సంఘముగాను ఆయన తన యెదుట దాని నిలువబెట్టు కొనవలెనని.. (ఎఫె 5:27). ఆయన మన దీనశరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపముగల దానిగా మార్చును (ఫిలి 3:21). ఇది మనకు ఎంతో ఆనందము.

డి) ఆనందముతో మిమ్మును నిర్దోషులుగా నిలువబెట్టుటకు శక్తిగల మన రక్షకుడైన అద్వితీయ దేవుడు :- 1) పరుని సేవకునికి తీర్పు తీర్చుటకు నీవెవడవు ? అతడు నిలిచి యుండుటయైనను పడియుండుటయైనను అతని స్వకీయ యజమానుని పనియే; అతడు నిలుచును, ప్రభువు అతని నిలువ బెట్టుటకు శక్తిగలవాడు (కీర్త 14:4). నిర్దోషులుగా ఆయన సన్నిధిని నిలువవలెనను ఆశను కలిగియుందుము గాక.

మన రక్షకుడైన అద్వితీయ దేవుడు, మన ప్రభువైన యేసుక్రీస్తుకు మహిమయు మహాత్మ్యమును, ఆధిపత్యమును, అధికారమును యుగములకు పూర్వమును ఇప్పుడును సర్వ యుగములును కలుగును గాక.

# 10. సంఘము అను క్రీస్తు శరీరము - క్షేమాభివృద్ధి

**ఎఫె 3:2-3లో** మీ కొరకు (అనగా సంఘము కొరకు) నా (పౌలు)కు అనుగ్రహింప బడిన దేవుని కృప విషయమైన యేర్పాటును గూర్చి మీరు విని యున్నారు. ఎట్లనగా క్రీస్తు మర్మము దేవ దర్శనము వలన నా (పౌలు) కు తెలియపరచబడినదను సంగతిని గూర్చి మునుపు సంక్షేపముగా వ్రాసితిని.

**ఎఫె 3:6లో** ఈ మర్మమేదనగా-అన్యజనులు సువార్త వలన, క్రీస్తుయేసు నందు, యూదులతో పాటు సమానవారసులును, ఒక శరీరమందలి (సంఘము) సాటి అవయవ ములును, వాగ్దానములో పాలివారలునై యున్నారనునదియే.

**ఎఫె 2:15లో** ఇట్లు సంధిచేయుచు, ఈ యిద్దరిని తనయందు ఒక్క నూతన పురుషునిగా సృష్టించి, తన సిలువ వలన ఆ ద్వేషమును సంహరించి, దాని ద్వారా వీరిద్దరిని ఏకశరీరముగా (సంఘముగా) చేసి దేవునితో సమాధాన పరచవలెనని యీలాగు చేసెను.

**ఎఫె 3:5లో** ఈ మర్మమిప్పుడు **ఆత్మ మూలముగా దేవుని పరిశుద్ధులగు అపొస్తలు లకును ప్రవక్తలకును బయలుపరచబడి** యున్నట్టుగా పూర్వకాలముల యందు మనుష్యులకు తెలియపరచబడలేదు.

ఎఫె 4:11-13లో 1) పరిశుద్ధులు సంపూర్ణులగునట్లు, 2) క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి చెందుటకు, 3) పరిచర్య ధర్మము జరుగుటకును, ఆయన కొందరిని అపొస్తలుల గాను, కొందరిని ప్రవక్తలగాను, కొందరి సువార్తికులగాను, కొందరి కాపరులగాను ఉపదేశకుల గాను నియమించెను. మన మందరము ఎ) విశ్వాస విషయములోను బి) దేవుని కుమారుని గూర్చిన జ్ఞాన విషయములోను 1) ఏకత్వము పొంది సంపూర్ణ పురుషులమగు వరకు, అనగా క్రీస్తుకు కలిగిన సంపూర్ణమైన పురుషత్వమునకు సమానమైన పురుషత్వము కలవారమగువరకు, ఆయన ఈలాగు నియమించెను.

ఎఫె 3:7లో దేవుడు కార్యకారియగు తన శక్తిని బట్టి నా (పౌలు) కు అనుగ్రహించిన కృపావరము చొప్పున నేను ఆ సువార్తకు పరిచారకుడనైతిని.

గలతీ 2:8-9లో సున్నతి పొందిన వారికి అపొస్తలుడవుటకు పేతురుకు సామర్థ్యము కలుగజేసినవాడే అన్యజనులకు అపొస్తలుడవుటకు నా (పౌలు)కును సామర్థ్యము కలుగ జేసెనని వారు గ్రహించినప్పుడు, సంఘములో స్తంభములుగా ఎంచబడిన యాకోబు, కేఫా, యోహాను అనువారు నా (పౌలు)కు అనుగ్రహింపబడిన కృపను కనుగొని, మేము అన్యజనులకును తాము సున్నతి పొందిన వారికిని అపొస్తలులుగా ఉండవలెనని చెప్పి, తమతో పాలివారమగుటకు సూచనగా నాకును బర్నబాకును కుడిచేతిని ఇచ్చిరి.

పై వచనముల బట్టి సంఘ మర్మము దేవుని పరిశుద్ధులగు అపొస్తలులకును ప్రవక్తల కును బయలుపరచబడి యున్నది. యూదా 3వ.లో పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన

బోధ నిమిత్తము మీరు పోరాడవలెనని యూదా వ్రాయుచున్నాడు. కనుక అపొస్తలుడైన పౌలు, సంఘములో స్తంభములగు యాకోబు, కేఫా, యోహాను, బోధ నిమిత్తము పోరాడ వలెనని హెచ్చరించిన యూదా అను ఐదుగురు 21 పత్రికలు వ్రాసిరి. వారు వ్రాసిన పత్రికలలో రక్షించబడిన దేవుని పరిశుద్ధులను 1) పౌలు సంఘముగాను, 2) యాకోబు దేవుని ప్రజలుగాను, 3) పేతురు దేవుని మందగాను, 4) యోహాను దేవుని ఇల్లుగాను, 5) యూదా దేవుని పరిశుద్ధులుగాను పోల్చి వ్రాసిరి. కనుక వారు వ్రాసిన 21 పత్రికలలో అనగా 1) రోమా నుండి హెబ్రీ వరకు పౌలు వ్రాసిన 14 పత్రికలు, 2) సామాన్య పత్రికలగు యాకోబు, పేతురు, యోహాను, యూదాలు వ్రాసిన 7 పత్రికలలో నుండి సంఘ వివరము, క్రమము, పరిశుద్ధులు ఎ) విశ్వాస విషయములోను బి) దేవుని కుమారుని గూర్చిన జ్ఞాన విషయములోను 1) ఏకత్వము పొంది సంపూర్ణులగుటకును, 2) క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి చెందుటకును, 3) అవసరమగు పరిచర్య ధర్మము జరుగు విధము క్లుప్తముగా నేర్చుకొందము (ఎఫెసీ 4:12-13).

ఎఫెసీ 2:11-22 ప్రకారము సంఘము అనగా శరీర విషయములో అన్యులు ఇశ్రాయేలీయులు క్రీస్తు యేసు నందు క్రీస్తు రక్తము వలన పాపము నుండి కడుగబడి దేవునితో సమాధానపడి పరిశుద్ధులుగాను, దేవుని ఇంటివారు గాను దేవుని నివాసము గాను పరిశుద్ధమైన ఆలయముగా కట్టబడుచున్నారు. మనమందరము 1) విశ్వాస విషయములో, 2) దేవుని కుమారుని గూర్చిన జ్ఞాన విషయములో సంపూర్ణ పురుషులమగు వరకు ఆయన ఈలాగు నియమించెను. 1) పరిశుద్ధులు సంపూర్ణులగునట్లు 2) క్రీస్తు శరీరము అనగా సంఘము క్షేమాభివృద్ధి చెందుటకును, 3) పరిచర్య ధర్మము జరుగుట కును ఆయన కొందరిని అపొస్తలులు గాను, కొందరిని ప్రవక్తలుగాను, కొందరిని సువార్తికులుగాను, కొందరిని కాపరులుగాను, ఉపదేశకులుగాను నియమించెను (ఎఫె 4:12-13).

అపొస్తలులు, ప్రవక్తలు, సువార్తికులు, కాపరులు, ఉపదేశకుల ద్వారా సంఘము క్షేమాభివృద్ధి చెందాలి. వీరు ఒకరు, ఇద్దరు కాక అనగా వీరు ఏక వచనములో కాక కొందరు (బహుమంది), క్రీస్తు ద్వారా నియమించబడుదురు. అందరు కాదు గాని కొందరు నియమించబడుదురు. ఎఫె 2:20 వచన ప్రకారము అపొస్తలులు, ప్రవక్తలు పునాది వేసిరి. వేయబడిన పునాదిపై సంఘము కట్టడముగా కట్టబడుచున్నది. సంఘము అను గృహము యొక్క నిర్వాహకత్వము అపొస్తలులకు పూర్తిగా బయలుపరచబడి క్రొత్త నిబంధన పత్రికల ద్వారా సంఘమునకు పూర్తిగా తెలియపరచబడినది (ఎఫె 3:2-11). సంఘము నకు పునాది వేయబడు వారి పని అయిపోయినందున నేటి కాల సంఘములో క్షేమాభివృద్ధి చెందుటకు వారిద్దరు అనగా అపొస్తలులు, ప్రవక్తలు ఉండరు. మిగిలిన ముగ్గురు కొందరు సువార్తికులు, కొందరు కాపరులు, ఉపదేశకులను క్రీస్తు నియమించును.

ఎఫె 4:8 ప్రకారము వీరిని అనగా 1) కొందరు సువార్తికులను, 2) కొందరు కాపరులను, ఉపదేశకులను ఈవులుగా క్రీస్తు అనుగ్రహించును. వీరి ద్వారానే 1) సంఘము

అనగా పరిశుద్ధులైన సహోదర సహోదరీలు, యవ్వనులు, పిల్లలు సంపూర్ణులు కావాలి. 2) క్రీస్తు శరీరము అనగా సంఘము క్షేమాభివృద్ధి చెందాలి. 3) సంఘములో పరిచర్య ధర్మము జరుగాలి.

**1) కొందరు సువార్త సేవకులు :-** అంతియోకయ సంఘములో బర్నబా, నీగెరన బడిన సుమెయోను, కురేనీయుడైన లూకియ.. మనయేను, సౌలు అను ప్రవక్తలు, బోధకులు ఉండిరి. వారు ప్రభువును సేవించుచు ఉపవాసము చేయుచుండగా పరిశుద్ధాత్మ, నేను బర్నబాను, సౌలును పిలిచిన పని కొరకు వారిని నాకు ప్రత్యేక పరచుడని చెప్పెను. అంతట వారు ఉపవాసము నుండి ప్రార్థన చేసివారి మీద చేతులుంచి వారిని పంపిరి, వారు పరిశుద్ధాత్మ చేత పంపబడినవారై సెలూకయకు.. కుప్రకు వెళ్లి ప్రభువు పని చేసిరి (అపో 13:1-3వ). సువార్త సేవకులను 1) పిలిచి, 2) ప్రత్యేకించి, 3) పంపుట, 4) పనిచేయుట అను అంశములను వివరముగా ధ్యానింతము.

**1. పిలుపు :-** బర్నబా యెరూషలేము సంఘమునందు పరిచర్యలోను, హెచ్చరించుట లోను ముందు నుండియే పాల్గొనుచుండినవాడు (అపో 4:36). యెరూషలేము సంఘము ద్వారా బర్నబా వాక్యమును బోధించుటకు, హెచ్చరించుటకు అంతియోకయకు పంపబడెను. పౌలు, బర్నబాలు అపో 11:19-26 ప్రకారము ప్రభువును నమ్మినవారిని స్థిర హృదయముతో ప్రభువును హత్తుకొనునట్లు చేసి బహుజనులను ప్రభువు పక్షమున చేర్చిరి. మరియు బర్నబా, పౌలులు అంతియోకయ వారిని శిష్యులనుగా తయారుచేసి అంతియోకయలో సంఘమును స్థాపించిరి. పరిశుద్ధాత్మ వీరిద్దరిని సేవకొరకు ప్రత్యేకించ మని సంఘమందు ప్రభువును సేవించుచు, బోధకులుగా నున్నవారికి చెప్పాడు.

**2. ప్రత్యేకత :-** గల 1:15 ప్రకారము తల్లి గర్భము నందు పడినది. మొదలుకొని పౌలును ప్రత్యేకించెను. కాని పరిశుద్ధాత్మ తాను పిలిచిన పనికి వారిని ప్రత్యేకించమని సంఘమందు ప్రభువును సేవించుచు, బోధించు పరిచర్యలో నున్న సుమెయోను, లూకియా, మనయేను మొదలగు వారికి చెప్పును. అప్పుడు వారందరు ప్రార్థించి, ఎకమనసుతో వారి మీద చేతులుంచి, ప్రత్యేకించి వారిని సేవ కొరకు పంపుదురు. కనుక ప్రత్యేకించుటలో ప్రభువు, పరిశుద్ధాత్మ, సంఘమందు సేవచేయువారు, బోధించువారు ఉన్నారు.

**3. పంపబడుట :-** సేవకు ప్రత్యేకించబడిన వీరితో ప్రభువు మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి అని మత్త 28:19-20లో చెప్పాడు. (Go ye therefore and teach all nations) అలాగే వీరు మందను కాయు కాపరులుగా (1 కొరి. 9:7). సంఘము ద్వారా పంపబడి ఇతర ప్రాంతాలకు / దేశాలకు వెళ్లి అపో 13-19 అధ్యాయముల ప్రకారము సేవ చేసి సంఘములను ఏర్పరచి, స్థిరపరచాలి.

**4. పనిచేయుట :-** వీరు సంఘములకు అపోస్తలులు, పెద్దలు నిర్ణయించిన విధులను అప్పగించుట ద్వారా సంఘములు విశ్వాసమందు స్థిరపడాలి. సువార్త ప్రకటించుట ద్వారా నూతన సంఘములు ఏర్పడాలి (అపో 16:5)

**5. పోషణ** :- సువార్త పని చేయునపుడు నిర్ణీత జీతములు ఉండవు. సువార్తను ఉచితముగా ప్రకటించుటయే నా జీతము అని 1 కొరి 9:18లో పౌలు అన్నాడు. 1కొరి 9:13-14లో ఆలయ కృత్యములు జరిగించువారు ఆలయము వలన జీవనము చేయు చున్నారనియు, బలిపీఠము నొద్ద కనిపెట్టు కొనియుండువారు బలిపీఠముతో పాలివారై యున్నారనియు మీరెరుగరా ? ఆలాగున సువార్త ప్రచురించువారు సువార్త వలన జీవింప వలెనని ప్రభువు నియమించి యున్నాడు.

ఎవడైనను తన స్వంత ఖర్చు పెట్టుకొని దండు కొలువు చేయునా ? ద్రాక్షతోట వేసి దాని ఫలము తిననివాడెవడు ? మందను కాచి మందపాలు త్రాగనివాడెవడు ? ఈ మాటలు లోకాచారమును బట్టి చెప్పుచున్నానా ? ధర్మశాస్త్రము కూడ వీటిని చెప్పుచున్నది గదా ? కళ్లము త్రొక్కుచున్న యెద్దు మూతికి చిక్కము పెట్టవద్దు అని మోషే ధర్మశాస్త్రములో వ్రాయబడి యున్నది. దేవుడు ఎడ్ల కొరకు విచారించు చున్నాడా ? కేవలము మన కొరకు దీని చెప్పుచున్నాడా ? అవును, మన కొరకే గదా యీ మాట వ్రాయబడెను. ఏలయనగా, దున్నువాడు (పాలు పొందుదునను) ఆశతో దున్నవలెను, కళ్లము త్రొక్కించు వాడు పంటలో పాలు పొందుదునను ఆశతో త్రొక్కింపవలెను. మీ కొరకు ఆత్మ సంబంధ మైనవి మేము విత్తియుండగా మీ వలన శరీర సంబంధమైన ఫలములు కోసి కొనుట గొప్ప కార్యమా ?' (1కొరి 9:7-11). గొప్పకార్యము కాదు కాని ఎవని వెండినైనను, బంగారునైనను ఆశించరాదు (అపో 20:33). సువార్త సేవకులు ఆశించువారుగా ఉండరాదు. పాతనిబంధనలో కూడా ఇదిగో లేవీయులు చేయు సేవకు అనగా ప్రత్యక్ష గుడారపు సేవకు నేను ఇశ్రాయేలీయుల దశమ భాగములన్నింటిని వారికి స్వాస్థ్యముగా ఇచ్చితిని అని వ్రాయబడినది. (సంఖ్యా-18:21 ద్వితి. 14:22-29) దీని భావము సంఘు రాబడి ద్వారానే సువార్త సేవ చేయువారి జీవనము జరగాలి. నిర్ణీత జీతము జీవనము అంతటికి సరిపోక పోవచ్చును కాని జీవనము అంతయు దేవుడు సంఘము ద్వారానే జరగాలి అని దేవుడు నిర్ణయించుట గమనింతుము గాక.

పై వచనాలను బట్టి సువార్త సేవకులు ఎవరనగా అపో.11అ. అంతియొకయలో వలె సువార్త ప్రకటన చేసి, వాక్యమును బోధించి, తమ సేవ ద్వారా నూతన సంఘాలను స్థాపించి, సంఘ అభివృద్ధిలో ప్రభువు ద్వారా వాడబడుచుండినవారు. వారిని పరిశుద్ధాత్మ తానే సువార్త సేవకులుగా ఎ) పిలిచి, సంఘము ద్వారా బి) ప్రత్యేకించి సి) పంపును వారి డి) పనిని 1) సైనికుడుగా, 2) సేద్యగాడుగా 3) మందను కాచు కాపరిగా 4) కళ్ళము త్రొక్కు ఎద్దుగా పోల్చి చెప్పుచు సువార్త సేవకుల, ఇ) పోషణ సంపూర్తిగా సంఘము ద్వారానే జరగాలని చెప్పుచున్నాడు.

గమనిక :- సేవకులుగా ప్రత్యేకించబడిన వారు అపో 13-19 అధ్యాయములలో చెప్పబడినట్లు పలు ప్రాంతాలకు దేశాలకు వెళ్లి సేవ చేసిరి సేవకు ప్రత్యేకించబడక ముందును

పౌలు బర్నబాలు సేవచేయు చుండినట్లు ప్రతి విశ్వాసి అపో-2:42లో చెప్ప బడిన కార్యములలో పాల్గొనుచూ దేవుని కొరకై సేవ చేయువాడుగా నుండాలి. ఎఫెసీ 4:16 వచన ప్రకారం శరీరమందలి ప్రతి అవయవము తన తన పరిమాణము చొప్పున పని చేయుచుండగా శరీరమునకు క్షేమాభివృద్ధి కలుగజేసికొనునట్లు ఆయన శిరస్సయి యుండగా ప్రతి విశ్వాసి తన తన పరిమాణము చొప్పున పని చేయుచు సంఘ క్షేమాభి వృద్ధికై పాటు పడుచు సేవ చేయవలెను కాని సేవ కొరకు ప్రత్యేకించబడిన సేవకులు తాము చేయు సేవ విషయమై ప్రత్యేకమైన బాధ్యత స్థానము కలిగియుందురని గమనింతుము గాక.

**2) కొందరు కాపరులు :-** అపో 20:17లో అతడు మిలేతు నుండి ఎఫెసుకు వర్తమానము పంపి సంఘపు పెద్దలను (Elders - Presbyters) పిలిపించి వారితో ఈలాగు చెప్పెను. "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు (కాపరులు - Pastors - Poimen) పరిశుద్ధాత్మ మిమ్మును దేని యందు అధ్యక్షులుగా (Bishops - Episcopous)ఉంచెనో ఆ యావత్తు మందను గూర్చియు, మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి (అపో 20:20). పిలిపించబడిన పెద్దలు, కాయువారని, అధ్యక్షులని పిలువబడుచున్నారు. కనుక కాపరులే అధ్యక్షులని, పెద్దలని నేర్చుకొనుచున్నాము. వారు చేయు పనులను బట్టి పలురకములైన పేరులతో పిలువబడుచున్నారు. కాపరులుగా (Pastors - Poimen) వీరి పని మందను కాయుట, మందకు మాదిరులుగా నుండుట (1పేతు 5:3), మందను మేపుట వాక్యమనుమేతను క్రమమైన రీతిగా సంఘము నకు అందించువారు. వీరి పని అధ్యక్షులుగా Bishops - Episcopous పై విచారణ చేయుట, పెద్దలుగా Elders - Presbyters వీరు ఆత్మీయ పరిపక్వత గలవారై, వాక్యమును బోధించి దేవుని సంఘమును ఆత్మీయ విధానములో ఏలువారు, పాలించువారు (1తిమో 3:5).

**పెద్దలు లేక కాపరులు లేక అధ్యక్షులు :**

దేవుని వాక్యమును బోధించి మీ పైని నాయకులుగా ఉన్నవారు.. హెబ్రీ 13:7 ప్రకారము మీ పైని నాయకులుగా ఉన్నవారు లెక్క ఒప్పచెప్పవలెనని మీ ఆత్మలను కాయు చున్నారు. (హెబ్రీ 13:7). వీరు సంఘము విషయమై దేవునికి లెక్క అప్పగించవలసిన వారు. సంఘము పట్ల దేవుని చిత్తము యెరిగి ఆత్మీయ బలము కలిగి సంఘము పట్ల భారము కలిగి, ఆత్మ నడిపింపుతో సంఘమును గురి యొద్దకు నడిపించువారు. కనుక పరిశుద్ధాత్మ చేత కొందరు కాపరులుగా (Pastors ) ఉంచబడినవారే పెద్దలుగా (Elders) సంఘమును ఏలుచు అధ్యక్షులుగా (Bishops) సంఘమును పై విచారణ చేయువారుగా సహవాసమందు, రొట్టె విరుచుట యందు, ప్రార్థన చేయుట యందు (ఆదివారము కాని వారము మధ్య కార్యక్రమములలో కాని) ప్రత్యేక కార్యక్రమములు, సభలలో పాల్గొనుటలో మాదిరులై పెద్దలు పై విచారణ చేయుచు, అధ్యక్షులుగా ఉండి వారి నడిపింపు క్రింద కార్యములన్నిటిని జరిగింతురు. పేతురు అపోస్తలులందరిలో

మొదటివాడైనను తోటి పెద్దను అని 1పేతు 5:1లో అన్నందున సువార్త ప్రకటించుటకు పంపుటకై ప్రభువు పిలిచి నిర్ణయించిన పేతురు వంటి సువార్త ప్రకటించువారు (మార్కు 3:13-16). సంఘమందలి కాపరులతో కలిసి (పెద్దలు), క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి చెందుటకు ఎఫె 4:13 ప్రకారము నియమించబడిరి. కనుక వీరందరు ఒకరికి ఒకరు తోటివారేనని గుర్తించాలి. కాని ఏ ఒక్కరు కూడా నేనే.. అని తలంచక మార్కు 9:35, 10:43-44 ప్రకారము కొందరు సువార్తికులు, కొందరు కాపరులు, ఒకరికి ఒకరు విధేయత కలిగి తమ్మును తాము తగ్గించుకొను వారుగా ఉండాలి. మీకు అప్పగించబడిన వారి పైన ప్రభువు లైనట్టుండక అను మాటను బట్టి సంఘములో పరిపాలనా బాధ్యత స్వతహాగా గర్వాన్ని పుట్టించుట వలన కొందరు మంద మీద ప్రభువులుగా ప్రవర్తించుట జరుగగలదు. ఇది నామంద లేక మనమంద కాది గుర్తించి ప్రభువు మంద అని మందకు మాదిరులుగా ఉండాలి (1పేతు 5:3). మనకు అప్పగించబడిన మందను గూర్చి ప్రభువుకు లెక్క అప్పగించవలెనని గుర్తించాలి (హెబ్రీ 13:17). రోగులను పరామర్శించుట, శ్రమలో ఉన్నవారిని దర్శించుట, మందపై శ్రద్ధను చూపుట పెద్దల బాధ్యత అని గుర్తించాలి. సంఘ పరిపాలనతో పాటి వాక్యోపదేశము, సిద్ధాంత పరమైన హితబోధను నిర్ధారణ చేయుచు, దేవుని ప్రజలను కాపాడాలి (తీతు 1:7-9, 1తిమో3:2) ఎవరికైతే దైవ వాక్యమును బోధించి, నిర్ధారించి ప్రయాసపడుటలో వరము, ఆసక్తి, సామర్థ్యము లేదో అట్టి వారు సంఘపెద్ద బాధ్యత చేపట్టరాదు. ఇతర పరిచర్యలు చేయువారైతే పరిచారకులుగా కొనసాగాలి.

**పెద్దల కుండవలసిన అర్హతలు :** (1తిమో 3:2-7 వచనాలను గమనించండి).

1. సామాన్య అర్హత : నిందారహితుడు

2. కుటుంబ అర్హత : ఏక పత్ని పురుషుడు (2వ.) సంపూర్ణ మాన్యత కలిగి తన పిల్లలను స్వాధీన మందుంచుకొన్నవాడు, ఇంటివారిని బాగుగా ఏలువాడు (4వ).

3. వ్యక్తిగత అర్హత : మితాను భవుడు, స్వస్థ బుద్ధి గలవాడు, మర్యాదస్తుడు, అతిథి ప్రియుడు, మద్యపాని కాక, కొట్టువాడు కాక, ధనాపేక్ష లేనివాడుగా నుండాలి (2-3వ).

4. సామాజిక అర్హత : సంఘమునకు వెలుపటి వారి ద్వారా మంచి సాక్షము పొందినవాడు (7వ.)

5. ఆత్మీయ అర్హత : బోధింపతగినవాడు, సాత్వికము గలవాడు (2-3వ), కొత్తగా చేరినవాడై యుండకూడదు (7వ) అనగా ఆత్మీయ పరిపక్వత గలవాడు.

**పెద్దలుగా ఉంచబడుట (చేయబడుట) - పెద్దలను ఏర్పరచుట :** పెద్దలుగా పరిశుద్ధాత్మ చేత ఉంచబడుదురు (అపో 20:28). వారు పై విచారణ చేయువారు. సంఘమునందు సువార్తికులతో పాటి తోటి ఈవులు (ఎఫె 4:8). పరిశుద్ధాత్మ సంఘ మందు బోధించుచు సేవచేయు వారిలో నుండి సువార్త సేవకులను పిలిచినపుడు అపో 13:1-3లో చెప్పబడినట్లు వాక్యమును బోధించు మిగిలినవారు ప్రార్థించి వారి మీద

ఏకీభావమునకు గుర్తుగా చేతులుంచిన రీతిగానే పెద్దలను కూడా పరిశుద్ధాత్మ ఉంచును. (పెద్దలు తమ ఆత్మీయ పరిపక్వతను బట్టి, తాము చేయుచుండిన పైవిచారణ, వాక్య ఉపదేశము మొదలగు వాటిని బట్టి గుర్తించబడి ఆపనికి ఉంచబడాలి). పెద్దలు ఉంచబడుట కూడా సువార్త సేవకులను ప్రత్యేకించిన రీతిగానే అపో 14:22-23 ప్రకారము సంఘ మందు వాక్యముతో హెచ్చరించుచు బలపరచువారు పెద్దలుగా చేయుట అను కార్యక్రమము జరిగించాలి.

నూతనముగా సంఘము ఏర్పడినపుడు, సంఘము ఏర్పడుటలో ప్రయాసపడిన వ్యక్తి, లేదా వ్యక్తులు నూతనముగా ఏర్పడిన సంఘములో పెద్దలను గుర్తించుటలో తోడ్పడుదురు (అపో14:23, తీతు 1:5). ముందు నుండి కొనసాగుచున్న సంఘములైతే సంఘము క్షేమాభివృద్ధి చెందుటకు సంఘమునకు వాక్యము బోధించి, హెచ్చరించి దృఢపరచు సువార్తికులైనవారు, (కాపరులు) పెద్దలు సంఘమునందు నమ్మకస్తులు, సంఘ విషయములో భారము కలిగి, ఆసక్తి కలిగి పెద్దల కుండవలసిన లక్షణములు కలవారిని, గమనించి వారి విషయము కొంత కాలము ప్రార్థించి, ఏకాభిప్రాయము కలిగి సంఘకూడిక యందు ప్రార్థన ద్వారా అపో 14:22-23 ప్రకారము వారిని పెద్దలుగా గుర్తించాలి. అధ్యక్షపదవి దొడ్డపని అని 1తిమోతి 3:1 లోను, సువార్తికులు దేవుడు పిలిచి ప్రత్యేకించిన పనివారని అపో 13:2లో వున్నది.

**ముఖ్య గమనిక :-** 1 తిమో 5:22 ప్రకారము త్వరపడి ఎవరిమీదనైనను హస్త నిక్షేపణ చేయకూడదు. కనుక ఈ దొడ్డ పనికి త్వరపడి ఎవరినైనను పెద్దలుగా గాని, సువార్తికులుగా కాని గుర్తించరాదు. ప్రార్థన పూర్వకముగా, కనిపెట్టి, ఏకీభావముతో దేవుని చిత్తమెరిగి గుర్తించాలి.

**3) ఉపదేశకులు :-** సువార్తికులు, కాపరులు కాకపోయినను, వాక్యమును ఉపదేశము చేయగల వారిని గుర్తించి ఆ పనిలో వాడుకొనుట సంఘ క్షేమాభివృద్ధికి అవసరము.

**4) పరిచారకులు :-** సువార్తికులు, కాపరులు, ఉపదేశకులు వాక్యమును మానక బోధించువారు. కనుక అపో 6:2-6 ప్రకారము పలు రకములైన వాక్యోపదేశము కాక ఇతర పరిచర్యలు చేయు సామర్థ్యము కలవారిని సహోదరులు ఏర్పరచగా వాక్యమును బోధించు సువార్తికులు, కాపరులు, వారిని నియమించుదురు. 'అలాగుననే పరిచారకులు 1) మాన్యులైయుండి 2) ద్విమనస్కులును 3) మిగుల మద్యపానాసక్తులును, 4) దుర్లాభము నపేక్షించువారునై యుండక 5) విశ్వాస మర్మమును 6) పవిత్రమైన మనస్సాక్షితో గైకొనువారై యుండవలెను. మరియు వారు మొదట పరీక్షింపబడవలెను; తరువాత వారు అనింద్యులైతే పరిచారకులుగా ఉండవచ్చును. పరిచారకులు 7) ఏకపత్నీ పురుషులును, 8) తమ పిల్లలను తమ యింటివారిని బాగుగా ఏలువారునై యుండవలెను. అటువలె (పరిచర్య చేయు) స్త్రీలును 1) మాన్యులై, 2) కొండెములు చెప్పనివారును 3) మితానుభవము గలవారును 4) అన్ని విషయములలో నమ్మకమైనవారునై యుండవలెను (1తిమో3:8-13).

పై వచనాలలో చెప్పబడిన పరిచారకుల గుణములు కలవారినే నియమించాలి.

**5) సంఘమందలి సహోదరులు :–** క్రీస్తు శిరస్సయి యున్నాడు. ఆయన నుండి సర్వ శరీరము (సంఘము) చక్కగా అమర్చబడి, తనలోనున్న ప్రతి అవయవము (ప్రతి సహోదరుడు) తన తన పరిమాణము చొప్పున పని చేయుచుండగా ప్రతి కీలు (ప్రతి సహోదరుడు) వలన కలిగిన బలముచేత అతుకబడి.. క్షేమాభివృద్ధి కలుగచేసికొను చున్నది (ఎఫె 4:16). ప్రతి సహోదరుడు తన తన పరిమాణము చొప్పున పనిచేయాలి.

మరియు సహోదరులారా, మీలో ప్రయాసపడుచు ప్రభువు నందు మీకు పైవారై యుండి మీకు బుద్ధి చెప్పువారిని మన్నన చేసి వారి పనిని బట్టి వారిని ప్రేమతో మిక్కిలి ఘనముగా ఎంచవలెనని వేడుకొనుచున్నాము (1థెస్స 5:12).

బాగుగా పాలనచేయు పెద్దలను, విశేషముగా వాక్యమందును ఉపదేశమందును ప్రయాసపడు వారిని, రెట్టింపు సన్మానమునకు పాత్రులనుగా ఎంచవలెను. ఇందుకు నూర్చెడి యెద్దు మూతికి చిక్కము వేయవద్దు అనియు పనివాడు తన జీతమునకు పాత్రుడు అని లేఖనము చెప్పుచున్నది. ఇద్దరు ముగ్గురు సాక్షులుంటేనే గాని పెద్ద మీద దోషారోపణ అంగీకరింపకుము (1తిమో 5:17–19).

మీ పైని నాయకులుగా ఉన్నవారు లెక్క ఒప్పచెప్పవలసిన వారివలె మీ ఆత్మలను కాయు చున్నారు; వారు దుఃఖముతో ఆ పని చేసిన యెడల మీకు నిష్ ప్రయోజనము గనుక దుఃఖముతో కాక ఆనందముతో చేయునట్లు వారి మాట విని వారికి లోబడి యుండుడి. (హెబ్రీ 13:17).

ఎఫె 4:13లో చెప్పబడిన కొందరు సువార్తికులు, కొందరు కాపరులు ప్రభువు పనిలో ముందుకు సాగుచుండగా ప్రతి సహోదరుడు 1) వీరిమాట వినుచు, 2) పనిని బట్టి వారిని ప్రేమతో మిక్కిలి ఘనముగా ఎంచుచు 3) రెట్టింపు సన్మానమునకు పాత్రుల నుగా ఎంచి, క్రమముగా ఎల్లప్పుడు పనిలో వారికి సహాయము చేయువారుగా నుండాలి.

పై వచనములను బట్టి ఉపదేశము చేయు పెద్దల నోటికి చిక్కము పెట్టరాదు. అనగా పెద్దల నోరు మూయరాదు. పెద్దలు మాటలాడకుండ అడ్డగించకూడదు. పెద్దల మాటలను మన్నన చేయాలి. రెట్టింపు సన్మానమునకు పాత్రులుగా ఎంచుకోనాలి. వారి మాట విని వారి కాపుదలకు లోబడి యుండాలి. కాని పెద్దలు మామాట వినాలని పెద్దలపై అధికారము చూపుట, పెద్దల సంఘ పాలనలో జోక్యము చేసికొనుట సమంజసము కాదు. ఇద్దరు ముగ్గురు సాక్షులు ఉంటేనే కాని పెద్ద మీద దోషారోపణ చేయకూడదు (1తిమో. 5:19).

**6) సంఘమందలి సహోదరీలు :–**

**ఎ) స్త్రీలు :** స్త్రీలు సంఘములలో మౌనముగా ఉండవలసినదే కాని మాటలాడుటకు వారికి సెలవు లేదు. ఈలాగు ధర్మశాస్త్రమును చెప్పుచున్నది. వారు ఏమైనా నేర్చుకొనవ

గోరిన ఎడల ఇంట తమ తమ భర్తలను అడగాలి. సంఘములో స్త్రీ మాటలాడుట అవమానకరము (1కొరి 14:34-35). స్త్రీలు మౌనముగా ఉండి సంపూర్ణ విధేయతతో నేర్చుకొనవలెను.

(1తిమో2:11) పై వచనములను బట్టి స్త్రీలు సంఘమందు మౌనముగా ఉండి, ఇంటిలో భర్తల ద్వారా నేర్చుకోవాలి. నేర్చుకొనుట కూడా ఇంటిలోనే కనుక సంఘమునకు స్త్రీలు నేర్పించువారుగాను, సంఘపాలనలో జోక్యము కలిగించుకొనువారుగాను, ఉండ కూడదని నేర్చుకొందము గాక. తీతు 2:3-5 ప్రకారము వృద్ధ స్త్రీలు కొండకత్తెలునై యుండక.. 1) ప్రవర్తన యందు భయభక్తులు గలవారై యుండవలెననియు, దేవుని వాక్యము దూషింపబడకుండునట్లు 2) యవ్వన స్త్రీలు తమ భర్తలకు లోబడియుండి 3) తమ భర్తలను శిశువులను ప్రేమించువారును, మంచివారునై యుండవలెనని.. బుద్ధి చెప్పుచు మంచి ఉపదేశము చేయువారై యుండవలెనని బోధించుము. 1తిమో 3:11 ప్రకారము పరిచర్య చేయు స్త్రీలు (పరిచారకుల భార్యలు) మాన్యులు, కొండెములు చెప్పని వారు, మితాను భవము గలవారును, అన్ని విషయములలో నమ్మకమైన వారుగా నుండ వలెను. సంఘమందు పరిచారకురాండ్లు అనగా బాధ్యత గల పనివారి భార్యలు ఉండ వలసిన విధము చెప్పబడినది. కనుక స్త్రీలు సంఘమునకు నేర్పించువారు కారు, కాని యవ్వన స్త్రీలకు మంచి ఉపదేశము చేయువారునై యుండాలి. సహోదరీలలో విధవ రాండ్లను మొదటిదిగా పిల్లలు, మనవండ్లు గల విధవరాండ్లగాను, రెండవదిగా అనాథలైన విధవ రాండ్లగాను విభజించవచ్చును.

**బి) సహోదరీలలో పిల్లలు, మనవండ్లు గల విధవ రాండ్ల విషయము :** 1తిమో 5:4 ప్రకారము విధవరాలుకు పిల్లలు, మనవండ్లు ఉన్న యెడల వారు తమ ఇంటివారి యెడల భక్తి కనుపరచాలి. తమ తల్లిదండ్రులకు ప్రత్యుపకారము చేయ నేర్చుకోవాలి. దీని భావము పిల్లలు, మనవండ్లు తమ తల్లిదండ్రులను చేర్చుకొని వారి అవసరములన్ని తీర్చాలి. 5:16 ప్రకారము విశ్వాసురాలైన ఏ స్త్రీ యింట నైనను విధవరాండ్లున్న యెడల సంఘమునకు భారము లేకుండ ఆమెయే విధవరాండ్లకు సహాయము చేయాలి.

**సి) సహోదరీలలో అనాథలైన విధవ రాండ్ల విషయము :** దేవుని యందు నిరీక్షణ యుంచుకొని విజ్ఞాపన, ప్రార్థనల యందు రేయింబవలు నిలుకడగా నుండాలి. అరువది యేండ్ల కంటే తక్కువ వయసులేక, ఒకే పురుషునికి భార్యయై, సత్క్రియలయందు పేరు పొందిన విధవరాలు పిల్లలను పెంచి, పరదేశులకు ఆతిథ్యమిచ్చి, పరిశుద్ధుల పాదములు కడిగి, శ్రమపడువారికి సహాయము చేసినదైన ఆమెను అనాథయైన విధవరాండ్ల లెక్కలోకి చేర్చి సంఘము వీరికి సహాయము చేయాలి (1తిమో 5:5-16). యవ్వనస్థులైన విధవరాండ్లు వివాహము చేసికొని, పిల్లలను కాని గృహపరిపాలన జరిగించుచు, నిందించు టకు అపవాదికి అవకాశమివ్వకూడదు (1తిమో 5;14).

**7) యవ్వన పురుషులు :-**

స్వస్థ బుద్ధిగలవారై యుండవలెనని సంఘమందు తీతు వంటి సేవకులు యవ్వన పురషులను హెచ్చరించుచుండాలి (తీతు 2:6). యవ్వనస్తులు తమ యందు దేవుని వాక్యము నిలిచి యుండునట్లు చూచుకొనాలి. దుష్టుని జయించిన వారుగా నుండాలి. యోహాను వంటి పెద్దలగువారు యవ్వనులకు బోధించుచు వ్రాయాలి. కనుక యవ్వనస్తు లను హెచ్చరించు కార్యక్రమములు సంఘమందు జరుపబడు చుండగా యవ్వనులు వాక్యము వినాలి. వాక్యము తమయందు నిలిచి యుండునట్లు చూచుకొనాలి. దుష్టుని జయించువారుగా నుండాలి. తీతు వంటి సేవకులు, యోహాను వంటి పెద్దలు, కాపరులు సంఘమందు యవ్వన పురుషులను హెచ్చరించుట కొరకైన ఏర్పాటును సంఘమందు క్రమముగా జరిగించు చుండాలి.

**8) యవ్వన స్త్రీలు :-**

యవ్వన స్త్రీలు తమ భర్తలకు లోబడియుండవలెనని, శిశువులను ప్రేమించాలని, స్వస్థబుద్ధిగలవారును, పవిత్రులును, ఇంటవుండి పనిచేసికొనువారును, మంచి పనివారునై యుండవలెనని, బోధించబడాలని సోదరీల భాగములో చూచితిమి (తీతు 2:3-5). కనుక యవ్వనురాండ్లకు బోధ చేయబడు ఏర్పాటు / కూడిక సంఘములో జరిగించుచుండాలి.

**9) పిల్లలు :-**

చిన్న పిల్లలారా ఆయన నామమును బట్టి మీ పాపములు క్షమించబడినవి. చిన్న పిల్లలు మీరు తండ్రిని యెరిగి యున్నారు (1యోహాను 2:12,14). పిల్లలు తండ్రియైన దేవుని ఎరిగిన వారుగా ఉండాలి. పాపములు క్షమించబడిన అనుభవము కలవారుగా ఉండాలి. కనుక సంఘమందు చిన్న పిల్లలారా అని చెప్పబడు పిల్లల కొరకైన కూడిక ఉండాలి. పిల్లలారా మీరు వచ్చి నా మాట వినుడి. యెహోవా యందలి భయభక్తులు మీకు నేర్పెదను (కీర్త 34:10).

పై వచనములందు పిల్లలు మీరు వచ్చి.. మీకు నేర్పెదను అను మాటను బట్టి పిల్లలు కూడివచ్చి నేర్చుకొను కూడిక సంఘమందు అవసరము. పిల్లలకు 1) పాపములు క్షమించబడు అనుభవము, 2) యెహోవా యందలి భయభక్తులు కలిగి యుండుట, 3) తండ్రిని యెరిగి యుండుట, అను విషయములు నేర్పించి అట్టి అనుభవములోనికి తీసికొని వచ్చుటకు పిల్లల కొరకైన కూడికలను సువార్తికులు, పెద్దలైన కాపరులు ఏర్పాటు చేయాలి.

**10) ముగింపు :-**

సంఘము అను ఆయన శరీరము కొరకు క్రీస్తు పాట్లు పడెను (కొలో 1:24). సంఘమంత 1) కొందరు సువార్తికులు, 2) కొందరు కాపరులు, 3) ఉపదేశకులు 4) పరిచారకులు 5) సహోదరులు 6) సహోదరీలు 7) యవ్వన పురుషులు 8) యవ్వన స్త్రీలు 9) పిల్లలు ఎ) విశ్వాస విషయములోను బి) దేవుని కుమారుని గూర్చిన జ్ఞానము విషయములోను సంపూర్ణులగుటకు దేవుడు నియమించిన నియమములో సాగుదము గాక.

# సార్వత్రిక పత్రికల పరిచయం

రచయిత టి.పి.వరప్రసాదరెడ్డి గారు ఆంధ్రక్రైస్తవ లోకమునకు చిరపరిచయస్థులు.వీరు రచించిన అనేక పుస్తకములద్వారా చాలా మంది బైబిల్ విద్యార్థులు మరియు ఆసక్తిగలవారు ఆశీర్వదించబడియున్నారు.

పాతనిబంధన గ్రంథములపరిచయము అను వీరి రచన,ఆదికాండము నుండి మలాకీ గ్రంథము వరకు గల39 గ్రంథముల పరిచయముగా ఉన్నది."చిన్న ప్రవక్తలపరిచయము" అను పుస్తకము హొషెయ మొదలుకొని మలాకీ వరకు గలపండ్రెండు గ్రంథముల సారాంశము అనుట అతిశయోక్తికాదు.

అపొస్తలుడైన పౌలు పత్రికలపరిచయము అను పుస్తకము అపొస్తలులకార్యములు మరియు రోమా మొదలుకొని హెబ్రీయులకు వ్రాసిన పత్రిక వరకు గల 15 పుస్తములవ్యాఖ్యానముగా ఉన్నది.మీ చేతిలోని ఈ పుస్తకమందు యాకోబు,పేతురు,యోహాను,యూదా అనువారి పత్రికల సంపూర్ణ వివరణ కలదు.

టి.పి.వరప్రసాదరెడ్డి గారి కలమునుండి వెలువడిన 1.ఇశ్రాయేలు దేశము 2. దానియేలు గ్రంథ ధ్యానము 3.రూతు గ్రంథము 4.సంఘ చరిత్ర 5. పరమగీతము 6.సైలాస్ ఫాక్స్ జీవిత చరిత్ర 7.పరిశుద్ధాత్మ ప్రస్థావన 8.ప్రసంగి గ్రంథ ధ్యానము అనునవి మీ ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడు పుస్తకములు.శ్రీమతి కెజియా వరప్రసాద రెడ్డి గారి ఎస్తేరు గ్రంథ ధ్యానము ఎంతో విలువైన పుస్తకము.

ఈ పుస్తకములు ప్రాముఖ్యమైన ప్రతి క్రైస్తవ బుక్ సెంటర్లలోను,లోపలతెలియజేసిన వారి యొద్దను లభించును.అనంతపూర్ గాస్పెల్ పబ్లిషింగ్ వారి "పరిశుద్ధగ్రంథము నందలి నామములు - వివరములు" అను శ్రేష్ఠమైన పుస్తకము యొక్క పునర్ముద్రణలో వీరికృషి ప్రశంసనీయము.